# టిసిపార్డ్
# TSIPARD

# స్థానిక పాలన
గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 7 సంచిక: 3

ఏప్రిల్, 2015



ఎడిటర్
**అనిత రామచంద్రన్**, ఐ.ఏ.ఎస్.
కమీషనర్, అపార్డ్

ఎడిటోరియల్ బోర్డు
**కె. యాదయ్య**
**డా॥ కె. ఆసయ్య**
**ఎ. నాగేశ్వరరావు**

కాన్సెప్ట్, ప్లానింగ్,
ఎడిటింగ్, డిజైనింగ్
**సెంటర్ ఫర్ మీడియా పబ్లికేషన్స్, టిసిపార్డ్**
**కాక్స్టన్ ఆఫ్‌సెట్ ప్రైవేట్ లిమిటెడ్**
హైదరాబాద్



ప్రచురణ
**టిసిపార్డ్**
రాజేంద్రనగర్
హైదరాబాద్-500 030
తెలంగాణ, ఇండియా
ఫోన్ : 040-24018656
ఫ్యాక్స్ : 040-24017005
E-mail : editorsthanikapalana@gmail.com
Website: www.apard.gov.in



ఈ సంచికలో రచయితలు వెలిబుచ్చిన అభిప్రాయాలు తప్పనిసరిగా ప్రభుత్వానికి గాని, టిసిపార్డ్‌కి గాని చెందినవిగా భావించనక్కరలేదు.


# విషయ సూచిక


సంపాదకీయం ........ 4
గ్రామ పంచాయతీల పనితీరును మెరుగుపరచాలి........ 5
తెలంగాణ రాష్ట్రంలో కమ్యూనికేషన్స్ అభివృద్ధికి సత్వర చర్యలు చేపట్టాలి........ 6
బి.ఎస్.వి.లు నిస్వార్థంగా గ్రామాభివృద్ధిలో పాల్గొని కృషి చేయాలని పిలుపు........ 7
మిషన్ కాకతీయ పవిత్రయజ్ఞం........ 8
స్థానిక స్వపరిపాలన దినోత్సవం - ఏప్రిల్ 24........ 11
తెలంగాణ పునరుజ్జీవనం........ 12
స్థానిక స్వపరిపాలనా పితామహుడు........ 14
పంచాయితీలకు నిధులు ఎలా వస్తాయి?........ 16
మానవ ధర్మం -విలువలు బోధనలో చేర్చాలి........ 20
బహిరంగ మల విసర్జన నిర్మూలన: ఆలోచన ధోరణిలో మార్పు ఆవశ్యకత........ 21
జీ.వో........ 25
వెనుకబడిన తరగతుల ఉద్ధారకుడు జ్యోతిబా పూలే........ 26
నూతనోత్సాహంతో పనిచేయాలి........ 27
చెరువుకు మనమై.. మనతో చేరువై........ 28
ఉపాధి హామీ పథకం - చెంచు సిబ్బందికి శిక్షణా కార్యక్రమం........ 30
గ్రామ పంచాయితీలలో వ్యర్థ పదార్థాల నిర్వహణ........ 34
'కీన్ వా' పంటను పరిచయం చేసిన 'టిసిపార్డ్'........ 36
గ్రామీణ ప్రాంతాలలో వచ్చే వ్యాధులు - ముందుగా తీసుకోవల్సిన జాగ్రత్త చర్యలు........ 38
వాతావరణంలో మార్పు- దాని ప్రభావం........ 41
సర్పంచ్‌లకే చెక్ పవర్........ 42
ఆదిలాబాద్ జిల్లా ఎకానమీ........ 43
ప్రాజెక్టుల నిర్మాణ వివరాలు........ 45
ప్రజల భాగస్వామ్యంతో ప్రగతి........ 46
మహిళా సాధికారతకు మిషన్ రుద్రమ........ 47
మైనార్టీలకు చేయూత........ 48
తెలంగాణ స్థానిక పంచాయతీ సంస్థలు పనిచేయటానికి ప్రోత్సాహం........ 49
మహారాష్ట్రకు వెళ్ళొచ్చిన సర్పంచ్‌ల అనుభవాలు........ 50
న్యాయం కోసం 'నిర్భయ' కేంద్రాలు........ 51
స్వేచ్ఛ, సమానత్వం చాటిన ప్రవక్త డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్........ 52
2014-15 తెలంగాణ ఆర్థిక సర్వే........ 53
క్షయ రహిత భారత్ దిశగా . . . ........ 55
వాటర్‌గ్రిడ్‌కు ప్రత్యేక ప్యాకేజీ........ 57
తెలంగాణ సంకీర్తనాచార్య........ 58
డా॥ బి.ఆర్. అంబేద్కర్ తాత్వికతలో భారతదేశం........ 59
టిసిపార్డ్‌లో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం........ 63
పంచాయతీరాజ్ చట్టం - గతం - నేడు పరిణామం
అధికార - విధులు పరిణామ క్రమంపై వర్క్‌షాప్........ 64
అందరికి విద్యాసాధనలో భారత్........ 64
'జననేత' బాబూ జగ్జీవన్ రామ్........ 65
ఈ - పంచాయతీపై అధికారుల శిక్షణ........ 66

# గ్రామ పంచాయతీల సాధికారత



మనదేశ పాలనలో గ్రామ పంచాయతీలకు చాలా ప్రాముఖ్యత ఉంది. ఏ దేశం స్వయం సమృద్ధిని సాధించాలన్నా ముందు గ్రామాలు పరిపుష్టంగా ఉండాలి. అసలు మనదేశం గ్రామ పంచాయతీలు స్వయం సమృద్ధి కలిగినవి. పాడి, పంటలతో, సిరిసంపదలతో ఉంటాయి. అందుకు కారణం మన గ్రామాల సౌహార్ధ్ర సంస్కృతే. సహకారం, సమన్వయం, ఇచ్చిపుచ్చుకునే ధోరణి విలసిల్లుతూ వచ్చింది. ఆ వ్యవస్థలలో సంపన్న వర్గాలకు, పేద వర్గాలకు సమన్వయాన్ని ఆనాటి స్థానికపాలనలో ఉండేదని చరిత్రకారుల అభిప్రాయం.


గ్రామ పంచాయతీలు మనదేశంలో గుప్తుల కాలం నుండి ఉన్నాయి. గ్రామాలలో స్వయం సమృద్ధిని సాధించేందుకు కృషి చేస్తున్నాయి. స్వాతంత్ర్యం తరువాత కమ్యూనిటీ డెవలప్‌మెంట్ పేరుతో అభివృద్ధి కార్యక్రమాలు 1950లో ఎస్.కె.డే నాయకత్వంలో పనిచేశాయి. గ్రామపంచాయతీలకు మరిన్ని అధికారాలను కల్పించేందుకు బల్వంతరాయ్ మెహతా, అశోక్ మెహతా కమిటీల సూచనల మేరకు గ్రామపంచాయతీలను బలపరచెందుకు కృషి జరిగింది. అయినా గ్రామపంచాయితీలకు ప్రత్యక్షంగా నిధులు అందజేసేందుకు గ్రామ సర్పంచులకు అధికారాలు యివ్వబడినాయి. వాటిని స్థిరీకరించెందుకు 1993లో 73వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయితీల సాధికారికతను పెంపొందించడం జరుగుతుంది. 73వ రాజ్యాంగ సవరణ ప్రకారం సర్పంచులకు అధికారాలను కట్టపెట్టి గ్రామంలో కనీస అవసరాలను తీర్చేందుకు కృషి చేయడం జరుగుతుంది. ఈ నేపథ్యంలోనే ఏప్రిల్ 24ను గ్రామ పంచాయితీ దినోత్సవంగా జరుపుకుంటున్నాం. గ్రామ పంచాయతీలో గ్రామసభ నిర్ణయించిన పనులను అమలు చేయుటకు అధికారులు శ్రద్ధ వహించుతున్నారు. 29 విషయాలకు సంబంధించి కార్యక్రమాలను అమలు చేయడం జరుగుతుంది.

మనదేశం ప్రాథమికంగా వ్యవసాయ దేశం. చెరువులు, దిగుడుబావుల నీటి ద్వారా సేద్యం సాగేది. కాని బహుళార్థక సాధక ప్రాజెక్టులు వచ్చాక గ్రామాలకు గ్రామాలనే కబళించడం జరిగింది. అయినా జీవనం సాగింది. మన గ్రామాలు, గ్రామ పంచాయతీలు స్వయం సమృద్ధిగా నడిచేవి. అంటే మన గ్రామాలులో పెరుగు, పాలు, నెయ్యి కొరత ఉండేది కాదు. తినగా మిగిలింది అమ్ముకునేవారు. ఇపుడు కేవలం అమ్మకానికే పాలు సేకరించడం జరుగుతుంది.

గ్రామ సభయే క్రిందిస్థాయిలో అత్యున్నత పార్లమెంటు లాంటిది. దానికి పూర్తి అధికారాలు కట్టబెట్టడం జరుగుతుంది. గ్రామపంచాయతీ పాలనను బలోపేతం చేసింది. అంటే గ్రామంలోని సమస్యలైన త్రాగునీరు, విద్య, వైద్యం, పారిశుద్ధ్య సౌకర్యాలను కల్పించుకోటానికి ఆ గ్రామ ప్రజల అభిప్రాయాలను తెలుసుకొని అమలు చేయటానికి 73వ రాజ్యాంగ సవరణ 1993 ను అమలు చేయటానికి 32 ప్రభుత్వశాఖాధికారులను గ్రామాభివృద్ధిలో భాగస్వాములను చేసింది.

సర్పంచులు గ్రామ పంచాయతీ పాలన పట్ల శ్రద్ధ తీసుకొని గ్రామ ఆర్థిక వ్యవస్థను స్థిరపరచాలి. అవి త్రాగునీరు, ఆరోగ్య కార్యక్రమాలు విద్యా, అక్షరాస్యత, ప్రణాళిక రచన, ప్రజల భాగస్వామ్యం, సంక్షేమ పథకాలు అంగన్‌వాడి, గృహనిర్మాణం, పెన్షన్ల పంపిణీ మొదలైన కార్యక్రమాలను అమలుపై అవగాహన పొందడం విధుల్లో ఉద్యోగులకు స్వేచ్ఛనీయడం ద్వారా గ్రామాలు అభివృద్ధి చెందుతాయి.

గ్రామాల నుండి చదువుకున్నవారు బయటికి పోవడంతో గ్రామాలు వట్టిగా తయారవుతున్నాయి. కమ్యూనికేషన్ విప్లవం వలన కూడా గ్రామ సంబంధాల్లో మార్పులు వచ్చాయి. గతంలో టెలిఫోన్ బూతుల వద్ద క్యూ కట్టే రైతు తన పొలంలోనే సెల్‌ఫోన్‌తో అమెరికా, లండన్‌లో ఉన్న తన కొడుకు, కోడలు, మనవలతో మాట్లాడుతున్నాడు. ఎలక్ట్రానిక్ విప్లవం వల్ల మొత్తం గ్రామ పాలనలో ఈ-గవర్నెన్స్, ఈ-బిల్లులు కట్టే స్థితికి వచ్చాం. కొద్దిగా ఆలస్యం అయినా కంప్యూటర్ నెట్ వర్క్ ద్వారా మనల్ని మనం పురోభివృద్ధి ద్వారా నడిపించుకుంటున్నాం. మన పంచాయతీలు ఆధునిక, సాంకేతిక స్పృహతో రాష్ట్రంలో ఈ-పంచాయతీలను నిజామాబాద్ జిల్లా నుండి ప్రారంభించటానికి నిర్ణయించారు. మన గ్రామీణ జీవితాలలో మార్పులు వచ్చినా, మన గ్రామీణ సంస్కృతి, సంపద, ఆచార వ్యవహారాలకు భంగం కలుగకుండా చూసుకొని ముందుకు నడవాలి. ఆ బాటలో మన గ్రామ పంచాయతీలకు పరిపుష్టి కల్పించి ఆధునిక మార్గాలలో ముందుకు నడిపించుదాం.



( అనిత రామచంద్రన్ )



# గ్రామ పంచాయతీల పనితీరును మెరుగుపరచాలి

**భారతదేశ అభివృద్ధి సాధనలో గ్రామ పంచాయతీల పని తీరును మెరుగుపరచి, తదనుగుణంగా నిధులను కేటాయించ వలసిన అవసరం ఉందని కేంద్ర ప్రభుత్వ పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి ఎం. విజయానంద్, ఐఎఎస్ అన్నారు.**

ఏప్రిల్ 14న హైదరాబాద్‌లోని తెలంగాణ స్టేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ (టిఎస్ఐపిఎఆర్‌డి) లో తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారుల సమావేశంలో గ్రామాభివృద్ధికి, పంచాయతీలు ఏ విధంగా కృషి చేయాలి అనే అంశం మీద సమావేశాన్ని ఆయన ప్రారంభించి ప్రసంగించారు.

పంచాయతీలకు నేరుగా కేంద్రం నిధులను కేటాయించే పద్ధతిని ప్రవేశపెట్టి 2 లక్షల కోట్ల రూపాయలను బడ్జెట్‌లో కేటాయించడం జరిగిందని కేంద్రం ఆ నిధులు కేటాయించిన 15 రోజులలో గ్రామపంచాయతీలకు నిధులు విడుదల చేసినట్లు కేంద్ర ఆర్థిక శాఖ నిర్దేశించిందని చెప్పారు. గ్రామ పంచాయతీలు గ్రామ సభను నిర్వహించి 22 విషయాలతో కూడిన పారిశుధ్యం, విద్య, ఆరోగ్యం, అభివృద్ధి పనులను చేపట్టు లాగున చూడవల సిన అవసరం ఉందని అన్నారు.

అంతకు ముందు టిఎస్ఐపిఎఆర్‌డి కమీషనర్ అనిత రామచంద్రన్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 'మన ఊరు–మన ప్రణాళిక'ను ప్రవేశపెట్టి పలు అభివృద్ధి పథకాలను అమలు చేస్తుందని వివరించారు. ముఖ్యంగా వాటర్ గ్రిడ్, చెరువుల అభివృద్ధి రోడ్ల నిర్మాణం, కమ్యూనికేషన్లకు అత్యధిక ప్రాధాన్యతనిస్తుందని చెప్పారు.

ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి ప్రిన్సిపల్ కార్యదర్శి రేమండ్ పీటర్, జిల్లా ముఖ్య కార్య నిర్వహణాధికారులు, సెర్ప్ అధికారులు, మెప్మా అధికారులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమాన్ని టిఎస్ఐపిఎఆర్‌డి జాయింట్ డైరెక్టర్ కె. యాదయ్య పర్యవేక్షించారు టిఎస్ఐపిఎఆర్‌డి అధికారులు పాల్గొన్నారు. వికేంద్రీకృత ప్రణాళిక పరిపాలన కేంద్రం (సిడిపిఏ) వారు కార్యక్రమంను నిర్వహించారు.

*– సి.ఎం.పి.*






# తెలంగాణ రాష్ట్రంలో కమ్యూనికేషన్స్ అభివృద్ధికి సత్వర చర్యలు చేపట్టాలి

**తెలంగాణ రాష్ట్రంలో అమలు జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలను కమ్యూనికేషన్ నెట్‌వర్క్స్ ద్వారా వన్‌స్టాప్ -ఫాష్ పద్ధతిని అభివృద్ధి పరచి ప్రజలందరికి వచ్చే ఐదు సంవత్సరాలలో అందుబాటులోకి తీసుకురావాలని తెలంగాణ రాష్ట్ర కమ్యూనికేషన్లు, పంచాయతీ రాజ్ శాఖల మంత్రి కె.టి.రామారావు అన్నారు.**

ఆయన ఏప్రిల్ 16 టిఎస్ఐపిఎఆర్‌డిలో జరిగిన కమ్యూనికేషన్ శాఖా అధికారుల సమీక్షా సమావేశాన్ని ప్రారంభించి ప్రసంగించారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి పథకాల ద్వారా ప్రజలకు 4 వేల కోట్లు రూపాయలు పంపిణీ జరుగుతున్నదని, వాటినన్నింటిని కంప్యూటరీకరించి యువతకు ఉద్యోగ కల్పన దిశగా పనిచేస్తున్నామని వివరించారు.

అదేరీతిలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జనధన్ యోజన, ఎస్‌హెచ్‌జి ఇతర పథకాలను అనుసంధానం చేసి ప్రజలకు త్వరితగతిని అందేవిధంగా చూడాలని మంత్రి కె.టి.రామారావు అధికారులను ఆదేశించారు.

కమ్యూనికేషన్స్‌లోని నూతన పద్ధతులు ప్రజలకు వచ్చే నాలుగేళ్ళలో అందుబాటులోకి తేవాలని సూచించారు. అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయంతో నడిపించే టెక్నాలజీని అభివృద్ధి చేయాలని మంత్రి అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో ప్రపంచ బ్యాంకు అధికారి డా॥ ఓజా వివిధ రాష్ట్రాలలో అమలవుతున్న టెక్నాలజీ పద్ధతులను కార్యక్రమంలో వివరించారు. మంత్రి కమ్యూనికేషన్, ఇన్ఫర్‌మేషన్ టెక్నాలజీలలో అమలౌతున్న వివిధ పథకాలను సమీక్షించి తగు సూచనలను జారీ చేశారు.

ఈ కార్యక్రమంలో ఐ.టి. ప్రిన్సిపల్ కార్యదర్శి జయేష్ రంజన్ తదితరులు పాల్గొన్నారు.

*– సి.ఎం.పి.*



# బి.ఎన్.వి.లు నిస్వార్థంగా గ్రామాభివృద్ధిలో పాల్గొని కృషి చేయాలని పిలుపు

**యువత ఆలోచనలో మార్పు వలన ఎన్నో రకాలైన పనులు సాధించవచ్చునని టిసిపార్డు (TSIPARD) కమీషనర్ శ్రీమతి అనితా రామచంద్రన్, ఐఎఎస్ అన్నారు. ఆమె ఈ రోజు భారత్ నిర్మాణ వాలంటీర్ల శిక్షణ సమావేశంలో పాల్గొని ప్రసంగించారు.త**

మనిషి ఆలోచనల నుండే అభివృద్ధి బీజాలు వస్తాయని, ఆలోచనలతో తను మారి, ఇతరులను ప్రేరేపించటం ద్వారా గ్రామంలో వారి అవసరాలైన తాగునీరు, పారిశుద్ధ్యం రోడ్లు తదితర ఎన్నో సమస్యలను తీర్చేందుకు అవకాశం ఉంటుందని శ్రీమతి అనితా రామచంద్రన్ అన్నారు.

తెలంగాణ రాష్ట్రం వివిధ జిల్లాల నుండి 250 మంది బిఎన్‌విలకు మార్చి 24, 25, 26 తేదీల్లో శిక్షణనిచ్చారు. ఇందుకు కేంద్ర, రాష్ట్ర పథకాలు స్వచ్ఛభారత్, ల్యాటిన్‌ల నిర్మాణం ద్వారా గ్రామాలలో ఆరోగ్యాన్ని ప్రజలు పొందేలా చూడాలన్నారు.

రాజకీయాలు మంచివైతే ఎన్నో విధాలుగా పనులు మనం సాధించవచ్చని, కానీ ప్రక్క దోవ పట్టి చెడుగా ప్రజల్లోకి వస్తున్నాయన్నారు. అందుకే బిఎన్‌విలు మార్పుకు ప్రయత్నించి విజయాలు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాన్ని అపార్డు జాయింట్ డైరెక్టర్ ప్రారంభించారు. శ్రీ జయపాల్‌రెడ్డి కోర్సు డైరెక్టర్‌గా వ్యవహరించారు.



# మిషన్ కాకతీయ పవిత్ర యజ్ఞం



**మరో చారిత్రాత్మక సంకల్పాన్ని తెలంగాణ భుజానికెత్తుకున్నది! సమైక్య పాలకుల దశాబ్దాల వివక్షను సమాధి చేస్తూ కొత్త రాష్ట్రంగా అవతరించిన తెలంగాణ.. తన ఆయువుపట్టయిన చెరువులను పునరుద్ధరించుకునేందుకు ఇప్పుడు మరో ఉద్యమానికి సిద్ధమైంది! వేల ఏండ్లపాటు తెలంగాణను సస్యశ్యామలం చేసి.. దశాబ్దాలుగా నిర్లక్ష్యంతో పూడుకుపోయిన దాదాపు 46 వేలకు పైగా చెరువులను మళ్లీ జలకళలాడించేందుకు కంకణం కట్టుకున్నది! అపురూపమైన ఈ సందర్భానికి నిజామాబాద్ జిల్లా సదాశివనగర్‌లోని 'పాతచెరువు' వేదికైంది!**

పూడికతో నిండిపోయిన పాత చెరువు.. ఇప్పుడు కొత్త కాంతులీనేందుకు తయారవుతున్నది! కొత్తనీటిని పొదువుకని.. చెరువుపై ఆధారపడిన సకల సామాజికవర్గాల బతుకు చిత్రాన్ని మార్చేయబోతున్నది! రాష్ట్రంలో పాత చెరువులాంటి 46 వేలకు పైగా చెరువుల రూపురేఖలు మార్చేందుకు ఉద్దేశించిన ప్రతిష్మాత్మక మిషన్ కాకతీయ కార్యక్రమానికి అంకురార్పణ చేసిన ముఖ్యమంత్రి  దీనిని పవిత్ర యజ్ఞంలా భావించాలని పిలుపు నిచ్చారు.

పాతచెరువు పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన చేసిన సీఎం మిషన్ కాకతీయ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అక్కడే గడ్డపార చేతబట్టి చెరువులోని పూడిక మట్టిని తవ్వారు. తవ్విన మట్టిని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే రవీందర్ రెడ్డి, మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి కలిసి తట్టల్లో ఎత్తారు. తట్టను మొదట మంత్రి హరీశ్‌రావు నెత్తిమీదకి ఎత్తడంతో ఆయన పక్కనే ఉన్న ట్రాక్టర్లో ఆ మట్టిని వేశారు. ఆ తర్వాత మంత్రి పోచారం, ఏనుగు రవీందర్‌రెడ్డి కలిసి సీఎం కేసీఆర్‌కు మట్టితట్ట నెత్తికెత్తారు. సీఎం తట్టలో మట్టిని మోస్తూ పక్కనే ఉన్న ట్రాక్టర్ వద్దకు నడిచివెళ్లి అందులో మట్టిని వేశారు.

ఆనంతరం అక్కడే ఏర్పాటు చేసిన బహిరంగసభను ఉద్దేశించి సీఎం ప్రసంగించారు. చెరువు పునరుద్ధరణ కార్యక్రమాన్ని అందరూ ఏకమై విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి నియోజకవర్గానికి వరాల జల్లు కురిపించారు. కామారెడ్డిని జిల్లా కేంద్రంగా చేస్తానని ప్రకటించారు.

"అరవై ఏండ్ల సిలుము.. ఒక్కరోజుతోని వదుల్తాది.... సదాశివనగర్ పాతచెరువులో ఏడు ఎనిమిది ఫీట్ల మట్టి పూడికపోయి ఉన్నది. మరి అరవై ఏండ్ల శిలుము కదా. ఒక రోజుతోని వదుల్తాది ! ఇంత నాశనం చేసింద్రు ! ఎక్కడబోయినా మన చెరువుల బతుకింతే. వాళ్లట్లచేస్తే.. మనం కూడా రైతుల మేంజేసినం..? బస్త కాదు రెండు బస్తాలు చల్లుదాంరా అని

జెప్పి చెర్లమట్టిని తీస్కపోయి పొలాల కొట్టుకునుడు కూడా బంజేసినం. మునుపైతే ఎండకాలమొస్తే.. అప్పుడు ట్రాక్టర్లు లేకుండే.. ఎడ్లబండ్లతోనైనా సరే చెర్లమట్టంతా పొలాలల్లకు కొట్టేది. మంచి సారం పెరిగేది భూమిలో. వాళ్లాంధ్రోళ్లట్ల జేసింద్రు.. మనం ఎరువులు బస్తాలెక్కువేసి పొలాలు ఖారబు చేసుకున్నం. చెర్లన్నీ పూడిక తెచ్చుకున్నం. దాని ఫలితమేమైంది? చెర్లన్నీ తాంబాళంలాగా మారిపోయినయి. అడవులు నరికేసింద్రు. మంచి వర్షాలు పడేదే తక్కువ. ఎప్పుడన్నా గాచారం బాగుండి మంచికాలమైతే చెర్వులలో నీళ్లు నిల్వయ్. ఎక్కడియక్కడ ఎళ్లిపోతయ్. ..

"ఉద్యమం సమయంలో ప్రతీ ఉపన్యాసంలో నేన్జెప్పిన. కామారెడ్డిలో నేను ఇన్‌చార్జిగా వచ్చినప్పుడు ఆరోజు నేను నగర్‌కు కూడా ఓ రోజు వచ్చి ఉండిపోయిన. ఆరోజు కూడా ఈ చెర్వుల మీద నేను మాట్లాడిన.. మొత్తం చెరువులు నాశనమైనయని. మా తెలంగాణ రాష్ట్రం మేం తెచ్చుకుంటం. మళ్లీ కాకతీయ, రెడ్డిరాజులకు దండం పెట్టి మేం కచ్చితంగా మా చెరువులు కళకళలాడేటట్టు చేసుకుంటమని ఉద్యమ సందర్భంలో నేన్చెప్పిన. ఉద్యమం గెలిచింది. తెలంగాణ వచ్చింది...

"ఎన్నికలు జరిగినయ్ ఉద్యమ నాయకత్వానికే ప్రజలు పట్టం గట్టింద్రు. ఆనాడు ఉద్యమంలో పాల్గొన్న నాయకులు, జైళ్లకు పోయిన నాయకులనే ఇయల ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా, మంత్రులుగా మీరే దీవించి అవకాశం ఇచ్చి నిలబెట్టింద్రు. మరియాల ఏం జరగాల? యాడాది తిర్గకముందే మొత్తమంత కూడా.. అధికారులు లేకపోయినా, వనరులు సరిగా లేకపోయినా, కొత్త రాష్ట్రమైనా.. మొత్తం విషయాలన్నీ అర్థం చేసుకొని, సర్వే చేయించి ఇంజినీర్లను ఉరుకుల పరుగులబెట్టించి మొత్తం వివరాలు తెప్పించుకున్నం. పోయినయ్ పోయినయ్. మిగిలిన వాటిల్లో 46 వేల చిల్లర చెరువులున్నయ్. వీటన్నింటిలో కచ్చితంగా మొత్తం పూడిక పోవాలె. కట్టలన్నీ బందబస్తు కావాలె. మత్తడ్లు, తూములన్నీ బందబస్తు కావాలె. పంటకాల్వలు కూడా మంచికావాలె...

"మన అదృష్టం మంచిగుండి ఒక్క సంవత్సరం కాలమైతే మూడేండ్లదాకా కరువు మనదిక్కు మర్రి చూడదు. ఆ పరిస్థితి మనమందరం తెచ్చుకోవాలె. కచ్చితంగా అందరం పిడికిలి పట్టాలె. అందరం ఎక్కడోళ్లమక్కడ పూనుకుంటేనే తయారైతది. నేను మంత్రి హరీశ్‌రావుగారికి చెప్పిన. ఎక్కడ్నైతే గ్రామాలలో రైతులు ముందుకొస్తరో.. పువ్వు మట్టి అంతా మీదమీదుండే మట్టి వాళ్ల పొలాలల్లకియ్యండీ.. మీరు గవర్నమెంటు తవ్వండి. ట్రాక్టర్లు వాళ్లు పెట్టుకుంటరు. మంచి లాభం జరుగుతదని నేన్చెప్పిన. రైతు సోదరులందరికీ నేను మనవి చేస్తావున్నా.. దయచేసి మీరందరు.. ఇంత మంచి అవకాశం దొరకదు. ఈ వేదిక నుంచి, నగర్ నుంచి నేనీరోజు తెలంగాణ యావన్మంది రైతులకు ఈ సందేశం చెప్తావున్నా. ఈ రెండుమూడు నెల్లపాటు బ్రహ్మాండంగా ఎక్కడ చూసినా.. మీరు చరిత్రలో కనివినీ ఎరుగని విధంగా తొమ్మిదివేల చెరువుల మరమ్మతులు బ్రహ్మాండంగా జరగబోతాయి...

"ఆ కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్టులో పెట్టండి. నేను ఇంజినీరు సోదరులకు మనవి చేస్తావున్నా.. జిల్లా కలెక్టర్‌కు కూడా ప్రత్యేకంగా చెప్తావున్నా. గతంలో మీదమీద పన్జేసి.. దొంగ బిల్లులు లేవట్టుకుంటె ఇదే జిల్లాలో మరమ్మత్తులు చేసిన అనేక చెరువులు తెగిపోయినయ్. ఆ తెగిపోవడానికి ఎవడెవడైతే బాధ్యుడున్నడో వాళ్లకెట్టి పరిస్థితుల పన్లు ఇయ్యొద్దని చెప్పి వాళ్లను బ్లాక్‌లిస్టులో పెట్టాలని చెప్పి ఈరోజు నేను అధికారులకు ఆదేశం ఇస్తావున్నా. ఈ దొంగ కాంట్రాక్టర్లు మనవకసరం లేదు. గతంలో ఏ చెరువుమీద ఎవడు పన్జేసిండు? ఏ చెరువు తెగిపోయింది? ఆ వివరాలనీ తీయించాలె. ఆ దొంగలు మళ్లా వస్తే మళ్లా మొదటికే వస్తది కాబట్టి ఆన్‌లైన్‌లో ఓపెన్ టెండర్లు పిలుస్తావున్నం. దానికి వీళ్లూవాళ్లనే బేధం లేదు. ఎవ్వరు టెండర్లేసినా పాల్గోవచ్చు. పనులు చేయవచ్చు. నాణ్యత ప్రకారం ఎవ్వరైతే చేయ్యరో జైలుకు పంపిచ్చేది కూడా ఖాయం. ఇది గత సమయం కాదు. గత ప్రభుత్వం కాదు. ఇది మన తెలంగాణకు ప్రాణం....

"నేల విడిచి సాము చేయొద్దు. ఎమ్మెల్యేలం, ఎంపీలం, మంత్రులమంటే నేలవిడిచి సాముచేయొద్దు. మనం చేసే పని ఎక్కడ్నో హైదరాబాద్‌లో లేదు. ఢిల్లీలో లేదు. ఇగో మనం చేసే పని సదాశివనగర్ పాత చెరువులో ఉన్నది. ఎల్లారెడ్డిలోని గ్రామ గ్రామాన ఉన్న చెరువులో ఉన్నది. ఎమ్మెల్యేలందరూ చిన్నపాటి టెంటేసుకుని చెర్లనే పండాలె. చెర్లనే ఉండాలె. రైతులతోని కలిసి అన్నం తినాలె. అంత పట్టుపట్టాలె. అంత మొండి పట్టుపడితేనే పనివరుస అయితది. తెలంగాణ మాత్రం వట్టిగచ్చిందా మనకు. ఎన్ని బాధలు పడ్డం. ఎన్ని తిప్పలు పడ్డం. చివరకు సచ్చేదాక తయారయినం. అంత తెగిస్తెనే తెలంగాణొచ్చింది. ఇపుడు కూడా తెలంగాణ నిలిసి గెల వాలె. దేశం ముందు రుజువు చేసుకోవాలె. భేష్.. తెలంగాణ బిడ్డలు గొప్పోళ్లు.. సాధించుకున్నరు. ..

"అగజూడు వాళ్లు కాకతీయ మిషన్ ఎట్ల చేసుకున్నరో. అగ జూడు రోడ్లెట్లజేస్కుంటున్నరో అని చెప్పి అద్భుతంగా దేశం ముందు మనం నిలిచి గెలిచి చూపట్టెలె. దాని కోసం ఎమ్మెల్యేలు, ఎంపీలు దయచేసి నాలుగురోజులైతే అసెంబ్లీ అయితది. మీరు హైదరాబాద్‌ల కనవడద్దు. ఏ ఎమ్మెల్యే చెర్ల పొంట, కుంటల పొంటనే ఉండాలె. ఇగ మన ముందు కనబడ్తా వున్నది దరిద్రమంతా అగో.. అయ్యే లొట్టపీసు చెట్లుంటం మనం. మొత్తంఅదే. నేను మళ్లా యాడాదినాడు హెలికాప్టర్‌ల గీడనే దిగుతా. కచ్చితంగా దిగుతా. ఇది నేను స్టార్ట్ చేసిన చెరువు కాబట్టి ఇది అన్ని రకాలుగా కావాలె. ఈ తూటిచెట్లు, లొట్టపీసు చెట్ల జాగల నీళ్ల తళకులు కనబడాలె. బ్రహ్మాండంగా నీళ్లు కనబడాలె. అప్పుడే మనకు సంతోషమైతది...

"ఈరోజు మా తల్లులకు, మా అన్నదమ్ములకు, మా వృద్ధులకు వెయ్యి రూపాయల పెన్షనిచ్చేది కనబడ్తలేదా ? ఇస్తాం డ్రామ్మా వెయ్యి రూపాయల పింఛన్లు.. వికలాంగులకు పదిహేను వందల పెన్షన్ ఇస్తున్నరా? రేషన్ కార్డు మీద పరిమితిలేకుండా ఆరుకిలోల బియ్యం ఇస్తున్నరా? ఇస్తున్నరు కదా! నిన్న అంగన్‌వాడీలకు జీతాలు పెరిగినయ్‌కదా? ఉద్యోగస్తులకు జీతాలు పెరిగినయా? ఇయాల చెరువులు తవ్వుడు మొదలయిందా? బీడీ కార్మికులకు వెయ్యి రూపాయలొచ్చిందా? బీడీ కార్మికులందరికీ అక్క జెల్లలకు ఒక్కటే జెప్తావున్నా. ఎవలెవలకతే వచ్చిందో వచ్చినవాళ్లు మీ పెన్షన్ తీసుకోండి. రాని వాళ్లు ఎమ్మార్వో ఆఫీసుకు పోయి దరఖాస్తియ్యండి. ప్రతి బీడీ కార్మికురాలికి సహాయమందించాలన్నదే మా ఉద్దేశం. జిల్లా కలెక్టర్ మంజూరు చేసి వారం పదిరోజుల్లో మీ ఇంటికి తీసుకొచ్చిస్తారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు, ఎంపీపీలకు, జడ్పీటీసీలకు మనవి చేస్తున్నాం. వచ్చినవాళ్లకు మొదటి విడత ఇప్పించుకోండి.. రాని వాళ్లకు రెండోవిడత ఎమ్మార్వో కార్యాలయంలో వెంటనే దరఖాస్తు పెట్టించుకోండి. ప్రతీ ఒక్క మనిషికి నేను ఇప్పిస్తానని హామీనిస్తావున్నా. ఎవరు కూడా దానికి చింతించాల్సిన అవసరం లేదు. ఇగ ఈ విధంగా పనిచేస్తున్నం ఈ పనులన్నీ కనబడ్తలేవా? దళితబిడ్డలకు గిరిజన బిడ్డలకు పెండ్లిలయ్‌తుంటే కల్యాణలక్ష్మి కింద 51 వేల రూపాయలు మంజూరు చేస్తావున్నాం. క్రైస్తవులకు గానీ, ముస్లింలకు గానీ సిక్కు సోదరులకు గానీ వాళ్ల ఇండ్లలో పిల్లలుంటే గూడ 51 వేల రూపాయలు మంజూరు చేస్తావున్నాం. ఇవన్నీ

# మిషన్ కాకతీయకు నాబార్డు సాయం

**రాష్ట్రంలో వ్యవసాయం, దాని అనుబంధ పరిశ్రమలు, ఇతర రంగాలతోపాటు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ కాకతీయ, వాటర్ గ్రిడ్ పథకాలకు ఆర్థిక సాయం అందించేందుకు జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డ్) ముందుకొచ్చింది. ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావును నాబార్డు ఛైర్మన్ హరీశ్‌కుమార్ భన్వాలా, డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్లు ఆర్ అమేలోర్ పర్వనాథన్, జీజీ మమ్మెన్‌లు సీఎం క్యాంపు కార్యాలయంలో కలిశారు.**

ఈ సందర్భంగా భన్వాలా మాట్లాడుతూ... తమ సంస్థ అన్ని రాష్ట్రాలకు వ్యవసాయ సంబంధమైన కార్యకలాపాలకు ఆర్థిక సాయం చేస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ ప్రాంతంలో 959 ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయి. కొన్ని ప్రాజెక్టులు నత్తనడకన నడుస్తున్నాయని, వాటి వేగం పెంచాలని ఛైర్మన్ కోరారు. దానికి సీఎం కేసీఆర్ స్పందించి, అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

### మిషన్ కాకాతీయ ప్రతిష్టాత్మకం

ప్రభుత్వం చేపట్టిన మిషన్ కాకతీయ ప్రాజెక్టు అత్యంత ప్రతిష్టాత్మకమైందని సీఎం కేసీఆర్ వారితో అన్నారు. ధ్వంసమైన చెరువులను ఇప్పుడు ప్రభుత్వం పునరుద్ధరించనున్నట్లు తెలిపారు. దానికి నాబార్డు సాయం చేయాలని కోరగా ఛైర్మన్ అంగీకరించారు. వ్యవసాయ కూలీల కొరత ఉన్నందున సేద్యంలో ఆధునిక యంత్రాలను ఎక్కువగా వాడాలని సీఎం చేసిన సూచనకు ఆమోదం తెలిపారు.

చిన్న, సన్నకారు రైతులకోసం ఒక ప్రత్యేక క్లబ్ ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్లు ఛైర్మన్ హరీశ్‌కుమార్ తెలిపారు. భూసార పరీక్షలు, సాయిల్ మ్యాపింగ్ చేసేందుకు ఆర్థిక సాయం చేయాలని సీఎం కేసీఆర్ కోరారు.

### మౌలిక సదుపాయాల కింద వాటర్‌గ్రిడ్

మౌలిక సదుపాయాల కల్పన కింద వాటర్‌గ్రిడ్ ప్రాజెక్టుకు తమ బ్యాంక్ గ్రామీణ మౌలిక వసతుల కల్పన నిధి కింద ఆర్థిక సాయం అందిస్తుందని హరీశ్‌కుమార్ చెప్పారు. ఫార్మాసిటీని ఏర్పాటు చేసేందుకు కూడా సాయం అందించాలన్న సీఎం విజ్ఞప్తిని ఆయన అంగీకరించారు. నదులు, వాగులు, వంకలపైన చెక్‌డ్యామ్‌లు ఏర్పాటు చేసేందుకు, గ్రామీణ గోదాముల ఏర్పాటుకు నాబార్డు నిధులను సమకూర్చనుంది.

*– ఐ&పి.ఆర్*

---

చేసుకుంట ముందుకు పోతావున్నాం. పెన్షన్ ఎవలకన్నా రాకపోతే మాకు సూచించండి. ఇవ్వడానికి మేం సిద్ధంగా ఉన్నం."

### ఎల్లారెడ్డి నియోజకవర్గానికి వరాలు..

"ఒక ఊళ్ళే ఎగిర్తం సుట్టమొచ్చిండట ఒకాయనె. పొద్దుగాల్నుంచి నేను జెల్దిపోతా జెల్దిపోతా అంటే ఇంట్లో పెద్దమనిషుండి బిడ్డా శాన దూరం పోవాలెకదా... అన్నం కాకపాయె. బుక్కెడంత సలన్నం వాన్నది తినిపోతవ బిడ్డా అన్నదంట. ఎందుకు పెద్దమ్మా చలన్నం తింటా. ఉడుకన్నమయెదాక ఉంటా అన్నదంట. రవీందర్‌రెడ్డిది కూడా గదే కతున్నది. చెరువుమందమేమో రమ్మన్నడు. ఈడికచ్చినంక ఇగ దుకాణం మొదలుపెట్టిండు. పెట్టవల్సిందే. ఇట్లాంటి ఎమ్మెల్యేలుంటనే సమస్యలు తెగితెనే బాగుపడ్తం. ఆయన స్పిరిట్‌కు అభినందిస్తావున్నా. ఆయనకు ఆరాటం బాగున్నది' అని కేసీఆర్ అన్నారు.

నియోజక కేంద్రంలో 132 కేవీ సబ్‌స్టేషన్ మండల కేంద్రంలో ఐటీఐ, ఎల్లారెడ్డి నియోజకవర్గ కేంద్రంలో 100 పడకల ఆస్పత్రిని ఆయన మంజూరు చేశారు. కాగిత లంబాడీలను ఎస్టీల రిజర్వేషన్ల పెట్టేందుకు కమిటీ నియామకం జరిగిందని సీఎం తెలిపారు. కాగితపు లంబాడీలను కచ్చితంగా లంబాడా కులంలో కలిపే బాధ్యత నేను తీసుకుంటా. మీకందరికీ త్వరలోనే ఈ శుభవార్త కూడ వస్తది. ఎస్టీలకొచ్చే సదుపాయమంతా కాగితపు లంబాడీ అన్నదమ్ములకు కూడా వస్తది. ఎస్టీలకొచ్చే సదుపాయమంతా కాగితపు లంబాడీ అన్నదమ్ములకు కూడా వస్తది" అని చెప్పారు.

ఎల్లారెడ్డి నియోజకవర్గం పరిధిలోని చెరువుల మరమ్మత్తులకు రూ. 30 కోట్లకు బదులు మరో రూ. 60 కోట్లు పెంచుతున్నామని, జీవో విడుదల చేస్తామని ప్రకటించారు. త్వరలోనే తెలంగాణలో కొన్ని కొత్త జిల్లాలు ఏర్పాటు చేసుకోబోతా ఉన్నామన్నారు.

ఇంకా ఏమన్నారంటే...

"వందశాతం కామారెడ్డి జిల్లా చేసే బాధ్యత నాది. కామారెడ్డి జిల్లా అయిన తర్వాత పునాది రాయి వేయడానికి నేను వస్తానని చెప్పి కూడా హామీ ఇస్తావున్నాను."

### సమాజానికి వాస్తవాలు చెప్పిన విద్యాసాగర్‌రావు

ప్రభుత్వ నీటిపారుదల రంగ సలహాదారుడు ఆర్ విద్యాసాగర్‌రావును కేసీఆర్ కొనియాడారు. "తెలంగాణ ఉద్యమం జరిగే రోజులలో.. ఒక చీఫ్ ఇంజనీర్‌గా రిటైరయిపోయి కూడా నేను మౌనం పాటించకూడదు. నా తెలంగాణ బిడ్డలు పోరాటం చేస్తున్నరు. కచ్చితంగా తెలంగాణ బిడ్డలకు నీళ్లలో జరిగే అన్యాయమేందో ఊరూరికి తిరిగి చెప్తా.. అని ప్రతిజ్ఞ తీసుకొని అద్భుతమైనటువంటి ఉపన్యాసాలు చేసి, తెలంగాణ సమాజానికి వాస్తవాలు చెప్పి.. 'నీళ్లు–నిజాలు' అనే అద్భుతమైన పుస్తకాన్ని, వాస్తవాల్ని.. నిప్పులాంటి నిజాల్ని ప్రపంచం ముందు పెట్టారు" అని కేసీఆర్ ప్రశంసించారు. ◆

# స్థానిక స్వపరిపాలన దినోత్సవం - ఏప్రిల్ 24

ప్రజాస్వామ్య వికేంద్రీకరణ కోసం మరియు ప్రభుత్వంలో ప్రజలను భాగస్వామ్యం చేయడం ద్వారానే దేశం ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందుతుంది. ప్రజాస్వామ్యం విజయవంతం అవుతుంది అనే ఉద్దేశ్యంతో స్థానిక సంస్థలు ఏర్పడ్డాయి. ప్రాచీన కాలంలోనే స్థానిక ప్రభుత్వాలను చోళులు ఏర్పాటు చేశారని మనకు ఋగ్వేదం ద్వారా తెలుస్తుంది.

1870లో లార్డ్‌మేయో చేసిన తీర్మానం స్థానిక సంస్థల ఏర్పాటు గూర్చి అతి ముఖ్యమైన ఘట్టం. 1882లో లార్డ్ రిప్పన్ కాలంలో చేసిన తీర్మానాలను స్థానిక స్వపరిపాలన సంస్థల పట్ల మాగ్న కార్ట గా అభివర్ణిస్తారు. అందుకే లార్డ్ రిప్పన్‌ను స్థానిక సంస్థల పితామహుడుగా పేర్కొంటారు.

గ్రామీణాభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన సమాజ అభివృద్ధి పథకం మరియు జాతీయ విస్తరణ సేవా కార్యక్రమం అమలు తీరును, స్థానిక ప్రభుత్వాల పనితీరును అధ్యయనం చేయడానికి 1957 జనవరిలో ప్రణాళిక సంఘ సభ్యుడైన బల్వంతరాయ్ మెహత అధ్యక్షతన ఒక కమిటీని నియమించింది.

ఈ కమిటీ స్థానిక ప్రభుత్వాలు 3 అంచెలుగా ఉండాలని -

1. గ్రామ పంచాయతి

2. బ్లాకులు (పంచాయితీ సమితి)

3. జిల్లా పరిషత్

ఏర్పాటు చేయాలని 1958లో తన నివేదిక సమర్పించింది. స్థానిక ప్రభుత్వాలు రాష్ట్ర జాబితాలోని అంశం కావున ఈ సిఫార్సులను అమలు చేయమని కేంద్రం రాష్ట్ర ప్రభుతాలకు సూచించింది. ఈ కమిటీ సిఫార్సుల మేరకు భారతదేశంలో మొట్టమొదటిసారిగా 1959 అక్టోబర్ 2న రాజస్థాన్‌లోని నాగోర్ జిల్లాలో జవహర్‌లాల్ నెహ్రూ ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్‌లో 1959 నవంబర్ 1న రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో నీలం సంజీవరెడ్డి ప్రారంభించారు.

ఆ తరువాత కాలానుగుణంగా వివిధ రాష్ట్రాలు వివిధ అంచెలలో పంచాయతీరాజ్ వ్యవస్థను ఏర్పాటు చేశాయి. ఉదాహరణకు రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్ మూడంచెలు ఏర్పాటు చేస్తే, తమిళనాడు రెండంచెలు, పశ్చిమబెంగాల్ నాలుగంచెల పంచాయతీరాజ్ విధానాన్ని ప్రవేశపెట్టాయి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మూడంచెల విధానాన్ని పాటిస్తూ 1985 సంవత్సరంలో బ్లాక్‌స్థాయిలో గల పంచాయతీ సమితులను విభజించి పాలనా సౌలభ్యం కోసం 10 లేదా 15 గ్రామ పంచాయితీలను కలుపుకొని మండలాలుగా రూపొందించారు.

పంచాయితీరాజ్ సంస్థలకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించడానికి 1992 సంవత్సరంలో పి.వి. నరసింహరావు కృషి మేరకు 73 వ రాజ్యాంగ సవరణ బిల్లును తీసుకువచ్చారు.

73వ రాజ్యాంగ సవరణ బిల్లు ప్రకారం రాజ్యాంగంలో 11వ షెడ్యూల్‌లోని 9వ భాగంలో 243 (ఎ) అధీకరణం నుండి 243 (ఓ) అధీకరణం వరకు గ్రామ పంచాయతీల గూర్చి వివరిస్తున్నది.

మన దేశంలో నూతన పంచాయితీరాజ్ చట్టం 1993 ఏప్రిల్ 24న అమలులోకి వచ్చింది. అందుకే ఏప్రిల్ 24న స్థానిక స్వపరిపాలన దినోత్సవంగా జరుపుకుంటారు.

గ్రామ పంచాయతీ అనేది గ్రామ స్థాయిలో గ్రామ సంబంధ విషయాలపై చర్చావేదికగా వ్యవహరిస్తుంది. గ్రామంలో రిజిస్టర్డు ఓటర్లు అందరూ గ్రామసభలో సభ్యులుగా ఉంటారు. ఈ గ్రామ సభ సంవత్సరానికి కనీసం రెండు సార్లు సమావేశం కావాలి.

గ్రామ పంచాయితీలో సర్పంచ్ కీలకమైన పాత్రను పోషిస్తాడు. గ్రామ సర్పంచ్‌ను గ్రామంలోని వయోజన ఓటర్లు అందరూ ప్రత్యక్ష పద్ధతిలో 5 సంవత్సరాల కాలానికి ఎన్నుకుంటారు. ఇతను గ్రామసభ సమావేశాలకు అధ్యక్షత వహిస్తాడు.

రాజ్యాంగం ప్రకారం స్థానిక ప్రభుత్వాలకు 29 విధులను కేటాయించడం జరిగింది.

ప్రయోజనాలు

1. భారతదేశంలో ప్రజాస్వామ్య సంస్థలకు స్థానిక సంస్థలు పునాదిగా ఉంటాయి.

2. స్థానిక ప్రభుత్వాలు ప్రజలలో రాజకీయ అవగాహనను బాధ్యతను పెంపొందిస్తాయి.

3. స్థానిక ప్రభుత్వాలు స్థానిక స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజలను భాగస్వామ్యాన్ని కల్పిస్తాయి.

4. స్థానికంగా అందుబాటులో ఉండే భౌతిక వనరులను సక్రమంగా వినియోగించుకోవడంలో స్థానిక ప్రభుత్వాలు దోహదపడతాయి.

గ్రామాలే దేశానికి పట్టుగొమ్మలు - గ్రామ స్వరాజ్యమే సంపూర్ణ స్వరాజ్యం - మహాత్మాగాంధీ

*-దొడ్డి కుమార్, జూకల్, శంషాబాద్ రంగారెడ్డి*
*94412 36492*

**'జరా సి సమ్ తో యే మిథి బడి జర్ఖాయిస్ హై సాఖి' (కొంచెం తడి సోకితే ఈ నేల అద్భుతమైనది అవుతుంది). ఇవి మహాకవి ఇక్బాల్ కవిలోని మాటలు. తెలంగాణ గడ్డ అద్భుతమైనది. ఇది చాలా సార్లు రుజువయింది. అద్భుతమైనది కాకపోతే నిజాం నవాబు ప్రపంచంలోనే మహా సంపన్నుడు అయ్యేవాడా?**

ఈ అపురూప భూమిపై ప్రభవించిన మహాకవులు ఒకరా ఇద్దరా? గతకాలంలో కాళోజీ నారాయణరావు, కంచెర్ల గోపన్న (భక్త రామదాసు), బమ్మెర పోతన, ముఖ్దుం మొహియుద్దీన్ మొదలైనవారు. వర్తమానంలో సి. నారాయణ రెడ్డి, గద్దర్, దాశరథి, గోరేటి వెంకన్న, అందెశ్రీ తదితరులు. అంతర్జాతీయంగా ప్రసిద్ధి పొందిన నృత్యకారులు రాజారెడ్డి, రాధారెడ్డి, అలేఖ్య పుంజాల, చిత్రకారులు లక్ష్మాగౌడ్, లక్ష్మణ్ ఏలేటి, సినిమా, నాటక కళాకారులు పైడి జైరాజ్, నరసింగ్‌రావు, నారాయణ్‌రావు, ఎన్ శంకర్ ఇంకా ఎంతో మంది తెలంగాణ మణిదీపాలు.

ఈ భూమి తన అద్భుత స్వభావం ద్వారా తన ప్రజలు ప్రపంచంలోనే అత్యంత స్నేహపూరితులుగా రూపొందించింది. ఆ అద్భుత స్వభావమే



# తెలంగాణ పునరుజ్జీవనం

తీవ్ర సంక్షోభ సమయంలోనూ ఈ భూమి తన ప్రజలు ప్రశాంతంగా ఉండగలిగేలా చేయగలుగుతుంది. మరి ఈ గడ్డకు చెందిన ఇదే ప్రజలు గత ఐదు దశాబ్దాలకు పైగా నిరంతరమూ ఆందోళనాపథంలో ఎందుకున్నారు?

ఒక ఉన్నత ఆశయ సాధనకు వేలాది యువతీయువకులు తమ ప్రాణాలను అర్పించారు. ఇంకెంతో మంది తమ లక్ష్య పరిపూర్తికి అవిశ్రాంతంగా పోరాడారు. ఎందుకిలా జరిగింది? ఈ గడ్డ తన అద్భుత స్వభావాన్ని కోల్పోయిందా? ఈ ప్రశ్నకు సమాధానం, ఒక్క మాటలో కోల్పోలేదు అనే. ఈ గడ్డ ఇప్పటికీ తన ప్రజలపై అద్భుత ప్రభావాన్ని చూపుతుంది. అయితే తన తడిని కొంచెం కోల్పోయింది. ఎందుకని? పాలకులు సంవత్సరాలుగా ఈ భూమిలోని నీటిని తోడుకున్నారు. పిండుకుని పిండుకుని మరీ ఉపయోగించుకున్నారు. మరి ఆ భూమిపై ఆధారపడ్డ సంఖ్యానేక ప్రజలను పూర్తిగా విస్మరించారు.

ఈ క్రమంలో ప్రజలు దశాబ్దాల క్రితం ఎలా ఉన్నారో అలానే ఉండిపోయారు. అభివృద్ధికి ఆమడదూరంలో ఉండిపోయారు. ఆకలిదప్పులు పెరిగిపోయాయి. ఒక పూట తినడానికి రోజంతా కష్టపడక తప్పలేదు. దయనీయ పరిస్థితుల్లో కునారిల్లిపోయారు. భూమిలోని తడిని పీల్చుకున్నవారేమో అంతకంతమూ సంపన్నులయ్యారు. ఈ బాధామయ రోజుల్లో రాజకీయవేత్తలు ఆ ప్రజలకు ఒక కొత్త ఆశాభావాన్ని కల్పించారు.

తమ ప్రాంతానికి ప్రత్యేక రాష్ట్ర ప్రతిపత్తిని సాధిస్తే బతుకులు బాగుపడతాయనే ఆశాభావాన్ని ప్రజల్లో పాదుకొల్పారు. సొంత రాష్ట్రం, స్వపరిపాలనే బాధల నుంచి తమ విముక్తికి మార్గమని, అదొక్కటే తమ జీవితాలకు సుఖశాంతులు ఇవ్వగలదని వారు విశ్వసించారు. ప్రజల జీవితాలలో అభివృద్ధి వెలుగులు వికసిస్తాయా, ఈ భూమి మళ్ళీ తన స్వతసిద్ధ అద్భుత స్వభావాన్ని సంతరించుకోగలుగుతుందా అనేది పూర్తిగా ఒక అంశంపై ఆధారపడి వుంది. ఎవరైతే ఈ భూమి తడిని పీల్చేసుకున్నారో, వారు అంటే పాలకులు లేదా రాజకీయవేత్తలు, ప్రజల శ్రేయస్సు వల్ల వారి బద్ధత అనేదే ఆ ఏకైక అంశం.

నేడు 'చిత్తశుద్ధి', 'నిబద్ధత' అనే లక్షణాలకు ప్రాధాన్యమిస్తున్నారు. ఈ లక్షణాలే కనుక పాలకులు లేదా రాజకీయవేత్తలలో ఉంటే ప్రత్యేక రాష్ట్రం కోసం డిమాండ్ చేయవల్సిన అవసరమే ఉండేది కాదు. రాజకీయవేత్తలలో చిత్తశుద్ధి, నిబద్ధత ఉన్నట్టయితే సొంత ప్రయోజనాలు నెరవేర్చుకోవడానికి కాక, ప్రజాహిత పాలననే అందించి ఉండేవారు. ప్రజల జీవితాలలో మేలు మార్పులు చోటుచేసుకునేవి. వారి బిడ్డలకు మంచి భవిష్యత్తు సమకూరి వుండేది. ధనవంతులు, పేదవాళ్ళ మధ్య అంతరాలు తీవ్రంగా ఉండేవి కావు. ఆరు దశాబ్దాల స్వాతంత్ర్యం అనంతరం కూడా తాము రాచరిక పాలనలో మగ్గిపోయిననాటి రోజులలో ఉన్నట్టే ఉన్నామని తెలంగాణ ప్రజలు తెలుసుకున్నారు.

సరే, ఇప్పుడు మన 'స్వరాష్ట్రం' వచ్చింది. స్వపరిపాలన

నెలకొంది. తమ బతుకులు బాగుపడతాయని తెలంగాణ ప్రజలు నిండు ఆశాభావంతో ఉన్నారు. అధికారంలో ఉన్నవారు చిత్తశుద్ధితోను, నిబద్ధతతోను వ్యవహరిస్తేనే ప్రజల నమ్మకం వమ్ముకాదని నేను గట్టిగా చెప్పదలుచుకున్నాను. కొత్తగా ఏర్పడిన రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, ప్రజల బతుకులు బాగుపడాలన్నా అధికారంలో ఉన్నవారు తాము ప్రజలకు ప్రతినిధుల మాత్రమేనని, వారికి పాలకులు కామని విశ్వసించాలి. కోట్లాది ప్రజలు తామే స్వయంగా ప్రభుత్వ బాధ్యతలు తీసుకోలేరు. కనుక తమ తరపున ఆ బాధ్యతలను నిర్వర్తించడానికి తమ ప్రతినిధులు మాత్రమేనని, వారికి పాలకులం కామని విశ్వసించాలి. కోట్లాది ప్రజలు తామే స్వయంగా ప్రభుత్వ బాధ్యతలు తీసుకోలేరు కనుక తమ తరపున ఆ బాధ్యతలను నిర్వర్తించడానికి తమ ప్రతినిధులను ఎన్నుకున్నారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మూడు ప్రాంతాలలో ఒకటైన రాయలసీమ చాలా తక్కువగా అభివృద్ధి చెందింది. ఆంధ్రప్రదేశ్‌కు అత్యధిక కాలు ముఖ్యమంత్రులుగా ఉన్నవారు రాయలసీమకు చెందినవారే కావడం గమనార్హం. తమ ప్రాంత అభివృద్ధి పట్ల వారికి చిత్తశుద్ధి ఉన్నట్లయితే ఆ ప్రాంతం ఇలా వెనుకబడిపోయి ఉండేదేనా.

గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలు ఎలా నివసిస్తున్నారో మనకు తెలుసు. అయితే హైదరాబాద్ నగరంలోని వారు అంతకంటే మెరుగ్గా జీవించడం లేదు. ఆ మహానగర వాసులలో అత్యధికులు రోజూ ఖాళీ కడుపుతోనే నిద్రకు ఉపక్రమిస్తున్నారు. ఎంతగా కష్టపడినా ఒక్కపూట కూడా సంతృప్తిగా తినలేని దుస్థితి వారిది. పట్టభద్రులైన విద్యార్థులలో అత్యధికులు నిరుద్యోగులగా ఉన్నారు. తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి జీవనోపాధికి వారు హైదరాబాద్ మహానగరానికి వలస వస్తున్నారు. అయితే అశోపహతులవుతున్నారు.

వేలాది ప్రజలు చిన్న చిన్న జబ్బులకు సైతం రోజుల తరబడి అనారోగ్యంతో మంచం మీదనే ఉండిపోతున్నారు. పారిశ్రామికవేత్తలను విద్యుత్తు కొరత ముప్పతిప్పలు పెడుతోంది. ఇక దశాబ్దాలకు పైగా తెలంగాణలో వేలాది యువతీయువకులు తీవ్ర అసంతృప్తితో ఆత్మహత్యలు చేసుకున్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని, అందరి బతుకుల్లోను వెలుగులు నిండుతాయని ఉద్యమకాలంలో నాయకులు చెప్పిన మాటలు వారిలో ఆశాభావాన్ని నింపాయి. సహజంగానే ప్రత్యేక రాష్ట్రంలో తమ భవిష్యత్తుపై ఆశలు పెంచుకున్నారు.

ఇప్పుడు తెలంగాణ భారతదేశపు 29వ రాష్ట్రం. తెలంగాణ ప్రజలు ఆనందంలో మునిగి తేలుతున్నారు. అదే సమయంలో చాలా అసహనంగా కూడా ఉన్నారు. కొత్త ప్రభుత్వం నుంచి వారు ఎంతో ఆశిస్తున్నారు. తమ ఆశలు నెరవేరుగాయని ఎదురు చూస్తున్నారు. కొంతకాలం వరకు వారు ఓపిగ్గా ఉంటారు. మరెంతోకాలం ఉండలేరు. ఇది వాస్తవం. కొత్త ప్రభుత్వం ఈ వాస్తవాన్ని అర్థం చేసుకోవాలి. ప్రజల జీవన స్థితిగతులను మెరుగుపరచడానికి తక్షణమే పూనుకోవాలి.

ఉపాధి అవకాశాలు తక్కువ. వాటిని సృష్టించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇది ఒక విధంగా అసాధ్యం కూడా. అసాధ్యం ఎందుకంటే ప్రభుత్వోద్యోగాలు రెండు లేదా మూడు శాతం మాత్రమే పెరుగుతాయి. మిగతావన్నీ ప్రైవేట్‌రంగంలోనే ఉంటాయి. మరి ప్రైవేట్ యాజమాన్యాలు ప్రతిభకు ప్రాధాన్యమిస్తాయిగాని, ప్రాంతీయతకు కాదు. తెలంగాణలో విద్యుత్ ఉత్పత్తి తక్కువ. అవసరాలకు తగ్గ విధంగా సమకూర్చుకోవడమనేది పూర్వపు రాష్ట్రంలో వలే అంత తేలికైన విషయం కాదు.

సాగునీరు ఒక ముఖ్య సమస్య. ఇప్పటికే నదీ జలాల విషయంలో ఇరుగుపొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటకలతో సమస్యలున్నాయి. వీటికి అదనంగా ఆంధ్రప్రదేశ్‌తో నీటి పంపకాల విషయంలో యుద్ధమే చేయవలసి రావచ్చు. ఇప్పటికే పరస్పరం గర్జించుకుంటున్నాయి. భవిష్యత్తులోనూ ఇదే పరిస్థితి ఉంటుంది.

వ్యవసాయక దిగుబడులను ఇతోధికంగా పెంచుకోవల్సిన అసరముంది. అందుబాటులో ఉన్న వనరుల ద్వారానే ఇది జరగాలి. సబ్సిడీలపై ఆధారపడడం మంచిదికాదు. దాని వల్ల ప్రభుత్వంపై ఆర్థిక భారం మరింతగా పెరిగిపోతుంది. ఆలోచనా విధానాల్లో మార్పుల ద్వారానే ఈ మేలు మార్పులను సాధించాలి. సబ్సిడీల వల్ల రైతుల పరిస్థితి నిజానికి మెరుగుపడదు. పైగా ఇతర రంగాలపై ప్రతికూల ప్రభావం ఉంటుంది.

అభివృద్ధి సాధనకు పర్యాటక రంగానికి ప్రాధాన్యమివ్వాలి. అభివృద్ధి చెందిన దేశాలన్నీ తమ పర్యాటకరంగానికి అగ్ర ప్రాధాన్యమిస్తున్నాయి. దుబాయినే చూడండి. దానికి ఒక్క సహజ వనరూ లేదు. అయితేనేం అరబ్ దేశాలలో అత్యంత సంపన్నదేశంగా వెలుగొందుతోంది. అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందడం ద్వారానే ఇది సాధ్యమయింది. మన కొత్త రాష్ట్రమూ పర్యాటక రంగానికి అధిక ప్రాధాన్యమివ్వాలి.

తొలుత పరిస్థితులను వాస్తవికంగా అర్థం చేసుకోవాలి. ప్రజలు నానా యాతనలు పడుతున్నారు. వారి బాధలను అర్థం చేసుకోవాలి. ఆ తరువాత వారిని ఆ బాధల నుంచి విముక్తం చేసి, మంచి జీవితాలను మెరుగుపరచడానికి నిబద్ధమవ్వాలి. ఈ నిబద్ధతకు చిత్తశుద్ధి మిళితమవ్వాలి. అప్పుడు రాష్ట్ర విభజనను ప్రజలు సమర్థిస్తారు. అలాకాకుండా ప్రజలను వారి మానానికి వారిని వదిలివేస్తే రాష్ట్ర విభజన విషయమై వారు చింతించే పరిస్థితి నెలకొంటుంది. ఇది చాలా ప్రమాదకరమైన పరిణామం.

కొత్త రాష్ట్ర అభివృద్ధికి ఇదెంత మాత్రమూ తోడ్పడదు. అంతేకాక వారు మళ్ళీ ఆందోళనా పథంలోకి ప్రవేశిస్తారు. ఇటీవలి కాలంలో ప్రజలు ప్రత్యక్షంగా పాల్గొన్న ఉద్యమాలు మాత్రమే విజయవంతమయ్యాయి. ఇందుకు ఉదాహరణ తెలంగాణ ఉద్యమమే. జాతీయస్థాయిలో లోక్‌పాల్ బిల్లు, అన్నా హజారే ఆమ్ ఆద్మీ పార్టీ, నిర్భయ చట్టం, జెస్సికాలాల్ హత్యకేసు మొదలైన అంశాలను నిదర్శనంగా చెప్పవచ్చు. ప్రజా ఉద్యమాల ద్వారాను, ఆందోళనల్లో ప్రజలు పాల్గొనడం ద్వారాను ఆయా సమస్యలు పరిష్కారమయ్యాయి. ప్రజల ఆందోళనలతో కాక, తెలంగాణ ప్రభుత్వ ప్రమేయం ద్వారా తెలంగాణ ప్రజల జీవన స్థితిగతులు మెరుగుపడగలవని ఆశిద్దాం.

*-ఎన్.టి.ఎన్.*


**సుదీర్ఘ చరిత్ర, ఉన్నత నాగరికత, సిరి సంపదలు గల 'భారతదేశం' ఇక్కడకు దాదాపు పదివేల కి.మీ. దూరంలో గల ఒక చిన్నదేశం 'ఇంగ్లాండ్' పాలన క్రిందకు రావడం చరిత్రలో ఓ మరువలేని ఘట్టం. ఆ పరాయి దేశానికి చెందిన ఓ చిన్న వ్యాపార సంస్థ 'ఈస్ట్ ఇండియా కంపెనీ' వ్యాపార నెపంతో దేశంలో అడుగిడిగి ఇక్కడి పాలకుల అంత:కలహాలను ఆసరాగా చేసుకుని కుట్రలు, కుతంత్రాలతో రాజ్యాధికారం సాధించడం, పాలనావ్యవస్థ నేర్పరచడం దేశచరిత్రలో దురదృష్ట సంఘటన.**

# స్థానిక స్వపరిపాలనా పితామహుడు

1757 ప్లాసీయుద్ధంతో బెంగాల్‌లో అధికారస్థాపన ప్రారంభించిన కంపెని 1857 నాటికి దేశంలో అత్యధిక భాగాన్ని తన పాలనలోకి తెచ్చుకొని రాజకీయ ఆర్థిక సాంఘిక మతపరంగా ప్రజలకు పరాయిపాలన రుచి చూపింది. కంపెనీ నిరంకుశ క్రూరపాలనకు వ్యతిరేకంగా జరిగిన సిపాయిల తిరుగుబాటు ద్వారా వెల్లడయిన భారతీయుల ఆగ్రహాన్ని మన్నించి, నాటి బ్రిటన్ పాలకురాలైన విక్టోరియా మహారాణి, కంపెనీ పాలన రద్దుచేసి, భారతదేశ పాలనను బ్రిటిష్ ప్రభుత్వం స్వీకరించింది. అయినా భారత్‌లో పరాయి పాలకుల ఆర్థికదోపిడి, జాత్యాహంకార విధానం, నిరంకుశపాలన కొనసాగింది. స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కోల్పోయి, ప్రజలనేక కష్టనష్టాలకు గురై, స్వదేశంలోనే బానిసలుగా బ్రతకవలసి వచ్చింది. నాటి బ్రిటిష్ పాలకులు అత్యధికులు అవినీతిపరులు, అహంకారులు, అక్రమార్జనాపరులు. తమ తెల్లజాతి అగ్రజాతి అను అత్యున్నతమైనదని, భారతీయులు నల్లజాతి అని, అధములని, వారి నాగరికత, సంస్కృతులు పాలనా విధానంలో తమకు సమానులుకారని, జాత్యహంకారం–జాతి విచక్షణ చూపిస్తూ, నిరంకుశవైఖరి ప్రదర్శించేవారు.

భారతీయుల పట్ల ప్రతివిషయంలో కఠినవైఖరినవలంబించేవారు. కరువు కాటకాలు, అంటువ్యాధుల మూలంగా ప్రజలు కష్టాల పాలవుతున్నా కనికరం చూపేవారు కారు. కంపెనీ పాలన అంతమొంది, బ్రిటిష్ ప్రభుత్వపాలన కొనసాగినా స్వదేశ ప్రజలపట్ల, పాలనపట్ల, విదేశీ పాలకులలో మార్పులు శూన్యం. అలాంటి చీకటి రోజుల్లో కాంతిరేఖల్లా మానవతావాదం ఉదారవిధానం ప్రదర్శించిన, అరుదైన బ్రిటిష్ పాలకుల్లో ఓ మహోన్నత వ్యక్తి 'లార్డ్ రిప్పన్'.

లార్డ్ రిప్పన్ 1880 ఏప్రిల్‌లో ఇండియాలో బ్రిటిష్ రాజప్రతినిధిగా నియామకం కావడంతో దేశచరిత్రలో నూతనశకం ప్రారంభమైంది. రిప్పన్ ఉదారవాది. శాంతి, స్వేచ్ఛావాదం, స్వయంపాలన పట్ల రిప్పన్‌కు అత్యంత విశ్వాసం. తన నాలుగు సంవత్సరాల పాలనా కాలంలో జాతివైషమ్యాలు నిరంకుశపాలనా విధానాలను ప్రక్కనబెట్టి ప్రజోపయోగమైన సంస్కరణలు కార్యక్రమాలు చేబట్టి భారతీయుల మదిలో చిరస్మరణీయుడుగా నిలిచాడు. అధికారం చేపట్టగానే ఆఫ్ఘన్ యుద్ధాన్ని అంతమొందించి అక్కడి అమీర్‌తో స్నేహం నెలకొల్పాడు. బర్మాలో యుద్ధం తప్పనిసరైనా నివారించి తమ ప్రాబల్యాన్ని కొనసాగించాడు. విలియం బెంటింగ్ కాలంలో తాము వశపరచుకొన్న మైసూరు రాజ్యాన్ని తిరిగి ఆ రాజవంశం వారికి అప్పగించాడు. సామ్రాజ్యవాదానికి స్వస్తిపలికి శాంతియుతంగా పరిపాలన ప్రారంభించాడు.



**లార్డ్ రిప్పన్**

పరిపాలనలో ఉదార విధానాలను ప్రవేశపెట్టి అనేక ప్రజోపయోగ కార్యక్రమాలను రిప్పన్ చేపట్టాడు. ఆయన కాలంలో 1200 మైళ్ళ పొడవు కాలువల త్రవ్వకం జరిగి, నూతనంగా ఒక మిలియన్ ఎకరాల భూమి సాగులోకి వచ్చింది. రైలుమార్గాల అవశ్యకత గుర్తించి నూతనంగా 2000 మైళ్ళ రైలు మార్గం వేయించాడు. విద్యారంగంపై శ్రద్ధ వహించి, 'హంటర్ కమిటి' నియమించి వారి సూచనల మేరకు ప్రాథమిక విద్యలో మార్పులు చేశాడు. ప్రభుత్వ గ్రాంట్లతో ప్రైవేటు విద్యాసంస్థలు నెలకొల్పాడు. కళాశాలలు, పాఠశాలలను ఇనస్పెక్టరులతో తరచు తనిఖీ చేయించేవాడు. భారతీయులు విద్యావంతులుగా, రాజకీయంగా చైతన్యవంతులు కావాలని సంకల్పించాడు. పాలనలో ఖర్చు తగ్గించి పొదుపు పాటించాడు. సైనిక వ్యయం తగ్గించాడు. అనేక దిగుమతి సుంకాలు రద్దు చేసి స్వేచ్ఛా వ్యాపార విధానం ప్రోత్సహించాడు. ఉప్పుపై పన్ను తగ్గించాడు. భూస్వాముల బారి నుండి పేదరైతులకు రక్షణ కల్పించాడు.

భారతదేశంలో మొదటి ఫ్యాక్టరీ చట్టం 1881లో అమలు జరిపిన ఘనత రిప్పన్‌కు లభించింది. నాడు ఫ్యాక్టరీలలో పనిచేసే కార్మికులు సరైన జీతం, విశ్రాంతి, నిర్ణీత పనిగంటలకు నోచుకోక దుర్భరజీవితం అనుభవించేవారు. పరిస్థితులను మెరుగుపరచడానికి రిప్పన్ ఫ్యాక్టరీ చట్టం చేసి పన్నేండ్ల వయసుకన్న తక్కువ వయసువారు తొమ్మిది గంటలకు మించి పనిచేయరాదని, ప్రమాదకరమైన పనులు వారికి అప్పగించరాదని, కార్మికులకు రోజుకు ఒక గంట విశ్రాంతి, నెలకు నాలుగు రోజులు సెలవు దినాలుండాలని నిర్ణయించాడు. ప్రత్యేక అధికారులను నియమించి చట్టం ఉల్లంఘించిన వారిపై జరిమానాలు విధించాడు. ఈ చట్టం ద్వారా రిప్పన్ తన మానవతావాదం నిరూపించాడు.

తనకు ముందు రాజప్రతినిధిగా వ్యవహరించిన లిట్టన్ ప్రభువు కాలంలో రూపొందించిన జాతివిచక్షణ చూపే చట్టాలను రిప్పన్ తన విశాల హృదయంతో రద్దు చేశాడు. భారతీయ భాషల్లో వెలువడే పత్రికలపై అనేక నిబంధనలు విధిస్తూ పత్రికా స్వాతంత్ర్యం హరించి వేసే లిట్టన్ కాలపు దేశభాషా పత్రికల చట్టం 1878ని రిప్పన్ రద్దు పరచాడు. ఫలితంగా భారతీయులలో ఆయన పట్ల గౌరవం పెరిగింది. నాటి నుండి భారతీయ పత్రికలు పాతిక సంవత్సరాలు పూర్తి స్వేచ్ఛననుభవించాయి. లిట్టన్ కాలంలో రూపొందించబడిన ఆయుధాల చట్టం 1871 కి సైతం రిప్పన్ సవరణలు సంకల్పించాడు.

లిట్టన్ కాలంలో బ్రిటిష్ పాలనా యంత్రాంగంలో యూరోపియనుల గుత్తాధిపత్యం కొనసాగించడానికి ఇండియన్ సివిల్ సర్వీసు పరీక్షకు హాజరయ్యే భారతీయుల వయోపరిమితిని 21 సంవత్సరాల నుండి 19 సంవత్సరాలకు తగ్గిస్తూ, నిబంధనలు రూపొందించారు. భారతీయులకు సైతం ఉన్నతోద్యోగాలలో అత్యున్నత స్థానాల అవకాశం ఉండాలనే సదాశయంతో రిప్పన్ ఐ.సి.యస్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల వయోపరిమితి పెంచమని, ఆ పరీక్షలను ఇంగ్లాండ్‌తో బాటు, ఇండియాలో కూడా నిర్వహించాలని సిఫార్సు చేశాడు. కానీ ఇంగ్లాండ్‌లోని ప్రభుత్వం అందుకు అంగీకరించలేదు. విద్యావంతులైన భారతీయుల్లో ఈ చర్య తీవ్ర అసంతృప్తి రేపింది. కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి రిచర్డ్ గర్త్ సెలవుపై వెళ్ళగా ఆ ఖాళీలో భారతీయ న్యాయమూర్తి రమేష్‌చందర్ మిట్టల్‌ను రిప్పన్ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా నియమించాడు. ఈ చర్యపట్ల కలకత్తాలోని యూరోపియన్‌లలో కలకలం రేగినా రిప్పన్ తన నిర్ణయం మార్చుకోలేదు. భారతీయులకు, బ్రిటిష్ వారికి స్నేహసంబంధాలేర్పడితే అది బ్రిటిష్ సామ్రాజ్యానికి క్షేమమని గుర్తించాడు.

విద్యావంతులైన భారతీయుల అభీష్టం-వాంఛ గుర్తించి పాలనలో వారికి భాగస్వామ్యం కల్పించడం తన బాధ్యతగా భావించాడు. వారికి స్థానిక సంస్థల ద్వారా ప్రజాస్వామ్య విధానాలను అభ్యసింపదలచాడు. రిప్పన్ 1882లో ఆమోదించిన తీర్మానం ప్రకారం స్థానికపాలనకై నూతనంగా అనేక జిల్లా బోర్డులు, తాలుకా బోర్డులు ఏర్పాటు చేయడమైంది. మున్సిపాలిటీల అధికారాలు పెంచడమైంది. స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించడం స్థానిక సంస్థల్లో అనధికార సభ్యుల సంఖ్యను 2/3 వంతుకు పెంచడం ద్వారా స్థానిక వ్యవహారాలు పాలన సాగాలని నిర్దేశించాడు. స్థానిక సంస్థలకు ఆర్థిక వనరులు సమకూర్చాలని ప్రాంతీయ ప్రభుత్వాలను ఆదేశించాడు. ఏ పాలనాంశాలను స్థానిక సంస్థలకు అప్పగించాలో గుర్తించాడు.

స్థానిక సంస్థల పాలనపై ప్రాంతీయ ప్రభుత్వాల జోక్యం ప్రభావం లేకుండా జాగ్రత్తలు తీసుకొన్నాడు. అధికారుల ప్రమేయం లేక పాలనలో కొద్ది పొరపాట్లు జరుగవచ్చని తెలిసినా, అచిరకాలంలో అనధికారులు ప్రజాస్వామ్య విధానంలో అనుభవం గడించి అవరోధాలను అధిగమించగలరని ఆశించాడు. ప్రభుత్వ అజమాయిషీ గాక ప్రభుత్వ సహకారం స్థానిక సంస్థలకు అవసరమని పేర్కొన్నాడు. ఎక్కడయినా స్థానిక సంస్థలు అధికార దుర్వినియోగానికి పాల్పడినా, పాలనపట్ల నిర్లక్ష్యం వహించినా ప్రాంతీయ ప్రభుత్వాలు వాటిని సస్పెండ్ చేయాలే గానీ, కేంద్ర ప్రభుత్వ అనుమతి లేకుండా వాటిని రద్దు చేయరాదని శాసించాడు. ఈ చర్యల ద్వారా రిప్పన్ ప్రభువు భారతదేశ చరిత్రలో 'స్థానిక సంస్థల పితామహుడు'గా కీర్తికెక్కాడు.

రిప్పన్ ప్రభువు కాలంలో 'ఇల్బర్టు బిల్లు' ప్రతిపాదన అత్యంత వివాదాంశంగా మారింది. రిప్పన్ కాలానికి అనేకమంది భారతీయ న్యాయమూర్తులు జిల్లా మేజిస్ట్రేటులుగా ఉన్నారు. కానీ భారతీయ నేరస్థులతో సమానంగా యూరోపియనులను విచారించే అధికారం 1873 నాటి క్రిమినల్ ప్రొసీజర్ కోడు ప్రకారం వారికి లేదు. న్యాయ విచారణలో ఈ జాతి విచక్షణ ఉండరాదని చట్టం ముందు అందరూ సమానులేనని రిప్పన్ భావించాడు. న్యాయ వివక్షతను తొలగిస్తూ భారతీయ న్యాయమూర్తులకు యూరోపియనులను విచారించే అధికారం ఇస్తూ తన కార్యనిర్వహణ మండలిలోని న్యాయశాఖ సభ్యుడు సి. పి. ఇల్బర్ట్ చే ఒక బిల్లు ప్రతిపాదింప చేశాడు. రిప్పన్ చర్యలు యూరోపియన్‌లలో తీవ్ర అసంతృప్తి, అలజడి రేకెత్తించాయి.

యూరోపియన్‌ల ఆత్మగౌరవానికి 'ఇల్బర్ట్ బిల్లు గొడ్డలి పెట్టు' అని, రిప్పన్ విధానాలు తమ హక్కులు హరించేవిగా ఉన్నాయని యూరోపియన్లు రిప్పన్‌ను ప్రత్యక్షంగా పత్రికాముఖంగా విమర్శించారు. రిప్పన్‌ను సాంఘిక బహిష్కరణకు గురిచేశారు. ఎంతో ఉదారవాదియైన గ్లాడ్‌స్టన్ కూడా ఇల్బర్ట్ బిల్లును విమర్శించాడు. కలకత్తా, సిమ్లాలో యూరోపియన్ మహిళలు సైతం ఆయనను అవమానంగా దూషించారు. చివరకు భారతీయ జిల్లా జడ్జికోర్టుకు యూరోపియనుల కేసు విచారణకు వస్తే, వారిని విచారించడానికి జడ్జితో బాటు ఒక జ్యూరీ ఉండాలని ఆ జ్యూరీలో సగం మందికి తక్కువ గాకుండా యూరోపియనులు ఉండాలని ఇల్బర్టు బిల్లును సవరించడమైంది. జాతి విచక్షణ రద్దుపరచడానికి రిప్పన్ ప్రభువు చేసిన ప్రయత్నం విఫలమైంది. ఈ వివాదం మూలంగా ఇంగ్లీషు వారు ప్రదర్శించిన జాతి వైషమ్యం, జాత్యహంకారం భారతీయుల్లో జాతీయోద్యమానికి స్ఫూర్తి కలిగించాయి.

పదవీ విరమణ చేసి 1884లో స్వదేశానికి మరలిన రిప్పన్ ప్రభువు పట్ల భారతీయులు చూపిన ఆదరాభిమానాలు మిన్నంటాయి. సిమ్లా నుండి బొంబాయి వరకు మార్గమధ్యం వెంట 70 మిలియన్లకు పైగా భారతీయులు ఆయనకు వీడ్కోలు పలికారు. 1915 సంవత్సరంలో కలకత్తాలో రిప్పన్ విగ్రహం నెలకొల్పదలిస్తే ఏ యూరోపియన్ కూడా ఒక్క రూపాయి కూడా విరాళంగా అందించకపోగా, భారతీయులే తమ స్వంత విరాళాలతో విగ్రహ ప్రతిష్ఠ గావించి తమ అభిమానం చాటారు. చివరగా బొంబాయిలో మున్సిపల్ భవనం శంకుస్థాపన కార్యక్రమానికి రిప్పన్ ముఖ్య అతిథిగా హాజరుకాగా, వేదిక వెండి బంగారు జ్ఞాపికలు, కుప్పలుగా పూలమాలలు, వేలాదిగా బ్యానర్లు, సన్మాన పత్రాలతో నిండిపోయింది. బొంబాయి నగరం సుందరంగా అలంకరించబడి, రిప్పన్ వెడుతున్న దారి వెంబడి వేలాది భారతీయులు ముకుళితహస్తాలతో నిలబడి వీడ్కోలు పలికారు. వ్యాపారస్థులు ముత్యాలు, వజ్రాలు పొదిగిన దండలతో ఆయనను సత్కరించారు.

రిప్పన్ ప్రయాణిస్తున్న గుఱ్ఱపుబండి భులేశ్వర్, ముంబాదేవి దేవాలయాలకు సమీపించగా అక్కడి బ్రాహ్మణులు రిప్పన్ ప్రభువుకు నొసట కుంకుమ దిద్ది, వెండిపళ్లేలలో నారికేళాలు సమర్పించి అక్షింతలతో ఆశీర్వదించారు. భారత దేశానికేతించిన మరెవరికీ లభించని గొప్ప గౌరవం రిప్పన్‌కు లభించింది.

స్థానిక సంస్థల ఏర్పాటు, వాటికి విధులు, నిధుల ఏర్పాటు, అధికారాల కేటాయింపు విషయాల్లో రిప్పన్ ప్రభువు మన మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీకి మార్గదర్శకుడని పేర్కొనవచ్చు.

'గ్రామ స్వరాజ్యం' కలలు కన్న మహాత్మగాంధీ, స్థానిక ప్రభుత్వాల ఏర్పాటుకు రాజ్యాంగం సవరించిన స్వర్గీయ రాజీవ్‌గాంధీల మాదిరిగానే, దేశ చరిత్రలో స్థానిక స్వపరిపాలన పితామహుడుగా రిప్పన్ ప్రభువు భారతజాతి మరువలేని మహామనిషి.

*- టిసిపార్థ్*

ప్రపంచంలోని వివిధ దేశాల రాజ్యాంగాలన్నిటి కంటే సుదీర్ఘమైన రాజ్యాంగం మనది. దీని రూపకల్పన 1946 డిసెంబర్‌లో ప్రారంభమైంది. భారత ప్రజల అభివృద్ధి కోసం సామాజిక విప్లవాన్ని సాధించటం రాజ్యాంగ లక్ష్యం. ప్రజాస్వామ్యాన్ని కాదని సామాజిక విప్లవాన్ని సాధించలేం. అదే సందర్భంలో సామాజిక విప్లవం లేని ప్రజాస్వామ్యం అర్ధరహితం. అందువల్ల ప్రజాస్వామ్యం, సాంఘిక సంస్కరణల ప్రాతిపదికన భారత రాజ్యాంగాన్ని రూపొందించారు. గ్రామ పంచాయితీలు 'స్థానిక స్వపరి పాలన' యూనిట్లుగా పని చేయటానికి అవసరమైన చర్యలను ప్రభుత్వం చేపట్టవలసి ఉంటుందని భారత రాజ్యాంగంలోని 40వ అధికరణలో పేర్కొన్నారు. ఈ విధమైన అధికరణను పొందు పర్చటం గూర్చి రాజ్యాంగ సభలో సుదీర్ఘమైన చర్చ జరిగింది. గ్రామ స్వరాజ్యం కాంక్షించే వారి ని సంతృప్తి పరచడానికి మాత్రమే ఈ అధికరణ పొందుపర్చ బడిందే కాని, ఆశించిన లక్ష్యాన్ని సాధించడానికి ఇది ఉపకరించదని పలువురు రాజ్యాంగ సభ సభ్యులు తమ సందేహాలను వ్యక్తం చేశారు.

★ ఇంకా ఇతర విషయాలు.

గ్రామ సభ సూచనలకు గ్రామ పంచాయితీ తగు ప్రాధాన్యతనిచ్చి పరి శీలించాలని కూడా పేర్కొనబడింది.

పైన నిర్దేశించిన గడువుకు 10 రోజుల లోపునే గ్రామసభ సర్పంచ్ లేదా ఉప సర్పంచ్ అధ్యక్షతన జరగాల్సి ఉంటుంది.

ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ చట్టం 1994లోని 6వ సెక్షన్‌ను స్థూలంగా పరిశీలించినప్పుడు గ్రామసభకు రాజ్యాంగం ఇచ్చిన నిర్వచనాన్ని పునర్లిఖించడమే కాక, గ్రామసభకు గల అధికారాలను కూడా పేర్కొనడం జరిగింది. 73వ రాజ్యాంగ సవరణ ద్వారా గ్రామ సభకు ఏర్పడిన రాజ్యాంగ భూమిక రాష్ట్రంలో చట్టరూపం సంతరించుకున్నది.

### రాష్ట్ర ఆర్థిక సంఘం

పంచాయితీలకు ఇవ్వబడిన అధికారాలు ఆచరణలో అమలులోకి రావాలంటే పంచాయితీలను ఆర్థికంగా పరిపుష్టం చేయాల్సి ఉంటుంది. అందుకనే పంచాయితీల ఆర్థిక పరిస్థితిని సమీక్షించటానికి పంచాయితీ సంస్థలకు, ప్రభుత్వానికి మధ్య ఆదాయ వనరుల పంపిణీకి సంబంధించి పంచాయితీలకు కేటాయించదగిన వనరుల నిర్ధారణకు, రాష్ట్ర సంచయిత

# పంచాయితీలకు నిధులు ఎలా వస్తాయి?

## గ్రామ సభకు రాజ్యాంగ భూమిక

రాజ్యాంగంలోని 40వ అధికరణ గ్రామ స్వరాజ్య సాధనదిశలో అనుకున్న లక్ష్యాలను చేరుకోలేక పోయిందని కాలపరీక్షలో నిర్ధారణ జరిగింది. 73వ రాజ్యాంగ సవరణ లక్ష్యాలలో కూడా ఇదే అంశాన్ని పేర్కొన్నారు. ఈ లోటును భర్తీ చేయటం కోసమే 73వ రాజ్యాంగ సవరణ ఉద్దేశించబడింది అని కూడా చెప్పబడింది.

ఈ సవరణ ద్వారా రాజ్యాంగంలో పొందుపరచబడిన IXవ భాగంలోని 243వ అధికరణంలోని (డి) 'గ్రామసభ' అంటే గ్రామపంచాయితీ ఓటర్ల జాబితాలో నమోదు కాబడిన వారందరితో కూడినదని నిర్వచించబడింది.

రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించే చట్టాల ద్వారా సంక్రమించబడే అధికారాలన్నింటిని గ్రామసభ కలిగి ఉంటుందని 243వ అధికరణలో పేర్కొన్నారు.

గ్రామ పంచాయితీలోని ఓటర్లు అందరూ గ్రామసభ సభ్యులుగా ఉంటారని ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ చట్టం 1994లోని 6వ సెక్షనులో పేర్కొన్నారు. ఈ గ్రామసభ సంవత్సరానికి రెండు సార్లు సమావేశమై ఈ క్రింది అంశాలను పరిశీలించాలని కూడా ఇందులో చెప్పబడింది. అవి:

(ప్రస్తుతం నాలుగుసార్లు)

★ వార్షిక ఆదాయ వ్యయ వివరాలు (annual statement of account), ఆడిట్ నివేదిక
★ గడిచిన సంవత్సర పరిపాలనా నివేదిక.
★ వార్షిక పనులు లేదా వార్షిక బడ్జెట్‌లో రాని కొత్త పథకాలు.
★ కొత్త పన్నులకు సంబంధించిన ప్రతిపాదనలు లేదా ఉన్న పనులను పెంచే విషయం.
★ పథకాల లబ్ధిదారుల ఎంపిక, ప్రాంతం (location) ఎంపిక.

నిధి (consolidated fund) నుండి కేటాయింపులు, పంచాయితీల ఆర్థిక పరిస్థితిని మెరుగు పరుచుటకు తీసుకోవాల్సిన చర్యల గురించి గవర్నర్‌కు సూచనలు చేయటానికి రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని (finance commission) ఏర్పాటు చేయాలని 73వ రాజ్యాంగ సవరణ ద్వారా 243-ఐ అధికరణాన్ని రాజ్యాంగంలో పొందుపర్చారు. ఈ కమీషన్ చేసిన సిఫార్సుల ను, అందుకు చేపట్టవలసిన చర్యలతో కూడిన వివరణలతో గవర్నర్ శాసన సభ ముందుంచటానికి పంపవలసి ఉంటుంది.

### జాతీయ ఆర్థిక సంఘం

భారత రాజ్యాంగంలో జాతీయ ఆర్థిక సంఘం గురించి చెప్పే 280వ అధికరణాన్ని కూడా 73వ రాజ్యాంగ సవరణ ద్వారా సవరించారు. రాష్ట్ర ఆర్థిక సంఘం చేసిన సిఫార్సుల ఆధారంగా, గ్రామ పంచాయితీల వనరులకు తోడ్పడేందుకు చర్యలను గురించి భారత రాష్ట్రపతికి తగు సూచనలను జాతీయ ఆర్థిక సంఘం చేయాల్సి ఉంటుందని ఇందులో పొందుపర్చబడింది. ఈ విధంగా పంచాయితీలకు, ఇతర స్థానిక సంస్థలకు నిధుల కేటాయింపు విషయం వాటిని ఆర్థికంగా శక్తివంతం చేసే విషయం కూడా జాతీయ ఆర్థిక సంఘం పరిధిలోనికి తీసుకుని వచ్చారు.

### మన పంచాయితీ నిధి

ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ చట్టం 1994లోని 3వ అధ్యాయం గ్రామపంచాయితీ పన్ను విధానానికి సంబంధించిన అంశాలను పేర్కొంటుంది.

గ్రామ పంచాయితీ విధించే పన్నుల గురించి 60వ సెక్షనులో పేర్కొనబడింది. అవి

★ ఇంటి పన్ను
★ కొలగారం లేదా కాటా రుసుం అంటే గ్రామంలో ఉత్పత్తి అయినటు వంటి దానికి తూనిక లేక కొలతల ప్రకారం అమ్మేటప్పుడు విధించే పన్ను.
★ ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ల ప్రకారం వసూలు చేసే ఇతర పన్నులు.

అయితే ప్రభుత్వం రాష్ట్ర శాసన సభ ఆమోదం లేకుండా అట్టి నోటిఫికేషన్ జారీ చేయరాదు.

గ్రామ పంచాయితీ పరిధిలో ఉన్న ఆస్థుల బదలాయింపు జరిగే సందర్భంలో నిబంధనలకు లోబడి సుంకం విధించబడుతుంది.

అలాగే వాహన పన్ను (మోటారు వాహనాలు మినహా), వ్యవసాయ భూములపై పన్ను, లాండ్ సెస్సు, గ్రామ పంచాయితీ అజమాయిషీలో ఉన్న పోరంబోకులు, సముదాయ భూముల (communal lands) ను ఉపయోగిస్తే ఫీజులు, గ్రామపంచాయితీ అజమాయిషీలో ఉన్న భవనాలు, చావిళ్ళు, సరాయిలు ఉపయోగిస్తే ఫీజులు గ్రామ పంచాయితీ నిబంధనలకు లోబడి వసూలు చేయవచ్చును.

గ్రామంలో క్వారీ చేయబడిన మినరల్స్, మైనర్ మినరల్స్ మినహా ఇతర వాటిపై ప్రభుత్వం వసూలు చేసే సినరేజ్ ఫీజుపై సర్ ఛార్జీని గ్రామ పంచాయితీ వసూలు చేయవచ్చును. అయితే ఎంత మొత్తం సర్‌ఛార్జీ విధించాలన్నది ప్రభుత్వ ఆమోదంతో చేయాల్సి ఉంటుంది.

ఆంధ్రప్రాంతంలోని ఆంధ్రప్రాంత జిల్లా బోర్డుల చట్టం 1920లోని సెక్షను 78 ప్రకారం విధించబడే లాండ్ సెస్సు పైనా, తెలంగాణా ప్రాంతంలో ఆంధ్రప్రదేశ్ తెలంగాణా (ప్రాంత) జిల్లా బోర్డుల చట్టం 1955 లోని సెక్షను 135 ప్రకారం విధించే లోకల్ సెస్సు మీద కూడా గ్రామ పంచాయితీ సర్ ఛార్జీ విధించవచ్చు.

ఆంధ్రప్రదేశ్ విద్యా చట్టం 1982 లోని సెక్షను 37 ప్రకారం విధించే విద్యా సెస్సు మీద కూడా గ్రామ పంచాయితీ సర్ ఛార్జీ విధించవచ్చు.

ఉన్న పన్నులను రద్దు చేస్తూ గాని లేదా తగ్గిస్తూ గానీ చేసే ఎట్టి తీర్మానమైనా కమీషనర్ ఆమోదం లేకుండా అమలు చేయరాదు.

నిబంధనలను అనుసరించి ఇంటి పన్నును నిర్ధారించటానికి తీసుకోవల సిన ప్రాతిపదికలను ఈ చట్టంలోని 61 సెక్షనులో పేర్కొన్నారు. అవి:

★ వార్షిక అద్దె విలువ లేదా
★ కాపిటల్ వాల్యూ, లేదా
★ నిర్ధారించబడిన ఏదేని ఇతర ప్రాతిపదిక

అయితే కోళ్లఫారాల మీద ఏ విధమైన ఇంటిపన్ను విధించరాదు.

ఇంటి పన్నును ప్రతి సంవత్సరం నిబంధనల ప్రకారం ఆ సంవత్సరం ప్రారంభమైన 30 రోజుల లోపు చెల్లించాలి.

కొన్ని రకాల ఇళ్ళకు ఇంటి పన్ను నుండి మినహాయింపును ఇస్తూ;

వార్షిక అద్దె లేదా కాపిటల్ వేల్యూ నిర్ధారించుటకు లేదా పన్ను నిమిత్తం వివిధ రకాల ఇళ్ళ వర్గీకరణకు అనుసరించాల్సిన పద్ధతిని;

పన్నులు చెల్లించాల్సిన వ్యక్తులు, యాజమాన్య బదిలీకి సంబంధించిన సమాచారం ఇవ్వటానికి;

పేదరికం ప్రాతిపదికన పన్ను నుంచి మినహాయింపు ఇవ్వటానికి;

ప్రభుత్వం నిబంధనలను రూపొందిచవచ్చును అని కూడా ఈ సెక్షనులో పేర్కొన్నారు.

## ప్రభుత్వ ఆదేశానుసారం పన్ను విధించటం

పైన వివరించిన 60వ సెక్షను ప్రకారం ఇంటి పన్ను విధించవల సిందిగా గ్రామ పంచాయితీని ఆదేశిస్తూ ప్రభుత్వం ప్రత్యేక పరిస్థితులతో ఉత్తర్వులను ఆంధ్రప్రదేశ్ రాజపత్రంలో ప్రచురించి జారీ చేయవచ్చునని ఈ చట్టంలోని 62వ సెక్షన్‌లో పేర్కొన్నారు.

అట్టి ఉత్తర్వులను గ్రామ పంచాయితీలో అన్ని భవనాలకు సంబంధించిగానీ లేదా కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వ సంస్థలకు చెందిన భవనాలకు సంబంధించి, రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన భవనాల గూర్చి జారీ చేయవచ్చును.

ప్రభుత్వ అనుమతి లేకుండా గ్రామ పంచాయితీ అట్టి ఇంటి పన్నుల ను సవరించటానికి గానీ లేదా రద్దు పరచటానికి గానీ చేయరాదని కూడా ఈ సెక్షనులో పేర్కొన్నారు.

## వాణిజ్య ప్రకటన పన్ను

ఈ చట్టం లోని 63వ సెక్షను, వాణిజ్య ప్రకటనలపై పన్ను గురించి పేర్కొంటుంది.

గ్రామ పంచాయితీ పరిధిలోని స్థలం, భవనం, గోడ లేదా ఏ ఇతర నిర్మాణం పైనైనా వాణిజ్య ప్రకటనను ఏర్పాటు చేసిన ప్రతి వ్యక్తి నిర్దేశించిన పన్నును గ్రామ పంచాయితీకి చెల్లించాలి.

అయితే ఇందుకు సంబంధించి నిర్ధారించిన రేట్లు ప్రభుత్వం రూపొందించిన గరిష్ట, కనిష్ట పరిమితులకు లోబడి ఉండాలి.

***ఇట్టి వాణిజ్య పన్నును –***

★ బహిరంగ సభ ప్రకటనలు
★ చట్టసభ లేదా గ్రామపంచాయితీ లేదా మండల పరిషత్ లేదా జిల్లా పరిషత్ ఎన్నికలు
★ అట్టి ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ప్రకటనలపై విధించరాదు.

***అలాగే ఇట్టి వాణిజ్య పన్నును –***

★ భవనం లోపల ఉన్న వ్యాపార ప్రకటనలకు లేదా
★ ఆ భవనంలో లేదా స్థలంలో జరుగుతున్న వ్యాపారానికి లేదా అట్టి స్థలం లేదా భవనం అమ్మకానికి, అట్టి స్థలం లేదా భవనంలో జరిగే వినోద కార్యక్రమానికి లేదా సభకు సంబంధించిన ప్రకటనలకు లేదా
★ ఆ స్థలం లేదా భవనం పేరు లేదా దాని యజమాని లేదా స్వాధినంలో ఉన్న వ్యక్తి పేరును సంబంధించిన ప్రకటనలు, లేదా
★ రైల్వే అడ్మినిస్ట్రేషన్‌కు సంబంధిత వ్యాపారానికి చెందిన, లేదా
★ రైల్వే స్టేషన్ లోపల రైల్వే అడ్మినిస్ట్రేషన్ ఆస్తులు లేదా వాటి గోడల మీద ప్రకటనలకు కూడా విధించరాదు.

గ్రామ పంచాయితీ పరిధిలో కార్యనిర్వహణ అధికారి అనుమతి లేకుండా ఏవిధమైన వ్యాపార ప్రకటనలు చేయరాదు, అని 64వ సెక్షనులో పేర్కొన్నారు.

***అట్టి వాణిజ్య ప్రకటన –***

★ ఈ చట్టంలో 270వ సెక్షను ప్రకారం గ్రామ పంచాయితీ రూపొందించిన బైలాస్‌ను ఉల్లంఘించినా,
★ పంచాయితీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి ఇంజనీరు లేదా మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆదేశాల ప్రకారం ఉన్న వాణిజ్య ప్రకటనకు అదనంగా ఏవైనా చేర్చినా,

★ వాణిజ్య ప్రకటనలో గాని లేదా అందులోని ఏదైనా ఒక భాగంలోగాని ప్రధానమైన మార్పును (material change) చేసినా:
★ అట్టి వాణిజ్య ప్రకటన ప్రమాదవశాత్తు కాకుండా కూలిపోయినా,
★ వ్యాపార ప్రకటన చెదిరిపోయే విధంగా, అది వున్న గోడ, భవనం లేదా నిర్మాణంలో మార్పు జరిగినా,
★ వ్యాపార ప్రకటన ఉన్న గోడ భవనం లేదా నిర్మాణం కూల్చబడినా లేదా కూలిపోయినా,

ఈ చట్టంలోని సెక్షను 64 ప్రకారం కార్య నిర్వహణ అధికారి ఇచ్చిన అనుమతి రద్దు అవుతుందని 65వ సెక్షనులో పేర్కొన్నారు.

ఈ చట్టంలోని 63,64 సెక్షన్లకు విరుద్ధంగా ఏదైనా స్థలం, భవనం, గోడ లేదా నిర్మాణం మీద ఉన్న వ్యాపార ప్రకటనలకు, లేదా అనుమతించిన కాల పరిమితి పూర్తయిన తర్వాత లేదా అనుమతి రద్దు అయిన తర్వాత కొనసాగుతున్న వ్యాపార ప్రకటనలకు అట్టి స్థల, భవన, గోడ లేదా నిర్మాణం యజమాని బాధ్యత వహించవలసి ఉంటుంది అని ఈ చట్టంలోని 66వ సెక్షనులో పేర్కొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వ్యాపార ప్రకటనలను కార్యనిర్వహణ అధికారి తొలగించి దానికి అయిన ఖర్చులను సంబంధిత వ్యక్తుల నుండి వసూలు చేయవచ్చును, అని 67వ సెక్షనులో పేర్కొన్నారు.

## స్థిరాస్థి బదలాయింపుపై సుంకం

గ్రామ పంచాయితీ పరిధిలో క్రింద పేర్కొన్న దస్తావేజుల ద్వారా జరిగే స్థిరాస్థి బదలాయింపులపై, భారతీయ స్టాంప్ చట్టం 1899 ప్రకారం విధించే రుసుంకు సర్ చార్జీని ప్రభుత్వం విధించ వచ్చునని పంచాయితీరాజ్ చట్టం 1994లోని 69వ సెక్షనులో పేర్కొన్నారు.

***దస్తావేజులపై పట్టికలో చూపిన మొత్తాల మీద 5% లోపు రుసుంను ప్రభుత్వం నిర్ధారించవచ్చును.***

| | దస్తావేజు వివరణ | రుసుము విధించబడే మొత్తం |
|---|---|---|
| (1) | స్థిరాస్థి అమ్మకం | దస్తావేజులో పేర్కొన్న అమ్మకం ధర లేదా దస్తావేజు ద్వారా అమ్ముతున్న ఆస్థి మార్కెట్ విలువ ఈ రెండింటితో ఏది ఎక్కువ అయితే అది. |
| (2) | స్థిరాస్థి మారకం (exchange) | ఆస్థి యొక్క మార్కెట్ ధర లేదా greater value which is the subject-matter of exchange |
| (3) | స్థిరాస్థి దానం (gift) | దానం చేయబడ్డ ఆస్థి మార్కెట్ ధర |
| (4) | స్థిరాస్థి స్వాధీన తాకట్టు | దస్తావేజులో పేర్కొన్న హామీ ఇచ్చిన మొత్తం (amount secured) |
| (5) | స్థిరాస్థిపై వంద సంవత్సరాల కంటే ఎక్కువ కాలానికి లీజు | దస్తావేజుల్లో పేర్కొన్న మొత్తంలో 1/6 వంతు లేదా మొదటి 5 సంవత్సరాలకు చెల్లించే లీజు మొత్తం. |

ఈ సెక్షను క్రింద వసూలు చేయబడిన రుసుమును సంబంధిత గ్రామ పంచాయితీ, మండల పరిషత్, జిల్లా పరిషత్‌ల మధ్య నిబంధనల ప్రకారం పంచబడుతుంది అని కూడా ఈ సెక్షన్‌లో చెప్పబడింది.

ఇట్టి రుసుమును వసూలు నియంత్రణకు మరియు సంబంధిత గ్రామ పంచాయితీ, మండల పరిషత్ మరియు జిల్లా పరిషత్‌ల మధ్య ఈ రుసుము పంపకానికి, ఇట్టి రుసుమును వసూలు చేయడంలో ప్రభుత్వానికి అయిన ఖర్చులను మినహాయించటానికి సంబంధించిన నిబంధనలను ప్రభుత్వం రూపొందించాలని కూడా పేర్కొనబడింది.

ఏదేని దస్తావేజును గాని లేదా కొన్ని రకాల దస్తావేజులు గాని ఇట్టి రుసుము నుండి షరతులకు లోబడిన మినహాయింపును ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వుల నివ్వవచ్చును.

నీటి సౌకర్యం, డ్రైనేజి సదుపాయం, వీధి దీపాలు వంటి పనుల కొరకు గ్రామపంచాయితీ ప్రత్యేక పన్నులను ఇళ్లపై నిబంధనలకు లోబడి విధించవచ్చునని ఈ చట్టంలోని 71వ సెక్షనులో పేర్కొన్నారు.

ఫ్యాక్టరీలు లేదా గృహ సముదాయాల యజమానులు పన్నుల బదులు ఏక మొత్తంగా సొమ్మును నిబంధనల ప్రకారం చెల్లించుకొనవచ్చునని ఈ చట్టంలోని 72వ సెక్షనులో పేర్కొన్నారు.

## గ్రామపంచాయితీ నిధి

గ్రామ పంచాయితీ చేత చేయబడిన అన్ని రకాల వసూళ్లు గ్రామపంచాయితీ నిధిలో జమ చేయబడతాయి.

ప్రత్యేక అవసరాల కోసం, నిర్దిష్టమైన ప్రజా ప్రయోజనం కోసం వసూలు చేసిన సొమ్మును ప్రత్యేక ఖాతాలో ప్రత్యేక నిధిగా జమచేయాలి.

ఈ చట్టంలోని వివిధ నిబంధనల కింద వచ్చిన ఆదాయమంతా గ్రామ పంచాయితీ నిధిలో జమ కావాలి, ఆంధ్రప్రదేశ్ (ఆంధ్రప్రాంత) వాణిజ్య పంటల మార్కెట్ చట్టం 1993 లోని సెక్షన్లు 11, సబ్ సెక్షన్ 3 అనుసరించి మార్కెట్ కమిటి గ్రామ పంచాయితీకి చేసిన చెల్లింపులు,

ఆంధ్రప్రదేశ్ (ఆంధ్రప్రాంత) ప్రజారోగ్య చట్టం 1939లోని సెక్షన్ 117, 118 ప్రకారం లేదా రాష్ట్రంలో అమలులో ఉన్న అటువంటి ఏదేని ఇతర చట్టం కింద వసూలు చేయబడ్డ పన్నులు లేదా రుసుములు;

ఆంధ్రప్రదేశ్ వినోద పన్ను చట్టం 1939లోని సెక్షన్ 13 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయితీకి చేసిన చెల్లింపులు.

గ్రామంలోని మండల పరిషత్ మార్కెట్‌కి సంబంధించి మండల పరిషత్ గ్రామ పంచాయితీకి చేసిన చెల్లింపులు లేదా అట్టి మార్కెట్ల ద్వారా వచ్చిన ఆదాయంలో సెక్షన్ 112 ప్రకారం గ్రామ పంచాయితీ వాటా నిమిత్తం మండల పరిషత్ చేసిన చెల్లింపులు మరియు జిల్లా పరిషత్ లేదా సెక్షను 57లో పేర్కొనబడిన ఏదేని ఉమ్మడి కమిటీ గ్రామపంచాయితీకి ప్రయాణపు పడవల (ferry) నిర్వహణ ద్వారా వచ్చిన ఆదాయంలో గ్రామ పంచాయితీ వాటా నిమిత్తం చేసిన చెల్లింపులు;

గ్రామ కంఠం, రోడ్లు తదితర గ్రామ పంచాయితీకి చెందిన ప్రదేశాలను తాత్కాలికంగా ఉపయోగించుకున్నందుకు చెల్లించే రుసుము;

గ్రామ పంచాయితీ నిర్వహణలో ఉన్న దేవాదాయ, ధర్మాదాయ సంస్థల నుండి వచ్చే ఆదాయం;

ఇనాము రద్దు చట్టం తర్వాత ప్రభుత్వానికి దాఖలు పడిన సర్వీసు ఇనాముల నుండి వచ్చిన మొత్తం;

గ్రామ పంచాయితీకి దాఖలు పరచబడిన నీటి వనరుల లోని చేపలు తదితరాల ద్వారా వచ్చిన ఆదాయం;

గ్రామ పంచాయితీకి నిర్వాహణలోని ప్రయాణపు పడవల (ferry) ద్వారా వచ్చిన ఆదాయం;

మేజర్ మినరల్స్ కానటువంటి మైనర్ మినరల్స్‌ను గ్రామ పంచాయితీ పరిధిలో క్వారీ చేయటానికి అనుమతించిన నిమిత్తం ప్రభుత్వం వసూలు చేసిన సినరేజ్ ఫీజు;

గ్రామ పంచాయితీ దాఖలు పరచనటువంటి పోరంబోకు భూముల్లో ఉన్న చెట్లమీద వచ్చే ఆదాయం,

గ్రామ పంచాయితీ పొందిన ప్రభుత్వ ఆస్తుల హద్దుల ద్వారా వచ్చే ఆదాయం;

గ్రామ పంచాయితీ ఆధీనంలో ఉన్న పోరంబోకు భూముల నుండి వచ్చిన ఆదాయం, వాటి అనధికార ఆక్రమణలో ఉన్న వ్యక్తుల నుండి ఏదేని చట్టం క్రింద వసూలు చేసిన జరిమానా,

ఈ చట్టం ప్రకారం గాని సంబంధిత నిబంధనలు లేదా బైలాల ఉల్లంఘన నేరాలు గ్రామంలో జరిగిన నాటికి మేజిస్ట్రేట్‌లు విధించే జరిమానాల వల్ల ప్రభుత్వానికి లభించిన ఆదాయంలో 1/10 వంతు ఆదాయం;

ప్రభుత్వ జిల్లా పరిషత్ లేదా మండల పరిషత్ నుండి పొందిన నిధులు,

గ్రామ పంచాయితీ నిధుల నుండి చేసిన పెట్టుబడుల (investments) ద్వారా వచ్చిన ఆదాయం.

ఈ చట్టంలో పేర్కొన్న ఇతర అన్ని వనరుల ద్వారా వచ్చిన వసూళ్ళు;

పైన పేర్కొన్నవే కాకుండా గ్రామ పంచాయితీ నిర్వహిస్తున్న లేదా గ్రామ పంచాయితీ ఆర్థిక సహకారంతో నిర్వహించబడుతున్న సంస్థలు లేదా సేవల ద్వారా వసూలు కాబడే మొత్తం గ్రామ పంచాయితీ నిధి క్రిందకే వస్తాయి.

గ్రామ పంచాయితీ వసూలు చేసిన అన్ని రకాల ఆదాయాన్ని దగ్గరలోని ప్రభుత్వ ఖజానాలో (Government Treasury) జమ చేయాలి.

అయితే జవహర్ రోజ్‌గార్ యోజన ఉద్యోగ బీమా పథకం లేదా ఇతర ఉద్యోగ వేతన పథకాల నిమిత్తం పొందిన సొమ్మును సమీపంలోని జాతీయ బ్యాంకులు లేదా సహకార బ్యాంకులు లేదా తపాలా కార్యాలయాల్లో నిర్దేశించిన విధంగా జమ చేయాల్సి ఉంటుంది.

గ్రామ పంచాయితీ నిధికి సంబంధించిన అన్ని రకాల ఉత్తర్వులు లేదా చెక్కులపై నిర్దేశిత అధికారి సంతకం చేయాలి.

## గ్రామ పంచాయితీ చెల్లింపులు

పై విధంగా సంక్రమించిన నిధులు ఖర్చు చేయడం గురించి పంచాయితీ రాజ్ చట్టంలోని 75వ సెక్షన్‌లో పేర్కొన్నారు,

గ్రామపంచాయితీ బాకీ పడ్డ లేదా చేసిన అప్పులను,

గ్రామపంచాయితీ అధికారులు, సేవకుల జీతాలను, అలవెన్సులను, పెన్షన్‌లను, పెన్షనరీ కంట్రిబ్యూషన్, ప్రావిడెంట్ ఫండ్ కంట్రిబ్యూషన్‌లను,

కోర్టు డిక్రీ లేదా ఉత్తర్వుల ప్రకారం చెల్లించాల్సిన మొత్తాలను.

కమీషనర్ నిర్దేశించిన పరిధులలో మండల పరిషత్ సబ్జక్ట్‌కు చెల్లించాల్సిన ఏదేని చెల్లింపులు,

ఈ చట్టం ప్రకారం చెల్లించాల్సిన ఏదేని చెల్లింపులు,

ఈ నిధి నుండి గ్రామ పంచాయితీ చెల్లించాల్సి ఉంటుంది

ప్రభుత్వ అనుమతితో భారతదేశ రక్షణ నిధికి గ్రామ పంచాయితీ చెల్లించవచ్చును.

గ్రామ పంచాయితీ, కమీషనర్ అనుమతితో గ్రామంలో జరిగే ఏదేని బహిరంగ ప్రదర్శన (exhibition), వేడుక (ceremony) లేదా వినోద కార్యక్రమాలకు అయ్యే ఖర్చులకు చెల్లించ వచ్చును.

ఏదేని ధర్మాదాయ నిధికి లేదా పేదల సహాయార్థం లేదా జబ్బులకు లేదా అంగవైకల్యానికి (infirmity) చికిత్స కొరకు, (recepton of diseased or infirm person) లేదా వైద్య పరిశోధనలకు ఏర్పడ్డ సంస్థకు,

ఏదేని అసాధారణమైన ఖర్చులను చెల్లించడానికి ఈ నిధి నుండి గ్రామ పంచాయితీ వినియోగించ వచ్చును.

ఎన్నికలకు సంబంధించిన అన్ని రకాల ఖర్చులను ప్రభుత్వమే భరించాల్సి ఉంటుందని ఈ చట్టంలోని 76వ సెక్షన్‌లో పేర్కొన్నారు.

ఓటర్ల జాబితా తయారీకి, సవరణలకు అయ్యే ఖర్చులు, గ్రామపంచాయితీ ఎన్నికల నిర్వహణతో సహా ఎన్నికల నిర్వహణ ఖర్చులు, అందుకు సంబంధించిన అన్ని రకాల ఖర్చులు ప్రభుత్వమే భరించాల్సి ఉంటుంది.

## పంచాయితీ బడ్జెట్

బడ్జెట్ రూపొందించడం, దానిని ఆమోదించడానికి సంబంధించి ఈ చట్టంలోని 77 సెక్షన్‌లో పేర్కొన్నారు.

కార్యనిర్వహణ అధికారి నిర్దేశించిన తేదీ కంటే ముందు గ్రామ పంచాయితీ ఆదాయ వ్యయాలకు సంబంధించిన అంచనాలతో కూడిన వార్షిక బడ్జెట్‌ను గ్రామ పంచాయితీ ముందు ఉంచాలి. అట్టి బడ్జెట్‌ను గ్రామ పంచాయితీ ఒక మాసంలోగా అవసరమని భావించిన సవరణలతో ఆమోదించాలి.

అయితే ఏదేని కారణం చేత గ్రామ పంచాయితీ బడ్జెట్‌ను నిర్ధేశించిన నెల రోజుల గడువులోపల ఆమోదించక పోయినట్లయితే, కార్యనిర్వాహణ అధికారి బడ్జెట్‌ను డివిజనల్ పంచాయితీ అధికారి ఆమోదం కోసం సమర్పించాలి. డివిజనల్ పంచాయితీ అధికారి అవసరమని భావించిన సవరణలతో బడ్జెట్‌ను ఆమోదించాలి.

గ్రామ పంచాయితీ కార్యనిర్వాహణ అధికారి ప్రతిపాదించిన బడ్జెట్‌ను నిర్దేశిత గుడువులోగా ఆమోదించక పోయినట్లయితే, కార్యనిర్వాహణ అధికారి బడ్జెట్‌ను డివిజనల్ పంచాయితీ అధికారి ఆమోదం కొరకు సమర్పించాలి. డివిజనల్ పంచాయితీ అధికారి అవసరమని భావించిన సవరణలతో బడ్జెట్‌ను ఆమోదించాలి.

గ్రామ పంచాయితీ కార్యనిర్వాహణ అధికారి ప్రతిపాధించిన బడ్జెట్‌ను నిర్దేశిత గడువులోగా ఆమోదించినట్లయితే, అట్టి బడ్జెట్‌ను కార్యనిర్వాహణ అధికారి నిర్దేశిత తేదీ లోపు డివిజనల్ పంచాయితీ అధికారికి పంపించాలి. డివిజనల్ పంచాయితీ అధికారి అవసరమని భావించిన సూచనలు లేదా సవరణలు చేసి గ్రామ పంచాయితీకి నెల రోజుల లోపు తిరిగి పంపించాలి. గ్రామ పంచాయితీ సవరణలతో గానీ, యధాతధంగా గాని ఈ బడ్జెట్‌ను ఇందు కొరకు నిర్వహించే ప్రత్యేక సమావేశంలో ఆమోదించాలి. ఆ విధంగా ఆమోదించబడినదే బడ్జెట్ తుది రూపం.

బడ్జెట్‌లో పేర్కొన్న ఆదాయ వ్యయాలకు సంబంధించి అట్టి సంవత్సరంలో ఏదేని మార్పులు చేయడం అవసరమని గ్రామ పంచాయితీ భావించినట్లయితే అనుబంధ లేదా సమీక్షించిన బడ్జెట్‌ను పైన పేర్కొన్న పద్ధతిలోనే అనుసరించి సవరించాల్సి ఉంటుంది.

గ్రామపంచాయితీ పరిధిలోని ప్రజల ప్రయోజనం కోసం ప్రభుత్వం లేదా ఇతర గ్రామపంచాయితీ లేదా మండల పరిషత్ లేదా జిల్లా పరిషత్ లేదా రాష్ట్రంలోని ఏదేని ఇతర స్థానిక సంస్థ ఈ చట్టంలో పేర్కొన్న విధంగా ఖర్చులు పెట్టినట్లయితే, కమీషనర్ వారి ఆమోదంతో, వారి ఆదేశానుసారం అట్టి సొమ్మును చెల్లించాల్సి ఉంటుంది అని ఈ చట్టంలోని 78వ సెక్షన్‌లో పేర్కొన్నారు.

పంచాయితీరాజ్ చట్టం 1994లోని అంశాలను 73వ రాజ్యాంగ సవరణలో పెనవేసి చూడటం ద్వారానే వీటి పరస్పర విస్తృతిని అవగాహన చేసుకోగలం.

*- టిసిపార్థ్*

# మానవ ధర్మం - విలువలు బోధనలో చేర్చాలి

**మన సమాజంలో అభివృద్ధితో పాటు కొన్ని లోపాలు చోటు చేసుకున్నాయి. వాటిలో ముఖ్యంగా మనం చేసే పనులలో కనీస విలువలను పాటించకపోవడం కరువైంది. ప్రతి వారు ఎన్నో చెబుతారు. పాటించరు. అంటే చెప్పట సులభమే కాని వాటిని ఆచరించడం కష్టం. అయినా ధర్మ సూత్రాలు, విలువలను మన పాఠశాల సిలబస్ లోనే చేర్చాల్సిన అవసరం ఉంది. భారతీయ వ్యవస్థలో మన చుట్టూ చూసినట్లయితే ఎన్నో రకాలైన ఘోరాలు, నేరాలు జరుగుతున్నాయి. అయినా చాలా మంది మనకేందుకులే అని దాట వేస్తున్నారు. అవి పెరిగి చివరకు మనలనే రూపుమాపే స్థాయికి ఎదిగాయి.**

రాజకీయాల నుండి పోలీసు వరకు, సంఘసేవ నుండి క్రీడల వరకు, మందుల నుండి మేరేజ్ (వివాహం) వరకు సరియైన దారిలో నడవడం లేదు. వక్రమ మార్గం బట్టి మనిషిని నాశనం చేసే స్థాయికి చేరాయి. కనుక వాటిని ముఖ్యంగా హింసాప్రవృత్తి, కోరిక అదుపు లేకుండ మన సామాజిక వ్యవస్థను పీడించుకుతింటున్నాయి.

ఈ నేపధ్యంలో మనిషిని సరియైన మార్గంలో పెట్టాలంటే విలువలతో కూడిన విద్య అవసరం. కనుక పాఠశాల విద్యనుండి ఎథిక్స్‌ను ఒక విషయంగా బోధించవలేనని అంతర్జాతీయ ఆత్యాత్మిక బోధకుడు ఆగాఖాన్ సూచించారు.

నైతిక ఆలోచనలను, సూత్రాలను పాఠశాల విద్యార్థుల మనస్సుల్లోకి చొప్పించెందుకు తగిన బోధన అవసరం ఉంది. మనం రోడ్డుపై "రెడ్ లైట్" ను చూడగానే ఎందుకు ఆగాలి ? మనం ఎదుటివారు ఆపదలో నున్నప్పుడు ఎందుకు సహాయపడాలి ? అనే అంశాలకు సమాధానాలు పాఠశాలలో బోధించే అంశాలలో ఉండాలి. తద్వార నూతన మైండ్ ఆలోచనలను అందించాలి.

తల్లిదండ్రులు తమ పిల్లలకు ఏ విధంగా చెబుతారో అట్లా ఆ పాఠశాలల్లోని టీచర్లు ఇది చేయాలి. దీని వలన సమాజానికి లాభం కలుగుతుందని చెబితే వారింటారు. కాని ఒకే రీతిలో టీచర్లు పాఠంలాగా చెబుతూ పోకుండ అకేషనల్‌గా ఎథికల్ విషయాలు చెబితే వారికి హత్తుకుంటుంది. ఎదుటి వారికి ఎందుకు సహాయం చేయాలి ? అంటే సమాధానం చెప్పలేని వారెందరో ఉన్నారు. కనుక వాటిని ప్రత్యామ్నాయ మార్గంను పిల్లలకు సూచించడం ద్వారా పిల్లలు నేర్చుకోగలుగుతారు.

నేడు సమాజంలో తల్లిదండ్రులు పిల్లలకు చెప్పేందెకు టైమ్ దొరకదు. గతంలో ఇంటిలో గ్రాండ్ పేరెంట్స్ ఉండి వారికి మోరల్స్ చెప్పేవారు. ఇప్పుడు అన్ని న్యూక్లియస్ కుటుంబాలు పిల్లలకు కథలు, సంఘటనలు గూర్చి చెప్పేవారు లేరు. ఏది నేర్చుకొన్న నేడు ఇంటర్‌నెట్, ఫేస్‌బుక్ ద్వారా తెలుసుకోవడం తప్ప వ్యక్తిగతంగా చెప్పడం కరువైంది. కనుక మౌకింగా వైవ్యక్తిక సంబంధాల ద్వారా పిల్లలకు మోరల్స్ చెప్పాలి.

కాని నేడు ప్రశ్న ఎథిక్స్ మంచి్ చెడు మీద భావనలు (To some it has to do with feelings about with right or wrong) మరి కొందరి కి అది మత నమ్మకాలు, మరికొందరికి న్యాయ సూత్రాలకు ఒదిగి ఉండడం లేద లోబడడం అని చెప్పవచ్చు. మన సంఘం అంగీకరించే ప్రవర్తన, విలువలెనని చెప్పచ్చు. కాని దీనిని అందరు ఒప్పుకోకపోవచ్చు. అయిన అంగీకరిస్తారు. ఇప్పటికే పాఠశాలలో పిల్లల మీద ఎన్నో బరువులున్నాయి. వాటికి Ethics చేర్చడం ఎంత వరకు అవసరం విజ్ఞులు ఆలోచించాలి. సోక్రటీస్ "said that" unexamined life is not worth living" అంటారు.

అదే విధంగా స్కూలులో ఒక విషయం అబద్ధం, దొంగతనం, మోసం చేయడం అనేవాటిని గూర్చి చెప్పడం కాని వీటి గూర్చి చెప్పి కాలంను వ్యర్థం చేయడమేనని కొందరంటారు. కనుక పిల్లలు నూతన క్రియేటివిటీని అలవర్చుకోవాలి.

అదే విధంగా విలువలను గూర్చి చెప్పడం అవసరం లేదని కొందరంటారు. కాని పాఠశాలలో పిల్లలకు విలువలను గూర్చి చెప్పాలి. ఏమిటది ? అంటే అందరు అంగీకరించి చెప్పమన్నదే విలువలను Ethics గూర్చి చెప్పాలి. ఇందుకు తగిన టీచర్స్‌ను ఎంపిక చేయాలి. బెర్లోట్ బ్రెచ్ (Berlot Brech Growth first then ethics I say reading and arthometics first) అర్థ మెటిక్స్ చెప్పె టీచర్ ఎథిక్స్ గూర్చి చెబితే పిల్లలకు చేరుతుందని చెప్పవచ్చు.

మానవ విలువలు దిగజారుతున్న నేడు రాబోయే తరాలకు విలువల గురించి మంచి - చెడును గూర్చి చెప్పాల్సిన అవసరం నేటి తరం మీద ఉంది. ఆ పని మనందరి మీద ఉంది కాదంటారా ?

◆

**గత బడ్జెట్ సమావేశాల్లో ఆర్థిక మంత్రి ప్రసంగిస్తూ మహాత్మాగాంధీ 150వ జయంతిని పురస్కరించుకుని 2019 నాటికల్లా దేశంలోని 120 కోట్ల మందికి మరుగుదొడ్ల సదుపాయం కల్పించడం ద్వారా సంపూర్ణ పారిశుధ్యం సాధించడమే లక్ష్యంగా చేసుకున్నట్టు ప్రకటించారు.**

అందుకు అనుగుణంగా మరుగుదొడ్ల నిర్మాణానికి జాతీయ స్థాయిలో కేంద్రం రూ. 65,000 కోట్ల నిధులను (కొంత కార్పొరేట్ భాగస్వామ్యం) మంజూరు చేసింది. ఈ లక్ష్య సాధనకు నిధుల కొరతలేదని, అవసరమైతే మరుగుదొడ్ల నిర్మాణానికి మరిన్ని నిధులను ప్రధాని ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన స్వచ్ఛభారత్ అభియాన్ కింద మంజూరు చేస్తామని కూడా ప్రకటించారు.

వినియోగిస్తున్నారని అఫిడవిట్ దాఖలు చేయాలన్న నిబంధన విధించారు.

ఏదేమైనా ప్రభుత్వం మరుగుదొడ్ల నిర్మాణం కంటే ముందుగా వాటి వినియోగం ఆవశ్యకత పట్ల ప్రజల ఆలోచనాధోరణుల్లో మార్పు తేవాల్సిన అవసరం ఉంది. బహిరంగ మల విసర్జన వల్ల తలెత్తే అనర్థాలను వివరించి, చైతన్యపరచాల్సి ఉంది. ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం బహిరంత మల విసర్జన వల్ల భూగర్భ జలాలు కలుషితమై అతిసార, కలరా వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతాయని, ఇది దేశంలో విదేశీ పర్యాటకులపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలుస్తున్నది.

అలాగే యూనిసెఫ్ నివేదిక ప్రకారం బహిర్భూముల్లో బహిరంగ మల విసర్జన వల్ల ప్రతి గ్రాము మలంలో పది మిలియన్ల వైరస్‌లు, ఒక మిలియన్ బ్యాక్టీరియా, వెయ్యి పరాన్నక్రిములు ఉన్నట్లు గుర్తించారు. ఇవి

# బహిరంగ మల విసర్జన నిర్మూలన: ఆలోచన ధోరణిలో మార్పు ఆవశ్యకత

దీనిని బట్టి 2019 నాటికల్లా సంపూర్ణ పారిశుధ్యం లక్ష్యసాధనకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నట్టు కనిపిస్తుంది. పంజాబ్ వంటి అభివృద్ధి చెందిన రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా ఇటీవల ప్రణాళికా సంఘానికి ప్రత్యామ్నాయ ఏర్పాటును పరిశీలించడానికి ర్పాటైన సమావేశంలో భారీ పెట్టుబడులు అవసరమయ్యే ప్రాజెక్టులకు విలువైన వనరులు వెచ్చించే బదులు దేశంలో తాగునీరు, మరుగుదొడ్లు వంటి కనీస సదుపాయాల కే అధిక ప్రాధాన్యం ఇవ్వాలని నిశ్చయించడం గమనార్హం. దీని ప్రకారం మరుగుదొడ్ల నిర్మాణం, వాటి ఇనియోగంపై ప్రజలను చైతన్యపరచడం ప్రతి రాష్ట్రం ప్రధమాల్లో ఒకటిగా మారాల్సి ఉంది.

ఇటీవల రాజస్థాన్‌లో రానున్న స్థానిక ఎన్నికల్లో పంచాయత్, బ్లాక్ సమితులు, జిల్లా పరిషత్ సభ్యులుగా పోటీ చేయదల్చుకున్న సభ్యులు విధిగా తమ ఇంట్లో మరుగుదొడ్డి ఉందని, ప్రతి కుటుంబ సభ్యుడు మరుగుదొడ్డిని



కూరగాయలు, పండ్ల ద్వారా మార్కెట్లకు చేరి రోగాల వ్యాప్తి జరుగుతున్నది. విధానపరమైన అంశాలను కూడా ప్రభావితం చేసే ఈ సమస్యపై విధాన నిర్ణేతలు మరింతగా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఆర్థిక సూచికలు కూడా ప్రాథమిక వయసులోనే ఆరోగ్యపరమైన ఇబ్బందులు తలెత్తడం అనేది యుక్తవయసు వ్యక్తుల ఉత్పాదకతను, లక్ష్యాలను దెబ్బతీస్తుందని స్పష్టం చేస్తున్నాయి. జీవితంలోని మొదటి రెండేళ్లలోనే ఆరోగ్యపరమైన దెబ్బలు తింటే కోలుకోవడం కష్టమే. శిశువుల ఆరోగ్యానికి తోడు స్త్రీ ఆరోగ్యం, గౌరవానికి కూడా ఇది భంగకరం. ఈ కారణంగా ముందే మేలుకొని బహిరంగ మలవిసర్జన అనే దురలవాటుకు స్వస్తి పలకాలి.

2014 జూన్‌లో ఆర్ఐసిఇ (రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ కంపాషినేట్ ఎకనామిక్స్) అనే పరిశోధన సంస్థ బీహార్, హర్యానా, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లోని 13 జిల్లాల్లో నాణ్యమైన పారిశుధ్య సదుపాయాలు, పరిణామాలు (శానిటేషన్ క్వాలిటీ యూజ్ యాక్సెస్, అండ్ ట్రెండ్స్) అనే అంశంపై సర్వే జరిపింది. ఈ సర్వేలో 40 శాతం ఇళ్లల్లో మరుగుదొడ్లు ఉన్నప్పటికీ కనీసం ఇంటికొకరు బహిరంగ మలవిసర్జనకు పాల్పడుతున్నట్లు తేలింది.

రాజస్థాన్‌లో ఈ పరిస్థితి మరింత అధికంగా (57 శాతం0 ఉండగా, హర్యానాలో కాస్త తకు&్వగా (37 శాతం0 ఉన్నట్టు తేలింది. కేవలం మరుగుదొడ్ల నిర్మాణంతోనే సరిపోదని, ప్రజల ఆలోచనాధోరణిలో మార్పు తేవాల్సిన ఆవశ్యకత ఉందని ఈ సర్వే ఫలితాలు చెబుతున్నాయి.

రాజస్థాన్ ఆగ్నేయ మారుమూల ప్రాంతంలో మంచి వర్షాలు పడి కాస్త మెరుగైన జీవన పరిస్థితులు గల ఝులావర్ జిల్లాలో ప్రొబేషనర్ అధికారిగా పనిచేస్తున్నపుడు నాకు ఈ పారిశుధ్య రంగం గురించిన అవగాహన

మొదలైంది. రాష్ట్రంలో అనేక ఇతర జిల్లాల్లో వలే పారిశుధ్య పటంలో ఝులావర్ వెనుకబడే ఉంది. 80 శాతం గ్రామీణుల ఇళ్లలో మరుగుదొడ్ల ఊసే ఉండేది కాదు. ఇది సాక్షాత్తూ ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గ ప్రాంతం కూడా. ఈ పరిస్థితిని మార్చాలని ట్రెయినీ కలెక్టర్ ఎంతో కృత నిశ్చయంతో ఉన్నారు

ముందుగా మూడు గ్రామ పంచాయతీలను నిర్మల్ గ్రామ పంచాయత్ పథకానికి ఎంపిక చేశారు. జిల్లా ప్రోగ్రాం కో ఆర్డినేటర్ కూడా ఎంతో చురుకు గల మహిళ, ఆమె గ్రామీణ మహిళలతో చాలా చొరవగా కలిసిపోగలిగేది. పారిశుధ్యంపై ఆ గ్రామస్తుల్లో చైతన్యం నింపడానికి మరుగుదొడ్ల వినియోగానికి వారిని ఒప్పించడానికి భయపెట్టో, బతిమాలో వారిని దారికి తేవడానికి పడ్డ శ్రమ, అర్ధరాత్రి వరకూ గ్రామీణులతో కౌన్సెలింగ్ సమావేశాలు జరపడానికి తోడు, గ్రామంలో ప్రతి ఇంటి తలుపు తట్టి నిర్మల్ పురస్కార్ గురించి చైతన్యపరచడాన్ని ఇప్పటికీ ఎంతో గర్వంగా ఉంటుంది. కేంద్ర బృందం వచ్చి మూడు గ్రామాలను తనిఖీ చేసి, మూడింటినీ నిర్మల్ గ్రామాలుగా ప్రకటించింది. దీంతో ఈ పథకంపై ఎంతో గౌరవం ఏర్పడింది.

భౌగళికంగా, సాంఘిక, ఆర్థిక పరిస్థితులు ఏ మాత్రం పొంతన లేని మూడు వేర్వేరు జిల్లాల్లో పారిశుద్ధ్యాన్ని చక్కదిద్దే అవకాశం లభించింది. ఝులావర్ ఏటా 1000 మిల్లీలీటర్ల వర్షపాతం ఉన్న స్థోమత గల జిల్లా కాగా, చురు పూర్తి ఎడారి ప్రాంతం. శీతాకాలంలో మైనస్ ఐదు డిగ్రీలు, వేసవిలో 50 డిగ్రీల ఉష్ణోగ్రతతో పూర్తి వైవిధ్య వాతావరణం ఉంటుంది. భూగర్భ జలాలు తాగడానికి కాదు కదా కనీసం వ్యవసాయానికి కూడా పనికిరావు.

ఇక మార్వర్‌కు గుండెకాయ లాంటి పాలి అపూర్వ ఆతిథ్యం కలగలిసిన రాజస్థానీ సంప్రదాయ సాంఘిక నిర్మాణం కలిగి ఉంటుంది. ఇంత వైవిధ్యం ఉన్నా ఈ మూడు జిల్లాల్లోనూ ప్రజలు ఒకే రీతిలో ఆరోగ్యకరమైన పారిశుద్ధ్య అలవాట్లు కలిగి ఉండాలని, బహిరంగ మల విసర్జన నిర్మూలించాలన్న ఆసక్తిని ప్రదర్శించారు. అయితే మరుగుదొడ్లు నిర్మించుకోకుండా వారిని అడ్డుకుంటున్నదేమిటి? అని ఎవరైనా ప్రశ్నించవచ్చు.

నిధులా? కాదనే ఎన్నో అధ్యయనాలు చెబుతున్నాయి… దీనికి జవాబు సామాజిక ప్రవర్తన, దాని ప్రభావం. ఈ రోజు మొత్తం దేశం స్వచ్ఛ భారత్ అభియాన్‌పై దృష్టి పెడుతోంది. ప్రముఖులు, సినీతారలు, మేధావులు అన్న తేడా లేకుండా ఒక్కరీతిగా మాటల్లోనూ, చేతల్లోనూ ఈ ఉద్యమానికి తోడ్పడుతున్నారు. ఈ ఉద్యమం ప్రారంభమైన తరువాత వచ్చిన ప్రధానమైన మార్పు ఏమిటి? (వాస్తవ ఫలితం కొంతకాలం గడిచాక కానీ తెలియరాదు).

మొట్టమొదటిసారిగా మన పారిశుధ్య అలవాట్లు, సామాజిక ప్రవర్తన, అది మారాల్సిన ఆవశ్యకత బహిరంగంగా వ్యక్తం కావడం, ఏ ఐరోపా నుంచో, సింగపూర్ నుంచో ఓ వ్యక్తి వచ్చి ఆయా దేశాల్లో పరిశుభ్రత గురించి మన ముందు ఏకరువు పెట్టడం సర్వసాధారణంగా మారింది. అయితే ఏ ఒక్కరూ ఇక్కడి పరిశుభ్రత విషయంలో మన పౌరుల సామాజిక ప్రవర్తనను ప్రశ్నించిన వారు ఇప్పటివరకూ లేరు. రోడ్డుపైనో, నలుగురూ సంచరించే బహిరంగ ప్రదేశంలోనో చెత్తను పారబోసే వ్యక్తి నిజానికి మూర్ఖుడు కాదు. తన ఇంటిని దుర్గంధం ఏసుకోడు కాబట్టి ఈ అంశంపై స్పృహలేని వాడు కూడా కాదు. అలాగని పరిశుభ్రమైన అలవాట్లు ని వాడు కూడా కాదు.

తన ఇంటిముందు కాలువలో మరుగు పేరుకుపోతే మున్సిపాలిటీ అధికారులకు ఫిర్యాదు చేయడానికి వెనుకాడడు. మరి ఎందుకు వీధులను చెత్త చేస్తాడు. ఇంట్లోని చెత్తను బహిరంగ ప్రాంతాల్లోకి విసరివేస్తాడు? ఎందుకంటే ఎవరూ అడిగేవారు లేరు కాబట్టి. తన అంతరాత్మకు అది తప్పని లుసు, అతని బుద్ధి కూడా వద్దనే చెబుతుంది. కానీ తన అలవాట్లు మానుకోడు. చాక్లెట్లు తింటే పళ్లు పాడవుతాయని, తల్లిదండ్రులు మందలిస్తారని తెలిసినా, వారు లేని సమయంలో తినడం మానుకోలేని చిన్నపిల్ల వాని చేష్టతో దీనిని పోల్చవచ్చు. వీధిలో చెత్త పారవేయడాన్ని, రోడ్డును దుర్గంధ పూరితం చేయడాన్ని సమాజం ఎప్పుడైతే ప్రశ్నించడం ప్రారంభిస్తుందో, అప్పుడు మాత్రమే ఈ దురలవాటు తొలగుతుంది.

బహిరంగ మల విసర్జన విషయంలో సైతం ఇదే వర్తిస్తుంది. గ్రామాల్లో ఎవరూ ప్రశ్నించరు కాబట్టి ఇంకా బహిరంగ మల విసర్జన అనే దురలవాటు కొనసాగుతోంది. అధికారుల నుంచి అభ్యంతరం వ్యక్తమైనా, గ్రామాల్లో పట్టించుకునే వారు ఉండరు. స్థానిక సమాజమే ఆ పనిని అడ్డుకోవాలి. అందుకోసం ప్రభుత్వం ప్రజలకు శిక్షణ ఇచ్చి, సాధికారత కల్పించి అందుకు సంసిద్ధులను చేయాలి. నిలకడగా పారిశుధ్య అలవాట్లు మెరుగుపడాలంటే నిజానికి ఇదొక్కటే మార్గం. ఒక సతి లేదా బాల్య వివాహం తరహాలో బహిరంగ మల విసర్జనను కూడా ఒక సామాజిక దురలవాటుగా గుర్తించిననాడు ప్రతి ఒక్కరి ఆలోచనలో సహజంగానే తప్పక మార్పు వస్తుంది.

## ధనప్రమేయం

బహిరంగ మల విసర్జన సమస్యను తరుచూ గ్రామీణ పేదరికంతో ముడిపెడుతుంటారు. ఈ సమస్యపై వాన ఎలా ఉంటుందంటే . . . గ్రామాల్లో తిండికే ఇబ్బంది పండుతున్న ప్రజలు కనీస అవసరాలు తీర్చుకోలేని దుస్థితిలో ఉంటే మరుగుదొడ్డి నిర్మాణం వంటి వాటిపై ఎలా ఖర్చు చేస్తారని ప్రశ్నిస్తారు. అంటే ప్రతి ఇంటికి మనం మరుగుదొడ్డి నిర్మించి ఇస్తే బహిరంగ మలవిసర్జన అనే దురలవాటు నిలిచిపోవాలి కదా? ఈ వాదనలో కొన్ని సమస్యలున్నాయి. ఒకటేమిటంటే ప్రతి గ్రామీణ కుటుంబం మరుగుదొడ్డి నిర్మించుకునే స్థోమత కలిగి ఉండదు. ఒక రూ. 50 వేల ఖర్చుతో విలాసంగా నిర్మించుకోవాలంటే కుదరకపోవచ్చు. నిజమే కదా.

అయితే, ఒక కుటుంబం వినియోగించుకునే స్థాయిలో మరుగుదొడ్డి నిర్మించుకోవడానికి ఈ మొత్తంలో పదో వంతు సరిపోతుంది. గ్రామీణ సమాజంలో బహిరంగ మల విసర్జన సమస్య అనేది స్థోమత లేకపోవడం వల్ల కాదు. . . సరైన అవగాహన కుటుంబ స్థాయిలో దాని అవసరానికి ప్రాధాన్యం ఇవ్వకపోవడమే అసలు సమస్య. రెండో విషయం వారికి మరుగుదొడ్డి నిర్మించి ఇచ్చినా దాని ఆవశ్యకతపై అవగాహన కల్పించకపోతే దానిని ఎవరూ పట్టించుకోక నిరుపయోగమయ్యే అవకాశమే ఎక్కువ.

ప్రభుత్వం మరుగుదొడ్లు కట్టించి ఇచ్చినా కనీసం 60 శాతం ఇళ్లలో ఒకరైనా బహిరంగ మల విసర్జనకు పాల్పడుతారన్నది అధ్యయనాలు చెబుతున్న మాట. ప్రైవేటుగా మరుగుదొడ్డి కట్టించుకుని ఉపయోగించే వారితో పోలిస్తే ఇది రెట్టింపు సంఖ్య. అందుకే మరుగుదొడ్డి నిర్మాణ బాధ్యతను ఆ కుటుంబానికే అప్పగించడం సరైన మార్గం. చురు, పాలి

జిల్లాల్లో మరుగుదొడ్ల నిర్మాణానానికి సంబంధించి, బయటి ఏజెన్సీలను నిషేధించారు. ఆ బాధ్యతను గ్రామస్తులకే అప్పగించారు.

ఆయా జిల్లాల్లో నిర్మల్ అభియాన్ విజయవంతం కావడానికి అదీ ఒక కారణం. తన ఇంటికి మరుగుదొడ్డి నిర్మాణం బాధ్యతను ఆ గ్రామస్తునికే అప్పగిస్తే అది తన ఇంటి వారి కోసమే అన్న స్పృహ ఇంటి యజమానిలో కలుగుతుంది. మరుగుదొడిడకి స్థలాన్ని ఎంపిక చేసుకోవడం,అవసరమైన ముడి సామాగ్రి తెచ్చుకోవడం, మేస్త్రిని రప్పించడం . . . ఇదంతా కొంత శ్రమకోర్చి చేయాల్సిన పనులు. ఇంత శ్రమకోర్చి మరుగుదొడ్డి నిర్మించుకోవడం వల్ల దానిని వాడాల్సిన అవసరం పట్ల కూడా అతనికి స్పృహ ఏర్పడుతుంది. ఇలా నిర్మించిన మరుగుదొడ్లు నిరుపయోగంగా మారే అవకాశాలు తక్కువ.

మరో విధంగా అంటే మరుగుదొడ్లు నిర్మాణానికి నిధులను సబ్సిడీ రూపంలో అందిస్తే అది గ్రామంలో పేదలు, సంపన్నులు అన్న వర్గాలను వేరుపర్చినట్టవుతుంది. ఎందుకంటే సబ్సిడీలు అర్హులైన పేదలకు మాత్రమే అందించడం వీలవుతుంది. వివిధ కారణాలతో ఎన్నో కుటుంబాలు సబ్సిడీల పరిధిలోకి రారు. దీంతో గ్రామంలో కొందరికే నిధులు ఇచ్చి, మిగిలిన వారి ని మరుగుదొడ్ల నిర్మాణానికి ఒప్పించాలంటే అది అసాధ్యమైన పనవుతుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని రెండు ఆలోచనలు చేశారు.

అసలు ముందుగా సబ్సిడీ ఇవ్వకుండా ప్రతికుటుంబం సొంత నిధులతో మరుగుదొడ్లు నిర్మించుకుని ఉపయోగించడం ప్రారంభించాకే సబ్సిడీలను పంచడం ప్రారంభించాలని. అయితే రెండు ఆలోచనాలూ అన్యాయమే అనిపించాయి. కానీ యోచన ఫలించింది. గ్రామస్తులు ఒక్కరీతిలో పారి శుధ్యాన్ని చక్కదిద్దుకునే పనిలో భాగస్వాములయ్యారు. గ్రామంలో నిరుపేదల కోసం ఒక రివాల్వింగ్ ఫండ్‌ను పంచాయతీకి అందజేశారు. మరుగుదొడ్డి నిర్మించుకోవడానికి అవసరమైన సామాగ్రి కొనలేని పేదల కోసం సామాగ్రిని అందజేసే బాధ్యతను పంచాయతీకి అప్పగించడం జరిగింది.

## సమష్టి ప్రోత్సాహకాల పాత్ర

బహిరంగ మలవిసర్జనకు వ్యతిరేకంగా గ్రాస్తులను చైతన్యపరచడానికి మెరుగైన మార్గం ఉద్యమ ఫలితాలను గ్రామాభివృద్ధి చర్యలకు ముడిపెట్టడం. ప్రతి ఊళ్లోనూ ఎవరైనా మెరుగైన సదుపాచాలతో పరి శుభ్రమైన వాతావరణంలో నివసించాలనే భావిస్తారు. అలాగే ప్రతి ఊరికి ఎన్నో అసంపూర్తి డిమాండ్లు ఉంటాయి. వాటిని సులభంగా పరిష్కరించడం ద్వారా ఉద్యమంలో భాగస్వాములను చేయవచ్చు. నేడు ఒక గ్రామం ఇతర గ్రామాల కంటే అభివృద్ధి పనుల కోసం రెండు కారణాలతో మాత్రమే అధిక నిధులు పొందగలదు.

ఒకటి అధిక జనాభా పరంగా, లేదా రాజకీయపరమైన చొరవ కారణంగా. పారిశుధ్యాన్ని కూడా వాటికి చేరిస్తే ఈ ఉద్యమానికి మరింత ఊపు తేవొచ్చు. ఉదాహరణకు గ్రామ జనాభా ఆధారంగాకొంత నిధుల మొత్తాన్ని ప్రత్యేకంగా కేటాయించి, దానిని సంపూర్ణ పారిశుధ్యం సాధించిన గ్రామానికి బదిలీ చేయవచ్చు. ఇది కనీసం ఐదేళ్లపాటు అమలులో ఉండేలా చేయాలి. నిధులందగానే గ్రామం మళ్లీ పాత అలవాట్లకు మరలకుండా ఉండాలంటే ఇది తప్పనిసరి.

## నిర్విరామ సందేశం . . .

బహిరంగ మల విసర్జన అనేది ఒక సామాజిక పీడ. దానిని ఆ విధంగానే ఎదుర్కోవాలి. సమాజం నలుమూలలా దాని దుష్ప్రభావాలపై అవగాహన కలిగేలా కృషి కొనసాగాలి. ఈ దురలవాటును మానుకున్న ప్రజలకు ప్రోత్సాహం లభించాలి. ఇందుకోసం గ్రామంతో అనుబంధమున్న అన్ని ప్రభుత్వ శాఖల భాగాస్వామ్యం తప్పనిసరి. నిర్మల్ పంచాయత్ ఉద్యమం ప్రారంభించిన తొలినాళ్లలో సాధారణ ప్రజలు ఈ ప్రచారానికి అంతగా లొంగడం లేదని గమనించారు. అప్పుడే వారి ప్రయత్నానికి స్థానిక అంశాలను జోడించి విభిన్న పంథాను అనుసరించారు.

భాగస్వాములందరికీ వర్క్‌షాప్ నిర్వహించి సర్పంచ్‌లు, ఉపాధ్యాయులు, ఆరోగ్య కార్యకర్తలు, రెవెన్యూ సిబ్బందిని కలుపుకుని వారిని వాలంటీర్లుగా చేసి ఈ కార్యక్రమాన్ని ఉద్యమస్థాయికి చేర్చారు. బహిరంగ మల విసర్జన నిర్మూలన కార్యక్రమానికి చురు జిల్లాలో 'చోకో చురు' అని, పాలి జిల్లాలో 'పుత్రో పాలి' అని నామకరణం చేశారు. అలాగే స్థానికతను ప్రతిబింబించే లోగోలను, నినాదాలను రూపొందించి ప్రచారాలకు వాడుకున్నారు. ఇలా బ్రాండింగ్ చేయడం కంటే నిరంతర చర్చలతో మెదళ్లను సానబెట్టడం ద్వారా గ్రామస్తులే ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లేలా చేయడంతో మంచి ఫలితాలు రాబట్టగలిగారు.

ఇలా నిర్విరామంగా బహిరంగ మల విసర్జనకు వ్యతిరేకంగా సందేశాన్ని మారుమూలల్లో వినిపించడానికి తోడు ఈ దురలవాటుకు స్వస్తి పలికిన ఇళ్ల ముందు 'ఛాకో ఘర్', లేదా పుత్రో ఘర్ . . . (స్థానిక భాషలో అందమైన ఇల్లు) అని నేమ్ ప్లేట్లు రాయించి గుర్తింపునివ్వడం చేశారు. చివరకు వారి రేషన్‌కార్డుల మీద కూడా ఉద్యమ లోగోను ముద్రించారు. స్థానిక ఆరోగ్య కార్యకర్తలకు కూడా పేషెంట్ల స్లిప్‌లపై లోగో స్టాంప్‌లను ముద్రించాలని సూచించారు.

స్కూళ్ళల్లో పిల్లలు ఇంకా ఎవరైనా బహిరంగ మల విసర్జన చేస్తున్నారా అని జాబితా తయారు చేయాలని సూచించారు. ప్రభుత్వం లేదా బయట ఏజెన్సీలు మరుగుదొడ్లు నిర్మించకుండా గ్రామస్తులే స్వయంగా నిర్మించుకోవడాన్ని ప్రోత్సహించారు. అంతకుముందు మలంలో క్రిములు, ఈగలు, నీరు, చివరకు పాల ద్వారా కూడా ఎలా రోగాలు వ్యాప్తి చేస్తాయో సోదాహరణంగా వివరిస్తూ గ్రామస్తులకు పరిశుభ్రతపై శిక్షణ ఇచ్చారు. నిర్మించిన మరుగుదొడ్లను గ్రామస్తులు ఉపయోగిస్తున్నారో లేదో తనిఖీకి బృందాన్ని కూడా నియమించాం.

ఇన్ని కార్యక్రమాలకు తోడు సమాజం ముందు తలదించుకోవాల్సి వస్తుందనే సిగ్గు, బిడియం ఇటు మహిళలను, పిల్లలను, వృద్ధులను కూడా బహిరంగ మలవిసర్జనకు దూరంగా ఉండేలా చేసింది. చురు, పాలి రెండు జిల్లాలకు ప్రపంచ బ్యాంకు నిధులతో తాగునీరు, పారిశుధ్య పనులు చేపట్టడం జరిగింది.

నిజానికి కార్యక్రమం విజయవంతానికి వరల్డ్ బ్యాంకు ప్రాయోజిక వాటర్ శానిటేషన్ ప్రాజెక్ట్ ఎంతో కీలకంగా పనిచేసింది. మరుగుదొడ్ల నిర్మాణం ఖరీదైన వ్యవహారమనే అపోహను పారద్రోలి స్థానికంగా లభించే సామాగ్రితోనే చౌకగా మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టడంలో స్థానిక మేస్త్రీలకు శిక్షణ ఇప్పించడం వంటి కార్యక్రమాలకూ ఈ ప్రాజెక్టు ఉపయోగపడింది.

దీనికితోడు ఆయా జిల్లాల్లోని కలెక్టరేట్లలో శానిటేషన్ పార్కులను కూడా ఏర్పాటు చేయడం జరిగింది. రూ. 5 వేల నుంచి రూ. 30 వేల వరకూ ధరల్లో వివిధ మోడళ్ల టాయిలెట్లను నిర్మించి సందర్శకులకు వివరించడం జరిగేది. వెలుపల ఒక బోర్డు తగిలించి ఉండేది. ఈ బోర్డుపై ప్రతి పంచాయతీలో పారిశుధ్యం పరిస్థితి ఎలా ఉందో రాసి ఉండేది.

బహిరంగ మల విసర్జనను పూర్తిగా అరికట్టిన గ్రామాల పేర్లను ఆ బోర్డుపై పచ్చని చుక్కలతోనూ, పురోగతి ఉన్న గ్రామాల పేర్లను నారింజ రంగులోనూ, అధమ స్థాయిలో ఉన్న గ్రామాల పేర్లను ఎర్రని చుక్కలతోనూ గుర్తించి ఉండేది. కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శించే గ్రామస్తులు ఆ బోర్డును చూసి తమ గ్రామానికి ఎలాంటి గుర్తింపు లభించిందో చూసి ఆలోచనలో పడేవారు.

చురుకైన సామాజిక కార్యకర్తలు, అభివృద్ధి ప్రోత్సాహకాలు, పటిష్టమైన భావప్రసార వ్యూహాలతో చేపట్టిన ఏ కార్యక్రమానికైనా సమర్థమైన ఫలితాలు వస్తాయనడానికి ఇది నిదర్శనం. నిజానికి పాలి జిల్లాలోని ఓ గ్రామ పంచాయతీ కేవలం 25 రోజుల్లో గ్రామంలో బహిరంగ మల విసర్జనను పూర్తిగా అరికట్టగలిగింది. దాదాపు 1200 గడపలు గల ఆ గ్రామంలో కేవలంలో 10 శాతం మంది మాత్రమే మరుగుదొడ్లు వినియోగించేవారు. కానీ గ్రామస్తుల చిత్తశుద్ధితో నెల తిరక్కుండానే గ్రామం రూపురేఖలను మార్చివేయగలిగారు.

## కార్పొరేట్ సంస్థల పాత్ర

గృహాలకు అదనంగా నిధులివ్వడం కూడా సరికాదు. ఇది ఆఖరుకు డబ్బు అందినవారు... అందనివారు అనే తేడాను సృష్టిస్తుంది. నిజానికి ఇప్పటికే ప్రభుత్వం సబ్సిడీ మొత్తాన్ని భారీగా అందిస్తోంది. మరికంఎలా? ముఖ్యంగా చేయాల్సింది ఐ.ఇ.సి. (ఇన్ఫర్మేషన్, ఎడ్యుకేషన్, కమ్యూనికేషన్) కార్యక్రమాలు, పాలి జిల్లాలో ఎన్నో పారిశ్రామిక సంస్థలు ఉన్నాయి. అయితే వాటిని నేరుగా ఇళ్లకు వెళ్లి మరుగుదొడ్లు నిర్మించి ఇవ్వడాన్ని నిరోధించాం. అందుకు బదులుగా వారు గ్రామపంచాయతీలను దత్తత తీసుకుని కమ్యూనిటీ శిక్షణ ఇవ్వడం, వలంటీర్లను తయారు చేయడం, సామాజిక ప్రవర్తనలో మార్పు తెచ్చే కౌన్సిలింగ్ వంటి కార్యక్రమాలు చేపట్టడాన్ని ప్రోత్సహించడం జరిగింది.

ఇపుడు కార్పొరేట్ సంస్థలు గ్రామాల్లో బహిరంగ మల విసర్జనను మానివేసిన కుటుంబాల్లో పిల్లలకు స్కూల్ బ్యాగ్‌లు, లంచ్‌బాక్స్‌లు అందించడం, కమ్యూనిటీ సమావేశాలు ఏర్పాటు చేసి, వలంటీర్లకు శిక్షణ ఇవ్వడం, బహిరంగ మలవిసర్జన దురలవాటును మానుకున్న ఇళ్లకు గుర్తింపు నేమ్ ప్లేట్లను అందజేయడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నాయి. ఇపుడు ఈ ఉద్యమం అక్కడ మరింత విస్తృతమైంది. ఫలితాలు కూడా వేగంగా వస్తున్నాయి. ఉదాహరణకు అంబుజా సిమెంట్స్ సంస్థ దత్తత తీసుకున్న ఐదు గ్రామాల్లో ఒక గ్రామంలో కేవలం నెలరోజుల్లో బహిరంగ మల విసర్జనను పూర్తిగా నిర్మూలించగలిగారు.

2010లో కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ పారిశుధ్య ప్రామాణికాల ఆధారంగా క్లాస్ 1 పట్టణాల జాబితాను విడుదల చేసింది. ఇపుడు నాలుగేళ్ల తరువాత చురు జిల్లా ఈ ఉద్యమానికి ఒక కేస్ స్టడీగా ఉపయోగపడుతోంది. ఇపుడు ఆ జిల్లాలోని తారానగర్ బ్లాక్ పూర్తిగా బహిరంగ మల విసర్జన నిర్మూలన ప్రాంతంగా గుర్తింపు పొందింది.

100కు పైగా గ్రామ పంచాయతీలు, 400 గ్రామాలు పూర్తిగా బహిరంగ మల విసర్జన దురలవాటును నిర్మూలించాయి. కేవలం ఒక ఏడాదిలో సాధించిన విజయాలివి. ఇప్పటికే చెప్పుకున్నట్టుగా బహిరంగ మల విసర్జన అనే మూఢాచారానికి ప్రధానంగా గ్రామీణ పేదరికం కారణంగా చెబుతారు. కానీ అది వాస్తవ దూరం. ఎందుకంటే డబ్బు అనేది తరుచూ ఒక ఆశచూపే సాధనం మాత్రమే.

తరతరాలుగా దురలవాటుగా మారిన బహిరంగ మలవిసర్జన సమస్య డబ్బుతో పరిష్కారమయ్యేది కాదు.

గతంలో ప్రభుత్వ తోడ్పాటుగా మరుగుదొడ్లు నిర్మించినా అవి చాలా వరకూ నిరుపయోగమే అయ్యాయి. మరికొన్ని ఆయా ఇళ్లలో స్టోర్‌రూంల ంగా దురుపయోగం అయ్యాయి. అదేవిధంగా సబ్సిడీలు అందించడం కూడా దురుపయోగానికే దారితీసింది. సబ్సిడీలు పొందే క్రమంలో అర్హులు, అనర్హులన్న తేడాలు వచ్చి పొరపొచ్చాలకు దారితీశాయి. అప్పటికే ఇళ్లలో మరుగుదొడ్లు ఉన్న వారు కూడా సబ్సిడీల కోసం తప్పుడు క్లెయింలు చేసిన ఉదంతాలు ఉన్నాయి.

లక్ష్యాలు పూర్తి చేయాలన్న అధికారుల తొందరపాటుతో ఈ నిర్మల్ గ్రామ పంచాయతీ అభియాన్ అస్తవ్యస్తంగా అమలు జరిగింది. ఈ అన-ంభవం నేపథ్యంలో వ్యక్తులకు నేరుగా నిధులు అందించకుండా 100 శాతం బహిరంగ మల విసర్జన నిర్మూలన సాధించిన పంచాయతీలకు గ్రాంటులిచ్చి ప్రోత్సహించాలి. ఇకనైనా ఎన్ని మరుగుదొడ్లు నిర్మించామని కాకుండా, ఎన్ని గ్రామాలు నిర్మలంగా మారాయి . . . అని లెక్కపెట్టడం మంచిది. దీనికి ఫైనాన్స్ కమిషన్ కూడా ప్రత్యేకించి కేటాయింపులు ఇవ్వవచ్చు.

2006లో ప్రపంచబ్యాంకు అధ్యయనం ప్రకారం పౌరులకు సరైన పారిశుధ్య సదుపాయాలు కల్పించలేని కారణంగా భారత్‌లో ఏటా జీడీపీలో 6.4 శాతం కోల్పోతోంది. మన ప్రధాని ఆశించినట్టుగా 2019 నాటికైనా పరిస్థితిలో మార్పు రావాలని కోరుకుందాం.

*ముఖ్యమైన అంశాలు...*

- ☆ సంపూర్ణ పారిశుధ్య లక్ష్య సాధన దిశగా మరుగుదొడ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ. 65,000 కోట్లు కేటాయించింది.
- ☆ మరుగుదొడ్లు నిర్మించడానికి ముందు ప్రభుత్వం మరుగుదొడ్ల అవసరాన్ని గుర్తించేటట్టుగా ప్రజల్లో చైతన్యం తేవడం ముఖ్యం.
- ☆ బహిరంగ మల విసర్జన సమస్య వల్ల తలెత్తే దుష్పరిమాణాలను అరికట్టాలి.
- ☆ ప్రభుత్వం నిర్మించిన మరుగుదొడ్లు చాలా వరకు నిరుపయోగంగా మారాయి. సబ్సిడీలు దుర్వినియోగమయ్యాయి.
- ☆ నిర్మలమైన గ్రామాలకు గౌరవ ప్రతిపత్తి కల్పించేలా సంపూర్ణ పారిశుధ్యం సాధించిన పంచాయతీలకు ప్రత్యేక గ్రాంటులిచ్చి ప్రోత్సహించాలి.

-జిఓఐ

GOVERNMENT OF TELANGANA
ABSTRACT

RD - A.P.Reorganisation Act, 2014 – Renaming of AMR-APARD (SIRD) as Telangana State Institute of Panchayat Raj and Rural Development (TSIPARD) – Orders – Issued.

---

PANCHAYAT RAJ & RURAL DEVELOPMENT (RD) DEPARTMENT

G.O.MS.No. 37. Dated:06-04-2015

Read the following:-

1. Andhra Pradesh Reorganisation Act 2014 (Act 6 of 2014), Dated: 01.03.2014.
2. From the Commissioner (FAC), AMR-APARD, Rajendra Nagar, Hyderabad Lr.No.1773/A3/Estt/AMR-APARD/2014, Dated 05/01/2015.

&&&

ORDER:

The Central Government enacted the Andhra Pradesh Reorganization Act, 2014 (Act 6 of 2014) dated 01.03.2014, and the Government of India notified 2nd June, 2014 as the appointed day for formation of a new State of Telangana.

2. In the reference 3rd read above, Commissioner, AMR-APARD, Rajendra Nagar, Hyderabad has submitted proposals for renaming the institution as Telangana State Institute of Panchayat Raj and Rural Development (TSIPARD).

3. Govt. after careful examination of the proposal of the Commissioner, AMR-APARD, Rajendra Nagar, Hyderabad in consultation with Advisory Departments under the provisions of the A.P. Reorganisation Act, 2014 hereby change the nomenclature of "AMR-APARD" as "TELANGANA STATE INSTITUTE OF PANCHAYAT RAJ AND RURAL DEVELOPMENT (TSIPARD)" in the State of Telangana.

4. The Director, AMR-APARD, Telangana, Rajendra Nagar, Hyderabad shall take necessary action in the matter.

(BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF TELANGANA)

**J. RAYMOND PETER**
PRINCIPAL SECRETARY TO GOVERNMENT

To
The Director, AMR-APARD, Telangana, Rajendra Nagar, Hyderabad.
The Director, Rural Development, Telangana, Hyderabad
The Director, PR &RE, Telangana, Hyderabad.
All District Collectors in the State/CEOs, ZPP/DPOs in the state (through Director, AMR-APARD)
All P.Ds, DRDAs in the State (through Director, AMR-APARD)

Copy to:
The Secretary, Ministry of Rural Development, GOI, Krishi Bhavan, New Delhi.
The P.S. to Addl. Secy. to CM
The P.S. to M (PR&IT)
The P.S. to Prl.Secy.PR&RD
SF/SC.


//FORWARDED::BY ORDER//

**SECTION OFFICER**

# వెనుకబడిన తరగతుల ఉద్ధారకుడు జ్యోతిబా పూలే

**విద్య అందరిసొత్తు. అందరికి దక్కవలసిందేనని నినాదంను కార్యరూపంలో పెట్టిన మహానుభావుడు జ్యోతిబా పూలే. స్త్రీకి విద్య తప్పనిసరి అని బ్రిటిషు ప్రభుత్వం నియమించిన హంటర్ కమీషన్‌కు పూలే 1882 అక్టోబర్ 19న అంటరాని కులాలు స్త్రీ విద్య అవశ్యకత మీద వినతిపత్రాన్ని సమర్పించారు. దీనిలో దేశీయ విద్య (వీధిబడులు), రాత్రి పాఠశాలల ఆవశ్యకతను గూర్చి పేర్కొన్నారు.**

ఉన్నత వర్గాల వారికి మాత్రమే విద్యావంతులను చేసే ఈ ప్రభుత్వ చర్యల వలన అన్ని ఉన్నతస్థాయి ప్రభుత్వ ఉద్యోగాలు వారితో నిండిపోయాయి. ఒకవేళ రైతుల సంక్షేమం ప్రభుత్వ లక్ష్యమైతే ఈ రంగంలో ఆయా వర్గాల ఆధిపత్యాన్ని తగ్గించి కూలీలుగా మిగతావారి మధ్య నిమ్న కులాలు ప్రజలు ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరే ఏర్పాటు చేయాలి.



ఇప్పుడున్న విద్యా వ్యవస్థ వల్ల ఈ లక్ష్యం సాధ్యం కాదని ఎవరైన అనవచ్చు. దీనికి సమాధానం ఏమంటే ఉన్నత విద్యను దాని మానాన దాన్ని వదిలేసి ప్రజలందరికి విద్యనందించేదుకు పూనుకోవాలి. దీనివల్ల సామాన్య జనం నుంచి కూడా ఎంతోమంది సమర్థులు నీతిమంతులు, శీలవంతులు రూపొందుతారు అని బాటే విద్యా కమిషన్ రిపోర్టు (భాగం -2 కలకత్తా ప్రచురితం 1884, పుటలు 14 నుంచి 154 వరకు) ఈ విషయాన్ని వెల్లడిస్తుంది.

అంతవరకు ఉన్నత కులాలకు మాత్రమే బ్రిటిషు ప్రభుత్వం ప్రాధాన్యతనిచ్చింది పూలె తన వినతిపత్రంలో భారత విద్యావ్యవస్థలో జరుగుతున్న అన్యాయాన్ని, జరగవలసిన సామాజిక న్యాయాన్ని వివరించారు. శూద్ర, అతిశూద్ర, అంటరాని కులాల విద్యకోసం ఉద్యమాన్ని నిర్వహించిన తొలి భారతీయుడుగా పూలే మాత్రమే నిలుస్తారని డాక్టర్ అంబేద్కర్ - ధనుంజయకేర్‌ల మధ్య జరిగిన ముఖాముఖిలో వెల్లడించారు.

అంటరాని కులాలకు, స్త్రీలకు విద్యనందించి జాతి వినాశనానికి పూలే కంకణం కట్టుకొన్నారని ఆనాటి ఆధిపత్య సమాజం ఆయన్ని నిందించింది. పూలే భార్య సావిత్రిబాయి స్త్రీలకు విద్య నేర్పిస్తున్నందుకు ఆమెపై దాడికి పూనుకొన్నారు. ఈ విషయాన్ని ( Altekar AR, AS ' The position of women in Hindu Civilization p.41) వివరించారు.

1848 -1852 మధ్యకాలంలో దాదాపు 16 పాఠశాలలు పూలే ప్రారంభించారు 1855లో శ్రామిక కూలీలు కోసం రాత్రిబడిని స్థాపించారు. 1863లో వితంతువులకు, వారి పిల్లలకు వసతి గృహాన్ని ఏర్పాటు చేశారు. అంటరానితనం కులం, వంశపరంగా సంక్రమిస్తుందనే సంప్రదాయాలపై తొలిసారిగా పూలే ధ్వజం మెత్తి వాటి నిర్మూలనకు కృషి చేశారు. బావిలో నీళ్ళు తోడుకోవడాన్ని అనర్హులుగా, బహిష్కృతులుగా వున్న అంటరానితనం కులం, వంశపరంగా సంక్రమిస్తుందనే సంప్రదాయాలపై తొలిసారిగా పూలే తిరుగుబాటు చేశారు. వాటి నిర్మూలనకు కృషి చేశారు. అంటరాని పిల్లలకు నీళ్ళు, బట్టలు సమకూర్చారు. పూలే సామాజిక పునర్నిర్మాణ ధృక్పధాన్ని పరిశిలించిన గాంధీ ఆయన్ని నిజమైన మహాత్మగా కొనియాడారు.

జ్యోతిరావు పూలే 1827లో ఏప్రిల్ 11న గోవిందరావు చిమ్నాబాయ్‌లకు జన్మించారు. పూలేను ఆయన మిత్రలు గౌరవభావంతో జోతి అని బాగా పిలిచేవారు. మిత్రుని వివాహానికి వెళ్ళి కుల వివక్షను ఎదుర్కొన్న పూలే మహారాష్ట్రలో సామాజిక అసమానతుల గురించి తెలుసుకున్నారు. వాటి నిర్మూలన కోసం ఆలోచన చేశారు. అంటరాని కులాలు కనీసం వీధిలో నడవాలంటే పాటించవలసిన నియమావళిని తన తండ్రి గోవిందరావు మాటల్లో విన్నారు.

మహారాష్ట్ర మహార్, మాంగ్, చారుదర్, భంగీ, ధీచ్ తదితర అంటరాని కులాలు ప్రజానికం వీధుల్లో సంచరించడం మీద నిషేధం వుండేది. నాడు ఆధిపత్యం వహించేవారు సమాజంలో పవిత్ర, అపవిత్రత, అనే ఆచారాన్ని పాటించేవారని, విద్య సమానత్వం వంటి విషయాల్లో స్త్రీలను కూడా శూద్రులు అతి శూద్రులు స్థాయిలోనే చూసేవారనీ విద్యావేత్త 'నారాయణ విష్ణు జోషి' తన రచనల్లో వివరించారు.

నిమ్న జాతుల ఉద్ధరణకు పూలే 1873లో సత్యశోధక్ సమాజ్‌ను స్థాపించారు. ఈ సంస్థ ఆధ్వర్యంలో పూలే పురోహితుల ప్రమేయం లేని వివాహాలు జరిపించారు. ఈ సంస్థ నిర్వహించిన వివాహాలు చట్టబద్ధమయిననే జాతూర్ కేసు 1890లో బొంబాయి హైకోర్ట్ సత్యశోధక్ సమాజ్‌కు అనుకులాంగ తీర్పునిచ్చింది. అదే విధంగా ఎన్నో సేవలను సమాజాభివృద్ధికి అందజేశారు.

*- సిఎంపి*



# నూతనోత్సాహంతో పనిచేయాలి

**పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖల అధికారులు, ఉద్యోగులు నూతనోత్సాహంతో పనిచేయాలని మంత్రి శ్రీ కె. తారక రామారావు పిలుపినిచ్చారు. సచివాలయంలో పంచాయతీరాజ్ శాఖాధిపతులతో ఆయన సుదీర్ఘ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ పరిధిలోని వివిధ అనుబంధ సంస్థల్లో జరిగిన కార్యక్రమాలు, పథకాలపై ఈ సందర్భంగా సమీక్ష నిర్వహించారు.**

తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన తెలంగాణ డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్టు, పంచాయతీరాజ్ రోడ్ల బలోపేతం, ఆసరా పింఛన్లు, జాతీయ ఉపాధి హామీ పథకంపై ఆయా విభాగాల అధికారుల నుంచి మంత్రి కేటీఆర్ నివేదికలు తీసుకున్నారు.

ఏప్రిల్ 9,12వ తేదీల్లో జరిగే కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు ఏ అంశంపై సమాచారం అడిగినా అందించేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులకు సూచించారు. తెలంగాణ డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్టు పనులపై సమీక్షలో భాగంగా.. ఇంటేక్ వెల్స్ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభమయ్యేలా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. ప్రాజెక్టు పూర్తి వివరాలతో నివేదిక తయారు చేయాలని, ఈ ప్రాజెక్టుపై కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేసే అవకాశముందని తెలిపారు.

నిధులను మిగిలించే ఉద్దేశంతో ఈపీసీ విధానాన్ని పక్కనబెట్టి, మొబిలైజేన్ అడ్వాన్సులు ఇవ్వకుండా పెద్ద ప్రాజెక్టు చేపట్టిన మొదటి ప్రభుత్వం టీఆర్ఎస్ ప్రభుత్వమని అన్నారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా జరుగుతున్న పన్నుల వసూలు కార్యక్రమం వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామంలో ఎన్నడూలేని విధంగా పన్నుల చెల్లింపు బాగా పెరిగిందని, ఇది త్వరలోనే మరింతగా పెరుగుతుందని పంచాయతీరాజ్ కమిషనర్ శ్రీమతి అనితా రామచంద్రన్ మంత్రికి వివరించారు. గతం కన్నా కనీసం 30 శాతం పన్నుల చెల్లింపులు పెరిగినట్లు ఆమె చెప్పారు.

గ్రామ పంచాయతీల బలోపేతానికి ప్రభుత్వం తీసుకున్న పలు కార్యక్రమాల నివేదికలను కలెక్టర్ల సమావేశంలో అందుబాటులో ఉంచుతామని అధికారులు వెల్లడించారు. గ్రామీణాభివృద్ధి, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ శాఖలు తమ ప్రాధాన్య అంశాలను సిద్ధం చేసి, కాలానుగుణంగా లక్ష్యాలు నిర్దేశించుకోవాలని, వీటిని కలెక్టర్లకు అందించాలని మంత్రి కేటీఆర్ అధికారులకు సూచించారు.

శాఖాపరంగా నిర్దేశించుకున్న లక్ష్యాలను పూర్తిచేయాల్సిన బాధ్యత కలెక్టర్లదేనని, ఈ విషయంలో అలసత్వం వహించవద్దని పేర్కొన్నారు. పంచాయతీరాజ్ రోడ్ల పనులను రాబోయే కాలానికి నెలవారీగా లక్ష్యాలు నిర్దేశించుకొని పూర్తిచేయాలని, ఈ మేరకు ఏ నెలకు ఎన్ని కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తారో తనకు షెడ్యూల్ ఇవ్వాలని పీఆర్ ఇంజినీరింగ్ అధికారులను మంత్రి ఆదేశించారు.

జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా సాధించిన అభివృద్ధి నివేదికతో పాటు, చేపట్టాల్సిన పనులను కలెక్టర్లకు సూచించాలని కేటీఆర్ అధికారులకు చెప్పారు. మరుగుదొడ్ల నిర్మాణం, పారిశుద్ధ్య ప్రణాళికలు, ప్రాధాన్యాలను వివరిస్తూ ప్రత్యేక నోట్ తయారుచేయాలని అధికారులను ఆదేశించారు.

ఆసరా పింఛన్ల ప్రక్రియను సమీక్షించిన మంత్రి కేటీఆర్.. సెర్ప్ ద్వారా చేపట్టాల్సిన ఇతర పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలను మరింత బలోపేతం చేసే దిశగా ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచిస్తున్నారని, ఇందుకోసం చేపట్టాల్సిన చర్యలు, కార్యక్రమాలను సూచించాలని కోరారు. అధికారులంతా కలెక్టర్ల సమావేశానికి సమగ్ర సమాచారం, ప్రాధాన్య అంశాల నివేదికలతో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.

ఈ సమావేశానికి పంచాయతీరాజ్ ముఖ్యకార్యదర్శి శ్రీ రేమండ్ పీటర్, కమిషనర్ శ్రీమతి అనితా రామచంద్రన్, సెర్ప్ సీఈవో శ్రీ మురళి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ బి. సురేందర్‌రెడ్డి, పీఆర్ ఇంజినీర్ ఇన్ చీఫ్ సత్యనారాయణరెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు. ◆



# చెరువుకు మనమై.. మనతో చేరువై...

**తెలంగాణలోని ఏ పల్లెకి పోయినా, ఏ గుండెను తడిమినా, చెరువు అంటే తెలియనోళ్ళు, చెరువుతో అనుబంధం లేనోళ్ళు ఉండరు. చెరువు అనే కల్పతరువు చుట్టూ తమ తమ బతుకుతెరువులనల్లుకున్న ఎందరో వాడకందార్లు ఆ చెరువును తమ తల్లిగా భావించి, ఆరాధించి, తమ సంస్కృతిలో భాగం చేసుకున్నారు. చెరువు రకరకాల వృత్తుల వారికి ఒక ఆదరువు. అందుకే వాటి పేర్ల వెనక సముద్రాలు, సాగరాలు అని పొందుబరిచి ఉన్నాయి.**

నవ తెలంగాణలో 'మిషన్ కాకతీయ' పేరున పెద్ద ఎత్తున ఒక ఉద్యమం లాగా చెరువుల పునరుద్ధరణకు నడుం కట్టడం రాష్ట్ర ప్రజల అదృష్టం. ప్రభుత్వానికి ఉన్న గట్టి సంకల్పంతో బాటుగా ఒక పకడ్బందీ విధానాన్ని తయారు చేసుకొని ముందుకుసాగితే ఎంతో మేలు జరుగుతుంది. చెరువు వ్యవస్థ సమగ్ర అభివృద్ధి దిశగా ఈ విధానాలను, దానికి అనుగుణంగా మార్గదర్శక సూత్రాలను కూడా రూపొందించుకోవాలి. తెలంగాణ ప్రభుత్వం మిషన్ కాకతీయ కార్యక్రమాన్ని చాలా ప్రతిష్టాత్మకంగా చేపట్టే ప్రయత్నం చేస్తున్నది. ఇందులో ప్రధానంగా చెరువు పూడిక తీసి, ఆ వొండురు రైతులు తమ పొలాల్లో తోలుకోవచ్చేనది ఒక లక్ష్యం. దీనిల్ల చెరువులో నీటిని నిలువజేసే పరిమాణం పెంచడంతో బాటుగా ఆ వొండును చల్లిన చోట నేల సారం పెంచుకోవచ్చు అనేవి ఆశించిన ఫలితాలు.

పూడికతీత, ఆ తరువాత వొండు చల్లుకోవడం అనే క్రమాన్ని సాంకేతిక, సామాజిక అంశాలే కాకుండా సంస్థాగత అంశాలూ ప్రభావితం చేస్తాయి. చెరువులో వొండురు చేరడమనేది పరివాహక ప్రాంతంలో నేల రకరకాల కారణాలతో కోతకు గురి కావడం, ఆ మట్టి చెరువును చేరడం వల్ల జరుగుతుంది. దానికి అడవి ప్రాంతం తగ్గడం, పంట పొలాలు పెరగడం, భూసంరక్షణ సరిగ్గా చేపట్టకపోవడం లాంటి కొన్ని ముఖ్యమైన కారణాలు, ఇది ఒక గతిశీలమైన అంశం. కాలానుగుణంగా పరిస్థితులు మారుతుంటాయి.



సాంకేతికంగా సాగునీటి శాఖ పరిభాషలో చెరువులో పూడికతీత అన్న అంశం లేదు. పూడిక పెరిగితే అలుగు మట్టం, దానితోబాటు కట్ట ఎత్తు పెంచడమే ఇదివరకు అవలంభించిన విధానం. దానివల్ల ముంపు పెరుగుతుంది కాబట్టి ఇది రాను రాను బందయ్యింది. మెట్ట సాగు చేసే రైతులు ఒకప్పుడు తమంతకు తావే వొండురుతోల ుకునకనన్నాళ్ళు సమస్య అంత జటిలంగా లేదు.. చెరువు పరిమాణం ఎక్కువగా తగ్గలేదు. మరి వొండు తోలుకోవడం తగ్గడమనేది స్థూలంగా అందరు అంటునట్టు రైతుల అవగాహనా లోపం ఎంత మాత్రం కాదు. అందుకే పూడికతీత అనే విషయాన్ని పెద్ద ఎత్తున చేపట్టాలంటే దానికి సాంకేతికంగా,

సంస్థాగతంగా సరి అయిన మార్గదర్శక సూత్రాలు ఏర్పడాలె.

సాంకేతికంగా చూస్తే, మొదటగా వొండురు నాణ్యతను పరీక్ష చేసి వ్యవసాయ శాఖ ద్వారా ధృవీకరించాలి. పొలాల్లో నేల సారం పెంచాగలిగే యోగ్యత ఉన్న వొండును మాత్రమే వ్యవసాయపరంగా వినియోగించుకోవాలి. మిగితా పూడిక మన్ను ఏ అవసరాలకు పనికి వస్తుందో గుర్తించి అక్కడకు చేర్చే ప్రయత్నం చెయ్యాలె. రెండవ అంశము చెరువులో ఎంత పూడిక ఎక్కడెక్కడ పేరుకుని ఉన్నదో అంచనా వెయ్యాలె. పూడిక లేదా వొండు చెరువు నుండి తీసెటప్పుడు ఏ ప్రాంతం నుండి, ఎంత లోతు తియ్యాల్సి ఉన్నదో ఒక అంచనా ప్రకారం, ఒక ప్రణాళిక ప్రకారం చేయకపోతే చెరువు వ్యవస్థ దెబ్బతినేందుకు అవకాశం ఉన్నది. కట్టకు మరీ దగ్గర తీయడం మంచిది కాదు. తీస్తే, బుంగలు పుట్టి కట్టను నష్టపరిచవచ్చు.

కానీ తూము ముందరి పూడిక తియ్యడం చాలా అవసరం. కట్ట దెబ్బతినకుండా ఒక కాలువ లాగా తూము దగ్గరి పూడిక తియ్యాలె. అలుగు ముందర పూడిక తియ్యడం చాలా అవసరం. దీని వలన అలుగు



పారేటప్పుడు నీళ్ళు సాఫీగా పోతాయి. చేపల పెంపకం బాగా చెయ్యాలంటే దానికి సరిపడేటట్టు ఎక్కడ ఎంత లోతు చెయ్యాలనో ఆలోచించవలసి వొన్నది. పూడిక ఎక్కువ తీసినా కూడా చెరువు నీళ్ళు భూమిలోకి ఎక్కువ ఇంకిపోయే అవకాశమున్నది. ఈ నీళ్ళు భూగర్భ జలాన్ని పెంచుతవి కదా అని అనుకోవచ్చు. కానీ అది ఎంత దూరంలో పెంచుతుందో, ఆ పెరిగింది చెరువు కింద రైతులకు ఉపయోగపడుతుందో లేదో చెప్పడం కష్టం.

భూగర్భ జలాలు క్రమేపీ పెరగడం ఎంత అవసరమో, చెరువులో కొంత కాలం పాటు నీరు నిల్వ ఉండడం అంతకన్నా అవసరం. ఇవన్నీ చెయ్యాలంటే ఇంజనీర్లు చెరువులో ఏ ప్రాంతంలో ఎంత పూడిక ఉందో అంచనా యేసి ఎక్కడ ముందు తియ్యాలనో ప్రాధాన్యతను కూడా గుర్తించాలి. ఇది వరకు సర్వే చేసినప్పటి కాంటూర్ క్యాపాసిటీ పట్టికల ఆధారంగా ఇప్పటి పరిస్థితిని సర్వే చేస్తే విషయం తేట తెల్లమవుతుంది. లేకపోతే స్థానికంగా వివరాలు సేకరించి అంచనా కట్టాలే. ఇది ఒక విశేష ప్రయత్నంతో మాత్రమే సాధ్యపడతది.

సామాజిక అంశాల పరంగా చూస్తే చెరువు వొండు వాడకందార్లు ఎక్కువ చెల్కలల్ల సేద్యం చేసే మెట్టసాగు రైతులే ఉంటరు. వాళ్ళు చెరువు నీటి సంఘంలో భాగం కారు. వొండు తోలుకోకపోవడం వాళ్ళ అవగాహనా రాహిత్యం మాత్రమే అనుకోవడం భావ్యం కాదు. తోలుకోవడానికి ఎన్నో అడ్డంకులు ఉండడం ఒక ఎత్తైతే భూమి సారం పెంచడానికి ఏ కష్టం లేకుండా అవసరమైతే వొద్దెరకు కూడా రసాయన ఎరువులిచ్చే సావుకార్లు ఎంతమందో వొన్నరు. మంచి వొండు అవసరం, దాన్ని రైతులు తమ శాయశక్తులా తోలుకోగలిగే సమర్థతను ప్రభుత్వం ఈ కార్యక్రమం ద్వారా పెంచగలగాలే. అది సాధించాలంటే రైతులందరికీ నీటి సంఘంతోనో లేక గ్రామ పంచాయతీతోనో సమన్వయం కావాలె.

అందరు కలిసి ఒక ప్రణాళిక తయారు చేసుకొని, వొండు తోలుకోడమేది ఒక సారో రెండు సార్లో ప్రభుత్వం మిషన్లు పెడితే తీసుకుపోవడం అనేటట్లు కాకుండా, అది ప్రతి యేడూ ఒక ప్రక్రియ లాగా సాగాలె. అది సఫలం కావాలంటే ఇంకో కోణంల చూస్తే, ట్రాక్టర్లు ఉన్నోళ్ళు, వొండును ఆశించే ఖమ్మం, పాలమూరులోని కొన్ని ప్రాంతాల్లో సమిష్టి కృషితో విజయవంతంగా చేపట్టిన కార్యక్రమాల ఉదాహరణలు కొన్ని ఉన్నాయి. ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, బ్యాంకులు, రైతు సంఘాలు అందరు కలిసి ఈ విజయానికి కారకులైనరు.

చెరవు మరమ్మత్తులు అవి ప్రధానంగా, కట్ట, తూము, అలుగు, కాలువలకు సంబంధించినవి. మరమ్మత్తులు ప్రాథమికంగా సాంకేతిక నిపుణుల విషయమైనా ఇంతకూ ముందు చర్చించుకున్నట్లు చెరువుల నిర్వహణలో అనాదిగ వస్తున్న స్థానికుల సొంత సాంకేతిక పరిజ్ఞానం, అనుభం, అవగాహనలను పరిగణలోకి తీసుకోవడం చానా అవసరం. చిన్న చిన్న చెరువువలకు సంబంధించిన హైడ్రలాజికల్ సమాచారం సర్వే ఆఫ్ ఇండియా టోపో షీట్ల మీద పూర్తిగా ఆధారపడి పొందడం కష్టం.

రిమోట్ సెన్సింగ్ మ్యాపుల నుంచి అంత సులువుగా అవసరమైన సమాచారాన్ని సాధించలేము. స్థానికుల అవగాహన ఇందుకు చానా తోడ్పడుతుంది. మంచిగా పని చేసే పాత తూముల స్థానంలో అక్కరలేకున్నా కొత్త తూములు కట్టడం, కట్టను బలంగ చెయ్యాలని మీద మట్టి కుప్పలు పోసి సరైన దిమ్మిస కొట్టకుపోవడం, కట్టకు రాతి కల్లులు (రివెట్మెంట్) కట్టకపోవడం, కాలువలకు అవసరమైన మరమ్మత్తులు సరిగ్గ చెయ్యకపోవడం లాంటి కొన్ని పొరపాట్ల వల్లనే చెరువుల పునరుద్ధరణ అనుకున్న స్థాయిలో ఇంత వరకు సాధ్యపడకపోవడానికి కొన్ని ప్రముఖ కారణాలు. ఎటువంటి మరమ్మత్తులు అవసరం, వాటి ప్రాధాన్యం ఏమిటనే విషయం నిర్ణయించడంలో వాడకందార్ల పాత్ర ఉంటే ఆ ప్రణాళిక పకడ్బందీగా ఉంటది. అందుకే ఈ విషయాలను వివరంగా చర్చించి మార్గదర్శకసూత్రాలు తయారు చెయ్యాలె.

చెరువుల పునరుద్ధరణలో సంస్థాగత అంశాలకు ప్రాధాన్యం ఉన్నది. చెరువు ప్రభావిత పరిధిలో ఆయకట్టు రైతులు, ప్రభావంలో ఉండే భూగర్భ జలాలు వాడుకునే రైతులు, చేపలు పట్టేవోళ్ళు, ఇటుక బట్టీలోళ్ళు, వొండు రు తోలుకునేటోళ్ళు, పశువుల కాపరులు, బట్టలు ఉతికెటోళ్ళు, ఫలసాయం హక్కున్న భూమి లేని నిరుపేదలు చానా మంది ఉన్నరు.

*– ఎన్పిఆర్*

# ఉపాధి హామీ పథకం – చెంచు సిబ్బందికి శిక్షణా కార్యక్రమం

ఉపాధి హామీ పథకం గురించి తెలుసుకుందాం.

### చట్టం - ఉద్దేశం

* నైపుణ్యం అవసరం లేని కూలీ పని చేయటానికి ముందుకు వచ్చిన జాబ్‌కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి ఒక సంవత్సరంలో 100 రోజులకు తక్కువ కాకుండా పని కల్పించడం, తద్వారా జీవనోపాధి భద్రతను కల్పించటం ఈ పథకం ప్రధాన ఉద్దేశం
* గ్రామీణ ప్రాంతాలలో చిరకాలం నిలిచి ఉండే ఉమ్మడి, సామాజిక, ఆర్థిక ఆస్తులను, మౌలిక సదుపాయాలను అభివృద్ధి పరచడం దీని రెండవ ఉద్దేశం.

### రాజీలేని అంశాలు

* పంచాయితీలో నమోదు చేసుకున్న ప్రతి కుటుంబానికి ఒక ఏడాదిలో 100 రోజుల కూలీ పని.
* ఒక వారంలో చేసిన పనికి రెండో వారంలో కూలీ చెల్లింపులు.
* ఆడా మగ తేడా లేకుండా సమాన కూలి.
* యంత్రాలు, కాంట్రాక్టర్లకు తావు లేకుండా కూలీలకు పని.
* గ్రామ సభలో గుర్తించి గ్రామ పంచాయతీ/మండల/జిల్లా పరిషత్ ఆమోదించిన పనులను చేపట్టడం.

### కూలీల హక్కులు

* జాబ్ కార్డు పొందడం మరియు జాబ్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఏడాదిలో 100 రోజుల పనిని పొందడం.
* పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు పొందడం (నీరు, నీడ, ప్రథమ చికిత్స పెట్టె, ఆయా).
* పని అడిగిన 15 రోజులలోపు పని కల్పించనిచో నిరుద్యోగ భృతి పొందడం.
* చేసిన పనికి ఆడ, మగ సమాన కూలీ పొందే హక్కు.



* స్మార్ట్ కార్డు లేదా పోస్టాఫీసు ద్వారా మధ్య దళారీలు లేకుండా నేరుగా కూలీ పొందే హక్కు.
* పని ప్రదేశం 5 కి.మీ. కంటే దూరం ఉంటే 10% అదనపు కూలీ పొందడం.
* పని ప్రదేశంలో దెబ్బలు తగిలితే ఉచిత వైద్యం పొందే హక్కు
* ఆసుపత్రిలో ఉండటానికి చికిత్స, ఉన్న రోజులకు మందులకు అయ్యే ఖర్చు పథకమే భరిస్తుంది. గాయపడిన వ్యక్తి మామూలుగా పనిచేస్తే వచ్చే వేతనం మొత్తంలో 50 శాతానికి తగ్గకుండా రోజువారీ భత్యం చెల్లిస్తారు.
* ఈ పథకం కింద పనిచేస్తున్న వ్యక్తి ని సమయంలో ప్రమాదం కారణంగా చనిపోయినా లేదా శాశ్వతంగా పని చేయలేని పరిస్థితి ఏర్పడినా నష్ట పరిహారం చెల్లిస్తారు. రూ. 50,000 ఈ మొత్తాన్ని చనిపోయిన వ్యక్తి వారసులకు, శాశ్వతంగా పనిచేయలేకుండా పోయిన వ్యక్తికి చెల్లిస్తారు.

## ప్రతికూల అంశాలు

* వేతన చెల్లింపులు ఆలస్యం అవటం
* కొన్ని ప్రాంతాలలో కనీస వేతనం కూడా రాకపోవటం
* కూలీలు కోరిన వెంటనే పని పొందలేకపోవటం
* పని కోరటం తమ హక్కు అనే విషయం చాలా మందికి తెలియకపోవటం. పనుల కోసం డిమాండ్ చేసే బదులు పని ఇచ్చే వరకు వేచి చూస్తున్నారు.
* స్థిరమైన ఆస్తులను ఏర్పాటు చేయలేకపోవటం వంటివి ఉన్నాయి.
* పనుల నాణ్యతగా లేకపోవటం.
* పథకంలో వార్షిక ప్రణాళిక తయారీలో ప్రజలు భాగస్వాములు కాకపోవటం.
* ఉపాధి హామీ పథకంలో వార్షిక ప్రణాళిక తయారు చేయటం అనేది కీలకమైన పని. గ్రామంలో ఒక ఆర్థిక సంవత్సరంలో ఎంతమంది కూలీ కుటుంబాలకు 100 రోజుల పని కల్పించవలసి ఉంటుంది. అందుకుగాను ఎన్ని నిధులు అవసరం అవుతాయి.

  100 రోజులు పని కల్పించేందుకు కావలసిన మొత్తం పనిదినాలు ఎన్ని, ఎన్ని పనులను గ్రామంలో గుర్తించటం ద్వారా 100 రోజుల పని అన్ని కుటుంబాలకు ఇవ్వగలం అనే ప్రణాళిక తయారీ ప్రతి సంవత్సరం తయారు చేసుకోవలసి ఉంటుంది. దాని వలన ముందుగానే పనులు మంజూరు చేయించుకొని, నిధులను సిద్ధపరచుకోవటానికి అవకాశం ఉంటుంది.
* ప్రణాళిక తయారు చేయనట్లయితే ఎన్ని కుటుంబాలు ఉన్నాయి, ఎన్ని రోజులు పని కల్పించవలసి ఉంటుంది. అందుకుగాను గుర్తించవలసిన పనులను ఎన్ని అని ముందు గుర్తించనట్లయితే కూలీలకు కోరిన వెంటనే పనులు ఇచ్చేందుకు పనులు



అందుబాటులో వుంటాయి. అందువలన ప్రతి సంవత్సరం ప్రణాళిక తయారు చేసుకుని ముందుకు వెళ్ళాలి.

## లేబర్ బడ్జెట్ అంటే

గ్రామంలో జాబ్‌కార్డు పొందిన ప్రతికూలి కుటుంబం ఒక ఆర్థిక సంవత్సరంలో 100 రోజులు పని పొందాలంటే ఆ గ్రామానికి ఎంత డబ్బు (నిధులు) సంవత్సరానికి అవసరం అవుతుందో, ఎన్ని పనిదినాలు కావాలో అంచనా వేసేదే లేబర్ బడ్జెట్. ఈ లేబర్ బడ్జెట్ కుటుంబం వారీగా తయారు చేయవలసి వుంటుంది.

***తయారీ విధానం :*** గ్రామంలో పని కోరే కూలీ కుటుంబాల సంఖ్య సరాసరి రోజులు 281 (ఒక పని దినానికి కనీస వేతనం రూ. 169 మరియు ఇతర ఖర్చులు అన్ని కలిపి) లేబర్ బడ్జెట్.

గ్రామంలో పని కోరుతూ కూలీ కుటుంబాల సంఖ్యను తీసుకునేందుకు శ్రమశక్తి సంఘంలోని కుటుంబాల సంఖ్య తాత్కాలిక శ్రమశక్తి సంఘాలలోని కుటుంబాల సంఖ్య వికలాంగుల శ్రమ శక్తి సంఘాలలోని కుటుంబాల సంఖ్య పని కోరే ఇతర కూలీ కుటుంబాల సంఖ్యల మొత్తంగా తీసుకోవాలి.

***పనులు గుర్తింపు***: ఒక ఆర్థిక సంవత్సరంలో తయారు చేసుకున్న లేబరు బడ్జెట్ ప్రకారం 100 రోజుల పనిదినాలను కూలీలకు కల్పించేందుకు కావలసిన పనులు గ్రామంలో గుర్తించాలి.

***గ్రామ సభలో ఆమోదం***: లేబర్ బడ్జెట్‌కు కావలసిన పనులను గుర్తించిన తరువాత గుర్తించిన పనులను గ్రామస్థులందరికీ తెలియచేపి గ్రామ సభ ఆమోదం పొందాలి.

***ఎస్టిమేట్స్ తయారీ***: గ్రామ సభలో ఆమోదం పొందిన పనులకు ఒక్కో పనికి ఎంత ఖర్చు అవుతుంది. ఎన్ని రోజులు పని చెయ్యాలి అనే అంచనాలు వేయాలి. అంచనా వేసిన పనులను జిల్లా స్థాయి అధికారులకు పంపవలసి ఉంటుంది.

***పనుల మంజూరి***: జిల్లా స్థాయిలో అధికారులు ఆమోదించిన పనుల ను మాత్రమే గ్రామంలో చేయవలసి ఉంటుంది. అలా మంజూరు చేసిన పనులను పనుల అరలో ఉంచుతారు. ఆ పనులను 'షెల్ఫ్ ఆఫ్ వర్క్స్' అంటారు.

## సమగ్ర భాగస్వామ్య ప్రణాళిక ప్రక్రియ ఆవశ్యకత, తయారీ విధానం

- ★ గ్రామంలో స్థితిగతులేమిటో, తమ సమస్యలేమిటో, సమస్యలు పోవడానికి ఎవరేమి చేయాలో, పరిస్థితి మెరుగుపడటానికి ఎలాంటి పరిష్కారాలు అవసరమో అనేది ఎవరో బయటివాళ్ళ కన్నా ఆ గ్రామ ప్రజలకే ఎక్కువ తెలుసు.
- ★ అందుకనే ప్రజల అభివృద్ధి కోసం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలలో ప్రజల భాగస్వామ్యంతో చేసే అభివృద్ధి ప్రణాళికల అవసరాన్ని, వాటి ప్రాధాన్యతను ప్రభుత్వాలు గుర్తించాయి. గ్రామీణాభివృద్ధిలో భాగస్వామ్య ప్రణాళికలు చాలా కీలకనున్న విషయాన్ని ప్రభుత్వాలు అర్థం చేసుకున్నాయి.
- ★ అయితే ఈ ప్రణాళకల తయారీ ప్రక్రియలో సాంకేతిక నిపుణుల పరిజ్ఞానం, వారి నైపుణ్యాలు అవసరమవుతాయి. ఇలాంటి పనులు చేసినవారి అనుభవం ఉపయోగపడుతుంది.
- ★ ఒక గ్రామం లేదా పంచాయతీ స్థాయిలో ఉపాధి హామీ పథకపు పనుల ప్రణాళికను తయారు చేసే బాధ్యత ఆ గ్రామ ప్రజలు లేదా పంచాయితీ ప్రజలది.
- ★ ఉపాధి హామీ చట్టంలోనూ, సంబంధిత మార్గదర్శక సూత్రాలలోనూ, భాగస్వామ్య ప్రణాళిక ప్రక్రియ అవసరం వార్షిక ప్రణాళికలు, కూలీల బడ్జెట్ ప్రజల భాగస్వామ్యంతో రూపకల్పన చేయాలని సూచించటం జరిగింది.
- ★ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రణాళిక ప్రక్రియలో ప్రజల భాగస్వాయం మరింతగా పెంచడానికి చేస్తున్న ప్రయత్నమే సమగ్ర భాగస్వామ్య ప్రణాళిక ప్రక్రియ (ఐ.పి.పి.ఇ.)

## కలిగే ప్రయోజనాలు

- ★ తమ పరిస్థితిని, సమస్యలను, స్థితిగతులను అర్థం చేసుకునే రీతిలో ప్రజలను సమీకరిస్తుంది. తమ సమస్యలను వారే పరిష్కరించుకునేలా చేస్తుంది. వారికున్న హక్కులు, ప్రయోజనాలపై అవగాహన పెంచుతుంది.
- ★ ప్రణాళికా అవకాశాలపై ప్రజలకు సమాచారం అందిస్తూ, వ్యక్తిగత స్థాయిలోనూ, ఉమ్మడిగానూ తమ అభివృద్ధి అవసరాలను గుర్తించి, స్థానిక అవసరాలకు తగినట్టు స్థానిక అభివృద్ధి ప్రణాళికలను, వ్యూహాలను రూపొందించి, వాటిని అమలు చేసుకోవడానికి వీలు కల్పిస్తుంది.
- ★ అవసరమైన నియమాలు, ప్రయోజనాలు అందుకోడానికి ప్రమాణాలు, నిధుల సమర్ధ వినియోగం ప్రాధాన్యతల నిర్ణయం వంటి అంశాలపై ఉమ్మడి నిర్ణయాలకు అవకాశం ఇస్తుంది.
- ★ సులువుగా అర్థం అయ్యే పద్ధతులు, చురుకుగా పాలుపంచుకునే తీరుకు ప్రోత్సాహం వంటి అంశాల ఆసరాగా ప్రజలను ప్రణాళిక ప్రక్రియలో మరింత మమేకమయ్యేలా చేస్తుంది.
- ★ ప్రజలలో ఉండే విభిన్న వర్గాల అవసరాలను, ఆలోచనలను ప్రతిబింబిచండానికి, వినడానికి అవకాశం కల్పించడం ద్వారా ఆయా వర్గాల మధ్య పరస్పర అవగాహనను, నమ్మకాన్ని పెంచడానికి వీలు కల్పిస్తుంది.
- ★ ఏ అంశంపైనైనా నిర్ణయాలు ఉమ్మడిగా తీసుకోవడం, ఆ ప్రతిపాదనలు, నిర్ణయాలపై ప్రతి ఒక్కరూ తమ అభిప్రాయాలను, విమర్శను తెలియచేయడానికి అవకాశం ఉన్నందున పారదర్శకత పెరగడానికి సాయపడుతుంది.
- ★ ఇది ఒక్కసారి కలసి కూర్చుని చేసే ప్రక్రియకు పరిమితం కాదు, నిర్ణయాల అమలులోనూ ప్రజల భాగస్వామ్యానికి, ప్రజల పర్యవేక్షణకు వీలు కల్పించే దీర్ఘకాలిక భాగస్వామ్య ప్రక్రియ.
- ★ కేవలం ప్రణాళికల తయారీకి మాత్రమే పరిమితం కాకుండా, దానికి మించి అవసరమైన నైపుణ్యాలను అందించే ప్రక్రియ ఇది సమావేశాలు నిర్వహించుకోవడం, వివరాలను విశ్లేషించుకోవడం, వ్యూహాత్మక ప్రణాళికలను రూపొందించుకోవడం వంటి అంశాలపరంగా ప్రజలకు తగిన అవగాహన కల్పిస్తుంది. ఒక విధంగా ఇది, ప్రజలను గ్రామ స్థాయి రిసోర్స్ పర్సన్‌గా, నాయకులుగా ఎదిగేలా చేస్తుంది.
- ★ కొద్దిమంది నియంత్రణలో ఉండే అభివృద్ధి ప్రణాళికా ప్రక్రియను ఎక్కువ మంది ప్రజల చేతుల్లోకి వెళ్ళేలా చేస్తుంది. అభివృద్ధి ప్రణాళికను ప్రజలు స్వంతం చేసుకునేలా చేస్తుంది.
- ★ ప్రజల ఉమ్మడి నిర్ణయాల ఆధారంగా రూపొందించబడతాయి కాబట్టి, ప్రాజెక్టుల పట్ల ప్రజల విశ్వసనీయత పెరుగుతుంది.
- ★ సమగ్రరీతిలో ఇంటింటి ప్రచారం చేస్తారు. ఎస్‌సిలు, ఎస్‌టిలు, మహిళలు, వైకల్యం ఉన్న వ్యక్తులు, ఇతరత్రా ఆటుపోట్లకు గురయ్యే వాళ్లు ఉపాధి పని డిమాండు చేసేలా ప్రోత్సహిస్తారు.

## ఈ ప్రణాళికా ప్రక్రియను ఎవరు నిర్వహిస్తారు ?

సమగ్ర భాగస్వామ్య ప్రణాళికా ప్రక్రియ విజయవంతం కావడం అనేది అందులో పాల్గొనే కీలక భాగస్వామ్యంతో కూడిన ప్రణాళికా ప్రక్రియ కాబట్టి ఇందులో ప్రతి ఒక్కరికీ ఫెసిలిటేషన్ పాత్ర ఉంటుంది.

- ★ పంచాయితీ సంస్థల ప్రతినిధులు
- ★ శ్రమశక్తి సంఘ సభ్యులు / సమాఖ్యల ప్రతినిధులు, కూలీలు
- ★ ఉపాధి హామీ పథకపు సిబ్బంది / కార్యకర్తలు
- ★ ప్రణాళికా బృంద సభ్యులు
- ★ డిపిసి చేత నియమించబడిన పరిశీలకులు
- ★ గ్రామ పంచాయితీ స్థాయిలో ఇతర నివాసితులు ప్రత్యేకించి మహిళలు, ఆటుపోట్లుకు గురయ్యేవాళ్లు.

## సామాజిక పటం వేసే విధానం, ఉపయోగం

- ★ సామాజిక చిత్రపటం / సోషల్‌మ్యాప్ అనేది స్థానిక ప్రజలు గీసే ఒక చిత్రపటం. ఇందులో వారి వారి ఇండ్లు, సంస్థలు, స్థానికంగా ఉన్న మౌలిక సదుపాయాలను గుర్తిస్తారు.
- ★ ఆయా కుటుంబాల మధ్య ఉండే సామాజిక, ఆర్థిక వ్యత్యాసాలను

ఈ చిత్రపటం ద్వారా అర్థం చేసుకోవచ్చు.

- ★ సామాజిక చిత్రపటం ద్వారా గ్రామ స్థాయిలో ఆయా ప్రాంతాల వారీగా ఉన్న విభిన్న సామాజిక వర్గాలు / కుటుంబాలు, వారికున్న సమస్యలు, స్థాయి వంటి సమాచారం తెలుస్తుంది.
- ★ సామాజిక చిత్రపటంలో ఆ ప్రాంతంలో ఉన్న మౌలిక సదుపాయాలు, రోడ్లు, ఆసుపత్రులు, సంస్థలు, ప్రధానమైన సంస్థలను కూడా గుర్తించవచ్చు.
- ★ ఈ చిత్ర పటాన్ని రూపొందించిన తరువాత, తీవ్ర సమస్యలు/ ఆటుపోట్లు ఉన్న చర్చలు జరపాలి.
- ★ ఉపాధి హామీ పథకం అమలును పటిష్టపర్చడం ద్వారా, ఉపాధి కల్పన, వారి కుటుంబాలకు స్వల్పకాలికంగానూ, దీర్ఘకాలికంగానూ సమస్యలు తగ్గించి పరిశీలించాలి.

## వనరుల పటం వేసే విధానం, ఉపయోగం

- ★ సామాజిక చిత్రపటం ఒక గ్రామానికి సంబంధించిన మానవ వనరుల సమాచారాన్ని అర్థం చేసుకోవడానికి ఎలా పనికివస్తుందో, అలాగే వనరుల చిత్రటం ఆ గ్రామ హద్దుల పరిధిలో భౌతిక వనరులను అర్థం చేసుకోవడానికి ఉపయోగపడుతుంది.
- ★ వనరుల పటం గ్రామంలోని భూమి, నీటి వనరులను, వాటి భౌగోళిక తీరుతెన్నులను, వాటి వినియోగానికి సంబంధించిన సమాచారం అందిస్తుంది. భూమి కింద వ్యవసాయ భూమి, పండ్లతోటలు, అడవి, మేత ప్రాంతం వంటి వాటితో పాటు స్థానికంగా ఇతరత్రా వినియోగంలో ఉన్న భూమి వివరాలు ఉంటాయి.
- ★ నీటి వనరులను సంబంధించి గ్రామ పరిధిలోని బావులు, కుంటలు, చెరువులు, కాలువలు, వాగులు, బోరుబావులు వంటి విభిన్న కేటగిరీలకు చెందిన వనరుల సమాచారం ఉంటుంది. ఈ వనరులకు సంబంధించిన రిడ్జి లైన్లు, డ్రైనేజీ తీరుతెన్నుల వివరాలతో పాటు అది ఎగువ ప్రాంతమా, దిగువ ప్రాంతమా వంటి సమాచారం కూడా వనరుల చిత్రపటంలో ఉంటుంది.
- ★ ప్రైవేటు భూములకు సంబంధించి వాటి వినియోగం/ఉత్పత్తి తీరు ఉదాహరణకు వ్యవసాయం, పండ్లతోటలు, మేత వనరులు వంటివి ఉమ్మడి వనరులకు సంబంధించి వనరుల తీరు చిత్రపటంలో సమాచారం పొందవచ్చు. ఈ పటం వలన ఏ ఏ పనులు చేపట్టవచ్చో తెలుస్తుంది.

## సీజనల్ పటం చేసే విధానం, ఉపయోగం

- ★ గ్రామాలలో ప్రజల జీవనం, వారి బ్రతుకుతెరువులు కాల పరిస్థితుల పై ఆధారపడి ఉంటాయి. సీజన్‌ల వారీగా మారుతూ ఉంటాయి. కొన్ని సీజన్‌లలో వ్యవసాయ పనులతో పాటు కూలీ పనులు కూడా విరివిగా దొరుకుతాయి.

  కొన్ని సీజన్‌లలో కొన్ని రకాల అటవీ సంపదపై లేదా ఉమ్మడి వనరులు అందించే ఫలసాయంపై ఆధారపడతారు. ఒక సీజన్‌లో అసలు ఉపాధి హామీ పథకం పనుల అవసరం తక్కువగా ఉంటుంది. మరో సీజన్‌లో అటు వ్యవసాయ పనులు ఉండవు, ఇటు అటవీ లేదా ఉమ్మడి వనరుల ఫలసాయం దొరకదు. ఇటువంటి పరిస్థితుల్లో ఉపాధి హామీ పథకం పనుల అవసరం చాలా ఉంటుంది.

  కొన్నిసార్లు మామూలు వ్యవసాయ సీజన్‌లో కూడా అంతగా పనులు ఉండవు. అందువలన మీ గ్రామంలోని పరిస్థితిని బట్టి ఏ కాలంలో ఉపాధి పనులు కావాలో గుర్తించేందుకు ఈ పటం వాడటం జరుగుతుంది.

## ఇంటింటి సర్వే ఫార్మెట్, సేకరణ విధానం, ఉపయోగం

గ్రామంలో నివాసం వుంటున్న అన్ని కుటుంబాలకు ఉపాధి పనుల అవసరాన్ని అంచనా వేయడానికి ఇంటింటి సర్వే చేపట్టాల్సి ఉంటుంది. ఏ ఒక్క ఇంటిని కూడా వదలకుండా, సమగ్ర స్థాయిలో ఈ సర్వేను చేపట్టాలి. ఈ సర్వే వలన గ్రామంలోని కుటుంబాల స్థితిగతులు తెలుస్తాయి.ఉపాధి హామీ పనులు ఎవరికి అవసరమో గుర్తించి పనికి దరఖాస్తు పెట్టించి పని కేటాయించవచ్చు. ఇంటింటి సర్వే చేపట్టే ముందు ఈ క్రింది జాబితాను సమకూర్చుకోవాలి.

- ★ జాబ్ కార్డుదారుల జాబితా
- ★ జనాభా గణన లెక్కల ప్రకారం ఇండ్ల జాబితా
- ★ బిపిఎల్ కుటుంబాల జాబితా
- ★ ఆంత్యోదయ కుటుంబాల జాబితా
- ★ వృద్ధాప్య, వితంతు, వైకల్య పెన్షన్‌లు పొందుతున్న వారి జాబితా
- ★ ఇందిరా ఆవాస యోజన లబ్ధిదారుల జాబితా (గత పదేళ్లలో లబ్ధి పొందిన వారు)
- ★ అటవీ హక్కుల చట్టం ప్రయోజనం పొందినవారి జాబితా

## పథకంలో చేయదగిన పనులు-వాటి వివరాలు

- ★ కుటుంబాల ఆవాస స్థాయిలో వ్యక్తిగత పనులు

  (ఉదాహరణకు : మేకల షెడ్లు, కంపోస్టు గుంత, ఇంటిలో మరుగుదొడ్డి నిర్మాణం వంటివి)
- ★ సామాజిక మౌలిక సదుపాయాలకు సంబంధించిన పనులు

  (ఉదాహరణకు : డ్రైనేజి లైన్, ఇంకుడు గుంతలు, స్కూళ్లలో మరుగుదొడ్ల నిర్మాణం)
- ★ వ్యక్తిగత భూముల అభివృద్ధి పనులు

  (ఉదాహరణకు : ఫారంపాండ్, బావి తవ్వకం, పొలం గట్లు వంటివి)
- ★ ఉమ్మడి భూమి, అటవీ అభివృద్ధి పనులు

  (ఉదాహరణకు : రోడ్డు పక్కల మొక్కలు / చెట్లు పెంపకం, మేత వనరుల అభివృద్ధి, గల్లీ ప్లగ్ పనులు వంటివి)
- ★ సాముదాయిక నీటి సంరక్షణ కట్టడాలకు సంబంధించిన పనులు (ఉదాహరణకు : చెక్‌డ్యాం, ఉమ్మడి చెరువు, ఫీల్డ్ ఛానల్స్ వంటివి) చేపట్టాలి.

*- టి.ఎం.కె. గాంధీ, ఫ్యాకల్టీ, సిఎన్ఆర్ఎం*

**గ్రామ పంచాయితీలు నిర్వహించవలసిన విధులలో అతి ముఖ్యమైనది పారిశుద్ధ్య నిర్వహణ. పారిశుద్ధ్యం అనే పదం చాలా విస్తృతమైనది. ఇందులో వ్యర్థాల నిర్వహణ ఒక ముఖ్య అంశం. గ్రామాలు కావచ్చు. పట్టణాలు కావచ్చు నేడువాటి ముందున్న ప్రధాన సమస్య పేరుకుపోయే వ్యర్థాలను ఎలా నిర్వహించాలన్నదే.**

### వ్యర్థాలు వ్యర్థాలేనా ?

నిజానికి వ్యర్థాలు పూర్తిగా నిరుప యోగం కావు వాటిని సరిగా వినియోగించు కుంటే ఇతరత్రా మంచి వనరులు ఉత్పన్నమయ్యే ఘన వ్యర్థాలలో ఎక్కువభాగం కుళ్ళే స్వభావం ఉన్నవే. వాటి నుండి మీథేన్ గ్యాస్‌ను ఉత్పత్తి చేయవచ్చు. జీవ సంబంధిత ఎరువులను తయారు చేయవచ్చు.

కుళ్ళని స్వభావం వున్న వ్యర్థాలను పున:ఉత్పత్తికి వినియోగి ంచి కొత్త వస్తువులను తయారు చేయవచ్చు. అందుకే వ్యర్థాలు మంచి వనరులు.



# గ్రామ పంచాయితీలలో వ్యర్థ పదార్థాల నిర్వహణ

★ *ఘన వ్యర్థాల నిర్వహణ విషయంగా ప్రస్తుతం గ్రామ పంచాయితీలు ఎదుర్కోంటున్న సమస్యలేమిటి?*

ఘనవ్యర్థాలు ప్రతి ఇంటా ఉత్పన్నమౌతాలు. కనుక ఇంటింటా ఉత్పన్నమైన వ్యర్థాలను ఒక క్రమ పద్ధతిలో సేకరించి, వాటిని అనువైన



ప్రదేశానికి తరలించి, వ్యర్థాలను వదిలి పెట్టడం సాధారణంగా జరిగే ప్రక్రియ. కాని ఈ ప్రక్రియ సజావుగా జరగాలంటే –

☆ చెత్తను సేకరించేందుకు రోజువారీ కూలీలు కావాలి.

☆ చెత్తను తరలించేందుకు ట్రై సైకిళ్ళు లేక ట్రాక్టర్లు కావాలి.

☆ చెత్తను వదిలి వేసే ప్రదేశం నుండి వచ్చే (డంపింగ్ యార్డ్) దుర్గంధం, కీటకాలు గ్రామంలోనికి చేరకుండా చూసుకోవాలి.

☆ కొన్ని గ్రామ పంచాయితీలలో చెత్తకు నిప్పంటించడం ద్వారా సమస్యను పరిష్కరించాల నుకోంటూ నిప్పంటిస్తుంటారు. కాని తద్వారా గాలి కాలుష్యాని సృష్టించడంతోపాటు అగ్ని ప్రమాదాలకు కూడా అవకాశముంది. కనుక అట్టి చర్యలకు దూరంగా ఉండేలా చూసుకోవాలి.

ఈ విధంగా వ్యర్థాల నిర్వహణ సజావుగా జరగాలంటే,

గ్రామ పంచాయితీ తనకున్న ఆదాయంలో ఎక్కువ శాతం చెత్త సేకరణకే ఖర్చుపెట్టాల్సి ఉంటుంది.

***గమనిక:*** మన గ్రామ పంచాయితీలలో సంవత్సరానికి 50,000 రూపాయిల నుండి 1 లక్ష రూపాయిల లోపు వార్షిక ఆదాయం ఉన్న గ్రామ పంచాయితీల సంఖ్య నాల్గింట మూడు వంతులు.

### ★ *గ్రామ పంచాయితీలు తక్కువ ఖర్చుతో, సమర్థవంతంగా చెత్తను నిర్వహించుకోవడం ఎలా సాధ్యం?*

మనలో చాలా మంది ఇదెలా సాధ్యం అనుకుంటాం, కానీ ఇది సాధ్యమే. దీనికై మనం మూడు పద్ధతులు అమలుపరచాలి. అందులో అతి ముఖ్యమైనది మొదటిది – మన గ్రామంలో చెత్త ఉత్పత్తినే తగ్గించుకోవడం, తదుపరి రెండవది – పున:వినియోగం, పునరుత్పత్తికి కావలసిన చర్యలు చేపట్టడం, చివరిగా మూడవది – కంపోస్టింగ్.



### 1. చెత్త ఉత్పత్తిని తగ్గించుకోడానికి చర్యలు

గ్రామ పంచాయితీ ముందుగా దృష్టి సారించవలసిన అంశం చెత్తను ఏ మేరకు తగ్గించగలం అన్న అంశం. అందుకు చెత్త ఉత్పత్తి అయ్యే ప్రాథమిక స్థానం కుటుంబాలు / గృహాలు కనుక, గృహస్తులు మనకు ముఖ్యమైన పాత్రధారులు. చెత్త తగ్గించుకోవాలనుకోనే పక్రియ గృహస్థాయి నుండి మొదలుపెట్టాలి.

అంటే గ్రామస్తులకు చెత్తపై మంచి అవగాహన రావాలి. అందుకై గ్రామ స్థాయిలో విరివిగా అవగాహనా సమావేశాలు ఏర్పాటుచేయాలి. ఈ సమావేశాలలో చెత్తను తగ్గించుకొనే వివిధ మార్గాల గురించి బాగా ప్రచారం చేయాలి. ఉదాహరణకు :

- ❑ ప్రతి ఒక్కరూ గుడ్డ/ జనపనారతో చేసిన చేతి సంచులను ఉపయోగించుకోవాలి.
- ❑ తక్కువ ప్యాకేజింగ్ ఉన్న వస్తువులను కొనుగోలు చేయాలి. ఉదా: సామూహికంగా బియ్యం, పప్పులు, పంచదార మొదలైన నిత్యావసర వస్తువులను కొనుగోలు చేయడం ద్వారా, తక్కువ ధరకే వస్తువులు లభించడంతో పాటు, వ్యర్థాలు తగ్గుతాయి.
- ❑ తిరిగి వాడడానికి వీలయిన వస్తువులనే కోనుగోలు చేయడం. ఉదా: పెట్ బాటిళ్ళు, మొదలైనవి.
- ❑ అవసరమైన మేరకే వస్తువులను/ఆహార పద్ధారాలను కోనుగోలు చేయడం లేదా తయారు చేయడం జరగాలి. ఈ దిశగా ప్రజలలో అవగాహన కల్పించి, అమలుకై నిరంతర పర్యవేక్షణ చేయాలి.

### 2. మరలా ఉపయోగించడం తిరిగి తయారికి వాడడం

గృహాలలో ఉత్పన్నమైన వ్యర్థాలను తిరిగి వాడడం, పున:తయారీకి ఉపయోగించాడనికై ప్రజలను సమాయాత్తం చేయాలి. ఈ దిశగా ప్రజలందరూ –

- ❑ ఒకరికి వ్యర్థం అనేది, మరోకరికి అవసరంకావచ్చు. కనుక, అలా ఉపయోగపడే వ్యర్థాలను గుర్తించి వినియోగం దిశగా మరల్చాలి.
- ❑ తిరిగి వినియోగించడానికి వీలున్న వసు–్తవులను మరలా మరలా వాడాలి.
- ❑ ఇండ్లలో వచ్చే చెత్తను గృహాస్తులు గ్రామపంచాయితీ ఏర్పరచిన కట్టుబాట్లు, నియమ నిబంధనల ప్రకారం నిర్వహించుకోవాలి.
- ❑ దగ్గరలోని రీ–సైక్లింగ్ యూనిట్‌కు తగు వ్యర్థాలను తరలించడం. ఉద్దా వేస్ట్ పేపర్ రీసైక్లింగా యూనిట్, ప్లాస్టిక్ రీసైక్లింగ్ యూనిట్, వంటివి అనుసరించేలా ప్రజలను సంసిద్ధులను చేయాలి.

### 3. కంపోస్టింగ్

గ్రామాలలో వచ్చే ఘన వ్యర్థాలలో 80% పైగా కుళ్ళే వ్యర్థాలే. ఉదా: వంటగది నుండి వచ్చే చెత్త, పెరటి తోట నుండి వచ్చే చెత్త, పశువుల పాకల నుండి వచ్చే చెత్త మొదలైనవి.

ఇట్టి వ్యర్థాలను సమర్థవంతంగా నిర్వహించుకోనేందుసుగాను, వీలయినంత వరకు గృహాస్థాయిలో ఎరువు గుంతలు / వర్మీ కంపోస్ట్ యూనిట్‌లు నెలకొల్పుకునేందుకు కావలసిన సాంకేతిక, ఆర్థిక సహాయ సహకారాలు. అందించడం ద్వారా, సేంద్రీయ ఎరువుల తయారీకి పునాదులు వేయాలి.

ఇట్టి చర్యల ద్వారా గ్రామ స్థాయిలో వచ్చే చెత్తను తగ్గించుకోని, భారాన్ని తగ్గించుకోవడం ద్వారా చెత్త నిర్వాహణను తక్కువ ఖర్చుతో సమర్థవంతంగా నిర్వహించేందుకు అవకాశం ఏర్పడుతుంది.

***– పి. మాధురి,*** *ఫ్యాకల్టీ, సిడబ్ల్యూఎస్*

# 'కీన్ వా' పంటను పరిచయం చేసిన 'టిసిపార్డ్'




**దేశంలోని క్షామ, దుర్భిక్ష ప్రాంతాలలో కూడా పంటలను పండించగలిగినపుడు ఆహార భద్రతకు డోకా వుండదని మేధావులు చెపుతుంటారు. అలాంటి పంటలను పండించిన రాష్ట్రాలు, దేశాలు మిగులు పంటలను విదేశాలకు ఎగుమతి చేసి అతి విలువైన విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించవచ్చు. రైతులకు అపారమైన ఆదాయం లభించి, సాగు పట్ల మక్కువ పెంచుకుంటారు. దేశానికి, రాష్ట్రానికి ఆర్థిక బలం చేకూరుస్తారు. అలాంటి పంటనొకదాన్ని 'టిసిపార్డు' మన రాష్ట్రానికి పరిచయం చేసిన ఘనతను దక్కించుకుంది .**

ఆహార కొరతను తీర్చుతూ, ఆరోగ్యాన్ని పెంచుతూ, ఆర్థికాభివృద్ధికి తోడ్పడేదే 'కాన్‌వా' పంట. అధిక ఆదాయం ఇవ్వటమే కాక, అత్యంత పోషక విలువలు కలిగిన అద్భుత చిరుధాన్యం కీన్‌వా. అందుకే దీన్ని ఆహార పంటల్లో 'క్వీన్' (రాణి)గా అభివర్ణిస్తుంటారు. అలాంటి అత్యద్భుత పంటను ఆంధ్రప్రదేశ్‌కు పరిచయం చేసిన ఘనత టిసిపార్డ్ మాజీ కమీషనర్ శ్రీ చంద్రమౌళికి దక్కుతుంది.

రాష్ట్రంలోని కొన్ని జిల్లాలు నీటి వసతి లేక అలమటించే ప్రాంతాలు ఉన్నాయి. వేలాది ఎకరాలను బీడులుగా వుంచేయటం వల్ల తరచుగా కరువు కరాళనృత్యం చేస్తుంటుంది. క్షామాలకు నిలయమైన నీటికొరత వున్న ప్రాంతాలలో సాగుకు అనువైన వంగడాల కోసం ప్రభుత్వాలు, మేధావులు పలు ప్రయత్నాలు చేశారు.

ప్రపంచ ఆహార వ్యవసాయ సంస్థ క్షామ ప్రంతాలలో సాగుకు అనువైనదిగా కీన్‌వాను గుర్తించింది. దీని ఫలితలను అంచనా వేసి 2013 సంవత్సరాన్ని 'అంతర్జాతీయ కీన్‌వా సంవత్సరం'గా ప్రకటించింది. అలాంటి ప్రాధాన్యత గల కీన్‌వా మన రాష్ట్రానికి పరిచయం చేసిన కీర్తి హైదరాబాదులోని అపార్డుకు దక్కింది. ఇది గడ్డి జాతి పంట. ప్రపంచ వ్యాప్తంగా 360 కీన్‌వా రకాలు వున్నాయి. మన దేశంలో 3 రకాలు వాడుకలో వున్నాయి.

2011లో అపార్డుకు కమీషనరుగా వున్న శ్రీ చంద్రమౌళి ఆ మూడు రకాలు రాష్ట్రానికి తెప్పించారు. 'నేషనల్ బ్యూరో ఆఫ్ ప్లాంట్ జెనిటిక్ రిసోర్స్' ద్వారా సాగుకు ప్రయత్నించారు. కీన్‌వా విత్తనాలను క్షామ పీడిత ప్రాంతాల రైతులకు అందించి సాగును ప్రోత్సహించారు. కేవలం వర్షాధారంగానే పెరుతుందనుకున్న ఈ కీన్‌వా ఇపుడు ఆరుతడి పంటగా కూడా పండించవచ్చని కోస్తా ప్రాంతంలో రైతులు రుజువు చేస్తున్నారు.

పశ్చిమగోదావరి జిల్లా కృష్ణాపురంకు చెందిన ఉండవల్లి త్రిమూర్తులు గత ఏడాది ఒక ఎకరంలో కీన్‌వాను సాగు చేశారు. ఎకరానికి 5 క్వింటాళ్ళ దిగుబడి వచ్చింది. మంచి ధర కూడా లభించింది. కిలో ఆరు వందల రూపాయలకు అమ్మారు. అంటే ఎకరంలో ఆదాయం సుమారు మూడు లక్షల రూపాయలు. అంతకు ముందు పొగాకు పండించి, సరైన దిగుబడులు

**ఇతర చిరుధాన్యాలకు, కీన్‌వాకు పోషక విలువలలో ఉన్న తేడా**

| పంట | నీటి శాతం | మాంసకృత్తులు | నూనె | పిండి పదార్థం | పీచు పదార్థం | బూడిద తవుడు |
|---|---|---|---|---|---|---|
| కీన్‌వా | 12.6% | 13.8% | 5.0% | 59.7% | 41% | 3.4% |
| బార్లీ | 9.0% | 147% | 1.1% | 67.8% | 2.0% | 5.5% |
| మొక్కజొన్న | 13.5% | 8.7% | 3.9% | 70.9% | 1.7% | 1.2% |
| జొన్న | 11.0% | 11.9% | 4.0% | 68.6% | 2.0% | 2.0% |
| సజ్జ | 13.5% | 11.1% | 4.6% | 57.6% | 0.3% | 2.9% |
| బియ్యం | 11.0% | 7.3% | 0.4% | 80.4% | 0.4% | 0.5% |
| గోధుమలు | 10.9% | 13.0% | 1.6% | 70.0% | 2.7% | 1.8% |

## ఇతర చిరుధాన్యాలకు, కీన్‌వాకు లవణాలలో ఉన్న తేడా

| పంట | కాల్షియం | భాస్వరం | మెగ్నీషియం | పొటాషియం | సోడియం | ఐరన్ | కాపర్ | మాంగనీస్ | జింకు |
|---|---|---|---|---|---|---|---|---|---|
| కీన్‌వా | 0.19% | 0.47% | 0.26% | 0.87% | 1.15% | 20.5% | 67% | 12.8% | 50% |
| బార్లీ | 0.08% | 0.42% | 0.12% | 0.86% | 200 | 50 | 80 | 16 | 15% |
| మొక్కజొన్న | 0.07% | 0.36% | 0.14% | 0.39% | 900 | 21 | - | - | - |
| గోధుమలు | 0.05% | 0.26% | 0.16% | 0.52% | 900 | 50 | 7 | - | 14% |

లేక, గిట్టుబాటు ధర రాక నష్టాలను చవిచూసిన ఆయనకు కీన్‌వా ఆశ్చర్యకరమైన ఆదాయాన్నిచ్చింది. ఈ ఏడాది 16 ఎకరాల్లో కీన్‌వాను సాగుచేసి. పలు జిల్లాల రైతుల్ని ఆకర్షించారు.

ప్రస్తుతం అదే పంట కోత దశకు వచ్చేసింది. ఎకరానికి అయిదు క్వింటాళ్ళకు తగ్గకుండా దిగుబడి వచ్చే స్థితిలో వుందని రైతు చెబుతున్నారు. ఆయన కుమారుడు కేదార్‌నాథ్ చౌదరి యం.బి.ఎ. పూర్తి చేశారు. ఉద్యోగంపై దృష్టి సారించకుండా, వ్యవసాయంలోనే కొనసాగుతూ తండ్రికి సాయపడుతున్నాడు. కీన్‌వా గురించి తెలుసుకుంది కూడా కొడుకు ద్వారానే.

కీన్‌వా గురించి తెలుసుకోటానికి ఇంటర్‌నెట్ సదుపాయం బాగా ఉపయోగపడుతుంది. దీనికున్న ప్రత్యేకతలు, ప్రాధాన్యతలు, డిమాండ్‌లు అన్నీ ఇంటర్‌నెట్ ద్వారా క్షుణ్ణంగా తెలుసుకోవచ్చు. కీన్‌వా కొనుగోలు సంస్థలు ఉన్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో వుండే డిమాండ్‌ను పరిశీలిస్తే, కిలో వెయ్యి రూపాయలు ధర కూడా లభించవచ్చు.

### సాగు విధానాలు

కీన్‌వా వర్షాధారంగా పండే పంటని చెబుతున్నప్పటికీ, ఆరుతడిగా నీరు అందించినపుడు మంచి దిగుబడినిస్తుంది. కాబట్టి 10, 15 రోజులకొకసారి నీరు అందించే అవకాశం ఉన్నా ప్రాంతంలో దీన్ని నిర్భయంగా సాగు చేయవచ్చు. మంచి దిగుబడిని సాధించవచ్చు. సారవంతమైన భూముల్లో దాన్ని సాగుచేసిపుడు ఎరువుల ఖర్చు తగ్గి, సాగు వ్యయం పరిమితంగా ఉంటుంది. మెత్తటి దుక్కి అవసరం. 20 అంగుళాల వెడల్పుతో బోదెలు వేయాలి. 20 అంగుళాలకు ఒక మొక్క నాటాలి. కీన్‌వా విత్తనాల మొలకశాతం 65 నుంచి 85 వరకు ఉంటుంది. కాబట్టి ఎకరానికి 2 కిలోల విత్తనాలను మళ్ళలో పోసి నారు పెంచాలి.

15-20 రోజుల వయ్సులో నాటటం శ్రేయస్కరం. దుమాల్ సూపర్ వేయటం శ్రేయస్కరం. నాటిన 10-15 రోజుల వ్యవధిలో డి.ఎ.పి. ఎరువు ఎకరాకి 50 కిలోలు తీస్తే చాలు. ఆ తర్వాత పొటాష్ పోషకాలు వున్న ఎరువులతో ఆటు, 90 రోజుల తర్వాత పొటాష్‌ను ఎకరాకు 50 కిలోలకు తగ్గకుండా వేయాలి. పొటాష్ ఎక్కువగా వాడటం వల్ల పైరుకు చీడ-పీడల బెడద వుండదు. గింజలు దృఢంగా ఏర్పడతాయి. మంచి దిగుబడి వస్తుంది.

తొలిదశలో ఒకటి రెండుసార్లు ఎడ్ల నాగళ్ళతో అంతర కృషి చేయవచ్చు. అలా చేయటం వల్ల చాలా వరకు కలుపు నిర్మూలన జరుగుతుంది. మొక్కల్లో నామ మాత్రంగా వున్న కలుపును మనుష్యులతో తీయించటం అవసరం. కూలీల కొరతను తట్టుకోలేక వ్యవసాయం తగ్గుతుంది. కాన్ వా నాటు వేయటానికి ఎకరానికి 6, 7 మంది సరిపోతారు. మధ్యలో కలుపు తీతకు మరో 5, 6 మంది వసరం. వరిపైరును నూర్పిడి చేసినట్లు కళ్ళాల్లి వేసి, ట్రాక్టరుతో నూర్పించవచ్చు. అయితే కోత అనంతరం బాగా ఆరనివ్వాలి. లేదంటే కొన్ని గింజలు రాలవు.

ఖర్చు విషయంలో రాజీపడకుండా పైరును జాగ్రత్తగా పెంచటం వల్ల మంచి దిగుబడి వచ్చే అవకాశాలు ఉన్నాయి. పైరు 6 అడుగుల ఎత్తు పెరుగుతుంది. ఎక్కువగా పిలకలు కూడా వస్తాయి. ఒక్కో మొక్క 10 నుంచి 12 దృఢమైన కంకులనిస్తుంది.

ఇంటర్నెట్‌లో లభ్యమౌతున్న సమాచారం ప్రకారం కిన్‌వా కిలో 1000 రూపాయల ధర లభించే సూచనలున్నాయి. కీన్‌వాకు అంత ఎక్కువగా ధర రావటం, డిమాండ్ పెరగటానికి కారణాలున్నాయి. దానిలో పోషక విలువలు అపారంగా వుండటమే. దాని ద్వారా ఎన్నో మందులును తయారు చేయటం జరుగుతుంది. ఎగుమతులు చేయటానికి కూడా అవకాశాలున్నాయి.

అమెరికా, ఫ్రాన్స్, నెదర్లాండ్, జర్మనీ, కెనడా, ఇజ్రాయిల్, బ్రెజిల్ లాంటి పలు దేశాలు కీన్ వా గింజలను భారీగా దిగుమతి చేసుకుంటున్నాయి. పెరూ దేశం 2007లో కీన్‌వా గింజల ఎగుమతి ద్వారా 5,52,000 అమెరికన్ డాలర్లను ఆర్జించింది. ప్రపంచ ఆర్గానిక్ ఉత్పత్తులలో కీన్‌వా గింజల ధర కిలో 3.1 అమెరికన్ డాలర్లు. ప్రపంచ వ్యాప్తంగా కీన్‌వాకు మంచి డిమాండ్ వుంది. మనిషి ఆరోగ్యాన్ని పరిరక్షించగల, ఆరోగ్యవంతమైన పోషకాలు కీన్‌వాలో అధికంగా వుండటమే ఈ డిమాండ్‌కు ప్రధాన కారణమంటున్నారు నిపుణులు.

పోషకాలతో పాటు లవణ పదార్థాలు కూడా అధికంగా కీన్‌వాలో ఉండటం వల్ల మంచి ధర వస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కీన్‌వా గింజలను దంచి, కడిగి అన్నంలా వండి భుజించినా, మంచి పోషక విలువలు సమకూరుతాయని వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మనకు కూడా కీన్‌వాను మరపట్టే యంత్రాలు అవసరం. ఆదాయం ఎక్కువగా వున్న కీన్‌వా సాగు విస్తరించే అవకాశం ఉంది. కాబట్టి మిల్లులు చాలా అవసరం.

*- దాసరి ఆళ్వార స్వామి, ఫ్రీలాన్స్ జర్నలిస్టు*
*9893818199*

**సాధారణంగా గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు వారి ఆరోగ్యానికి సంబంధించి తరుచుగా వచ్చే వ్యాధులు, అవి రాకుండా ముందుగా తీసుకోవలసిన నివారణా చర్యలను గురించి, వారిలో అవగాహన కలిగించాలనే ఉద్ధేశంతో కొన్ని అంటువ్యాధుల గురించి వివరంగా చర్చించటం జరిగింది.**

**ఈ ప్రయత్నంలో భాగంగానే, దేశానికి 'పల్లెసీమలే పట్టుకొమ్మలు' అనే జాతిపిత మహాత్మాగాంధి పలుకుల స్ఫూర్తితో మనదేశంలో ప్రాధమిక ఆరోగ్యాన్ని రాజ్యాంగబద్ధం చేయుటం జరిగింది.**

సాధారణంగా పట్టణప్రాంతాలతో పోలిస్తే, గ్రామీణ ప్రాంతాలలో నివశించే ప్రజల ఆహారపు అలవాట్లు, జీవన విధానం మొదలైనవి బి న్నంగా కనిపిస్తాయి. గ్రామీణ ప్రాంతాలలో నివశించే ప్రజలు ఎక్కువగా వ్యవసాయంపై ఆధారపడి వున్నారు. చాలా మంది నిరక్షరాస్యులు. కాబట్టి



మనదేశంలో ప్రతి సంవత్సరం లక్షలమంది ప్రజలు నివారించగల వ్యాధులకే మరణిస్తున్నారు. అందులో గ్రామీణ ప్రాంతంలో నివశించే వారే ఎక్కువ. ఇలాంటి మరణాల నుంచి మనల్ని మనం ముందుగా కాపాడుకోవటం మన కనీస బాధ్యత. వ్యాధుల నివారణకు అనేక పద్ధతులు ఉన్నాయి.

# గ్రామీణ ప్రాంతాలలో వచ్చే వ్యాధులు ముందుగా తీసుకోవల్సిన జాగ్రత్త చర్యలు

వారు, వారి ఆరోగ్య పరిరక్షణలో ఎక్కువ శ్రద్ధ కనబరచటంలేదు. ఎందుకంటే వారికి తరుచుగా వచ్చే వ్యాధుల గురించి అంతగా అవగాహన లేకపోవటం ప్రధాన కారణంగా చెప్పవచ్చు. ఇప్పటికీ కూడా (స్వాతంత్ర్యం వచ్చి 67 సంవత్సరాలు అయినా కూడా) గ్రామీణ ప్రాంతాలలో సాంప్రదాయ వైద్య విధానాన్ని అవలింభిస్తున్నారంటే అతిశయోక్తి కాదేమో? దానికి కారణం వారికి నూతన వైద్య విధానం గురించి సరైన అవగాహన లేకపోవటం మరి యు తరతరాల నుంచి వస్తున్న ఆచారాలను విడనాడకపోవటం మొదలైనవి కారణాలుగా చెప్పవచ్చు.




గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు సాధారణంగా వచ్చే వ్యాధుల గురించి (ఉదాహరణకు మలేరియా, డయేరియా, డెంద్యూ, క్షయ, చికెన్ గున్యా మొదలైనవి) వాటి లక్షణాల గురించి, అవి రాకుండా ముందుగా తీసుకోవల్సిన జాగ్రత్తలను ఈ క్రింది వివరించడం జరిగింది.

### అంటువ్యాదుల వ్యాప్తి

అంటువ్యాధులు వ్యాపించే తీరునుబట్టి వాటిని మూడు తరగతులుగా విభజించవచ్చు. వాయువాహక రోగాలు మొదటి రకం, ఆహార పానీయాల ద్వారా వ్యాపించే రోగాలు రెండో రకం, ఈ రెండూ కాకుండా ఇతర మార్గాలలో వ్యాపించే వ్యాధులు మూడో రకం.

**వాయువాహక వ్యాధులు:** గాలివల్ల వ్యాపించే వ్యాధుల జాబితాలో సాధారణమైన జలుబు, ఆటలమ్మ, గవద బిళ్లల వ్యాది, కోరింతదగ్గు, డిఫ్తీరియా, క్షయ మున్నగు వ్యాధుల్ని పేర్కొనవచ్చు.

**ఆహారపానీయాల ద్వారా వ్యాపించే రోగాలు:** మనం తినే తిండీ, త్రాగే నీళ్ల ద్వారా ఈ రకం వ్యాదులు వ్యాపిస్తాయి, కలరా, టైఫాయిడ్, కామెర్లు, పోలియో లాంటి వ్యాదులు ఈ రకమైనవి.

**ఇతర మార్గాలలో వ్యాపించేవి:** త్రుప్పుపట్టిన మేకోముల్లో గ్రుచ్చుకోవడం, దానివల్ల చర్మం చిట్లినప్పుడు, కత్తిదెబ్బల వల్ల గాయాలు ఏర్పడినప్పుడు ఆ గాయాలద్వారా టెటనస్ (ధనుర్వాతం) వ్యాధి క్రిములు దేహంలోకి ప్రవేశిస్తాయి. గజ్జి, ఎగ్జిమాలాంటి చర్మవ్యాదులు ఆ రోగుల సాన్నిధ్యం

ద్వారా సంక్రమిస్తాయి. సుఖరోగాలు లైంగిక సంపర్కం ద్వారా వ్యాపిస్తాయి.

**జ్వరాలు – నిరోధక చర్యలు:** జులై నుంచి నవంబర్ నెలవరకు జ్వరాలు, మలేరియా ప్రజలకు ఎక్కువగా సోకుతాయి. సాధారణ వైరల్ జ్వరాలు చిన్న వైద్యంతో తగ్గిపోతాయి. కానీ మలేరియా, డెంగ్యూ మొదలగు అంటు వ్యాధుల నుంచి పూర్తి నివారణ పొందేందుకు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.

**మలేరియా:** మలేరియా వ్యాధి చలి, వణుకుతో కూడిన విపరీతమైన జ్వరం ఉంటుంది. సరైన వ్యాధి నిర్ధారణ, చికిత్స లేకపోతే నెలల తరబడి బాధిస్తుంది. చికిత్సతోపాటు నివారణా చర్యలు కూడా మంచి ఫలితాన్నిస్తాయి. వర్షాకాలంలోని దోమకాటు వల్ల ఈ వ్యాధి అధికంగా వస్తుంది.

**డెంగ్యూ:** అకస్మాత్తుగా వచ్చే ఎముకలు, కండరాలు, కీళ్ళ నొప్పితో కూడిన తీవ్ర జ్వరం వస్తుంది. తగ్గినట్లు అనిపించినా వారం, పదిరోజుల్లో తిరగబెట్టే లక్షణం ఉంటుంది. ఎడిస్ ఈజిప్టై దోమల ద్వారా ఒకరి నుంచి ఇంకొకరికి ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. కండ్ల నొప్పి, శరీరంపై చిన్నపాటి దద్దుర్లు వ్యాధి లక్షణాలు. చిగుళ్ళు, మలం, మూత్రం ద్వారా రక్తం పోవటం డెంగ్యూ హేమరేజి లక్షణాలు. ఈ వ్యాధి అపస్మారక స్థితి స్థాయికి చేరటాన్ని డెంగ్యూ షాక్ సిండ్రోమ్‌గా పరిగణించాలి.

**చికెన్ గున్యా:** ఈ వ్యాధి లక్షణాలన్నీ డెంగ్యూ వ్యాధి లక్షణాలను పోలి ఉంటాయి. కానీ రక్తస్రావం మాత్రం ఉండదు. తీవ్రమైన ఒళ్ళు నొప్పులు దీర్ఘ కాలం ఉంటాయి.

**ఫైలేరియాసిస్ ( బోదకాలు):** తరచూ వచ్చే జ్వరం, చంకల్లో బిళ్ళలు కట్టటం, శరీరంలోని అవయవాల వాపు, ప్రత్యేకించి కాళ్ళు చేతులు స్థనాలు, జననేంద్రియాలు పాడవటం ఈ వ్యాధి ముఖ్య లక్షణాలు. క్యూలెక్ దోమ కాటు వల్ల ఈ వ్యాధి వ్యాపిస్తుంది.




***నివారణ చర్యలు:*** దోమకాటుకు గురికాకుండా ఉండాలి, మలేరియా, డెంగ్యూ వంటి జ్వరాలను నివారించాలి. నీళ్ళ కుండీలు, ఇంటిపై ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకు మీద మూతలు సరిగా అమరి ్చ దోమలు గుడ్లు పెట్టకుండా చూసుకోవాలి. వారానికి ఒకసారి వాటిని శుభ్రం చేసుకోవాలి. కొబ్బరి బోండాలు, చిప్పలు, పాత టైర్లు, రోళ్ళలో నీరు నిల్వ ఉండకుండా చూడాలి. పనికిరాని బావులను పూడ్చివేయాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి. తాజాగా వండిన ఆహార పదార్థాలను తినాలి. శుభ్రమయిన నీటిని త్రాగాలి. పందులను జనావాసాలకు ఐదు కిలోమీటర్లు దూరంగా ఉంచాలి.

డెంగ్యూ వాధి కలుగజేసే దోమ పగటిపూట కుడుతుంది. కాబట్టి పగటి పూట కూడా దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. డెంగ్యూ జ్వరం, కొన్ని ముఖ్య జ్వరాల్లో ప్లేట్‌లెట్స్ తగ్గటం సహజం, కానీ అవి వెంటనే పెరగాలని కంగారు పడకుండా వ్యాధి నిరోధక శక్తిని పెంచుకుంటే అవే పెరుగుతాయి.



**హెచ్ ఎన్ జ్వరం. (స్వైన్ ఫ్లూ):** ఈ వ్యాధి గాలి ద్వారా వ్యాపిస్తుంది. ఇది ఫ్లూ వ్యాధి వలే ఉండి ఊపిరి తిత్తుల లోపలి భాగానికి సోకుట వలన ప్రమాదకారిగా మారి ప్రాణాపాయం సంభవిస్తుంది.

***లక్షణాలు:*** జ్వరము, దగ్గు, గొంతునొప్పి, జలుబు, ముక్కు కారటం, శ్వాస తీసుకోవటంలో ఇబ్బంది మొదలగునవి.

***నివారణ చర్యలు:*** పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలి. ఎక్కువగా నీరు త్రాగాలి, పౌష్టికాహారాన్ని తీసుకోవాలి. చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. జనసమ్మర్ధం ఉన్న ప్రాంతాలకు వెళ్ళకూడదు. శ్వాస తీసుకోవటం ఇబ్బందిగా ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. వ్యాధి నిర్ధారణ, వైద్య సౌకర్యం ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉంది. ఈ జబ్బు గాలి ద్వారా వ్యాపిస్తుంది. బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మివేయరాదు. దగ్గినపుడు, తుమ్మినపుడు గుడ్డ అడ్డంగా పెట్టుకోవాలి.

**అతిసార, కలరా, పచ్చకామెర్లు, టైఫాయిడ్:** తుఫానులు, వరదలు, భారీ వర్షాలు వచ్చినపుడు అతిసార, కలరా, పచ్చకామెర్లు, టైఫాయిడ్ వంటి అంటువ్యాధులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. కాబట్టి నీటి ద్వారా ప్రభలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

***లక్షణాలు:*** వాంతులు, విరేచనాలు కావటం, జ్వరం తగ్గకపోవటం తదితర కారణాలు.

***జాగ్రత్తలు:*** సమీపంలోని ఆశా కార్యకర్తల సహాయ సహకారాలు తీసుకోవాలి, బ్లీచింగ్ పౌడర్ కలిపిన క్లోరినేషన్ వేసిన కొళాయి నీటిని మాత్రమే తాగాలి. ఇలాంటి నీరు దొరకకపోతే నీటిని కాచి చల్లార్చి తాగాలి. వాంతులు విరోచనాలు అవుతున్న సంధర్భాల్లో దగ్గర్లోని ప్రభుత్వ ఆసుపత్రిలో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సహాయం తీసుకోవాలి.

మరుగుదొడ్డిని మాత్రమే వాడాలి. అన్నం తినటానికి ముందు, మల విసర్జనకు వెళ్ళి వచ్చిన తరువాత చేతులు సబ్బుతో కడుక్కోవాలి. వేడి అన్నం తినాలి. ఈగలు వాలిన ఆహార పదార్థాలు తినకూడదు.



చెత్త చెదారం విడిగా పారవేయకుండా ఊరు బయట గోతిని తవ్వి దానిలో వేసి మన్ను కప్పాలి. దీని వల్ల ఈగలు వృద్ధి

చెందకుండా ఉంటాయి. ఆహార పదార్థాలపై ఈగలు వాలకుండా మూతలు పెట్టుకోవాలి. ఆహార పదార్దాలు నిలువ ఉంచే పాత్రలను ముందుగా వేడి నీటితో కడగాలి.

చచ్చిన జంతువులు, చేపలు, కోళ్ళ మాంసాన్ని తినకూడదు. ఆకు కూరలు, కూరగాయలను నీళ్ళలో శుభ్రంగా కడిగిన తరువాత సరిగ్గా ఉడకబెట్టి వండి తినాలి. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. మంచి నీటి బావుల్లో చెత్తా చెదారం వేయకుండా బావులకు కూడా మూతలు అమర్చుకోవాలి. అతి సార రోగి వాడిన బట్టలు ఐదు శాతం పినాయిల్ నీటిలో అరగంట సేపు ఉంచి మరుగబెట్టి ఆ తరువాత ఉతకాలి. అతిసార వ్యాధి ఉన్నవారు ఇతర ప్రదేశాల్లో, అపరిశుభ్రంగా ఉన్న ప్రదేశాల్లో ఆహారం, నీరు తీసుకోకూడదు.

**పోలియో:** ఈ జబ్బు ఒక రకమైన వైరస్‌వల్ల వస్తుంది. ముఖ్యంగా రెండు విధాలుగా ఈ జబ్బు రావచ్చు. అశుభ్రమైన ఆహారం తినడం వల్ల ఈ వ్యాధి క్రిములు కడుపులో ప్రవేశించి వ్యాధిని కలిగిస్తాయి. ఇదొక రకం. మరొక విధం ఏమిటంటే, ఈ వ్యాధి క్రిములు గొంతులో ప్రవేశించడం మూలాన రోగి బాధపడుతాడు.

కడుపులో ప్రవేశించిన క్రిములు రోగి మలంలో ఎక్కువగా బహిర్గతం అవుతాయి. అశుభ్రమైన ఆహార పానీయాదుల వల్ల చేతులూ కాళ్ళూ



సరిగ్గా కడుక్కోకపోవడం వల్ల ఈ వ్యాధి రావచ్చు. మలం మీద వాలిన ఈగలు, మళ్ళీ ఆహార పదార్థాల మీద వాలడం వల్ల మూడా ఈ వ్యాధి వ్యాపించవచ్చు.

గొంతులో చేరిన క్రిములు రోగి దగ్గినప్పుడు, లేక తుమ్మినప్పుడు ఇతరులకు వ్యాపిస్తాయి.

కడుపులోగాని, గొంతులోగాని ఈ వ్యాధి క్రిములు ఒకసారి ప్రవేశిస్తే అధిక సంఖ్యలో వృద్ధిపొందుతూ, క్రమంగా వ్యాధి బాగా ముదురుతుంది. అధిక సంఖ్యలో ఉత్పత్తి అయిన క్రిములు రక్తంలో కలిసిపోతాయి. రక్తంలో కలిసిన క్రిములు ముఖ్యంగా నరాలలో జీవ కణాలను బాధిస్తాయి. అందువల్ల నాడీమండలం దెబ్బతిని, కదల్చడానికి వీలులేకుండా కండరాలు బిగుసుకుపోతాయి.

*లక్షణాలు:* ఈ క్రిములు శరీరంలో ప్రవేశించి అసంఖ్యాకంగా వృద్ధిపొందడం మొదటి దశ. రెండవ దశలో నాడీమండలానికి వ్యాధి ప్రాకుతుంది. దానివల్ల కండరాలు కదల్చడానికి వీలు లేకుండా బిగుసుకుపోవడం మూడో దశ.



ఈ క్రిములు గొంతులో ప్రవేశిస్తే, వెంటనే గొంతు రాచుకపోయి శ్లేష్మం ఏర్పడుతుంది. రెండోదశలో తలనొప్పి, మెడనొప్పి, కొన్ని సందర్భాలలో అంగ ప్రకంపనాలు కూడా కన్పించవచ్చు. మూడవదశలో కోశం, కండరాలు బలహీనపడతాయి. గొంతుభాగం నోటిలోపలి కండరాలు బలహీనమవుతాయి. మెడ నిలబడకుండా వాలిపోవటం జరుగుతుంది.

ఈ జబ్బు మామూలుగా ఒకటి, రెండు ఏళ్ల పిల్లలకు ఎక్కువగా వస్తుంది. అందుచేత ఈ జబ్బును పసిపిల్లన వాతం అనికూడా అంటారు.

మొట్టమొదటి 48 గంటల కాలం మిక్కిలి వేగంగాను ఆ తర్వాత రెండు మూడు రోజులపాటు కొంచెం మెల్లగాను ఈ వ్యాధి వ్యాపిస్తుంది. ఆహారం మింగే ప్రదేశంలో ఉన్న కండరాలు దెబ్బతిన్నప్పుడు మింగటం కష్టమై ఆహారం శ్వాసకోశంలోకి ప్రవేశించటం జరగవచ్చు. కొన్ని సందర్భాలలో శ్వాసకోసం పూర్తిగా మూసుకుపోవచ్చు.

వ్యాధి నిరోధక మార్గాలు: ఈ వ్యాధి వల్ల కాలిమీద కండరాలు బలహీనమై రోగి జీవితమంతా కుంటివాడు కావటం జరగవచ్చు. అయితే ఈ వ్యాధి రాకుండా అరికట్టే ఉపాయం ఉంది.

ఈ వ్యాధి క్రిములలో మూడు రకాలున్నాయి. ఒక్కొక్క క్రిమిని నిరోధించడానికి ఒక్కొక్క ప్రత్యేక ఔషదము ఉంది. అందుచేత మూడు రకాల క్రిములను సంహరించేందుకు మూడు మందులను కలిపి వాడతారు.

ఈ క్రిములను ఫార్మలిన్ అనే రసాయనిక ద్రవంలో ముంచి చంపుతారు. చనిపోయిన ఆ క్రిములను ఇంజెక్షన్ ద్వారా శరీరంలోకి ఎక్కిస్తారు. దీని ద్వారా బిడ్డలో వ్యాధినిరోధక శక్తి ఏర్పడుతుంది. బిడ్డ పుట్టిన ఏడాదిలోపుగాని మూడు ఇంజెక్షన్‌లు చేయించాలి. రెండో ఏడు నడుస్తున్నప్పుడు మరో ఇంజెక్షన్ ఇవ్వాలి. ఇలాచేస్తే మరి ఈ వ్యాధి రాదు. ఒకవేళ వ్యాధిసోకిన అంగవైకల్యం లాంటి తీవ్ర లక్షణాలు ఏర్పడవు.

ప్రస్తుతం ఒక రకమైన చుక్కల మందు ఇస్తున్నారు. రోగ క్రిములను చంపకుండా క్రిమిదోష తీవ్రతను తగ్గించి వ్యాధినిరోదక శక్తిని పెంచే ఈ మందు చాలా శ్రేష్టమైనది. ఈ చుక్కల మందు బిడ్డకు ఏడాదిలోపుగాని మూడు సార్లు ఇవ్వాలి.

పైన తెల్పిన అంటువ్యాధులే కాకుండా ఇంకా గ్రామాలలో అనేక రకాలైన వ్యాధుల సంక్రమిస్తున్నాయి. కాబట్టి వాటన్నింటినుంచి మన ఆరోగ్యాన్ని కాపాడుకోవటానికి ముందు జాగ్రత్తలు పాటించినట్లయితే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించిన వారమవుతాము.

*– డా।। నాగేశ్వరరావు, రీసెర్చి అసోసియేట్, సిడిఎస్, అపార్డ్*

# వాతావరణంలో మార్పు- దాని ప్రభావం

మనిషికి ప్రసాదించిన వరం వాతావరణం ముఖ్యమైనది. వాతావరణం మనిషికి ఇచ్చిన వాటిలో నీరు, ఆహారం, చెట్లు, చేమలు. అందులో వేలకొలది జీవరాశులు సుఖజీవనం సాగిచేందుకు తోడ్పడుతున్నాయి. ఆ తోడ్పాటులో ఎన్నో స్మృతులు చోటు చేసుకున్నాయి. అందులో వాతావరణం మార్పు చెంది మనిషికి లాభాలను, నష్టాలను కూడా కలిగిస్తుంది. ఆ ప్రక్రియలో మనిషి జీవితం ఆటుపోటులకు గురి అవుతుంటుంది. ఆ ఆటుపోటులను తొలగించుకునేందుకు మనిషి పలు విధాలుగా ప్రయత్నం చేస్తుంటాడు. కానీ, ఆ ప్రకృతిమాత కరుణించకపోతే మనిషి విలవిల్లాడిపోతాడు.

ఈ ఆటుపోటులు రెండు రకాలు. 1. మనిషి చేష్టవల్ల జరిగేవి. 2. ప్రకృతి వలన వచ్చేవి.

ఇటీవలకాలంలో దైవాన్ని ధ్యానించటానికి ఆ శివుని పూజించటానికి జార్ఖండ్ రాష్ట్రంలోని హిమగిరి పర్వతాన్ని దర్శించటానికి వెళ్ళినపుడు వర్షాల వలన వచ్చిన వరదలలో సుమారు 2.5 లక్షల మంది గల్లంతయినట్లు, వేల గ్రామాలు ఆ నీటి ప్రవాహంలో కొట్టుకుపోవడం జరిగింది. ఆ రాష్ట్రం వారు కొందరైతే ఇతర రాష్ట్రాల నుండి వెళ్ళిన వారు అధికంగా వున్నట్లు తెలుస్తోంది. అంటే ప్రకృతి విలయ తాండవం చేస్తే తట్టుకోవడం కష్టం. అందుకే వాతావరణం సమతౌల్యాన్ని పాటించాలని అంటారు.

## నేలకోత

మనిషికి ప్రకృతి ప్రసాదించిన నేల ఎన్నో రకాలుగా ఉపయోగపడుతుంది. నేలతల్లి ఆశీర్వాదం వలన మనిషికి ఆహారం, నీరు లభిస్తుంది. కాని ఆ నేలతల్లిని మనిషి రకరకాలుగా ఆధించడం జరుగుతుంది. అందులో భాగమే 'నేలకోత'. వ్యవసాయం, సాగు పేరుతో నేలను పలు విధాలుగా వాడుకొనడం జరుగుతుంది. అందుకే మనిషి 'భూదేవిని' పూజిస్తారు. భూమాత కరుణించకపోతే మనిషి ఆకలితో అలమటించవలసిందే. ఈ నేపథ్యంలో ప్రతి ఏడాది భూమి నేలకోతకు గురి అవుతుంది.

ముఖ్యంగా వరదలు కారణంగా సారవంతమైన భూములు నీరుపాలై సముద్రంలో కలిసిపోతూ పంట పొలాలను ఇసుకతో కప్పివేయడం జరుగుతుంది. ఆ ఇసుకను పంట భూముల నుండి తొలగించేందుకు అనేక రకాలుగా ప్రజలు ఇబ్బందుల పాలవడం జరుగుతుంది. మన దేశంలో ప్రతి ఏడాది 51% నేలకోతకు గురి అవుతుంది. ముఖ్యంగా తీర ప్రాంత జిల్లాలైన బంగాళాఖాతం ఒడ్డున వున్న జిల్లాల్లో ఈ నేలకోత తక్కువగా ఉన్నట్లు అంచనా.

ఆయా నేలలు కోతకు గురి అవుతాయి. దీనివలన 0.22% పంటనేలలు కోతకు గురి అవుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. నేలకోతను తగ్గించి పంట భూములను పరిరక్షించేందుకు వ్యవసాయ శాఖ సంయుక్తంగా చర్యలు చేపట్టి నేలకోతను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటుంది. అయినా ఆ ప్రకృతి బీభత్సాన్ని కొంతవరకే ఆపగలుగుతున్నాం. కాని నేల కోతను పూర్తిగా అరికట్టవలసి వుంది. అందుకు చర్యలు - 1. ఉపయోగం లేని భూములను సాగులోకి తేవడం 2. వాతావరణ స్థితిని, కలుషితమైన చర్యలను అరికట్టడం 3. నేల కోతను బహుళార్ధక చర్యల ద్వారా ఆపడం. 4. నేల ముఖ్యంగా పంట పొలాలను కోతకు గురి కాకుండా చూడడం. 5. నేలమీద వత్తిడిని తగ్గించి సమతౌల్యతను కాపాడడం.

వాతావరణ పరిరక్షణలో భాగంగా వరదలు, తుపాన్ల నుండి పరిరక్షించటానికి మనిషి పలు రకాలుగా ప్రివెంటివ్ మెజర్స్‌ను తీసుకొనడం జరుగుతుంది. అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విపత్తుల నియంత్రణ బోర్డును స్థాపించడం జరిగింది. ఆ డి.ఎం.బి. వరదలు తుపాను మంచువలన కలిగే నష్టాలను ముందు జాగ్రత్త చర్యలను ప్రజల్లో అవగాహన కల్పించటం ద్వారా నష్టాలను చాలావరకు అధిగమించవచ్చు.

2014లో ఆంధ్రప్రదేశ్‌లో వచ్చిన హుదుద్ తుపాను వలన ఉత్తర కోస్తా ఎంతగానో నష్టపోయింది. కాని ముందు జాగ్రత్త చర్యల వలన నష్టాల నుంచి తగ్గించుకోగలిగాం.

ఈ వాతావరణంలో వచ్చిన మార్పులు వలన పంటల దిగుబడి తగ్గిపోవడం, వేడిగాలుల వలన పంట రాబడి తగ్గడం లేదా ఎక్కువగా కెమికల్స్ వాడకంలో వాతావరణంలో వచ్చిన తేడాల వలన కూడా పంట దిగుబడి తగ్గిపోవచ్చును. ఇట్లా వాతావరణ సమతుల్యతను కోల్పోవడం వలన నష్టాలు పరోక్షంగాను, ప్రత్యక్షంగాను ఉంటాయి. వాటినన్నింటిని అధిగమించేందుకు మనం కృషి చేయాలి. ఈ వాతావరణ మార్పులను తట్టుకునేందుకు మనిషి ఏపాటి వాడు - భరించడం తప్ప. ప్రభుత్వమే ఇందుకు పూనుకోవాలి. అదే విధంగా పబ్లిక్, ప్రైవేట్, పార్టనర్‌షిప్ ద్వారా వాతావరణంలో వచ్చిన వ్యతిరేక మార్పుల నష్టాన్ని తగ్గించుకొనవచ్చును. అందుకు కాలుష్య నియంత్రణ బోర్డు కూడా పని చేస్తుంది. మనిషి





ఉపయోగించే టాక్సిక్ ఆసిడ్స్ వాడకాన్ని నియంత్రించడం, గాలిలో మోనోక్సైడ్‌ను తగ్గించడం. పెట్రోలు, కెమికల్స్, పెస్టిసైట్స్‌ను వాడాకాన్ని తగ్గించడం వలన వాతావరణ కాలుష్యాన్ని తగ్గించవచ్చును.

వరదలతోపాటు సముద్రంలో ఆటుపోట్లు రావడం వలన ఉప్పెనలు, సునామీలు రావడం జరుగుతుంది. ఈ ఉప్పెనలు, సునామీలు, వడగండ్ల వర్షం వలన పంట నష్టం జరుగుతుంది. వడగండ్ల కాలం కాని అకాలంలో రావడంతో రైతులు అప్పుడు లేకపోవడంతో అధిక నష్టాన్ని ఎదుర్కొనవల్సి వస్తుంది. ఈ అకాల వర్షాలు, వడగండ్లు, సునామీలు, గాలిదుమ్ములు, ఉప్పెనలు వలన మనిషి పలురకాలుగా నష్టపోవడం జరుగుతుంది.

ఆ నష్టాన్ని అంచనా వేయడం కష్టం. జరిగనానంతరం తీసుకొనవలసిన చర్యలను గురించి ఆలోచించడం జరుగుతూందే కానీ, వాతావరణం కలుషితం కాకుండా, శాశ్వత చర్యలను తీసుకోవాలి. కాలుష్య నియంత్రణ అనేది వ్యక్తికి సంబంధించి కాదు. పూర్తి సమాజ బాధ్యత క్రిందకు వస్తుంది. అందుకే ప్రివెన్షన్ ఈజ్ బెటర్ దెన్ క్యూర్. కనీసం తమతమ స్థాయిలో వాతావరణ మార్పులు అర్థం చేసుకొని కృషి చేయాలి. అందులో - 1. నేల పరిరక్షించేందుకు చర్యలు 2. నేల కోతకు గురికాకుండా ఉండడం. 3. నేల ఉన్నతి కృషి 4. ప్లాస్టిక్ వాడకం నిషేధం. 2. కాలుష్యం తగ్గించేందుకు చర్యలు. 3. చెట్ల పెంపకం 4. కెమికల్స్ వాడకం నియంత్రణ 5. ఆలోచనా విధానంలో మార్పులతో మన వాతావరణ మార్పు ప్రభావం ఎదుర్కొనవచ్చు.

*- సి.ఎం.పి.*

# సర్పంచ్‌లకే చెక్ పవర్

**తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడిన తొలి సర్కారు సర్పంచ్‌లకు తీపి కబురు అందించింది. గ్రామ పంచాయతీ నిధుల వినియోగంపై విధించిన జాయింట్ చెక్‌పవర్ ఆదేశాలను ఉపసంహరిస్తూ... సర్పంచ్‌లకు చెక్‌పవర్ కల్పించాలని నిర్ణయించింది.**

సచివాలయంలో తెలంగాణ గ్రామ పంచాయతీ సర్పంచుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు మల్లేపల్లి సోమిరెడ్డి, ఎమ్మెల్సీ పట్నం నరేందర్‌రెడ్డిల ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఛైర్మన్లు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పంచాయతీరాజ్ శాఖ మంత్రి శ్రీ కె. తారకరామారావు, రవాణా శాఖ మంత్రి శ్రీ పట్నం మహేందర్‌రెడ్డి, పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శి శ్రీ రేమండ్ పీటర్, కమిషనర్ అనితా రామచంద్రన్‌తో సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా స్థానికసంస్థల బలోపేతంపై చర్చించిన మంత్రి కేటీఆర్... సర్పంచ్‌లకు చెక్‌పవర్ కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధుల డిమాండ్లను సానుకూలంగా విన్న మంత్రి శ్రీ కె. తారకరామారావు మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులకు గౌరవ వేతనాన్ని పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఈ అంశంపై ముఖ్యమంత్రితో చర్చించి త్వరలో నిర్ణయం ప్రకటిస్తామని కేటీఆర్ తెలిపారు. గ్రామ పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేయాల్సిన బాధ్యత సర్పంచ్‌లపై ఉందన్నారు.

పంచాయతీల ఆదాయాలను పెంచి గ్రామాలను స్వయం సమృద్ధిగా మార్చుకోవాలని కేటీఆర్ సూచించారు. ఈ ప్రయత్నంలో భాగంగా సిరిసిల్ల నియోకవర్గంలోని 92 గ్రామ పంచాయితీల్లో 100 శాతం ఆస్తిపన్నుల వసూలును పూర్తి చేసినట్లు ప్రజాప్రతినిధులకు వివరించారు. కేంద్ర బడ్జెట్‌తో తీవ్ర నష్టం: క్షేత్రస్థాయిలో ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి విజయవంతం చేసేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పంచాయితీరాజ్ శాఖకు తీవ్ర నష్టం ఏర్పడిందని చెప్పారు. గ్రామాభివృద్ధికి ఇచ్చే బీఆర్‌జీఎఫ్, పీఎంజీఎస్‌వై, ఎన్ఎస్ఆర్‌జీపీ, ఎన్ఆర్‌డీడబ్ల్యూపీ పథకాలను కేంద్ర ప్రభుత్వం నిలిపివేసిందని పేర్కొన్నారు. స్థానిక సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యత కల్పించిందన్నారు. పంచాయితీరాజ్ చట్టానికి సవరణలు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామని, ముఖ్యమంత్రితో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని మంత్రి కేటీఆర్ తెలిపారు.

గ్రామ పంచాయతీల విద్యుత్ బకాయిల కారణంగా పంచాయతీ కార్యాలయాలు, విద్యుత్ బోర్లకు విద్యుత్ కనెక్షన్లు తొలగించవద్దని జిల్లా కలెక్టర్లను ఆదేశించినట్లు చెప్పారు. ప్రభుత్వ పథకాలను విజయవంతం చేస్తూ, స్వయం సమృద్ధి సాధించే గ్రామాలకు ప్రోత్సాహకాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఏకగ్రీవంగా ఎన్నికైన మైనర్ గ్రామ పంచాయితీలకు ప్రోత్సాహక నిధులను రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు, మేజర్ పంచాయతీలకు రూ. 10 లక్షల నుంచి రూ. 15 లక్షలకు పెంచినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రాములు నాయక్, రంగారెడ్డి, నల్లగొండ, కరీంనగర్, మహబూబ్‌నగర్ జిల్లా పరిషత్ ఛైర్మన్లు పట్నం సునితా మహేందర్‌రెడ్డి, బాలు నాయక్, తుల ఉమ, భాస్కర్, తెలంగాణ పంచాయతీరాజ్ చాంబర్స్ రాష్ట్ర అధ్యక్షుడు సి.హెచ్. సత్యనారాయణరెడ్డి, సర్పంచ్‌ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు భూమన్న, సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోలిపురం రాంరెడ్డి, రాజేష్ నాయక్, కృష్ణారెడ్డి ఎంపీటీసీ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కరుణాకర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

*- టి.ఎన్.ఓ.*

# ఆదిలాబాద్ జిల్లా ఎకానమీ

**రాష్ట్రంలోని వెనుకబడిన జిల్లాల్లో ఆదిలాబాద్ ఒకటి. బీజాపూర్ సుల్తాన్ అయిన 'మహమ్మద్ ఆదిల్ షా' పేరు మీద దీనికి ఆదిలాబాద్ అని పేరు వచ్చింది. మరొక కథనం ప్రకారం ఒకప్పుడు ఈ ప్రాంతంలో ఎద్దుల అంగడి ఎక్కువగా జరిగేదని తెలుస్తుంది. అందువల్ల ఈ జిల్లాను ఎదులాపురం అని పిలుస్తారు. దీనికి తూర్పున ప్రాణహిత నది, ఉత్తరాన వార్ధానది, దక్షిణాన గోదావరి నదులు ప్రవహిస్తున్నాయి.**

### ఆహారేతర పంటలు అధికం

జిల్లా మొత్తం విస్తీర్ణం 16,10,500 హెక్టార్లు. ఇందులో నికర సాగుబడి 6,19,736 హెక్టార్లు. అంటే మొత్తం విస్తీర్ణంలో ఇది 38.48 శాతాన్ని కలిగి ఉన్నది. ఒకటి కంటే ఎక్కువసార్లు సాగుచేస్తున్నది. 40,905 హెక్టార్లు. ఇది మొత్తం విస్తీర్ణంలో 6.60 శాతాన్ని కలిగి ఉంది. అయితే తెలంగాణలో అత్యధిక నికర సాగుబడి చేస్తున్న జిల్లా మహబూబ్‌నగర్ (8,55,485 హెక్టార్లు), అతి తక్కువగా నిజామాబాద్ జిల్లా (3,26,360 హెక్టార్లు) చివరి స్థానంలో ఉన్నది. ఆహార పంటలను ఈ జిల్లాలో 2,25,775 హెక్టార్లలో, 4,34,866 హెక్టార్లు ఆహారేతర పంటలను, మొత్తం కలిపితే 6,60,641 హెక్టార్లలో ఆహార, ఆహారేతర పంటలను సాగు చేస్తున్నారు. అత్యధికంగా ఆహార పంటలను ప్రోత్సహిస్తున్న జిల్లా మహబూబ్‌నగర్ (5,25,915 హెక్టార్లు), అతి తక్కువగా రంగారెడ్డి జిల్లా, 2,01,556 హెక్టార్లలో ఆహార పంటలను సాగు చేస్తున్నది.

ఆహారేతర పంటలను ఎక్కువ సాగు చేస్తున్న జిల్లా ఆదిలాబాద్. అంటే ఈ జిల్లాలో డ్రై ల్యాండ్ ఎక్కువగా ఉండటం వలన ఈ పంటలు ఎక్కువగా పండుతాయి. ఆహారేతర పంటలను తక్కువగా సాగుచేస్తున్న జిల్లా రంగారెడ్డి 81,212 హెక్టార్లు.

రాష్ట్రంలో వరిని అతితక్కువగా పండిస్తున్న జిల్లా రంగారెడ్డి అయితే, తరువాత స్థానం ఆదిలాబాద్‌ది. 70,749 హెక్టార్లలో వరిని సాగుచేస్తూ, 1,87,287 టన్నులు ఉత్పత్తి చేస్తుంది. అయితే తెలంగాణలో అత్యధికంగా వరిని సాగుచేస్తున్న జిల్లా కరీంనగర్. గోధుమ ఉత్పత్తిలో ఈ జిల్లా 3,585 హెక్టార్లలో, 4051 టన్నులు ఉత్పత్తి చేస్తూ తెలంగాణలోని గోధుమను ఎక్కువగా పండిస్తున్న జిల్లాలో మొదటిస్థానాన్ని కలిగివుంది.

పత్తి ఉత్పత్తిలో కూడా ఈ జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉంది. 3,70,363 హెక్టార్లలో సాగుచేస్తూ 7,23,297 టన్నులు ఉత్పత్తి చేస్తుంది.

### కొయ్య బొమ్మలకు ప్రసిద్ధి

రాష్ట్రంలో అతి తక్కువగా ఫ్యాక్టరీలు కలిగిన జిల్లా ఆదిలాబాద్. ఈ జిల్లాలో మొత్తంగా 258 పరిశ్రమలు మాత్రమే ఉన్నాయి. అయితే తెలంగాణలో ఎక్కువ ఫ్యాక్టరీలు రంగారెడ్డి జిల్లాలో 3131తో నమోదయ్యాయి.

ఆదిలాబాద్ జిల్లా రాష్ట్రంలో ఎక్కువగా కొయ్యబొమ్మలకు ప్రసిద్ధి చెందింది. ఇక్కడి బొమ్మలు ఆసియా ఖండంతో పాటు ప్రపంచ ప్రసిద్ధిగాంచినవి. ఇందులో ఎక్కువగా నిర్మల్ అనే ప్రాంతం కొయ్యబొమ్మలకు ప్రసిద్ధి గాంచినది. ఈ చేతివృత్తి వలన అనేక మందికి ఉపాధి లభిస్తుంది. వారంతా సహకార వ్యవస్థగా ఏర్పడి ఈ వృత్తిని అవలంభిస్తుంటారు. దీంతోపాటు జిల్లాలో కొన్ని పెద్ద తరహా పరిశ్రమలు ఉన్నాయి.

వాటిలో కొన్ని...

***సిర్పూర్ పేపర్ మిల్స్:*** దీనిని 1938లో అప్పటి నిజాంమీర్ ఉస్మాన్ అలీఖాన్ ప్రారంభించాడు. కాగజ్‌నగర్‌లో ఉన్న ఈ కంపెనీ అనేక రకాల పేపర్‌ను మానుఫ్యాక్చరింగ్ చేస్తూ దేశవ్యాప్తంగా పేరు గాంచింది. ఇది ముంబైస్టాక్ ఎక్స్ఛేంజ్ లిస్టెడ్ కంపెనీ. రాష్ట్రంలో అతిపురాతన, అతి పెద్ద పేపర్ మిల్లు. ప్రస్తుతం ఇది నష్టాల్లో కూరుకుపోయింది.

***సింగరేణి కాలరీస్:*** ఆదిలాబాద్ జిల్లాలో బెల్లంపల్లి ఎక్కువగా బొగ్గు గనులను కలిగి ఉంది. బ్రిటీష్ ఇండియా వారు మొదటగా 1936లో తొలి కోల్‌మైన్‌ను ఇక్కడ స్థాపించారు. బొగ్గును ఇక్కడి నుంచి ఎన్టీపీసీకి తరలిస్తున్నారు.

***సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా:*** దీనిని 1965లో భారత ప్రభుత్వం తన ఆధీనంలోకి తెచ్చుకుంది. ఇది ఇండియాలో తగినంత సిమెంట్‌ను ఉత్పత్తి చేస్తూ సిమెంట్ లోటును భర్తీ చేస్తున్నది. వీటితోపాటు మంచిర్యాలలోని కోల్ కెమికల్ కాంప్లెక్స్, పెన్‌గంగా ఆయిల్ లిమిటెడ్, నటరాజ్ స్పిన్నింగ్ మిల్ వంటి ప్రముఖ పరిశ్రమలు ఉన్నాయి.

2011 జనాభా ప్రకారం జిల్లా జనాభా 27,41,239. అంటే జనాభా పరంగా ఈ జిల్లా చివరి నుంచి రెండో స్థానంలో ఉంది. అయితే రాష్ట్రంలో అత్యధిక జనాభా గల జిల్లా రంగారెడ్డి (52,96,741), అతి తక్కువ జనాభా గల జిల్లా నిజామాబాద్‌లో (25,51,335) ఆదిలాబాద్ జిల్లాలో 1,725 గ్రామాలు రికార్డయ్యాయి. అంటే రాష్ట్రంలో అత్యధిక గ్రామాలు నమోదైన జిల్లాగా గుర్తింపు పొందింది. అతి తక్కువగా రంగారెడ్డి జిల్లాలో (870) నమోదయ్యాయి. జనసాంద్రత ఈ జిల్లాలో 170 చ.కి.మీ.గా నమోదు అయింది. అంటే రాష్ట్రంలో అతి తక్కువగా జనసాంద్రత కలిగిన జిల్లా ఇది. ఎక్కువ జనసాంద్రత కలిగిన జిల్లా హైదరాబాద్ 18,172 చ.కి.మీ.

స్త్రీ, పురుష నిష్పత్తి ఈ జిల్లాలో 1001:1000గా నమోదయ్యింది. అయితే రాష్ట్రంలో అత్యధికంగా స్త్రీ, పురుష నిష్పత్తి గల జిల్లా నిజామాబాద్ 1040:1000 తక్కువగా హైదరాబాద్‌లో 954:1000 గా నమోదు అయింది.

0-6 ఏండ్ల మధ్యగల పిల్లల జనాభా 3,09,922గా నమోదయ్యింది. అంటే మొత్తం జనాభాలో వీరిశాతం 11.31, అత్యధికంగా 0 నుంచి 6 ఏళ్ళ పిల్లలు కలిగిన జిల్లాగా 6,33,172తో రంగారెడ్డి ప్రథమస్థానంలో ఉండగా, కనిష్ఠంగా 2,33,172తో ఖమ్మం చివరి స్థానంలో ఉన్నది.

0-6 సంవత్సరాల పిల్లల నిష్పత్తి ఈ జిల్లాలో 934:1000గా, అక్షరాస్యత 61.01 శాతంగా నమోదు అయింది. ఎస్టీ జనాభా ఈ

జిల్లాలో 4,95,794తో రాష్ట్రంలో రెండో స్థానం కలిగి ఉంది. అయితే మొదటి స్థానం ఖమ్మం జిల్లా (7,65,565). ఎస్సీ జనాభా ఈ జిల్లాలో 4,88,596లో నమోదయ్యింది. అయితే అత్యధికంగా ఎస్సీ జనాభా కలిగిన జిల్లా కరీంనగర్ (709,757). అదేవిధంగా అతి తక్కువగా ఎస్సీ, ఎస్టీ జనాభా హైదరాబాద్‌లో ఉంది.

## వాతావరణం

జిల్లాలో నైరుతి రుతుపవనాల వలన అత్యధికంగా 984.1 మి.మీ. వర్షపాతం కురుస్తుంది. ఇది రాష్ట్రంలో అత్యధిక వర్షపాతం (ఎస్‌డబ్ల్యూఎం), అదేవిధంగా అతి తక్కువగా నైరుతి రుతుపవనాల వలన మహబూబ్‌నగర్ జిల్లాలో 446.6 మి.మీ. వర్షపాతం కురుస్తుంది. ఈశాన్య రుతుపవనాల వల్ల ఈ జిల్లాలో 116.7 మి.మీ. వర్షపాతం కురుస్తుంది. అయితే అత్యధికంగా (ఎన్ఈఎం) 151.9 మి.మీ. హైదరాబాద్‌లోనూ, అతి తక్కువగా 113.6 మి.మీ. కరీంనగర్‌లోనూ నమోదైంది.

## అధిక సాగు గొట్టపు బావుల ద్వారానే..

జిల్లా మొత్తం నికర సాగుభూమి 87,773 హెక్టార్లు, ఇందులో చెరువుల ద్వారా 13, 891 హెక్టార్లు సాగవుతుంది. అత్యధికంగా చెరువుల ద్వారా సాగుచేస్తున్న జిల్లా వరంగల్ (59,968 హెక్టార్లు), అతి తక్కువగా (2108 హెక్టార్లలో) రంగారెడ్డి జిల్లా సాగుచేస్తుంది. కాలువల ద్వారా ఈ జిల్లాలో 10,592 హెక్టార్ల భూమి సాగవుతుంది. అత్యధికంగా కాలువల ద్వారా మహబూబ్‌నగర్ జిల్లాలో 30,291 హెక్టార్లు, అతి తక్కువగా కరీంనగర్ జిల్లాలో 311 హెక్టార్లు సాగవుతున్నాయి. గొట్టపు బావుల ద్వారా 43,136 హెక్టార్ల భూమి సాగు అవుతున్నది. అంటే రాష్ట్రంలో గొట్టపు బావుల ద్వారా అతి తక్కువగా సాగవుతున్న జిల్లా ఇది. అయితే అత్యధికంగా గొట్టపు బావుల ద్వారా మహబూబ్‌నగర్ జిల్లా 2,00,57 హెక్టార్లను సాగుచేస్తున్నది. శాతం వారీగా చూస్తే ఈ జిల్లాలో చెరువుల ద్వారా (15 శాతం), కాలువల ద్వారా (12 శాతం), గొట్టపు బావుల ద్వారా 49.14 శాతం, దిగుడు బావుల ద్వారా 20.30 శాతం సాగుచేస్తుంది.

## ప్రాజెక్టులు

*ప్రాణహిత చేవెళ్ల లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం.* దీనిని 2008లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి (ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో) ప్రారంభించారు. ఇది సిర్పూర్ నియోజకవర్గంలో తుమ్మిడి హెట్టి గ్రామంలో ఉన్నది. దీనిని డా॥ బీఆర్ అంబేద్కర్ 'ప్రాణహిత-చేవెళ్ల సుజల స్రవంతి' ప్రాజెక్టు అని పిలిచే ఈ ప్రాజెక్టును రంగారెడ్డి జిల్లా చేవెళ్ల వరకు చేపట్టనున్నారు. 7 జిల్లాల్లో 15 లక్షల ఎకరాలకు సాగునీరు, తాగునీరు అందించడానికి దీనిని రూపొందించారు. దీనికి రూ. 40 వేల కోట్లు ఖర్చవుతుందని అంచనా. దీనికోసం ఉమ్మడి రాష్ట్రంలో జాతీయ హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. కొత్తగా ఏర్పడిన తెలంగాణ ప్రభుత్వం కూడా దీనికోసం జాతీయ హోదాను అడుగుతుంది. దీనిని ప్రాణహిత నదిపై నిర్మించనున్నారు. 152 మీ॥ ఎత్తులో ఈ ప్రాజెక్టు నిర్మాణం జరగాల్సి ఉంది.

*కడెం ప్రాజెక్టు:* దీనిని కడెం నారాయణరెడ్డి ప్రాజెక్టు అంటారు. ఇది కడెం గ్రామంలో కడెం నదిపై ఉన్నది.

*సుద్దవాగు ప్రాజెక్టు:* సుద్దవాగు ప్రాజెక్టు సుద్దవాగు నదిపై కలదు. భైంసా గ్రామంలో ఉంది.

*పాల్వాయి పురుషోత్తంరావు ప్రాజెక్టు:* దీనినే ఎర్రవాగు ప్రాజెక్టు అంటారు. ఇది కోల్వాడా గ్రామంలో ంంది.

*ముఖ్యమైన ప్రాజెక్టులు:* లోయర్ పెనుగంగా ప్రాజెక్టు, ఎస్ఆర్ఎస్‌పి స్టేజ్-2, మాతాదివాగు, కొమరంభీమ్ ప్రాజెక్టులు, గొల్లవాగు ప్రాజెక్టు, పెద్దవాగు ప్రాజెక్టులు ముఖ్యమైనది.

*నదులు* : ప్రాణహిత, గోదావరి, సుద్దవాగు, కడెం, వత్సవాగు వంటి నదులు ఆదిలాబాద్ జిల్లాలో ఉన్నాయి.

*దర్శనీయ ప్రదేశాలు* : కుంటాల వాటర్ ఫాల్స్ రాష్ట్రంలో అతి ఎత్తయిన జలపాతం. ఇది సహ్యాద్రి కొండల్లో ఉన్నది.

*కవ్వాల్ వన్యప్రాణి సంరక్షణ కేంద్రం:* దీనిని 1964లో నెలకొల్పారు. ఇందులో పులులు, మొసళ్లు, కొండచిలువలు, నెమళ్లను సంరక్షిస్తున్నారు పోచారం వాటర్ ఫాల్స్, ప్రాణహిత వైల్డ్‌లైఫ్ సాంక్చురీ, మహాత్మా గాంధీ పార్క్, శివరాం వైల్డ్‌లైఫ్ సాంక్చురీలు ఉన్నాయి.

*సరస్వతీ దేవస్థానం బాసర:* ఇక్కడ పిల్లలకు అక్షరాభ్యాసం చేయిస్తారు. గోదావరి నదికి దగ్గర్లో ఉన్న ఈ దేవాలయం దేశంలోనే రెండవ సరస్వతి ఆలయం. మొదటిది జమ్ముకశ్మీర్‌లో ఉన్నది.

*ప్రజారోగ్యం* : ఈ జిల్లాలో మొత్తం పిహెచ్‌సి ల సంఖ్య 70. ఈ జిల్లాలో జననాల రేటు 19.2గా నమోదైంది. ఇన్‌ఫ్యాంట్ మోర్టలిటి రేట్ 56గా నమోదయ్యింది.

*పశుసంపద ఎక్కువే..* : ఈ జిల్లా గుండా ఎన్‌హెచ్ 7 జాతీయ రహదారి వెళ్తోంది. ఇది 266 కి.మీ. పొడవున పోతున్నది. రాష్ట్రంలో అధిక జాతీయ రహదారులు కలిగిన జిల్లా ఆదిలాబాద్.

రాష్ట్రంలోనే ఆదిలాబాద్ జిల్లాలో పశువులు ఎక్కువగా ఉన్నాయి (910,23,270).

మాంస ఉత్పత్తిలో, చికెన్ ఉత్పత్తిలో, గుడ్ల ఉత్పత్తిలో ఈ జిల్లా చివరి స్థానంలో ఉన్నది.

1,18,75,286 టన్నుల బొగ్గు ఉత్పత్తి చేస్తూ ఈ జిల్లా 3వ స్థానంలో ఉంది. అయితే మొదటి స్థానంలో ఖమ్మం, రెండో స్థానంలో కరీంనగర్ జిల్లాలు ఉన్నాయి. తలసరి విద్యుత్ వినియోగం (గృహావసరాలు, వ్యవసాయం, పరిశ్రమలు) ఈ జిల్లా 502 కెడబ్ల్యూహెచ్‌తో రాష్ట్రంలో చివరిస్థానంలో కలదు.

దేశీయ పర్యాటకులను ఆకర్షిస్తున్న రెండో జిల్లా ఆదిలాబాద్. మొదటి జిల్లా వరంగల్.

ఈ జిల్లాలో సీఎం కేసీఆర్ జైపూర్ థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని ప్రారంభించారు. దీని ఉత్పత్తి సామర్థ్యం 1200 మెగావాట్లు.

*కలివికోడికి ప్రసిద్ధి* : జిల్లా విస్తీర్ణం 16,128 చ.కి.మీ. ఈ జిల్లాలో అటవీ విస్తీర్ణం దాదాపుగా 723189 చ.కి.మీ. చొప్పున విస్తరించింది. అంటే 44.84 శాతం కలిగి ఉన్నది. జాతీయ అటవీ విధానం కంటే ఎక్కువగా నమోదవుతూ.. రాష్ట్రంలో అటవీ విస్తీర్ణంలో రెండో స్థానంలో ఉంది. మొదటిస్థానంలో ఉన్న జిల్లా ఖమ్మం (52.64 శాతం), చివరి స్థానం నల్లగొండ జిల్లా (5.88 శాతం) ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లా అడవుల్లో బీడిల తయారీకి ఉపయోగపడే తునికాకు లభిస్తుంది ఈ అడవిలో కలివికోడి ప్రసిద్ధి చెందినది. ప్రస్తుతం ఇది అంతరించే దశలో ఉన్నది. ◆

# ప్రాజెక్టుల నిర్మాణ వివరాలు

**ప్రాజెక్టుల నిర్మాణ పనుల ధరలను పెంచాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు సూచనల మేరకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఇందులో భాగంగా ప్రస్తుత మార్కెట్ ధరలకు అనుగుణంగా ప్రాజెక్టుల నిర్మాణ పనులకు చెల్లింపులు చేస్తారు. దాంతో ప్రభుత్వంపై అదనంగా రూ. 25 వేల కోట్ల మేర భారం పడే అవకాశం ఉంది.**

ఉమ్మడి రాష్ట్రంలో జలయజ్ఞం కింద తెలంగాణలో మొత్తం 33 ప్రాజెక్టుల ను చేపట్టారు. ఇందులో 18 భారీ ప్రాజెక్టులు, 12 మధ్య తరహా ప్రాజెక్టులు మరో రెండు ఆధునీకరణ ప్రాజెక్టులు, మరో ఫ్లడ్‌బ్యాంకు ప్రాజెక్టులు ఉన్నాయి. ఇందులో ఇప్పటికి మూడు ప్రాజెక్టులే పూర్తి చేశారు. మిగిలిన 30 ప్రాజెక్టుల నిర్మాణ దశలో ఉన్నాయి.

ఇందులో కొన్ని 95 శాతం పూర్తి కాగా, మరి కొన్ని 50 శాతం పనులు పూర్తయినవి ఉన్నాయి. ఈ మొత్తం ప్రాజెక్టుల పరిపాలన అనుమతి విలువ 1,11,335 కోట్లు. అయితే కాంట్రాక్టర్లతో రూ. 84,508 కోట్ల పనులకు ప్రభుత్వంతో ఒప్పందాలు కుదిరాయి. ఇందులో భాగంగా ఇప్పటి వరకు రూ. 45,331 కోట్ల విలువ గల ప్రాజెక్టుల నిర్మాణ పనుల్ని పూర్తి చేశారు. అంటే ఇంకా సుమారు రూ. 40 వేల కోట్ల విలువ గల నిర్మాణ పనుల్ని చేయాలి. ప్రస్తుతం పెంచబోయే ధరలు ఈ రూ. 4 వేల కోట్ల నిర్మాణ పనులకు వర్తిస్తాయి.

**తెలంగాణ రాష్ట్రంలోని ముఖ్య ప్రాజెక్టుల నిర్మాణాల వివరాలు..**

*(అంచనా వ్యయం, ఖర్చు రూ. కోట్లల్లో)*

| ప్రాజెక్టు పేరు | అంచనా వ్యయం | ఇప్పటికి చేసిన ఖర్చు |
|---|---|---|
| ఎస్సారెస్పీ -2 | 1043.14 | 916.72 |
| దేవాదుల | 9427.73 | 7417.27 |
| కంతనపల్లి | 11773 | 35.05 |
| ఎల్లంపల్లి | 4942.57 | 4052.92 |
| ప్రాణహిత్ చేవెళ్ల | 38500 | 8166.21 |
| కల్వకుర్తి | 2990 | 2807.45 |
| కోయిల్‌సాగర్ | 458.25 | 399.49 |
| భీమా | 2158.40 | 2099.15 |
| నెట్టెంపాడు | 1862.73 | 1800.94 |
| ఇందిరాసాగర్ | 1203.89 | 642.34 |
| రాజీవ్‌సాగర్ | 1681 | 832.19 |
| ఏఎమ్మార్పీ | 5811.42 | 4402.41 |

జలయజ్ఞం ప్రాజెక్టులను పదేళ్ల క్రితం ఇంజనీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) విధానంలో చేపట్టారు. కాంట్రాక్టర్లతో ఒప్పందాలు కూడా ఈ పద్ధతి ప్రకారమే జరిగాయి. ఈ విధానంలో భాగంగా ప్రాజెక్టు నిర్మాణ వ్యయం పెరిగినా, తగ్గినా ప్రభుత్వానికి సంబంధం ఉండదు. ఒప్పందం చేసుకున్న అంచనా వ్యయంతోనే సదరు కాంట్రాక్టర్ ప్రాజెక్టు నిర్మాణ పనుల్ని నిర్ణీత గడువు లోపు పూర్తి చేయాలి. ఇప్పుడు పెంపు వర్తించే ప్రాజెక్టులను కాంట్రాక్టర్లు.. నిర్ణీత గడువులోపు పూర్తి చేయలేకపోయారు. పైగా మూడు, నాలుగేళ్లలో పూర్తి కావాల్సిన ప్రాజెక్టులు పదేళ్లైనా ఇంకా నిర్మాణ దశలోనే ఉన్నాయి.

దాంతో పదేళ్ల క్రితం కుదుర్చుకున్న ధరల ప్రకారం ఇప్పుడు పనులు చేయాలంటే తమకు గిట్టుబాటు కాదని కాంట్రాక్టర్లు పనులను నిలిపి వేశారు. నిర్ణీత సమయంలో ప్రభుత్వం భూసేకరణ చేయలేదని, వివిధ అనుమతులను సాధించడంలో జాప్యం జరిగిందన్న కారణాలను తెరపైకి తీసుకువచ్చారు. ప్రాజెక్టుల నిర్మాణ జాప్యానికి ప్రభుత్వమే కారణం అయినందున ధరలను పెంచాలని డిమాండ్ చేశారు. ధరలను పెంచాల నే కాంట్రాక్టర్ల డిమాండ్ ఉమ్మడి రాష్ట్రంలోనే వచ్చింది.

దీనిపై అప్పటి ప్రభుత్వం ఇంజనీర్ల కమిటీని వేసి అధ్యయనం చేయించింది. ధరలను పెంచాలని ఈ కమిటీ ప్రభుత్వానికి నివేదికను సమర్పించింది. దాంతో 2014 ఫిబ్రవరి 7వ తేదీన ధరలను పెంచుతూ (జీవో నెంబర్ 13) ఉత్తర్వులను జారీ చేశారు. అయితే ఈ నిర్ణయంపై అప్పట్లో వివాదం చెలరేగింది. దాంతో ఈ ఉత్తర్వులను నిలుపుదల చేశారు. అనంతరం రాష్ట్రవిభజన, ఎన్నికలు వంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి.

ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంపై ఒత్తిడి పెరిగింది. తెలంగాణలోనూ కొత్త ధరలను వర్తింపజేయాలని కాంట్రాక్టర్లు డిమాండ్ చేస్తున్నారు. అప్పటి వరకు నిర్మాణాలను చేయబోమని స్పష్టం చేశారు. ఈ పరిస్థితుల్లో ధరల ను పెంచాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్టు సమాచారం. పూర్తి చేయాల్సి ఉన్న రూ. 40 వేల కోట్ల విలువైన పనులకు ఈ నిర్ణయాన్ని వర్తింపజేయాలి. తాజా ఎస్ఎస్ఆర్ ధరల ప్రకారం అంచనా వేస్తే.. పెరుగుదల 60 శాతం ఉండవచ్చని భావిస్తున్నారు. ఈ ప్రకారం తెలంగాణ రాష్ట్రంపై అదనంగా రూ. 25 వేల కోట్ల ఆర్థిక భారం పడనుందని భావిస్తున్నారు.

# ప్రజల భాగస్వామ్యంతో ప్రగతి

**బ్రిటిష్ పాలన అంతమైన తర్వాత జరిగిన మార్పుల నేపథ్యంలో తెలంగాణ సాంస్కృతిక, రాజకీయ సమకాలీన పరిస్థితులను అంచనా వేస్తే ఆసక్తికర అంశాలు వెల్లడవుతాయి. మధ్యయుగాల ఫ్యూడల్ పునాదులపై బ్రిటిష్ సామ్రాజ్యం వాణిజ్య కారణాలతో ప్రవేశించి రాజకీయ అధికారాన్ని చేజిక్కించుకొని ప్రజల జీవన విధానాన్ని అతలాకుతలం చేసింది. బ్రిటిష్ పరిపాలనలో వచ్చిన క్రైస్తవ మిషనరీల ప్రభావంతో ఎంతోమంది సంఘ సంస్కర్తలు ముందుకొచ్చారు.**

తమిళనాడులో పెరియార్ రామస్వామి, అన్నాదురై, బెంగాల్‌లో రాజా రామ్మోహనరాయ్, ఆంధ్రలో వీరేశలింగం పంతులు తదితరులు అనివార్యమైన సంఘ సంస్కరణలకు ఆద్యులయ్యారు. సర్ ఆర్థర్ కాటన్, బ్రౌన్‌లాంటి బ్రిటిష్ అధికారులు ఆర్థిక, సాంస్కృతిక మార్పులు చేశారు.

అప్పటికి తెలంగాణ నిజాం పరిపాలనలో ఉన్నది. బ్రిటిష్ ప్రభుత్వంతో నిజాం ప్రభుత్వం సఖ్యత కొనసాగించడం వల్ల క్రైస్తవ మిషనరీలు ఇక్కడికి రాలేపోయాయి. మధ్యయుగాల ఫ్యూడల్ పోకడలకు సమాజం చీకటి బతుకుల విముక్తి కోసం చేసిన 'తెలంగాణ సాయుధ రైతాంగ తిరుగుబాటు' ద్వారా చరిత్ర పుటల్లోకెక్కింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ తెలంగాణలో చీకటి పాలన కొనసాగింది. వందల రాష్ట్రాల పేరిట ఆంధ్ర ప్రాంతంలో విలీనం చేశారు. ఇక్కడున్న సహజ వనరులు, సమతుల్య వాతావరణం, దక్కన్ పీఠభూమిలో గంగ తెహజీబ్ సంస్కృతితో మతసామరస్యం పరిఢవిల్లిన హైదరబాద్ నగరాలు దానికి కారణమయ్యాయి.

అనంతరం నిరక్షరాస్యత, మానవ వనరులు, ఆర్థికాభివృద్ధి, సామాజిక సంబంధాల పురోగతి ఇలా చెప్పుకుంటూ పోతే ప్రతి దాంట్లో ఆంధ్ర పాలనలో తెలంగాణకు తీరని అన్యాయం జరిగింది. 'తెలుగు జాతి ఒక్కటే' అనే విధ్వంసాన్ని తెలంగాణ ప్రజలు, మేధావులు 1969లోనే కనుక్కొని తొలి ఉద్యమాన్ని షురూ చేశారు. నాటి నుంచి పలు దఫాలుగా తెలంగాణ ప్రజలు ఉద్యమాలు చేశారు. ఆ పోరాటాల ఫలితంగా జూన్ 2, 2014న తెలంగాణ ప్రజల కల నెరవేరింది. తెలంగాణ పూర్తి స్వాతంత్ర్యం వచ్చింది. దీంతో తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవనం పురుడు పోసుకున్నది.

తెలంగాణ ప్రజలు ఇచ్చిన ఏకపక్ష తీర్పు ద్వారా తెలంగాణ రాష్ట్ర సమితి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీల ప్రకారం రైతుల రుణమాఫీ, ఇతర సంక్షేమ పథకాలకు రూపకల్పన చేయడం, సమగ్ర సర్వే తదితర పథకాలకు శ్రీకారం చుట్టింది తెలంగాణ ప్రభుత్వం.

దశాబ్దాలుగా దెబ్బతిని, అభివృద్ధికి నోచుకోని ఎంతో మందికి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు పథకాలు తాత్కాలిక ఉపశమనమిస్తాయి. బీడీ కార్మికుల కుటుంబాలు సంబురాలు చేసుకున్నాయి. తెలంగాణలో వ్యవసాయం తర్వాత జీవనోపాధిని కల్పిస్తున్నది బీడీ పరిశ్రమే. తెలంగాణ సాంస్కృతిక సంపద, వారసత్వాన్ని కాపాడుతూ, రూపకల్పన చేసిన పథకాలు తెలంగాణ సమాజ ఔన్నత్యానికి ఎదుగుదలకు, పురోభివృద్ధికి తోడ్పడుతాయి. తెలంగాణలో మొదటి స్వాతంత్ర్య వేడుకలు గోల్కొండ కోటపైన పతాకాన్ని ఆవిష్కరించి తరిగిపోతున్న సంపదను కాపాడడమే కాకుండా, తెలంగాణ అస్తిత్వాన్ని చాటారు ముఖ్యమంత్రి కేసీఆర్.

తెలంగాణలోని చెరువులకు జరిగిన విధ్వంసాన్ని 46,531 చెరువులకు గాను 20 వేల కోట్ల రూపాయల ఖర్చుతో యాభైశాతం వరకు పునరుద్ధరించుకోవచ్చు. 100-150 గజాల లోతులో ఉన్న భూగర్భ జల మట్టం 1000-1500 గజాల లోతు వరకు వెళ్లడం వల్ల వ్యవసాయ రైతులు ఇబ్బందులకు గురయ్యారు. భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. 'మిషన్ కాకతీయ' పేరుతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కార్యక్రమంలో ఇప్పటికే మూడు వేల చెరువుల మరమ్మత్తులు ప్రారంభమయ్యాయి. దశల వారీగా చేపట్టే ఈ కార్యక్రమం గ్రామీణ జన జీవితాన్ని, పర్యావరణాన్ని ప్రభావితం చేస్తాయి.

ఇతర రాష్ట్రాలలో పోలిస్తే తెలంగాణలో అక్షరాస్యతా శాతం చాలా తక్కువ. అక్షరాస్యతను పెంచడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలు ప్రవేశపెట్టినప్పటికీ వివిధ కారణాలతో ఫలితాలు పొందలేకపోయాయి. అందుకే తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య ప్రకటించింది. ఇది విజయవంతం కావాలంటే అందుకు అవసరమైన చట్టాలను సవరించాలి. ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లో అర్హత ఉన్న అధ్యాపకుల ద్వారా రెసిడెన్షియల్ పద్ధతిలో బోధనా పద్ధతుల్ని అమలు చేయాలి. ఇలా అంచెలంచెలుగా, ప్రయోగాత్మకంగా చేపట్టినట్లయితే సుసాధ్యమవుతుంది. వాటర్‌గ్రిడ్ పథకం ద్వారా రాష్ట్రంలోని ఇంటింటికి మంచినీరు అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

ఈ కార్యక్రమాన్ని మారుమూల గ్రామాలకు విస్తరిస్తే గిరిజన గ్రామాలు, తండాలు మైళ్ల కొద్ది నడిచి వెళ్లే పరిస్థితిని అధిగమించవచ్చు. ముఖ్యంగా రంగారెడ్డి, నల్గొండ జిల్లాల ప్రజలు ఫ్లోరైడ్ నుంచి విముక్తి పొందుతారు. ప్రభుత్వం ఈ పథకాన్ని రానున్న ఎన్నికలకు ముందే పూర్తి చేయడానికి ముందుకు రావడం హర్షనీయం.

విశ్వవిద్యాలయాలు, విద్యావంతులు, ఉద్యోగులు తెలంగాణ పునర్వికాస ఎజెండాతో ముందుకుపోతే 2020 వరకు సంపూర్ణ అక్షరాస్యతతో పాటు గుణాత్మకమైన సామాజిక మార్పుకు దోహదం చేయవచ్చు. మిషన్ కాకతీయపై మిచిగాన్ విశ్వవిద్యాలయం మాదిరిగా ఇక్కడి అన్ని విశ్వవిద్యాలయాలు, పరిశోధనా కేంద్రాలు అభివృద్ధి పథకాలను నమూనాలను శోధించి రూపొందించాలి. ప్రభుత్వానికి నిర్మాణాత్మక సూచనలను అందజేయడం ద్వారా ప్రగతిలో భాగస్వాములవుతారు.

తెలంగాణ భాషను కూడా నిఘంటువుల రూపకల్పన ద్వారా పాత పదాలను తిరిగి సమకూర్చుకొని వాడుకలోకి తీసుకురావాలి. ఇందుకోసం నిపుణులైన భాషా సాహితీవేత్తల సలహాలు తీసుకోవాలి.

ముఖ్యమంత్రి కేసీఆర్ ఎనిమిది నెలల పాలనలో తెలంగాణను 'బంగారు తెలంగాణ' వైపు అడుగులు వేయించడమే కాదు పటిష్ఠమైన పునాదులు పడుతున్నాయి. అధికార యంత్రాంగం ఈ బృహత్తర కార్యక్రమంలో ప్రజలకు సంక్షేమ ఫలాల్ని అందించే వాహనంగా ఉపయోగపడాలి. తెలంగాణ పునరుజ్జీవన చైతన్యం ప్రతీ ఉద్యోగిలో రావాలి. తెలంగాణ రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధి చేయాలి. తెలంగాణ మానవ వనరుల అభివృద్ధితో పాటు, మానవ సంబంధాల ఉన్నత విలువల గల తెలంగాణ సమాజం దేశంలో ఆదర్శ రాష్ట్రంగా నిలుస్తుంది.

- ఎస్.పి. ఆర్

# మహిళా సాధికారతకు మిషన్ రుద్రమ

**చెరువుల పునరుద్ధరణను ప్రజా ఉద్యమంగా రూపొందించి ఈ కార్యక్రమానికి 'మిషన్ కాకతీయ' గా కేసీఆర్ నామకరణం చేయడం ముదావహం. అలాగే సమాజంలోని పలు రుగ్మతలకు కారణమైన లింగ వివక్షకు పరిష్కారం చూపే మహిళా సాధికారదిశగా సీఎం అడుగులు వేయడాన్ని తెలంగాణ హర్షిస్తున్నారు.**

'కాకతీయుల అభివృద్ధే ఆదర్శం కావాలె' వ్యాసంలో కాలువ మల్లయ్య మనకు అవసరమైన అభివృద్ధి నమూనాను వివరించారు. కాకతీయుల ఈ ప్రాంత అభివృద్ధికి స్థానిక పరిస్థితులను పరిగణలోనికి తీసుకోవడంతోపాటు మానవాళి అభివృద్ధికి విశ్వజనీనమైన భావాలను ఆచరించారు. కాకతీయులు మనకు మిగిల్చిన భౌతిక సంపదలు రాళ్ళు (శిల్ప సంపద), నీళ్ళు (గొలుసు కట్టు చెరువులు). వీటితోపాటు మనకందించిన గొప్ప భావసంపద బాలికా సాధికారత. ఈ దిశగా తగినంత పరిశోధన జరగకపోవడం దురదృష్టం.

నాటి సమకాలీన సమాజాల్లో మహారాణులు, ఇతర కుల స్త్రీలు సతీసహగమనాన్ని పాటించేవారు. యుద్ధాలలో ఓడిపోతే సంధి కోసం కూతుళ్ళు, చెల్లెళ్ళను విజేతలతో వివాహం చేసేవారు. రుద్రమాంబ, గణపాంబ తల్లులు పేరాంబ, నారాంబలను సంధిలో భాగంగానే గణపతిదేవ చక్రవర్తితో వివాహం చేశారు. అటువంటి సామాజిక నేపథ్యంలో గణపతిదేవుడు ధృడచిత్తంతో తన కుమార్తెలు రుద్రమాంబ, గణపమాంబలకు రాజనీతిని, యుద్ధ విద్యలను నేర్పించాడు. నాటి సాంప్రదాయ భావలననుసరించి వారికి పురుషవేషం ధరింపజేశాడు.

మహామంత్రి శివదేవయ్యతో పాటు సైన్యాధిపతులను అందుకు ఒప్పించాడు. మహిళలకు రాజ్యాధికారాన్ని కొందరు దండనాయకులు, సామంతులు, ఇతర రాజులు అంగీకరించపోవచ్చునని ముందుగానే ఊహించిన గణపతిదేవుడు ఆమెను యువరాజుగా ప్రకటించి తనతోపాటు రాజ్యపాలనలో భాగస్వామిని చేశాడు. తాను బతికి ఉండగానే ఆమెకు 1259లో పట్టాభిషేకం చేశాడు. రుద్రమాంబ సైతం తండ్రి స్ఫూర్తిని అందిపుచ్చుకొని తన స్నిగ్ధత, విజ్ఞతతో అనతికాలంలోనే ప్రజామోదం పొందింది.

స్త్రీ రాజ్యాధికారాన్ని సహించలేని సామంతులను, ఇరుగుపొరుగు రాజులతో తన పరిపాలనా కాలమంతా పోరాడుతూ, తిప్పికొడుతూ ఉండటం వల్ల రుద్రమదేవి పెద్దగా అభివృద్ధి పనులు చేపట్టలేకపోయినప్పటికీ పరిపాలనా వ్యవస్థనూ, గొలుసుకట్టు చెరువులను చక్కగా నిర్వహించింది. భర్త చాళుక్య చినవీరభద్రుడు కాకతీయ సామ్రాజ్య పాలనను ఆశించినప్పటికీ రుద్రమ అతనికి అవకాశమీయలేదు. అతడు స్పర్ధలు పెంచుకున్నప్పుడు తాను చినవీరభద్రుని ధర్మపత్నిననే విషయాన్ని గుర్తుచేస్తూనే, పరిపాల నను మరొకరికి అప్పగించి కాకతీయ సామ్రాజ్య ప్రజానీకం తనపై ఉంచిన విశ్వాసాన్ని వమ్ముచేయలేనని స్పష్టం చేయడంతో చినవీరభద్రుడు దిగివచ్చి ఆమెకు సహకరించక తప్పలేదు. తనపాలనలో ఎన్నడూ భర్త జోక్యానికి అవకాశమీయలేదు. ఈ అంశాలను నేటి మన మహిళానేతలు ఆదర్శంగా తీసుకోవాలి.

ఆమె సోదరి గణపమదేవి తన భర్త కోట బేతరాజు సరసన సింహాసనాన్ని అధిష్టించి 24 ఏండ్లు, అతని మరణానంతరం మరో 15 ఏళ్లు పాలన చేసింది. ఓడరేవులను, విదేశీ వర్తకులకు తగు సౌకర్యాలు కల్పించి వాణిజ్యాన్ని, చెరువులు తవ్వించి వ్యవసాయాన్ని అభివృద్ధి చేసిందనీ, మోటుపల్లి పట్టణాన్ని బహుళజాతి పట్టణంగా రూపొందించిందనీ వెనీషియన్ చరిత్రకారుడు మార్కోపోలో నమోదు చేశాడు. ఆమె తన సామ్రాజ్యంలోని వనరులను అత్యంత సమర్ధవంతంగా ఉపయోగించుకొని, ఆర్థిక పురోగతిని సాధించిన తీరును మనం తెలుసుకోవచ్చు.

రుద్రమదేవికి తర్వాత కూడా ఎంతోమంది స్త్రీలు చనిపోయిన భర్తలకు ప్రతినిధులుగానో, మైనర్లయిన కుమారులకు రాజమాతగానో రాజ్యాధికారం చేసినప్పటికీ బాలికా/మహిళా సాధికారత భావనతో గణపతిదేవునితోపాటు రుద్రమ, గణపమలకు స్పష్టత ఉన్నట్టు మనం గమనించవచ్చు.

కాకతీయులను ఎదిరించిన సమ్మక్క, సారక్కల పోరాటపటిమ మనలను ఉత్తేజితులను చేస్తుంది. గోల్కొండ సామ్రాజ్యం సంక్షోభంలో ఉన్నప్పుడు రాజమాత హయత్ బక్షీ నడిపిన మంత్రాంగం వల్లనే చాలాకాలం ఔరంగజేబు దక్కనులో చొరబడలేకపోయాడు. రజాకార్లను అడ్డుకోవడానికి చాకలి ఐలమ్మ చూపిన ధీరత్వాన్ని మనమెన్నటికీ మరువలేము. సీమాంధ్ర శాసనసభలో కాసు బ్రహ్మానందరెడ్డికి తెలంగాణ అంశంపై చెమటలు పట్టించిన ఈశ్వరీబాయిని తెలంగాణ ఉద్యమకారులు ఎప్పటికీ తలచుకుంటారు. రాయనిగూడెంలో 'జై తెలంగాణ' నినాదాలతో పరుగులు పెట్టించింది కూడా ఆడపిల్లలే.

కాకతీయుల నాటి సమాజానికి ఆర్థిక మూలాలైన గొలుసుకట్టు చెరువుల పునరుద్ధరణ కొత్త రాష్ట్రంలో ఎంత ప్రాధాన్యంగా మారిందో, కాకతీయ గణపతిదేవుని మానసపుత్రికయైన మహిళాసాధికారత కూడా కేసీఆర్ నాయకత్వంలో అంతే ప్రాధాన్యంతో రూపొందుతున్నదని తెలంగాణ ఆడబిడ్డలు విశ్వసిస్తున్నారు. ఆరు దశాబ్దాల పాలనలో తెలంగాణ సమాజం కంటే ఎక్కువగా ఈ ప్రాంత స్త్రీలు అధోలోకాలకు తోసివేయబడ్డారు. నాటి ఆంధ్రప్రదేశ్ అక్షర క్రమంలో ముందున్నప్పటికీ ఆడవారి స్థానం అధ:పాతాళంలో ఉన్నది.

స్త్రీ సాధికారతకు ముఖ్యమైనవి ఆరోగ్యం, విద్య. 2001 మహిళల జాతీయ సగటు జీవిత కాలం 66.1 సంవత్సరాలైతే సమైక్యాంధ్రప్రదేశ్‌లో మహిళల సగటు వయసు 65.8 సంవత్సరాలు. సగటు ప్రసూతి మరణాల సంఖ్య తగ్గుదలను శాంపిల్ రిజిస్ట్రేషన్ జాతీయ స్థాయిలో ప్రసూతి మరణాల

సంఖ్య 34 తగ్గితే, సమైక్య రాష్ట్రంలో 24 మాత్రమే తగ్గింది.

ఇక మానవాభివృద్ధి సూచికతలో దక్షిణ భారతంలో ఆంధ్రప్రదేశ్ స్థానం మరీ అధ్వాన్నంగా 0.473కు పడిపోయింది. దేశవ్యాప్తంగా స్త్రీల పై జరిగే నేరాలలో ఢిల్లీ ( 21.41 శాతం) తర్వాత రెండవ స్థానంలో ఆంధ్రప్రదేశ్ (10.6శాతం) ఉన్నాయి. ఈ దశాబ్ద కాలంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాలనే తేడా లేకుండా సమైక్య రాష్ట్రంలో బాలికల సంఖ్య దారుణంగా తగ్గిపోయింది. పొరుగు రాష్ట్రాలైన కేరళ, కర్ణాటక, తమిళనాడులు బాలికల సంఖ్యలో పురోగతిలో ఉన్నాయి. ఆరు దశాబ్దాలుగా అధికారంలో ఉన్న సీమాంధ్రులు ప్రతీ అంశాన్ని వ్యాపారకోణం నుంచి చూసే దృక్పథం వల్ల ఆడపిల్ల మైనస్‌గానూ, మగపిల్లవాడు ప్లస్ గానూ గుర్తించబడుతున్నారు.

బంగారు తెలంగాణ నిర్మాణ కార్యాచరణ మన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తెలిసినంతంగా మరెవరికీ తెలియదు. కేసీఆర్ నాటి గణపతిదేవుని అడుగుజాడల్లో చెరువుల పునరుద్ధరణతోపాటు మహిళా సాధికారతకు నడుం బిగించారని తెలంగాణ ఆడబిడ్డలు విశ్వసిస్తున్నారు. మహిళల భద్రతకు స్మితా సభర్వాల్ కమిటీని నియమించి మహిళా సాధికారత దిశగా తొలి అడుగువేశారని భావిస్తున్నారు. వైద్య ఆరోగ్య రంగాలను మహిళా హితమైనవిగా మార్చడానికి స్మితా సబర్వాల్ కమిటీ పలు ఆచరణాత్మకమైన సూచనలు చేసింది. ఉన్నత విద్య, ఉపాధి, ఉద్యోగ రంగాల్లోని స్త్రీల రక్షణ, భద్రత, వృత్తి నైపుణ్యాలు, ఉద్యోగ మెళకువలు, ఆర్థిక స్వాలంబనను పెంపొందించే చర్యలనూ చర్చించింది.

మహిళా సాధికారత చేకూరడానికి శిక్షణలతో పాటు రక్షణా చర్యలు ఒకదాని వెంట ఒకటి నడవాలి. కార్యాలయాలు, విద్యాలయాల్లో లింగవివక్షకు వ్యతిరేకంగా చైతన్యం పెంపొందించడానికి యుద్ధ ప్రాతిపదికన కార్యాచరణ రూపొందించాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నొక్కి చెప్పింది. వాటిల్లో ప్రత్యేకంగా శిక్షణ పొందిన ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులను కౌన్సిలర్లుగా నియమించాలి. స్త్రీ పట్ల జాలి చూపించడం కాకుండా వివక్ష వల్ల సమాజం కోల్పోతున్నదేమిటో తెలియజేయాలి. స్త్రీ లేకుంటే సమాజం మనుగడ సాగించలేదని వివరించాలి.

తెలంగాణ సమాజం సిరి సంపదలతో తులతూగాలంటే ప్రతి ఊరికీ జలసిరి కావాలి. ప్రతీ కుటుంబం సుఖసంతోషాలతో గడపాలంటే మహిళా సమానత్వం, సాధికారత కావాలి. మహిళా సాధికారతను 'మిషన్ రుద్రమ' పేరుతో ఒక ఉద్యమంగా మలచాలి.

*– ఎ. ఉమాదేవి*

# మైనార్టీలకు చేయూత

**'హయత్ లేకే చలో.. కాయనాత్ లేకే చలో'... చలోతో సారే జమానేకో సాత్ లేకే చలో'... అంటూ ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ప్రజలకు పిలుపునిచ్చారు. సెక్యులర్ రాష్ట్రంగా తెలంగాణను ప్రపంచం ముందు నిలబెడతామని సీఎం కేసీఆర్ ఉద్ఘాటించారు.**

రాష్ట్ర అసెంబ్లీలో జరిగిన చర్చలో భాగంగా సీఎం కేసీఆర్ ముస్లింల హక్కుల పరిరక్షణ, వారి అభివృద్ధి-సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. దీంతో ముస్లింలలో హర్షం వ్యక్తమవుతోంది. సీఎం కేసీఆర్ నిర్ణయంతో ముస్లింలకు పూర్వవైభవం దక్కుతుందని సంతోషం వ్యక్తమవుతోంది.

కేసీఆర్ హామీ ఇచ్చారు. నాంపల్లి వద్ద ఉన్న ప్రస్తుత హజ్ భవనం సరిపోవడం లేదని, ఈ క్రమంలోనే మరింత విశాలంగా ఉండేందుకు హజ్ హౌస్ నిర్మించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రసిద్ధ బాబాషర్ఫుద్దీన్ దర్గాకు ర్యాంపు ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. జహంగీర్‌పీర్ దర్గా, బడాపహాడ్ దర్గా, జాన్‌పహడ్ దర్గాల అభివృద్ధికి అధికారులతో సమావేశమై చర్చిస్తామన్నారు. పాతబస్తీ అభివృద్ధి కోసం ఏర్పాటైన కులీకుతుబ్‌షా పట్టణాభివృద్ధి సంస్థకు తగినన్ని నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. త్వరలోనే 'కుడా' అధికారులతో సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు.

### అనీసుల్ గుర్బాలో....

నాంపల్లిలోని ముస్లిం పిల్లల అనాథాశ్రమం అనీసుల్‌గుర్బాలో ప్రమాణాలను మెరుగుపరుస్తామన్నారు. అంతేకాకుండా పక్కనే ఉన్న ఆర్ అండ్ బీ భవనం కూడా కేటాయించి బాల బాలికలకు వేర్వేరుగా గదులు ఉండేలా చూస్తామన్నారు. అనీసుల్‌గుర్బా నిర్వహణ కమిటీలో స్థానిక ప్రజా ప్రతినిధులు, ఎంపీకి సభ్యుడుగా అవకాశం కల్పిస్తామన్నారు. ఈ క్రమంలోనే హుస్సేన్‌షావలీ దర్గాలో ప్రస్తుతం ఉన్న ఖాళీ స్థలాన్ని పరిరక్షిస్తామన్నారు.

### ఆడిటోరియం నిర్మాణం...

140 ఏళ్ల చరిత్ర కలిగిన చారిత్రక జామియా నిజామియా ఇస్లామిక్ యూనివర్సిటీ అభివృద్ధికి సహకరిస్తామన్నారు. ఈ యూనివర్సిటీ ఎంతో మందికి విద్యనందించిందన్నారు. నిజామియా యూనివర్సిటీలో ఆడిటోరియం నిర్మాణానికి రూ. 9.6 కోట్లు కేటాయిస్తూ జీవో జారీ చేశామన్నారు. అంతేకాకుండా మైనారిటీ సంక్షేమం కింద విడుదల అవుతున్న నిధుల దుర్వినియోగం కాకుండా గ్రీన్‌ఛానల్ ఏర్పాటు చేస్తామని సీఎం ప్రకటించారు. నగరంలోని ఉర్దూ విద్యా సంస్థల్లో టీచర్ పోస్టుల భర్తీ చేపడతామని సీఎం ప్రకటించారు. ముస్లింలకు బీసీ క్రీమీలేయర్ విధానం అమలయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రీమెట్రిక్, పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌లు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

*– టి.ఎస్.జి.ఓ.*

# తెలంగాణ స్థానిక పంచాయతీ సంస్థలు పనిచేయటానికి ప్రోత్సాహం

**భారతదేశ స్థానిక పంచాయతీ సంస్థలు గ్రామీణాభివృద్ధికి చేయవలసిన పనులకు ఊతం కల్పించింది 73వ రాజ్యాంగ సవరణ. ఈ 73వ రాజ్యాంగ సవరణ గ్రామ పంచాయతీలకు ప్రత్యక్ష ప్రజాస్వామిక అధికారాలను సమకూర్చింది. గ్రామీణ ప్రజలకు గ్రామాభివృద్ధిలో భాగస్వామ్యంను కల్పించి వారి గ్రామాన్ని వారే బాగు చేసుకోవటానికి "గ్రామసభ' ను ఏర్పాటు చేసుకొని ఆ గ్రామసభలో తీసుకొన్న నిర్ణయాల ను ఆ గ్రామ సర్పంచు అమలు చేయటానికి వీలు కల్పించింది.**

గ్రామ సభయే క్రిందిస్థాయిలో అత్యున్నత పార్లమెంటు లాంటిది. దానికి పూర్తి అధికారాలు కట్టబెట్టడం జరిగింది. గ్రామపంచాయతీ పాలనను బలోపేతం చేసింది. అంటే గ్రామంలోని సమస్యలైన త్రాగునీరు, విద్య, వైద్యం, పారిశుద్ధ్య సౌకర్యాలను కల్పించుకోటానికి ఆ గ్రామ ప్రజల అభిప్రాయాలను తెలుసుకొని అమలు చేయటానికి 73వ రాజ్యాంగ సవరణ 1993 ను అమలు చేయటానికి 32 ప్రభుత్వశాఖాధికారులు గ్రామా భివృద్ధిలో భాగస్వాములను చేసింది.

కేరళ ప్రభుత్వం 73వ రాజ్యాంగ కు స్ఫూర్తిగా తీసుకొని ఆ సవరణ ఆదేశించినట్లు 1994 నుండే వాటిని అమలు చేయటం ప్రారంభించి ఎంతో ప్రగతిని సాధించింది. వార్డు సభ్యులకు, ఉపసర్పంచు, సర్పంచులకు 73వ రాజ్యాంగ సవరణలో పేర్కొన్నట్లు వారికి జీతభత్యాలను నిర్ణయించి గ్రామాభ్యుదయంలో చురుకుగా పాల్గొనేట్లు చేసింది. అక్షరాస్యతను సాధించింది. గ్రామ స్వయం సమృద్ధికి కేంద్రం, రాష్ట్రం అమలు చేస్తున్న పథకాల నుండి ప్రత్యక్షంగా గ్రామానికి లక్ష రూపాయలు పొంది అభివృద్ధి చెందాయి.

అదేరీతిలో నూతనంగా ఏర్పడిన తెలంగాణా ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర సమితి ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు పంచాయతీరాజ్ శాఖా మంత్రి కె.టి.రామారావులు చొరవ తీసుకొని గ్రామ పంచాయతీలకు ఆర్థికంగా పరిపుష్టి కల్పించి వారిని అభివృద్ధిలో భాగస్వాములను చేయడం జరుగుతుంది. ఈ నేపథ్యంలో పంచాయతీ శాఖమంత్రి శ్రీ కె.టి రామారావు, ఆ శాఖ ప్రిన్సిపల్ ముఖ్యకార్యదర్శి రేమాండ్ పీటర్ కేరళ గ్రామాలను సందర్శించడం, వారు చేసిన అధ్యయనాన్ని బట్టి తెలంగాణ రాష్ట్రంలో అదే రీతులలో అమలు చేయటానికి చర్యలు చేపట్టడం జరిగింది.

కేరళ ప్రభుత్వం మూడంచెల గ్రామపాలనను అమలు చేస్తూ ఆర్థికాభివృద్ధిని సాధించింది - స్థానిక పాలనలో ప్రజల భాగస్వామ్యంతోనే విజయవంతం చేసింది. పంచాయితీలకు 12వ షెడ్యూల్డులోని 29 అంశాల ను 1997లోనే పూర్తిస్థాయిలో బదిలీ చేసింది. కేరళ మొత్తం జనాభా 3.23 కోట్లు, కేరళలోని మొత్తం గ్రామ పంచాయతీలు 999. 152 బ్లాక్ పంచాయతీలు, 14 జిల్లా పంచాయతీ పరిషత్‌లు, 53 మున్సిపాలిటీలు, 5 నగర పాలక కార్పోరేషన్ కలిపి 1223 ప్రభుత్వపాలనను సాగిస్తున్నాయి. కేరళలోని సర్పంచులు గ్రామ పంచాయతీ పాలన పట్ల శ్రద్ధ తీసుకొని గ్రామ ఆర్థిక వ్యవస్థను స్థిరపరిచారు. అవి 1. త్రాగునీరు 2. ఆరోగ్య కార్యక్రమాలు 3. విద్యా 4. అక్షరాస్యత 5. ప్రణాళిక రచన, ప్రజల భాగస్వామ్యం, 6. సంక్షేమ పథకాలు కుటుంబశ్రీ, అంగన్‌వాడి, గృహనిర్మాణం పెన్షన్‌ల పంపిణీ మొదలైన కార్యక్రమాలను అమలుపై అవగాహన పొందడం విధుల ఉద్యోగులు, నిధులు స్వేచ్ఛనీయడం ద్వారా గ్రామాభివృద్ధి చెందాయి.

కేరళలో 'సర్పంచ్' అంటే చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆ గ్రామాభివృద్ధికి కృషి సల్పుతారు. సర్పంచ్‌కు గౌరవ వేతనం నెలకు రూ. 4,500 వార్డు మెంబర్లకు 1500 చెల్లిస్తున్నారు. గ్రామ పంచాయతీ పాలనలో భాగంగా నిధులు, విధులు నిర్వహణ సమర్థవంతంగా నడుస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నేరుగా పంచాయతీలకు 40% నిధులు బదలాయించడం విశేషం. ప్రతి పంచాయతీకి సంవత్సరానికి ఒక కోటి రూపాయల నుండి 5 కోట్ల రూపాయలు వివిధ వనరుల ద్వారా ఆదాయం సమకూరుతుంది. ఈ ఆదాయం 1. సొంతవనరులు 2. ప్రణాళికా నిధులు. 3. పంచాయతీ గ్రాంట్స్‌లుగా లభిస్తున్నాయి.

కేరళ గ్రామాలలో విధులను పర్యవేక్షించేందుకు 3 స్థాయి సంఘాలున్నాయి. 1) ఆర్థిక సంఘం 2) అభివృద్ధి సంఘం 3) సంక్షేమ సంఘం ఆర్థిక సంఘంకు గ్రామ ఉప సర్పంచ్ అధ్యక్షుడుగా ఉంటాడు. మిగిలిన వార్డు సభ్యులు సభ్యులుగా ఉన్నారు. కేరళలో గ్రామపంచాయతీ ప్రత్యేకత ఏమంటే పారిశుద్ధ్యం నిర్వహణ. ప్రతి ఇంటికి మరుగుదొడ్డి ఉంది. ప్రతి ఇల్లు శుభ్రతకు శ్రద్ధ తీసుకొంటారు. బహిరంగ మలమూత్ర విసర్జన స్వచ్ఛందంగా నిషేధం విధించుకొన్నారు. మురుగునీరు చెట్లకు సరఫరా అయ్యే విధంగా ఏర్పాటు చేసుకొన్నారు. కేరళ మహిళలో, చైతన్యం ప్రత్యేకంగా కుటుంబశ్రీ పథకం విజయవంతంగా, అమలు జరుగుతుంది. పథకాలు అమలులో కేరళ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉంది.

అదే రీతిలో తెలంగాణ రాష్ట్రంలో కేరళ తరహా గ్రామ పంచాయతీ పాలనను ఏర్పాటు చేయటానికి ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు నిర్ణయించారు. ఆ క్రమంలో చర్యలు ప్రభుత్వం తీసుకొంటుంది. రాష్ట్రంలో మొత్తం గ్రామపంచాయతీలు 9,804 వాటిలో ఇటీవల 2014 ఏప్రిల్‌లో ఎన్నికలు జరిగాయి. నూతనంగా సర్పంచులు ఎన్నికయ్యారు. 8,946 గ్రామ పంచాయతీలలో ఎన్నికకాబడిన సర్పంచులు వార్డుమెంబర్లు వచ్చారు. వారిని గ్రామీణాభివృద్ధిలో ఇన్వాల్వ్ చేయటానికి వారిని ప్రోత్సహించటానికి ఆంధ్రప్రదేశ్ 791 ప్రకారం 29 అధికారాలను గ్రామ పంచాయతీలకు అప్పగించెందుకు చర్యలు తీసుకొనడం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలో 9 జిల్లాలకు జిల్లా పరిషత్ అధ్యక్షులు ఎన్నుకొనబడ్డారు. వారిలో ఎక్కువమంది తెలంగాణ రాష్ట్రీయ సమితి (టిఆర్ఎస్) వారేనని చెప్పవచ్చును. జిల్లా పరిషత్ (జడ్‌పిటిసిలు 493 మంది ఉన్నారు.

మండలాలకు 446 మండలాధ్యక్షులు ఎన్నికయ్యారు. మండల ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు 5,427 మంది ఉన్నారు. మొత్తం మున్సిపాలిటీల సంఖ్య 52. ఈ స్థానిక సంస్థలకు జవసత్వాలు కల్పించి అభివృద్ధిలో భాగస్వాములను చేయడం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరిగింది. అందులో భాగంగానే టిఆర్ఎస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ప్రతినిధుల జీతభత్యాల ను పెంచింది. గ్రామపంచాయతీ సర్పంచులకు గతంలో రూ. 1500 గౌరవవేతనాన్ని యిచ్చింది. అది ఇపుడు రూ. 5000 రూ. పెంచారు.

మండలి పరిషత్ అధ్యక్షునికి రూ. 1500 నుండి రూ. 10000 పెంచారు. ఎం.పి.టి.సిలకు రూ. 750 గౌరవవేతనాన్ని 5000 కు పెంచారు.

అదేవిధంగా జిల్లాపరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యుడు (జడ్‌పిటిసి) కి రూ. 5000 గౌరవవేతనం నుండి రూ. 10000 పెంచారు. జిల్లా పరిషత్ ఛైర్మన్‌కు రూ. 7,500 నుండి లక్ష రూపాయలకు పెంచారు. ఈ పెంచిన జీతభత్యాలు 2015 ఏప్రిల్ నుండి అమలులోనికి వస్తాయని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు ప్రకటించారు. అదేవిధంగా 74 సవరణ ద్వారా మున్సిపాలిటీలకు కూడా స్వయం పాలనాధికారులను సంతరించుకొన్నాయి. దానికనుగుణంగా మేయర్లకు (1క్లాసు) రూ. 14,000 నుండి రూ. 50,000 జీతం పెంచారు. డిప్యూటీ మేయర్లకు రూ. 8000 నుండి రూ. 25000 కౌన్సిలర్స్‌కు రూ. 1800 నుండి రూ. 2,500 చేశారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక స్వపరిపాలన సంస్థలను బలోపేతం చేయు తీరులో మొదటి చర్య ఎన్నికకాబడిన ప్రతినిధుల జీత భత్యాల ను పెంచడం. రాష్ట్రంలోకి గ్రామలకు త్రాగునీరును సరఫరా చేయటానికి 'వాటర్‌గ్రిడ్' పథకంను అమలు చేయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. కాకతీయ మిషన్ క్రింద అభివృద్ధి పథకాలను అమలు చేయటానికి, చెఱువుల పునరుద్ధరణ అమలు చేసి గ్రౌండ్‌వాటర్ లెవెల్‌ను పెంచడం సాగునీరు వ్యవసాయానికి అందించడంగా టి.ఆర్.ఎస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. కొత్త ప్రభుత్వం అయిన ప్రజల సాధికారికతకు ఎన్నో చర్యలు తీసుకోవడం ముదావాహం.

టిఆర్ఎస్ ప్రభుత్వం ఉపాధి అవకాశాలను కల్పించటానికి కేరళలలో వలె కేరళ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసు పని చేస్తున్నట్లు తెలంగాణ రాష్ట్రంలో కూడా తెలంగాణ రాష్ట్ర అడ్మినిస్ట్రేటివ్ సర్వీసును ఏర్పాటు చేయటానికి చర్యలు చేపట్టారు. ఈ విధంగా తనకంటు ఒక పరిపాలనా ముద్రను తెలంగాణ రాష్ట్ర స్వయంపాలనలో ముందుకు పోవాలని నిర్ణయించింది. ఇటీవల ప్రవేశపెట్టిన 2015-16 బడ్జెట్‌లో మిగులు 546 కోట్ల రూపాయలతో ప్రవేశపెట్టింది

స్థానిక పంచాయతీ ప్రభుత్వాలకు నిధులు కేటాయించకపోయినా మిషన్ కాకతీయ, వాటర్‌గ్రిడ్, చెరువుల అభివృద్ధికి అన్ని నిధులు కేటాయించారు. రూ. 1.16 వేల కోట్లు బడ్జెట్ కేంద్ర నిధులు, వాణిజ్య పన్నులు తదితర ఆశించిన నిధులతో రాష్ట్రాన్ని పురోభివృద్ధిలో నడిపించేందుకు ఎన్నో చర్యలు చేపట్టడం జరిగింది. గ్రామాలలో పెన్షన్ పంపిణీలకు అధిక ప్రాధాన్యతనిచ్చారు. రూ. 200 పెన్షన్‌ను రూ. 1000 వికలాంగుల పెన్షన్‌ను రూ. 500 నుండి రూ. 1500 పెంచి వారికి ఊరట కలిగించారు. టిఆర్ఎస్ మానిఫెస్టోలో తీసుకొన్న నిర్ణయాలు అమలు చర్యలు తీసుకోవడం హర్షించదగ్గ విషయం.

ఏది ఏమైనా టిఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నో ఇన్నోవేటివ్‌గా పథకాలను రూపొందించి అమలు చేసిన అవి హైదరాబాద్ దాటిపోవడంలేదని, క్రింది స్థాయిలో పథకాలు అమలుకు నోచుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. వీటిని టిఆర్ఎస్ మంత్రులు త్రిప్పికొడుతున్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వం ఆంధ్ర దోపిడి సిండ్రోమ్ నుండి బయటపడి స్వతంత్రంగా నిర్ణయాలు ప్రకటించి అమలు చేయాలి. ప్రతి విషయాన్ని నిందించడంలో అర్థం లేదు. మిమర్శలు కూడా నిర్మాణాత్మకంగా రాజకీయ వ్యూహంతో తెలంగాణ ప్రభుత్వం ముందుకు వెళుతుంది. ప్రజలపై టిఆర్ఎస్ పాలన పోకడలు ఇంకా పడలేదు. అందుకు వారు కృషి చేయవలసి వుంది. గ్రామాలలో టిఆర్ఎస్ ప్రభుత్వం పోకడలను అమలు చేసి పేరు తెచ్చుకోవాలి. అప్పుడే ప్రభుత్వ విధానాల వలన ప్రజలకు లాభాలు చేకూరతాయని ఆశిద్దాం.


*– డాక్టర్ కె.ఆసయ్య, సి.ఎం.పి.*

# మహారాష్ట్రకు వెళ్ళొచ్చిన సర్పంచ్‌ల అనుభవాలు

**వాటర్‌షెడ్ పథకం అమలు తీరుతెన్నులను అధ్యయనం చేసేందుకుగాను జిల్లాకు చెందిన సర్పంచ్‌లు, రైతులు, అధికారులతో కూడిన మహారాష్ట్రలోని రాలేగావ్, దరేవాండీ, మెస్‌వాండీ గ్రామాల్లో పర్యటించింది.**

రాలేగావ్, దరేవాండీ, మెస్‌వాండీ గ్రామాల్లో విజయవంతమైన వాటర్‌షెడ్ పథకం అమలు గురించి తెలుసుకునేందుకు పలువురు సర్పంచ్‌లు, రైతులతో సహా రంగారెడ్డి జిల్లా నుంచి 30 మంది సభ్యుల బృందం అక్కడ పర్యటించింది.

జిల్లాలో మెగా వాటర్‌షెడ్ పథకం కింద కొనసాగుతున్న పనుల ను వేగవంతం చేసేందుకు, పనుల్లో ప్రజల భాగస్వామ్యం పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించేందుకు రైతులు, సర్పంచులను పలు దఫాల్లో మహారాష్ట్రకు తీసుకువెళ్లనున్నట్లు అధికారులు వెల్లడించారు. అక్కడ గ్రామాల్లో పర్యటించిన జిల్లా బృందం పలు విషయాలను తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. ఆయా గ్రామాల ప్రజలు గత 30 ఏళ్లుగా స్వచ్ఛందంగా వాటర్‌షెడ్ పనుల్లో పాల్గొంటున్నారని తెలిపారు.



అదేవిధంగా మద్యపానం, గుట్కా, పాన్, జర్ధా, సిగరెట్ వంటివి ఆయా గ్రామాల్లో నిషేధించినట్లు తెలిపారు. 1996 నుంచి సంబంధిత గ్రామాల్లో మొక్కలను పెంచడం ఒక ఉద్యమంలా సాగుతోందన్నారు. ఈ పర్యటన సందర్భంగా రాలేగావ్ సిద్ధిలో సామాజికవేత్త అన్నా హజరేను జిల్లా బృందం కలిసింది. ఈ సందర్భంగా ఆయా పథకాల అమలులో తీసుకోవాల్సిన కార్యక్రమాలు, ప్రజల సహకారం ఏ విధంగా ఉండాలనే దానిపై ఆయన పలు సూచనలు చేసినట్లు వెల్లడించారు.

ఈ సందర్భంగా చట్ట సభల కంటే గ్రామ సభనే అత్యున్నతమైనదని, గ్రామసభ తీర్మానం లేకుండా ఏ పని చేపట్టవద్దని అన్నాహాజరే గుర్తు చేసినట్లు పేర్కొన్నారు. మీ గ్రామాల్లో కూడా వాటర్‌షెడ్ పథకాన్ని కొన సాగించేందుకు కంకణం కట్టుకోవాలని ఆయన పిలుపునిచ్చారన్నారు. వారం రోజుల పాటు సాగిన ఈ పర్యటనలో ఎనిమిది సర్పంచులు, రైతులు, అధికారులతో కూడిన 30 మంది సభ్యులతో కూడిన బృందం పాల్గొన్నట్లు అధికారులు తెలిపారు.

*– ఎన్‌పిఆర్*

**అధిక జనాభా కలిగిన మనదేశంలో ఉన్నన్ని చట్టాలు ప్రపంచంలో మరే దేశంలో కూడా లేవు. మహిళలకు తమ శరీరంపై హక్కులు కల్పించాలనే ఉద్దేశంతో 1971లో 'మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ' చట్టం అబార్షన్ హక్కులు కల్పించింది. దీన్ని దుర్వినియోగపరుస్తూ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తూ గర్భస్థ ఆడ పిండాలను చంపుతుండటంతో 1994లో పీఎన్‌డీటీ చట్టం వచ్చింది. ఇది 2003లో పీసీ పీఎన్‌డీటీ చట్టంగా సవరణ చేయబడింది.**

1929 లో వచ్చిన బాల్య వివాహ రిజిస్ట్రేషన్ చట్టాన్ని సవరిస్తూ 2006లో బాల్య వివాహ నిరోధక చట్టం వచ్చింది. అయినప్పటికీ 3.7 శాతం మంది 18 సంవత్సరాలలోపు పెళ్లి చేసుకుంటున్నారు. గృహ హింసను నిరోధిస్తూ 2005లో గృహహింస నిరోధక చట్టం వచ్చింది. 1997లో వచ్చిన విశాఖ మార్గదర్శకాలను ఆధారంగా చేసుకుని 2013లో పనిచేసే ప్రదేశంలో లైంగిక హింస నిరోధక చట్టం వచ్చింది.

2012 డిసెంబర్ 16న నిర్భయ సంఘటన తర్వాత జస్టిస్ వర్మ కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారం ఇండియన్ పీనల్ కోడ్, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ సవరణ చేసి మహిళల లైంగిక హింసను కూడా దీనిలో చేర్చారు. దీన్నే 'నిర్భయ చట్టం' గా మనం పిలుచుకుంటున్నాం. అయితే ఇన్ని చట్టాలున్న మన దేశంలో అసలు బాల్య వివాహాలు, గృహహింస, పని ప్రదేశాలలో హింస, గర్భంలో ఆడ పిండాన్ని చిదిమేయడం లాంటివి చేయొద్దు. కానీ ఇంకా దేశ మహిళ జనాభాలో 65 శాతం మంది తమ కుటుంబం విడిపోకుండా ఉండేందుకు హింసను తట్టుకుంటున్నారు. 24శాతం మంది పురుషులు వారి జీవితకాలంలో ఎప్పుడో ఒకసారి లైంగిక హింసను పాల్పడ్డారని 2011లో ఇంటర్నేషనల్ మెన్ అండ్ ఈక్వాలిటీ సర్వే వెల్లడించింది.

2012 డిసెంబర్ 16న ఢిల్లీలో జరిగిన నిర్భయ అత్యాచార ఘటన దేశవ్యాప్తంగా నిరసనలకు దారితీసింది. ఫలితంగా అప్పటి యూపీఏ ప్రభుత్వం 2013 ఫిబ్రవరిలో దేశవ్యాప్తంగా 'వంద వన్‌స్టాప్ క్రైసిస్ సెంటర్'లను ప్రారంభించాలని నిర్ణయించింది. ఇవి మహిళలకు, ఆడ పిల్లలకు అన్నిరకాల సత్వర సహాయాలు అందించాలని ఆదేశించారు. కానీ ఈ ఆదేశాలను అనుసరించి ఏ రాష్ట్ర ప్రభుత్వం 'ఓఎస్‌సీసీ' లను మొదలు పెట్టలేదు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఈ అంశం మరుగున పడింది.

గత సంవత్సరం అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం మహిళల హింస గురించి, ఆడపిల్ల రక్షణ గురించి చాలా విషయాలు మాట్లాడింది. దానిలో ఒకటి నిర్భయ సెంటర్ల స్థాపన. దీనికి సంబంధించి మహిళా, శిశు అభివృద్ధి శాఖ 2014 జూన్ 30న ఒక పబ్లిక్ నోటీస్ విడుదల చేసింది. ఈ నిర్భయ సెంటర్లు ఎలా ఉండాలో కూడా నిర్దేశించింది. దీని ప్రకారం హింసకు, అత్యాచారానికి గురైన మహిళలకు ఆడపిల్లలకు వైద్యం, న్యాయం, రక్షణ, తాత్కాలిక నివాసం, సహాయం అవసరం. ఈ సౌకర్యాలన్నీ ఒకే దగ్గర అందించడం ద్వారా బాధితురాలికి న్యాయం జరుగుతుందని దీని సారాంశం. మలేషియా, బంగ్లాదేశ్, దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్, వేల్స్, రువాండా, జాంబియా, ఆస్ట్రేలియా దేశాలలో ఇటువంటి కేంద్రాలు ఉన్నాయని జస్టిస్ ఉషామెహ్రా కమిషన్ తన రిపోర్టులో ఉటంకించింది. వీటి నిర్వహణ బాధ్యతలను ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా నిర్వహించాలని సూచించింది.

2013లో కేంద్ర ప్రభుత్వ ప్రకటన అనంతరం ఢిల్లీలో '181-ఉమెన్ హెల్ప్‌లైన్' మొదలైంది. ఇది ఫోన్ ద్వారా బాధితులకు సహాయం అందజేస్తుంది. పూర్తి తరహాలో ముఖ్యమంత్రి ఆఫీసులో దీని నిర్వహణ జరిగింది. తర్వాత మహిళా శిశు అభివృద్ధి సంస్థకు మార్చబడింది. చాలా ప్రదేశాలలో ఈ సెంటర్ల నిర్వహణ కొనసాగుతున్నది.

ముంబయి లాంటి మహానగరాలలో ఇలాంటి సెంటర్‌లు 80కి పైగా పనిచేస్తున్నాయి. దేశంలోని 640 జిల్లాల్లో, 20 పట్టణాలలో ప్రభుత్వ, ప్రైవేటు ప్రాంతాలలో నిర్భయ కేంద్రాలు నిర్వహిస్తారని దానికి సుమారు 477 కోట్లు అవసరమవుతుందని, దీనిని ఉమెన్ హెల్ప్‌లైన్‌కు అనుసంధానం చేయాలని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. అయినా గడిచిన 9 నెలల్లో ఏ రాష్ట్రంలో కూడా నిర్భయ ఫండ్ కింద 2013లో కేటాయించిన 1000 కోట్లకు తోడు ఇటీవలి బడ్జెట్‌లో మరో 1000 కోట్లు కేటాయించారు. అయితే ఈ బడ్జెట్ కేటాయింపులు నిర్భయ సెంటర్ల నిర్వహణకా లేకా బాధిత మహిళలకు ఇచ్చే నష్టపరిహారమా? అన్న స్పష్టత లేదు.

గడిచిన 9 నెలల్లో మహిళా రక్షణ పేరుతో, 50 కోట్లు మహిళా రక్షిత పట్టణాలుగా తీర్చిదిద్దడానికి 150 కోట్లు కేటాయించారు. 2014 జూన్ 16న మధ్యప్రదేశ్‌లో యాక్షన్ ఎయిడ్ అనే స్వచ్ఛంద సంస్థ, ఆ రాష్ట్ర నేషనల్ రూరల్ హెల్త్ మిషన్‌తో కలిసి 'గౌరవి' అనే పేరుతో 'వన్‌స్టాప్ సెంటర్' ను మొదలు పెట్టింది.

ఇది 2013లో అప్పటి ప్రభుత్వం ప్రకటన అనంతరం ఆలోచించి నిర్వహిస్తున్న సెంటర్. అయితే ఇది గత సంవత్సరం జూన్‌లో వచ్చిన నిర్భయ గైడ్‌లైన్స్‌లోనే పనిచేస్తుంది. దీని నిర్వహణ బాధ్యత నేషనల్ రూరల్ హెల్త్ మిషన్ ఎన్ఆర్‌హెచ్ఎం, యాక్షన్ ఎయిడ్ తీసుకోగా మిగతా డిపార్ట్‌మెంట్‌లు వీరికి సహకరిస్తున్నాయి. దీనిని భోపాల్‌లోని

# న్యాయం కోసం 'నిర్భయ' కేంద్రాలు

ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహిస్తున్నారు. బాధితులు హెల్ప్‌లైన్ ద్వారా లేదా స్వయంగా సెంటర్‌కు వచ్చి సహాయాన్ని తీసుకుంటున్నారు. 2014 జూన్ 16 నుంచి 2015 జనవరి నెలాఖరు వరకు 7267 మంది ఈ సెంటర్‌ను సంప్రదించగా వాటిలో 734 కేసులు రిజిస్టర్ అయ్యాయి. ఇప్పటివరకు 29 పోలీసుస్టేషన్లు వీరికి సహాయపడుతున్నారు. 321 మంది రెగ్యులర్‌గా కౌన్సిలింగా తీసుకుంటున్నారు.

గౌరవి మధ్యప్రదేశ్‌లో వున్న 51 జిల్లాల మహిళలకు సహాయం చేయలేకపోయినా యాక్షన్ ఎయిడ్ పనిచేస్తున్న 15 జిల్లాలకు సంబంధిత కేసులను రిఫర్ చేస్తూ సహాయాన్ని అందిస్తున్నారు. అయితే ప్రముఖ మహిళా హక్కుల కార్యకర్త ఫ్లేలియా ఆగ్నస్ అన్నట్టు జిల్లా కేంద్రంలో వున్న సెంటర్ ఏ రకంగా గ్రామస్థాయిలో ఉన్న మహిళలకు ఉపయోగపడుతుంది? 'జిల్లాకేంద్రంలో వున్న పోలీస్‌స్టేషన్ పరిధిలో గ్రామ సమస్యలను ఎలా నమోదు చేస్తారు? నిజంగా ఇంత సులభంగా అన్ని జరిగితే జిల్లా స్థాయిలో గృహహింస నిరోధక చట్టం పరిధిలో వున్న జిల్లా ప్రొటెక్షన్ ఆఫీసర్ల పని పరిస్థితి ఇలా ఉండేది కాదు.' అని అన్నారు. దీనికి సమాధానం కాకపోయినా యాక్షన్ ఎయిడ్, గౌరవి నిర్వహణలో కేసులు బుక్ చేయడానికి 'ఏరియా జూరిస్ డిక్షన్స్' తొలగిస్తూ ప్రభుత్వం ఒక ఆదేశం ఇచ్చింది. దీని ఆధారంగా అక్కడ కేసులు నమోదు అవుతున్నాయి.

నిర్వహణ సమస్యలు ఎన్ని ఎలా ఉన్నా సౌకర్యాలు ఎలా కావాలన్నా ముందు నిర్భయ కేంద్రాల స్థాపన అవసరం. ఉషామెహ్రా కమిటీ సూచనల మేరకే నిర్భయ కేంద్రాలను ప్రభుత్వం సూచించింది.

*-జిఓఐ*

# స్వేచ్ఛ, సమానత్వం చాటిన ప్రవక్త డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్



**భారతదేశ రాజ్యాంగంలో స్వేచ్ఛ, సమానత్వంను చాటిన ప్రవక్త డా.బి.ఆర్. అంబేద్కర్ అని టిఎస్ఐపిఎఆర్‌డి జె.డి. శ్రీ కె. యాదయ్య కొనియాడారు. ఆయన భారత రాజ్యాంగ రచనతో దేశ ఐక్యత, సమగ్రతలను కాపాడేందుకు ఎంతగానో కృషి చేసిన మహా వ్యక్తి అంబేద్కర్ అన్నారు. ఏప్రిల్ 14న డా.బి.ఆర్.అంబేద్కర్ 125వ జయంతి సందర్భంగా రాజేందర్‌నగర్‌లో TSIPARD (తెలంగాణ రాష్ట్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పంచాయతీరాజ్ & రూరల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్) లో ఆయన సేవలను గుర్తు చేసుకొన్నారు.**

డాక్టర్ అంబేద్కర్ అణగారిన వర్గాలకు చేసిన సేవలను ముఖ్యంగా స్త్రీ విద్యను ప్రోత్సహించడం ద్వారా దేశ ప్రగతి జరుగుతుందని గుర్తించిన వ్యక్తి అంబేద్కర్ అన్నారు. సామాజిక ప్రగతి జరగాలంటే అట్టడుగు వర్గాలకు తగిన సహాయ సహకారాలు అందించి, చేయూతనియ్యవలసిన అవసరం ఉందని తెలంగాణ పంచాయతీ గ్రామీణాభివృద్ధి సంస్థ జాయింట్ డైరెక్టర్ కె. యాదయ్య అన్నారు.

ఈ సందర్భంగా జ్యోతిబాపూలే ఉత్సవాన్ని కూడా టిఎస్ఐపిఎఆర్‌డి (టిసిపార్డ్) లో జరుపుకోవడం జరిగింది. జ్యోతి బాపూలె మహిళలకి కమిటీ (1882) లో వాదించిన మహానుభావుడు జ్యోతిరావుపూలే భార్య చేతి అణగారిన కులాలకు పాఠశాలను స్థాపింపచేశారు.

పూలే భావాలకు అంబేద్కర్ ప్రభావితుడైననుసరించిన బాటలో ముందుకు నడిచేందుకు నిర్ణయించి దళితులు (డిప్రెస్డ్) కులాల విద్యకు బ్రిటిషు కార్యదర్శి ముందు అంబేద్కర్ వాదించడం జరిగింది. రాజ్యాంగంలో అంబేద్కర్ షెడ్యూల్డు కులాలకు అంటరానితనంను పోగొట్టేందుకు 17వ ఆర్టికల్ పొందు పరిచి రాజ్యాంగ పరిషత్‌చే ఆమోదించాడని అన్నారు.

ఈ అంబేద్కర్ జయంతిఉత్సవాలలో పలువురు వక్తలు పాల్గొని ప్రసంగించారు. టిసిపార్డు సెంటర్ హెడ్స్ ఎ. నాగేశ్వరరావు, కె. ఆశయ్య, ఎ.ఓ. డా. ఆంజనేయులు, టిసిపార్డ్ సిబ్బంది, తదితరులు పాల్గొని ప్రసంగించారు.

*– సిఎంపి*

# 2014-15 తెలంగాణ ఆర్థిక సర్వే

**గత ఆర్థిక సంవత్సర ఆర్థిక వ్యవస్థను తెలిపేదే ఆర్థిక సర్వే. ఆర్థిక శాఖ మంత్రి శ్రీ ఈటెల రాజేందర్ తెలంగాణ ప్రభుత్వం 2014-13 ఆర్థిక సర్వేను శాసనసభలో ప్రవేశపెట్టారు. గత సంవత్సర ఆర్థిక నివేదికను ప్రజల ముందు ఉంచారు.**

### రాష్ట్రోత్పత్తి (జిఎస్‌డిపి)

2014-15 సంవత్సరంలో రాష్ట్రోత్పత్తి వృద్ధి రేటు 5.9 శాతంగా నమోదైంది. అయితే 2013-14 సంవత్సరంలో 4.8 శాతం మాత్రమే నమోదయ్యింది. జాతీయ స్థాయి వృద్ధి 2014 -15 సంవత్సరంలో 7.4 శాతం నమోదయ్యింది. వృద్ధిరేటును పెంచాల్సి ఉన్నది. చాలక ధరల్లో రాష్ట్ర ఆదాయం 4,30,599 కోట్ల రూపాయలుగా నమోదు అయింది.

### రాష్ట్ర ఉప రంగాల వృద్ధి

2014-15 సంవత్సరంలో వ్యవసాయరంగ వృద్ధి-10.3 శాతంగా నమోదయింది. ప్రాథమికరంగంలోని చేపలు 11.4 శాతం వృద్ధిని నమోదు అయినా, చివరికి పశుసంపద 6.5 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నా, వ్యవసాయం రుణాత్మక వృద్ధిని నమోదు చేసుకున్నా, వ్యవసాయం రుణాత్మక వృద్ధిని నమోదు చేసుకోవడం దురదృష్టకరం. పారిశ్రామికరంగం 4.1 శాతం వృద్ధిని సేవారంగం 9.7 శాతం వృద్ధిని నమోదు చేసుకోవడం జరిగింది.

### తలసరి ఆదాయం

స్థిర ధరల్లో 48,881 రూపాయల నుంచి 51,017 రూపాయలకు, చాలక ధరల్లో 95,361 రూపాయల నుంచి 1,03,889 రూపాయలకు పెరిగింది. దేశ తలసరి ఆదాయం చాలక ధరల్లో 95,361 రూపాయల నుంచి 1,03, 889 రూపాయలకు పెరిగింది. దేశ తలసరి ఆదాయం చాలక ధరల్లో 88,533 రూపాయలుగా నమోదు అయింది.

### మన ఊరు - మన ప్రణాళిక

జూలై 14, 2014 నుంచి అభివృద్ధి కోసం ఈ ప్రథకాన్ని ఆదిలాబాద్ జిల్లాలో ప్రారంభించారు. ఇందులో తాగునీరు, విద్య, వైద్యానికి ఎక్కువగా ప్రాధాన్యతను ఇస్తారు. ఇందుకోసం ప్రత్యేక అధికారులను నియమించారు.

### స్త్రీ నిధి

స్త్రీలకు 48 గంటల్లో ఆర్థిక సహాయం చేయడానికి స్త్రీ నిధి క్రెడిట్ కార్పొరేషన్ ఫెడరేషన్ హైదరాబాద్‌ను ఆమోదించారు. దీనికోసం 2015-16 సంవత్సరానికి రూ. 1100 కోట్లు కేటాయించారు. దీని ద్వారా 436 మండల మహిళ సమాఖ్యలు లబ్ధి పొందుతాయి. గతంలో ఉన్న స్త్రీనిధి కొనసాగించడం మంచి పరిణామం.

### ఆరోగ్య శ్రీ

పేదలకు దాదాపు 944 జబ్బులకు వైద్య పరిమితి 2 లక్షల వరకు అందే ఉద్దేశంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. ఇందు కోసం 104 కాల్ సెంటర్‌ను అమలు చేస్తున్నారు.

### భూమి ఉపయోగం

రాష్ట్రంలో ఉన్న మొత్తం భూభాగం 11.84 లక్షల హెక్టార్లు. ఇందులో అడవుల శాతం 23.89, వ్యవసాయేతర అవసరాలకు ఉపయోగపడే భూమి 7.79 శాతం, బంజరు భూమి శాతం 5.36 శాతం నమోదయింది.

### సగటు కమతం

రాష్ట్ర సగటు కమతం ఆదిలాబాద్ జిల్లాలో 1.4 హెక్టార్లుగా, కనిష్ఠంగా నిజామాబాద్ జిల్లాలో 0.92 హెక్టార్లుగా నమోదు అయింది.

### వర్షపాతం

రాష్ట్ర సగటు వర్షపాతం 906 మిల్లీమీటర్లు. ఇందులో నైరుతి రుతుపవనాల్లో 715 మిల్లీమీటర్లు కాగా, ఈశాన్య రుతుపవనాల వల్ల 129 మిల్లీమీటర్లుగా ఉన్నది. రాష్ట్రంలో నైరుతి వర్షపాతం అధికంగా ఆదిలాబాద్ జిల్లాలో, ఈశాన్యం అధికంగా హైదరాబాద్‌లో, చలికాలంలో వర్షాలు అధికంగా కరీంనగర్‌లో నమోదయ్యాయి.

### ఆర్థిక వ్యవస్థ ప్రధాన రంగాల వాటా

2014-15 సంవత్సరంలో చాలక ధరల ప్రకారం ప్రాథమిక రంగం 17.9 శాతం, ద్వితీయ రంగం 25 శాతం, తృతీయ రంగం 57.1 శాతం కలిగి ఉంది.

### జిల్లాల తలసరి ఆదాయం

చాలక ధరల్లో హైదరాబాద్ గరిష్ఠంగా 1,32,862 రూపాయలుగా, కనిష్ఠంగా ఆదిలాబాద్ 68,511 రూపాయలుగా నమోదు కావడం జరిగింది. స్థిర ధరల్లో కూడా హైదరాబాద్ గరిష్ఠంగా, ఆదిలాబాద్ కనిష్ఠంగా కలిగి ఉన్నాయి.

### కమతాల సంఖ్య

రాష్ట్రంలో నమోదయిన కమతాల 55,54 లక్షలు కాగా, ఈ కమతాలు ఆక్రమించిన విస్తీర్ణం 61.97 లక్షల హెక్టార్లు. ఉపాతంత కమతాలు 62 శాతం, కాగా చిన్న కమతాల శాతం 23.9 అంటే సన్న చిన్న కమతాల శాతం 85.9గా నమోదయ్యాయి.

### సూక్ష్మ సేద్యం

రాష్ట్రంలో సూక్ష్మసేద్యం (ఎస్‌హెచ్‌ఎం) ను 2003 లో, దేశంలో సూక్ష్మ సేద్యం (ఎన్‌హెచ్‌ఎం) ను 2006లో ప్రారంభించడం జరిగింది. తెలంగాణలో 4,79,763 హెక్టార్లు సూక్ష్మ సేద్యం కోసం ఉపయోగిస్తున్నారు. ఇందులో గరిష్ఠంగా మహబూబ్‌నగర్‌లో 1,11,701 హెక్టార్లు ఉపయోగిస్తుండగా, కనిష్ఠంగా నిజామాబాద్‌లో 31,420 హెక్టార్లు ఉపయోగిస్తున్నారు.

## అడవులు

వ్యవసాయ ఆదాయంలో 5.02 శాతం ఆదాయాన్ని అటవీ సంపద ఇస్తుండగా, రాష్ట్ర ఆదాయంలో 0.9 శాతం కలిగి ఉన్నది. తెలంగాణకు హరితహారం కింద అడవుల శాతాన్ని 25.16 నుంచి 33 శాతానికి పెంచడం లక్ష్యంగా నిర్ణయించడం జరిగింది. శాతం పరంగా ఖమ్మం 52.64తో ప్రథమస్థానంలో ఉండగా 5.88 శాతంతో నల్లగొండ కనిష్ఠ స్థానంలో ఉంది.

## ప్రజా పంపిణీ

87.57 లక్షల కుటుంబాలు బియ్యం పంపిణీ ద్వారా లబ్ధి పొందుతున్నాయి. ప్రతీ వ్యక్తికి 6 కిలోల చొప్పున ఒక రూపాయికి కిలో బియ్యాన్ని విక్రయిస్తున్నారు. అంత్యోదయ అన్న యోజన కార్డు ఉన్నవారికి ప్రతి కార్డు కింద 35 కిలోలు ఇస్తున్నారు. గతంలో 4 కిలోల చొప్పున గరిష్ఠంగా 20 కేజీలు ఇచ్చేవారు. కార్డు పొందడానికి వార్షిక ఆదాయంగా గ్రామాల్లో తెల్లకార్డుకు లక్షాయాభైవేలు, పట్టణాల్లో రెండు లక్షలు ఉండాలని నిర్ణయించారు.

## పాలు, పాల ఉత్పత్తులు

లీటరుకు 4 రూపాయల చొప్పున పాల సరఫరా ధరను పెంచారు. దేశ సగటు 263 గ్రాములు అయితే రాష్ట్ర సగటు 234 గ్రాముల పాలు అందుబాటులో ఉన్నట్లుగా సర్వే పేర్కొంది. రాష్ట్రంలో సర్వే ప్రకారం పాల ఉత్పత్తి 2354. 32 లక్షల మెట్రిక్ టన్నులుగా నమోదయింది.

## చేపలు

రాష్ట్ర వ్యవసాయ ఆదాయంలో చేపలు 3.47 శాతం ఆక్రమించడం జరిగింది. అదే విధంగా రాష్ట్ర ఆదాయంలో చేపలు 0.6 శాతం ఆక్రమించాయి. ప్రపంచలో భారత్ 137 మిలియన్ టన్నులతో మొదటి స్థానాన్ని కలిగి ఉన్నది. రాష్ట్రంలో ఖమ్మం ప్రథమస్థానంలో ఉన్నది.

## టివివిపి

రాష్ట్రంలో 103 ఏరియా ఆస్పత్రులు, 8 జిల్లా వైద్యశాలను, 233 ఆయుర్వేద, 260 యునాని వైద్యశాలల నిర్వహణ బాధ్యతను జూన్ 2, 2014లో ప్రారంభమైన తెలంగాణ వైద్య విధానపరిషత్‌కు అప్పగించడం జరిగింది.

## ఆరోగ్య సూచికలు

రాష్ట్రంలో బాలింత మరణాలు సగటున 92 నమోదయ్యాయి. గరిష్ఠంగా ఆదిలాబాద్‌లో 152, కనిష్ఠంగా 71 హైదరాబాద్‌లో నమోదు అయ్యాయి. శిశుమరణాలు రాష్ట్రంలో 39 నమోదు కాగా, గరిష్ఠంగా మహబూబ్‌నగర్‌లో 53, కనిష్ఠంగా హైదరాబాద్‌లో 20గా నమోదు అయ్యాయి. మొత్తం జనన రేటు 1.8గా నమోదు అయితే గరిష్ఠంగా 2.0గా మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్‌లో నమోదు అయ్యాయి.

## నిలుపుదల

ఎఎస్ఈఆర్ 2014 రిపోర్ట్ ప్రకారం రాష్ట్రంలో నిలుపుదల (డ్రాప్‌అవుట్) 38.21గా నమోదు (1 నుంచి 10 తరగతి వరకు) అయింది. దీన్ని తగ్గించాల్సిన అవసరం ఉంది.

## ఆనంద నిలయం

అనాథ కుటుంబాల కోసం సోషల్ వేల్ఫేర్ హాస్టళ్లను నడుపుతున్నారు. రాష్ట్రంలో వీటి సంఖ్య 33గా ఆర్థిక సర్వే పేర్కొంది.

## మీ–సేవా

ఈ–సేవా, సిఎస్‌సి, ఏపి ఆన్‌లైన్ లను విలీనం చేస్తూ 2011 లో మీ–సేవను ప్రారంభించారు. దీనిద్వారా సుమారు 311 సేవలు 34 శాఖలకు అందుబాటులోకి వచ్చాయి.

## టాస్క్

ఇంజినీరింగ్, డిగ్రీ విద్యార్థులకు సమాచార నైపుణ్యత, ఉద్యోగ నైపుణ్యం, సాంకేతిక నైపుణ్యత అందించేందుకు నిరుద్యోగాన్ని నిర్మూలన చేసేందుకు తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

## టీ –హబ్

నూతన పెట్టుబడిదారులను ప్రోత్సహించే ఉద్దేశంతో ట్రిపుల్ ఐటి క్యాంపస్ గచ్చిబౌలిలో దీనిని ప్రారంభించారు. ఇందులో ఐఎస్‌బీ, నల్సార్, ఐఐటీ –హైదరాబాద్ వారు భాగస్వాములు.

## టీఎస్‌డీసీ

ఈ–గవర్నెన్స్ సాధన కోసం రాష్ట్ర అన్ని శాఖల అవసరాల కోసం 9000 చదరపు అడుగులతో తెలంగాణ స్టేట్ డాటా సెంటర్‌ను ఏర్పాటు చేశారు. దీనిని మణికొండ గ్రామంలో నిర్మించారు.

## ఆరోగ్య లక్ష్మి

చిన్నపిల్లల తల్లుల, గర్భిణులకు ప్రతిరోజూ పూర్తి భోజనం అందించడానికి 105.86 కోట్ల రూపాయలతో జనవరి1, 2015 నుంచి ఎడబ్ల్యుసి ద్వారా పథకాన్ని అమలు చేస్తున్నారు.

## మహిళా భద్రత 181

సెప్టెంబర్ 11, 2014న మహిళా భద్రతకు 181 నంబర్‌ను హెల్ప్ లైన్‌గా గుర్తించారు. అదేవిధంగా షీ ఆటోరిక్షాలు, షీ పోలీస్ టీమ్స్, 505 బియుహెచ్‌ఓఎం విధానాన్ని ఉపయోగిస్తున్నారు. షీటాక్సీ స్కీంలో 35 శాతం సబ్సిడీ కింద ఆటోలను అందుబాటులో ఉంచుతున్నారు.

## అక్షరాస్యత

రాష్ట్రంలో 2001 లో అక్షరాస్యత 58 శాతం ఉండగా 2011 లో 66.46 శాతంగా నమోదు అయ్యింది. జాతీయ స్థాయిలో అక్షరాస్యత 72.99 శాతంగా ఉన్నది. దేశంలో రాష్ట్ర ర్యాంకు 21గా గమనించాలి. గ్రామ అక్షరాస్యత తెలంగాణలో 57.25 శాతం, పట్టణాల్లో 81.08 శాతంగా నమోదు అయింది.

## ఆసరా పథకం

ఎన్ఎస్ఎపి పథకాన్ని కొనసాగిస్తున్నారు. వృద్ధులకు పింఛన్ రూ. 200 నుంచి 1000 పెంచారు. అదేవిధంగా వితంతువులకు, చేనేత, బీడి, కల్లుగీత కార్మికులకు. ఎయిడ్స్ బాధితులకు 1000 అందిస్తున్నారు. అంగవైకల్యంగల వారికి రూ. 500 నుంచి 1500కు పెంచారు.

*–ఐ&పి.ఆర్, తెలంగాణ*

# క్షయ రహిత భారత్ దిశగా...

**నూట ముప్పైమూడు సంవత్సరాల క్రితం (1882, మార్చి 24) నాటి మాట... జర్మనీ రాజధాని బెర్లిన్..ఆ మహానగరంలోని జీవ ధర్మ శాస్త్ర పరిశోధనా సంస్థ సమావేశ మందిరం.. వైద్యశాస్త్ర చరిత్రలో సువర్ణాక్షలతో లిఖించదగ్గ రోజు అది. ఎందుకంటే - వేల సంవత్సరాలుగా మానవుడితో దాగుడుమూతలాడుతూ, మనిషి మనుగడను శాసిస్తూ, అప్పటివరకు అంతుపట్టకుండాొన్న ఒక భయంకర వ్యాధికి కారణమైన 'సూక్ష్మక్రిమి'ని రాబర్ట్ కోచ్ (1845-1910) అనే జర్మన్ శాస్త్రవేత్త కనుగొన్నారు.**

రాబర్ట్‌కోచ్ పరిశోధన ఆధునిక యుగ జీవ, వైద్యశాస్త్ర పరిశోధనా రంగంలో ఒక ప్రధాన మైలు రాయి అని ప్రముఖ శాస్త్రవేత్త పాల్ ఎర్లిచ్ అభివర్ణించారు. ఒక భయంకర వ్యాధి కారక సూక్ష్మ క్రిమిని కనుగొన్నందుకు గాను రాబర్ట్‌కోచ్‌కు 1905లో వైద్య శాస్త్రంలో నోబెల్ పురస్కారం లభించింది. ఆ సూక్ష్మక్రిమి కలుగజేసే వ్యాధి ఆ కాలంలో ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏడుగురిలో ఒకరిని బలిగొనేది. ఆ వ్యాధే క్షయ (ట్యూబర్క్యులోసిస్ –టీవీ)



మైక్రోబ్యాక్టీరియమ్ ట్యూబరిక్లోసిస్ అనే సూక్ష్మక్రిమి క్షయ వ్యాధిని కల ుగచేస్తుంది. రాబర్ట్‌కోచ్ పరిశోధన ఫలితంగా క్షయ వంశపారపర్యంగా, ఒక బ్యాక్టీరియా వల్ల సంక్రమిస్తుందని ప్రయోగాత్మకంగా, శాస్త్రీయంగా నిర్ధారితమయింది.

క్షయ వ్యాధికి సంబంధించిన కొన్ని ప్రాథమిక విషయాలు తెలుసుకుందాం. క్షయ రోగి మాట్లాడినప్పుడు, తుమ్మినప్పుడు, దగినప్పుడు, ఉమ్ము ఊసినప్పుడు వెలువడే గాలి తుంపరల ద్వారా చుట్టపక్కల వారికి సంక్రమిస్తుంది. ఈ వ్యాధి సోకినవారికి రెండు వారాలుగానీ, అంతకు మించిగానీ బాగా దగ్గు వస్తుంది. సాయంత్రం/రాత్రిపూట జ్వరం వస్తుంది. జ్వరంతోపాటు చెమటలు పడతాయి. రోగి బరువు తగ్గుతాడు. ఇది ప్రధానంగా ఊపిరితిత్తులకు సోకే వ్యాధి. శరీరంలోని ఇతర అవయవాలకూ క్షయ సోకుతుంది. రోగి నుంచి ఇతరులకు వ్యాపించేది ప్రధానంగా ఊపిరితిత్తులకు క్షయే.

క్షయ ప్రాణాంతకవ్యాధా అంటే నూటికినూరుపాళ్ళూ కాదని చెప్పవచ్చు. ఎందుకంటే సరైన సమయంలో వ్యాధి నిర్ధారణ, ఖచ్చితమైన మోతాదులో శాస్త్రీయమైన వైద్యం అందించగలిగితే క్షయ వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చు. కనీసం ఆరు నెలల పాటు నిర్ణీత సమయంలో క్రమం తప్పకుండా మందులు వాడితే క్షయ వ్యాధి నుంచి బయటపడడం అంత కష్టమేమీ కాదు. ఈ మందుల్ని దేశవ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లోను కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో ఉంచుతుంది. గ్రామ పంచాయతీల్లో కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'డాట్స్' కేంద్రాల వద్ద ఈ మందులను ఉచితంగా పొందవచ్చు.

ఒక యదార్థ విషాదగాథను తెలుసుకుందాం. లక్ష్మికి ఇరవై ఏళ్ళ వయస్సులో వివాహమయింది. పెళ్ళయిన ఆరు నెలలకే భర్తకు క్షయ సోకినట్లు తెలిసింది. గ్రామంలోని డాట్స్ సెంటర్‌కు వెళ్ళితే కళ్ళ పరీక్షలు నిర్వహించి మందుల ఇచ్చారు. రెండు నెలల పాటు మందులు వాడగా వ్యాధి లక్షణాలలో గణనీయమైన మార్పు వచ్చింది. దీంతో వ్యాధి నయం అయిందని భావించి వైద్యుల్ని కూడా సంప్రదించకుండా లక్ష్మి భర్త మందులు వాడడం మానేశాడు. ఆరునెలల పాటు ఎటువంటి సమస్యా రాలేదు. ఆ తరువాత క్షయ లక్షణాలు మళ్ళీ బయటపడ్డాయి.

రోజురోజుకీ ఆరోగ్యం క్షీణించింది. ప్రభుత్వ ఛాతీ వైద్యశాలలో పరీక్షలు నిర్వహించగా ఎమ్‌డీఆర్ టీడీ అని తేలింది. అప్పటికే రెండు ఊపిరితిత్తులూ పాడయ్యాయి. మందులు ప్రారంభించినప్పటికీ శరీరంలోని అన్ని అవయవాలు క్షీణ దశకు చేరడంతో లక్ష్మి భర్త కొద్దిరోజుల్లోనే మరణించాడు. లక్ష్మి ఆరునెలల గర్భవతి. భర్త సరిగా మందులు వాడకపోవడం వలన లక్ష్మికి కూడా ఎమ్‌డీఆర్ క్షయ సోకింది. కాన్పు

అయిన నెలలోనే ఆమె కూడా మరణించింది. 'మందులు మానెయ్యడం' అనే ఒక చిన్న తప్పు ఒక చిన్నారిని తల్లిదండ్రులు లేని అనాథను చేసింది.

ఇప్పుడు క్షయ వ్యాధిని జయించిన ఒక యువతి స్ఫూర్తిదాయక గాథను తెలుసుకుందాం. అనూష (పేరు మార్చబడినది) వయస్సు 17 సంవత్సరాలు. తండ్రి ఆటో డ్రైవర్, ఇంటర్ చదువుతుంది. ఏడాది క్రితం అనూష నానమ్మ క్షయ వ్యాధితో, మరణించింది. ఇంటర్ పరీక్షలకు కొద్దిరోజుల ముందు విపరీతమైన దగ్గు, జ్వరం ప్రారంభమయ్యాయి. దగ్గుతోపాటు రక్తం కూడా పడ్డది. వెంటనే దగ్గర్లో ఉన్న ప్రభుత్వ ఛాతీ వైద్యశాలలో వైద్యుల్ని సంప్రదించగా పరీక్షలు నిర్వహించి ఎమ్‌డీఆర్ టీబీ అని నిర్ధారించారు.

రెండు సంవత్సరాల పాటు మందులు వాడాలని సూచించారు. అనూష ఏమాత్రం నిరాశ చెందక, క్రమం తప్పకుండా మందులు, ఇంజెక్షన్లు తీసుకుంది. ఎంత కష్టమయినా టీబీ మందులు వాడడం ఆపలేదు. రెండేళ్ళ అనంతరం ఆమె క్షయ నుంచి బయటపడడమే గాక ఇంటర్‌లో కళాశాల టాపర్‌గా నిలిచింది.

మానవుని నిర్లక్ష్య ధోరణి వలన టీబీ ఒక భయంకరమైన ప్రాణాంతక వ్యాధిగా రూపాంతరం చెందింది. అదే ఎండీఆర్/ ఎక్స్‌డీఆర్/ టీడీఆర్ టీబీ. ఎండీఆర్ టీబీ అనగా 'మల్టీ డ్రగా రెసిస్టెన్స్ టీబీ' – ఇది సాధారణ మందులకు తొంగని/ ప్రభావితం కాని టీబీ. ఎక్స్‌డీఆర్ టీబీ అంటే 'ఎక్స్‌ట్రీమ్లీ డ్రగా రెసిస్టెన్స్ టీబీ' అని, టీడీఆర్ టీబీ అంటే 'టోటల్లీ డ్రగా రెసిస్టెన్స్ టీబీ' అని అంటారు. అన్ని ముందులకూ లొంగని/ ప్రభావితం కానీ టీబీ ఇది. టీబీ మందులు సక్రమంగా వాడకపోవడం/ మధ్యలోనే మందులు మానెయ్యడం వలన సాధారణ టీబీ కాస్తా ప్రాణాంతకమైన 'ఎండీఆర్ /ఎక్స్‌డీఆర్/ టీడీఆర్ టీబీ'గా పరిణామం చెందుతుంది. ఇదంతా స్వయంకృత అపరాధం వల్లనే సంభవిస్తుంది.

క్షయ వ్యాధి గణాంకాలను పరిశీలిస్తే భయపడకుండా వాండడం అసాధ్యం. ఏటా ప్రపంచంలో 90 లక్షల మంది క్షయ వ్యాధి బారిన పడుతున్నారు. వీరిలో మూడింట ఒక వంతు మంది భారతీయులే. మన దేశంలో ప్రతి సెకనుకు ఒకరికి క్షయ సోకుతోంది. ప్రతిరోజూ మూడు నిమిషాలకు ఇద్దరు, సుమారుగా ఒక్కరోజులోనే 1000 మంది క్షయ వ్యాధితో మరణిస్తున్నారు.

213 గణాంకాల ప్రకారం ఏటా ఎనిమిది లక్షల మంది మనదేశంలో క్షయ వ్యాధితో మరణిస్తున్నారు. ప్రతి క్షయ రోగి తాను చనిపోయే ముందు లేక చికిత్స పూర్తయ్యేలోపు పదిహేనుమందికి ఆ వ్యాధిని వ్యాప్తి చేస్తున్నాడు. కాబట్టి క్షయ నివారణ మందులు మధ్యలోనే అర్థాంతరంగా మానెయ్యడం ఆత్మహత్యా సదృశ్యమే కాక పదిహేను – ఇరవైఐదు మంది ప్రాణాలకు ముప్పు కలుగచేస్తున్న వారవుతున్నారు. సంతానలేమితో బాధపడుతున్న చాలా మంది స్త్రీలలో గర్భాశయ క్షయ బయటపడుతుంది. ప్రపంచ వ్యాప్తంగా మూడు లక్షల మంది ఎమ్‌డీఆర్ (సాధారణ మందులకు లొంగని) క్షయ రోగులు వాన్నారు.

ఈ పరిస్థితుల్లో మన కర్తవ్యమేమిటి? ప్రతి వ్యక్తి క్షయ గురించిన ప్రాథమిక విషయాల్ని సమగ్రంగా తెలుసుకోవాలి. వ్యక్తిగత పరిశుభ్రత,

మానవుని నిర్లక్ష్య ధోరణి వలన టీబీ ఒక భయంకరమైన ప్రాణాంతక వ్యాధిగా రూపాంతరం చెందింది. అదే ఎండీఆర్/ ఎక్స్‌డీఆర్/టీడీఆర్ టీబీ.

ఎండీఆర్ అంటే సాధారణ మందులకు లొంగని/ప్రభావితం కాని టీబీ ఎక్స్‌డీఆర్, టీడీఆర్ అంటే అన్ని మందులకూ లొంగని / ప్రభావితం కానీ టీబీ ఇది.

టీబీ మందులు సక్రమంగా వాడకపోవడం/ మధ్యలోనే మందులు మానెయ్యడం వలన సాధారణ టీబీ కాస్తా ప్రాణాంతకమైన టీబీగా పరిణామం చెందుతుంది.

ఇదంతా స్వయంకృత అపరాధమే.

సాంఘిక స్పృహ కలిగివుండాలి. ముఖ్యంగా రోగులు చేయాల్సినవి. వ్యాధి లక్షణాలను గుర్తించిన వెంటనే వైద్యుల్ని సంప్రదించాలి. డాక్టర్ల సల హా మేరకు మందుల్ని క్రమం తప్పకుండా కనీసం ఆరు నెలలు వాడాలి. మందులు వాడుతున్నప్పుడు ఏవైనా ఇతర సమస్యలు (వాంతులు, కామెర్లు లాంటివి) తలెత్తినట్లయితే వైద్యుల్ని సంప్రదించాలి. మందుల్ని ఎట్టి పరి స్థితుల్లోనూ ఆపరాదు. బహిరంగ ప్రదేశాలలో తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు చేతిరుమాలు తప్పనిసరిగా వాడాలి. బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలి. ధూమపానం, మద్యసేవనం లాంటి దురలవాట్లకు దూరంగా ఉండాలి.

డాక్టర్లూ తమ బాధ్యతలు విస్మరించకూడదు – ఏమిటవి? ప్రతి క్షయ వ్యాధిగ్రస్తుడికి వ్యాధి గురించి సంపూర్ణ అవగాహన కల్పించాలి. దీర్ఘకాలిక చికిత్స కొరకు రోగిని మానసికంగా సిద్ధపరచాలి. మందులు మానెయ్యడం వల్ల కలిగే నష్టాలను గురించి వివరించాలి. ప్రతి వైద్యుడు తన వద్దకు వచ్చే రోగుల గురించి ప్రభుత్వానికి తెలియపరచాలి. ఇది ప్రభుత్వ నియమం.

ఇక ప్రభుత్వ కర్తవ్యమేమిటో చూద్దాం. క్షయ వ్యాధి గురించిన అవగాహన సదస్సులను విస్తృతంగా నిర్వహించాలి. గ్రామ పంచాయతీలలోని 'డాట్స్' కేంద్రాల ద్వారా అందిస్తున్న వాచిత సేవల గురించి ప్రజలందరికీ తెలియపరచాలి. క్షయ రోగులకు పౌష్టికాహారం పంపిణీ చేయాలి.

క్షయ వ్యాధికి కారణభూతమైన సూక్ష్మ క్రిమిని కనుగొన్న తేదీని అంటే మార్చి 24న ప్రపంచ ఆరోగ్య సంస్థ 'వరల్డ్ టీబీ డే' (ప్రపంచ క్షయ నివారణ దినం)గా ప్రకటించింది. ఈ ఏడాది టీబీ డే సంద్భంగా అందరికీ క్షయ నివారణ చికిత్సలు, ఔషధాలను అందుబాటులోకి తీసుకురావాలని పిలుపునిచ్చింది. 'క్షయను గుర్తించండి, చికిత్స చేయండి వ్యాధిని పూర్తిగా నిర్మూలించండి, జీవితాల్ని కాపాడండి' అనే సందేశాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇచ్చింది. ఈ సందేశ స్ఫూర్తితో క్షయ వ్యాధి గురించిన అవగాహనను పెంచుకుంటూ క్షయరహిత భారతదేశ నిర్మాణం దిశగా అడుగులేద్దాం. స్వచ్ఛ భారత్! ఆరోగ్య భారత్!!

*– ఎస్.పి.ఆర్*

**దే**శంలోనే తొలిసారిగా గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో ఇంటింటికి నల్లా కనెక్షన్ ద్వారా రక్షిత ద్వారా రక్షిత తాగునీటిని అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'తెలంగాణ డ్రింకింగా వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు' పై కేంద్ర ప్రభుత్వం ఆసక్తిని కనపరుస్తోంది. ఈ భారీ ప్రాజెక్టుకు ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించే అంశాన్ని కేంద్ర ప్రభుత్వం చురుగ్గా పరి శీలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

**ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు డీపీఆర్, డిజైన్, గ్రిడ్ ఏర్పాటుకు చేపడుతున్న చర్యలపై గత మూడు రోజుల ఎగా ఢిల్లీలో రాష్ట్ర అధికారులతో చర్చలు జరుపుతున్నట్లు తెలియవచ్చింది.**

సుమారు రూ. 40 వేల కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న ఈ ప్రాజెక్టుకు కేంద్రం నుంచి సుమారు రూ. 4వేల కోట్ల నుంచి రూ. 8 వేల కోట్ల దాకా ప్రత్యేక ప్యాకేజీ కింద ఆర్థిక సహకారం లభించే అవకాశముందని టీఎంసీల నీటిని ఈ ప్రాజెక్టుటకు వినియోగించనున్నారు. 21.5 టీఎంసీ నీటిని కృష్ణా నది నుంచి, 12.5 టీఎంసీల నీటిని గోదావరి నది నుంచి తీసుకునేలా అధికారులు ప్రణాళికను రూపొందించారు. నీటిని ప్రజలకు సరఫరా చేసేందుకు మూడు అంచెల్లో పైప్‌లైన్‌ను డిజైన్ చేశారు. ప్రధాన పైప్‌లైన్ 5వేల కిలోమీటర్లు, రెండవస్థాయి పైప్‌లైన్ 50 వేల కిలోమీటర్లు, గ్రామాలలోకి సరఫరా చేసేందుకు 75వేల కిలోమీటర్ల పైప్‌లైన్‌ను అధికారులు డిజైన్ చేశారు.

ఈ గ్రిడ్ కోసం 180 మెగావాట్ల విద్యుత్ అవసరమని అధికారులు అంచనా వేశారు. జాతీయ గ్రామీణ తాగునీటి సరఫరా శాఖ ప్రమాణాల మేరకు దేశంలో మొట్టమొదటి సారిగా విజన్ 2050 ప్రణాళికతో గ్రామీణ ప్రాంతంలో ప్రతి వ్యక్తికి రోజుకు 100లీటర్లు, పట్టణ ప్రాంతంలో 150 లీటర్ల రక్షిత మంచినీటి అందించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికను రూపొందించింది.

# వాటర్ గ్రిడ్‌కు ప్రత్యేక ప్యాకేజీ!

ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికిప్పుడే కేంద్రం ప్రత్యేక ప్యాకేజీపై ప్రకటన చేయకున్నా, ప్రాజెక్టు అమలు, రాష్ట్ర ప్రభుత్వ పనితీరును పరిశీలించి కేంద్రం స్పందిస్తుందని అధికారులు విశ్వసిస్తున్నారు. ఇప్పటికే సీఎం కేసీఆర్ ప్రధాని నరేంద్ర మోదీని కలిసినపుడు ఈ ప్రాజెక్టు గురించి వివరించారు.

రాష్ట్ర ప్రభుత్వం దీనికి ఎంత ప్రాధాన్యత ఇస్తున్నదో వెల్లడించడానికి 'వాటర్‌గ్రిడ్ పైలాన్' ఆవిష్కరణకు ప్రధానినే రప్పించాలనే ఆసక్తితో ఉన్నారు. పైలాన్ ఆవిష్కరణకు మోదీ హాజరైతే వాటర్ గ్రిడ్ ప్రాజెక్టుటకు కేంద్రం నుంచి భారీ ఆర్థిక సహాయం లభించడం ఖాయమని అధికవర్గాలు భావిస్తున్నాయి.

### భారీ ప్రాజెక్టు...

తెలంగాణ వాటర్ గ్రిడ్ ద్వారా రాష్ట్రంలోని తొమ్మిది జిల్లాల పరిధిలోని 25వేల గ్రామలు, 67 పట్టణాలకు రక్షిత మంచినీరు సరఫరా చేయనున్నారు. ఇందుకోసం కృష్ణా, గోదావరి నదుల నుంచి సుమారు 37

### చకచకా ఏర్పాట్లు..

వాటర్ గ్రిడ్ పనులను సకాలంలో పూర్తి చేసేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గుర్తించిన ఖాళీలను భర్తీ చేయడానికి టీఎస్‌పీఎస్సీకి అనుమతిచ్చింది. అప్పటి వరకు కాంట్రాక్ట్ పద్ధతిలో అవసరమైన సిబ్బందిని నియమించింది.

ఉద్యోగుల సర్వీస్ రూరల్స్‌ను రేషనలైజ్ చేసి పదోన్నతుల ప్రక్రియను ప్రభుత్వం చేపట్టింది. క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించేందుకు అధికారులు, ఉద్యోగుల కోసం 21 కొత్త వాహనాలను కొనుగోలు చేసింది. గ్రిడ్ నిర్మాణానికి ఇతర శాఖల నుంచి అవసరమైన అన్ని అనుమతులు ఇప్పటికే పూర్తి చేసిన ప్రభుత్వం.

గ్రిడ్‌లో భాగంగా ఇంటేక్‌వెల్స్ నిర్మాణాలకు రూ. 1518 కోట్ల అంచనాలతో టెండర్లు పూర్తి చేసింది. టెండర్లు ముగిసిన వారం రోజుల్లో కాంట్రాక్టర్లకు ఎలాంటి మొబిలైజేషన్ అడ్వాన్స్‌లు లేకుండా ఇంటేక్‌వెల్స్ తవ్వకాల పనులను ప్రారంభించారు.

*– ఎన్.పి.ఆర్*

**పాలమూరు అంటేనే వలస జిల్లా, కరువు జిల్లా, నిరక్షరాస్యతో ప్రథమ స్థానంలో ఉండే జిల్లాగా బాహ్య ప్రపంచానికి పరిచయమైంది. కానీ తెలుగు ప్రాంతంలో ఏ జిల్లాకు లేని సాహిత్యసంపద, సాంస్కృతిక సంపద పాలమూరు జిల్లాలో ఉంది. అన్నమయ్య ప్రపంచానికి పరిచయం చేసిన మన తెలుగు వాళ్లు అన్నమయ్యకు దారి చూపిన తొలి తెలుగు సంకీర్తనాచార్యుడైన కృష్ణామాచార్యున్ని వివక్షకు గురిచేయడం జరిగింది. మరికొందరైతే ముందుకెళ్లి కృష్ణామాచార్యులు పాలమూరు జిల్లా వాడే కాదని వాదించిన వారు ఉన్నారు. వాదనలు ఎన్ని ఉన్నా చివరకు నిజమే గెలుస్తుంది.**

క్రీ.శ 1268 ప్రాంతంలో లక్ష్మీ దేవమ్మ, గోవిందాచార్యులు దంపతులకు ప్రస్తుతం షాద్‌నగర్ సమీపంలోని సంతాపూర్ (నాడు ఆ గ్రామం సంతూరుగా పిలవబడింది) లో కృష్ణామాచార్యులు జన్మించారు. తెలుగులో తొలివచనైక రచనలు చేసిన ప్రథమ సంకీర్తనాచార్యులు శ్రీ కంత కృష్ణామాచార్యులు. ఏకామ్రనాథుని, ప్రతాప చరితలోనూ, సరస్వతి మహల్ గ్రంథాలయం నందలి తాళపత్ర ప్రతిలో కృష్ణామాచార్యులు జీవిత విశేషాలు లభిస్తున్నాయి. వీటి ఆధారంగా కృష్ణామాచార్యులు సంతూరు గ్రామంలో వైష్ణవ కుటుంబంలో జన్మించారు. పుట్టు గుడ్డి అయిన నర్సింహస్వామి అనుగ్రహం చేత దృష్టిని పొంది సింహాచలస్వామిపై 4 లక్షల భక్తి పూరిత వచనాలు రాశారు.

కాకతీయ ప్రతాప రుద్రుని చేత 50 గ్రామాలపై అధికారం, ఒక అగ్రహారం బహుమానంగా పొందాడని సంతూరు దగ్గర గ్రామం నిర్మించాడని చివరి దశలో శ్రీరంగం క్షేత్రం చేరి క్రీ.శ. 1328లో మరణించారని శాసనాల వల్ల తెలిసింది.

కృష్ణామాచార్యుల గురించి "ప్రతాప చరిత్ర" అనే గ్రంథం కొన్ని విషయాలను తెలియపరుస్తుంది. అంతకు మించి పెద్దగా ఆధారాలు లభించలేదు. ఇతని "వచనముల"ను బట్టి చేస్తే మంచి భాషా పరిజ్ఞానం కలవాడని, సాహిత్య మర్మాలు తెలిసినవాడని అనిపిస్తుంది.

సంతూరులో జన్మించిన కృష్ణామాచార్యులు కొంతకాలం కల్లూరులో జీవించి, ఆ తర్వాత సింహగిరి వెళ్లారని తెలుస్తోంది. అందుకే ఈ వచనాలకు సింహగిరి వచనాలని పేరు వచ్చింది. భక్తి గల వాడే బ్రాహ్మణుడు అన్న సామాజికి ఆధ్యాత్మిక భావనలు బాగా తెలిసిన వ్యక్తి కృష్ణామాచార్యులు.

ఈ కవి రచనలు రెండు. ఒకటి సింహగిరి వచనాలు, రెండు విష్ణునామ సంకీర్తనా ఫలం. వీటిలో మొదటి కావ్యాన్ని ఆచార్య కులశేఖర్‌రావు ఎంతో కష్టపడి 1968లో సింహగిరి వచనాలతో ముద్రించారు. అందులో మొత్తం 60 సంకీర్తనలు ఉన్నాయి.

"దేవా..! జయ జయ పరంధామ...! పరమపురుష...! పరమాతా ప్రకాష..! అమృత..! అచలాచల...!అవ్యక్త...! అగణిత దయంబోధి ...! అనాథపతియైన స్వామి సింహగిరి నరహరి నమోనమో దయానిధి..!

"సింహగిరి నరహరి నమోనమో దయానిధీ..!" అన్న మకుటంతో కూడిన ఈ వచనలు శతక రచనలు కల్పిస్తాయి. భజన కీర్తనల సాంప్రదాయానికి కృష్ణామాచార్యులు మార్గదర్శకులైనారని చెప్పవచ్చు. ఆడుగూ, పాడుతూ, తిరుగుతు, మునుగుతూ, వచ్చుని, కలిగిన మున్నగు వ్యవహారిక పదాలకు చోటివ్వడం వచనాలు పోతానాది మార్గ కవులను, తాళ్లపాక పదకవులను ప్రభావితం చేశాయంటే వీటి ప్రశస్తి వెల్లడవుతుంది.

# తెలంగాణ సంకీర్తనాచార్య

"విష్ణు భక్తి లేని విధ్వాంసుని కంటేను హరికీర్తనము సేయునతడే కుల జుండుశ్వపచుండైన నేమి... ఏ వర్ణంబైననేమి ద్విజుని కంటే నతడే కుల జుండు... సింహగిరి నరహరి దలంచిన యతండే కులజుండు" వంటి పంక్తులు అన్నమయ్య పదాలలో "ఏకులజుడైన నేమి ఎవ్వరైనానేమి ఆకడ నతడే హరినెరగని వాడు"

హరిదలచు పంచమహా పాతకుడై బ్రాహ్మణోత్తముడు వంటివి ప్రతిబింబిస్తాయి.

తాళ్లపాక పెదతిరుమలాచార్యుల వేంకటేశ్వర వచనాకుల సింహగిరి వచనాలకు వచనములతో స్వామ్యాలు ఉన్నాయి. ఇంత గొప్ప రచనలు చేసిన కృష్ణామాచార్యులు తెలంగాణ సాహిత్య చరిత్రలోనే కాక తెలుగు సాహిత్య చరిత్రలో మనిపూసనే కాక సంకీర్తనా సాహిత్యానికి ఆధ్యుడనే చెప్పవచ్చు. వీరు రచించిన సంకీర్తనలు వేలాదిగా ఉన్నా మనకు లభిస్తున్నవి.

300 సంకీర్తనలు మాత్రమే. సాహిత్య పరిశోధకులు వీటిపై దృష్టి పెట్టి సంకీర్తనలంటిని ఒక చోట చేర్చాల్సిన అవసరం ఉంది. అలాగే రాగిరేకుల పైన వచనాలను (సంకీర్తనలను) చెక్కించే పద్ధతిని కృష్ణామాచార్యులే మొదట ప్రారంభించారు. ఇంతటి విశిష్టత గల కృష్ణామాచార్యుల సంకీర్తనలు అన్నింటిని సాహిత్య పరిశోధకులతో గ్రంథ రూపంలో తీసుకువచ్చినట్లయితే తెలంగాణ సాహిత్యాన్ని పునర్నిర్మించుకున్నట్లే అవుతుంది. అలాగే మన సాహిత్య సంపదను కాపాడుకున్న వారమవుతాం.

**– ఎన్.పి.ఆర్**

# డా॥ బి.ఆర్. అంబేద్కర్ తాత్వికతలో భారతదేశం

**“నేను నమ్మేది, భావించేది నా అభిప్రాయం మనమందరం ఒక జాతి. అది నిజమవడానికి మనమందరం గొప్ప కృషి సల్పుతున్నాము. ఎన్నో వందల కులాలతో కూడిన భారతదేశం ఒక జాతి ఎట్లా అవుతుందనేది ప్రశ్న? వెంటనే మనకు స్ఫురణకొచ్చేది ఇంకా మనమందరం ఒక జాతిగా ఏర్పడలేదు. దీనికి కారణం సాంఘిక మనోతత్వంగా జాతి ఏర్పడాలి. దానికి కావలసిన ఇంటా, బయట విషయాలను బయటికి రాకుండా జాతిమొత్తం కూడా తీవ్రంగా ఆలోచించి 'జాతీయత' అనే లక్ష్యాన్ని సాధించాలంటే ప్రతి భారతీయుడు కష్టించి, పనిచేసి ఉన్నతంగా ఎదిగి ఏకతను కాపాడాల్సిన బాధ్యత ప్రతి భారతీయ పౌరునిపై ఉందని “ఉరాజ్యాంగ సభ పరిషత్”ఉ చర్చల ప్రసంగంలో డాక్టర్ అంబేద్కర్ అన్నారు.**



దేశంలో పుట్టిన ప్రతి మానవుడు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతోపాటు, ఆర్థికంగా, రాజకీయంగా సమాన అవకాశాలు కల్పించడంతోపాటు దేశంలో ఆస్తిని జాతీయం చేసి ప్రజలందరికీ పంచాలని చెప్పిన గొప్ప దేశ భక్తుడు, జాతీయవాది. అలాగే సంపద, కుల, మతాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చినంతకాలం భారతదేశం ప్రపంచ దేశాల అభివృద్ధి పోటీలో మరియు విజ్ఞానవంత దేశం కావడానికి చాలా సమయం పడుతుందని జాతిని జాగృతం చేసి ఆంగ్ల విద్య అవసరం భవిష్యత్తులో దీని ప్రాధాన్యం నొక్కి చెప్పిన మార్గదర్శి.

మనదేశ ప్రధాని నెహ్రూ అస్పృశ్యులకు మహాపురుషుడు, రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ పీడిత వర్గాలకు ఆశాజ్యోతి మరియు రాజగోపాలచారి న్యాయం కోసం పోరాడిన ధీశాలి. వేరే కాకుండా ఎన్.ఎ. గాడ్గిల్ అన్యాయాన్ని ప్రతిఘటించిన ఉద్యమకారుడు, ఫైలి పోరాట యోధుడు ఆధునిక మనువుగా ఫ్రాంక్ ఆంథోని మాటల్లో నవ బుద్ధునిగా, దార్శనికుడిగా, దేశంలో సమసమాజ స్థాపన కోసం రాజీలేని కృషితో చివరి వరకు సిద్ధాంతం కోసం నిలబడ్డ ధృడ సంకల్పుడు అంబేద్కర్.

అంబేద్కర్ 1891 ఏప్రిల్ 14న మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్ 'మౌ' గ్రామంలో రాజ్‌జీ సఖ్‌పాల్, భీమబాయి దంపతులకు 14వ సంతానంగా జన్మించి, బరోడా సంస్థానాధీశుడు శాయాజీ రావ్‌గైక్వాడ్-అమెరికాలో ఉన్నత చదువులు చదివారు. అలాగే బ్రిటన్‌లో ఎం.ఎస్. సిడిఎస్‌సి (ఎకనామిక్స్) బార్‌ఎట్‌లా చదివారు. బ్రిటిష్ మ్యూజియం గ్రంథాలయంలో అత్యధిక పుస్తకాలను చదివిన మొదటి వ్యక్తి, మార్క్సిజం నేత కారల్‌మార్క్స్ కాగా, రెండో వ్యక్తి మన అంబేద్కర్. ఇతన్ని ప్రభావితం చేసిన వ్యక్తుల్లో గౌతమబుద్ధ, కబీర్, జ్యోతిరావ్‌పూలే నౌరోజీ, రనడే గోఖలే మొదలైనవారు.

## అంబేద్కర్ ఆలోచనలో విద్య

అంబేద్కర్ సమాజంలోని రుగ్మతలకు అవిద్యయే కారణంగా భావించి పీడితులైన నిమ్నకులాలు, సమాన అవకాశాలు పొందాలంటే 'చదువు' ఒక్కటే మార్గమని చెప్పాడు. 'విద్యయే శక్తి. విద్యతోనే సకల సమస్యలకు పరిష్కారం' దొరుకుతుందని నమ్మి, నిరూపించిన వ్యక్తి. ప్రపంచ దేశాలకు అనుసంధాన భాష అయిన 'ఇంగ్లీష్' ను చదవాలని ఇంగ్లీష్ మీడియంలో స్కూళ్ళను గ్రామీణ ప్రాంతాలలో ప్రారంభించాలని బ్రిటిష్ వారిని కోరాడు.

పూలే రన్నడేలు మొదలుపెట్టిన సాంఘిక సంస్కరణలు విద్య, సమానత్వం అందరి సొత్తు అనే భావనలను తీసుకొని బలహీన వర్గాల వారికి, నిమ్న జాతులకు, కార్మికులకు, మహిళల కోసం ప్రత్యేక పాఠశాలల ద్వారా విద్యావకాశాలను కల్పించాలని కోరుకున్నారు.

“విద్యార్థిగా అమెరికాలో అడుగుపెట్టాక ఇతను తన జీవితంలో మొదటిసారిగా స్వేచ్ఛా వాయువుల పీల్చారు. మనిషి పుట్టుకతో సంబంధం లేకుండా పౌరులందరిని సమానంగా చూసే సమాజాన్ని తిలకించి ముగ్దుడయ్యాడు. మనిషి రంగు, పుట్టిన కులం, తల్లిదండ్రులను చూసి వ్యక్తిత్వాన్ని నిర్ణయించే వాతావరణం నుంచి నూతన ప్రపంచంలోనికి ప్రవేశించిన అంబేద్కర్‌లో అభ్యుదయ భావాల వికాసం ఏర్పడింది. అతను చదివిన - వాల్టేర్, రూసో, ఇంగర్‌సాల్, బెర్నాడ్‌షా వంటివారి రచనలు, అమెరికా స్వాతంత్ర్య పోరాటం ఫ్రెంచి విప్లవానికి సంబంధించిన సాహిత్యం అతన్ని ఎంతో ప్రభావితం చేశాయి. దేశ చరిత్రను శాస్త్రీయ కోణంలో మానవ పరిణామ దృష్టితో చూడడం అలవర్చుకున్నాడు. తల్లిదండ్రుల పూర్వజన్మ సుకృతంత ఆధారంగా తమ సంతానపు అదృష్ట, దురదృష్టాలేర్పడతాయనేది ఒట్టి భ్రమ. ఈ కర్మ సిద్ధాంతానికి ఆధారం లేదు.

స్త్రీలు పురుషులతో సమానంగా చదువుకోవచ్చు, ఉద్యోగం చేయవచ్చు. ఈ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఉండడంవల్లనే అమెరికా ముందుకు పోగలుగుతోంది. ప్రాచ్యాత్య దేశాల అభివృద్ధికి ప్రధాన కారణం అక్కడి స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు, సమత్వభావన. మన దేశంలో

కూడా స్త్రీలకు పురుషులతోపాటు సమానావకాశాలు, విద్యావకాశాలు కల్పిస్తే దేశం వేగంగా అభివృద్ధి చెందుతుంది. ప్రస్తుతం నిమ్న కులాల కర్తవ్యం తమ సంతానాన్ని చక్కగా చదివించడమే. విద్యావంతమైన జాతి తనంతట తానే అభివృద్ధి చెందుతుంది'' అంటూ తన మిత్రుడికి రాసిన లేఖలో విద్యపై తనకు ఉన్న స్పష్టత మనకు గోచరిస్తుంది.

## ప్రజాస్వామ్యం పట్ల విశ్వాసం

అంబేద్కర్ పూర్తిస్థాయి రాజకీయ సిద్ధాంతకర్త కాకపోయినా రాజకీయ, న్యాయపరమైన విజ్ఞానం కలవాడు. రాజ్యం.. లక్ష్యాల సాధనకోసం పనిచేయాలని సూచించాడు. రాజ్యానికి సంబంధించిన నిధులే లక్ష్యంగా ఉంటుంది. ఇందులో పౌరుని స్వేచ్ఛ స్వాతంత్ర్యాలు, సుఖ సంతోషాల పరిరక్షణ పవిత్ర లక్ష్యంగా ఉండాలని ఆకాంక్షించాడు.

అంబేద్కర్ ప్రపంచంలో ఎన్నో రాజ్యాంగాలను చదివి, వాటిలో ఉన్న ఉన్నత భావనలు, లోటుపాట్లను నిశితంగా గమనించిన వ్యక్తి. కాబట్టి ప్రజాస్వామ్యాన్ని పూర్తిస్థాయిలో విశ్వసించాడు. ఎందుకంటే



ప్రజలకు రాజ్య కార్యనిర్వహణలో ప్రత్యక్ష భాగస్వామ్యం ఉండడం. ప్రాచీన మధ్య యుగాలలో పదవుల కోసం యుద్ధాలు చేయడం ద్వారా, మరణాలు సంభవించేవి. కాని ప్రజాస్వామ్య వ్యవస్థలో, ప్రజలే నిర్ణీత కాల వ్యవధితో కూడిన ప్రజా ప్రతినిధులను రక్తపాతం లేకుండా సమాజంలోని అసమానతలను రూపుమాపడానికి 'ప్రజాస్వామ్యం' ఒక సాధనంగా ఏర్పడి విస్తృత అవకాశాలను అందిస్తుందని భావించాడు.

ఇతను ప్రజాస్వామ్యం ప్రభుత్వ రూపం మాత్రమే కాక ఇది దేశ ప్రజల ఉమ్మడి జీవ విధానంగా పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో వృత్తులను ఎన్నుకొనే హక్కు అన్ని వర్గాల ప్రజలకు ఉండాలని, ఇలా జరగని పక్షంలో రాజకీయ ప్రజాస్వామ్యాన్ని సాధించలేమని కూడా చెప్పారు. సమానత్వం అనేది నిర్దిష్టంగా సాధ్యం కాకపోయినా పౌరులందరినీ సమానంగా చూడడం సాధ్యమని, అలాగే కులం, అంటరానితనం ఏ రూపంలో ఉన్నా నిషేధించాలని కోరిన సామాజిక వేత్త. 'సామాజిక న్యాయం' లేని ప్రజాస్వామ్యం నిరర్థకమవుతుందని ప్రజాస్వామ్యం విజయవంతంగా పనిచేయాలంటే సమాజంలో ఎలాంటి ప్రస్ఫుటమైన అసమానతలు రూపుమాపకుండా ఆర్థిక, సామాజిక న్యాయంలేని పక్షంలో రాజకీయ ప్రజాస్వామ్యాన్ని సాధించలేమని నిక్కచ్చిగా చెప్పాడు.

సమాజంలో ప్రజల ప్రజల మధ్య ఉన్న ఆదాయ అసమానతలను జాతీయస్థాయిలో తగ్గించాలంటే, దేశసంపదను జాతీయం చేయాలని భావించాడు. కాని ఆచరణలో ఇది సాధ్యం కాలేదు. ఈ అంశంపై విస్తృతంగా చర్చించేవారు, ఆదర్శభావాలు గలవారు చాలా తక్కువగా ఉండడం ఒక కారణంగా చెప్పవచ్చు. ఆదర్శభావాలు గల రాజకీయ నాయకులు, ప్రజలు, పీడీత వర్గాలకు రాజ్యాంగపరమైన రక్షణ కల్పించాలని, వారి ప్రత్యేక హక్కులను నిరాకరించకూడదు. అలాగే, ఇలాంటి హక్కులు స్వార్థ ప్రయోజనాలకు లేదా శాశ్వత హక్కులుగా మారకూడదని కూడా అంబేద్కర్ పేర్కొన్నారు.

అంబేద్కర్ ప్రజాస్వామ్యంపై వివరణ ఇస్తూ "ప్రభుత్వాన్ని నడిపే వ్యక్తులు, ప్రజల సామాజిక ఆర్థిక జీవన రంగాలలో మౌలిక మార్పులు తేవడానికి ప్రజాస్వామ్యం అనుమతించినప్పుడు, ఆ మార్పులను ఎలాంటి రక్తపాతం లేకుండా ప్రజలు ఆమోదించే పరిస్థితి ఉన్నప్పుడు అక్కడ ప్రజాస్వామ్యం ఉన్నట్లు చెప్పగలను. ప్రజాస్వామ్యానికి ఇదే గీటురాయి'' అని చెప్పారు.

ప్రజాస్వామ్యం విజయవంతం కావడానికి కొన్ని ముఖ్యాంశాలు అంబేద్కర్ గారు వివరించారు. అవి 1. సమాజంలో అసమానతలను ఉండకూడదు. 2. బాధ్యతయుత ప్రతిపక్షమనేది ప్రజాస్వామ్యంలో ఖచ్చితంగా ఉండాలి. 3. చట్టం ముందు, పరిపాలన ముందు అందరూ సమానంగా పరిగణించడం. 4. పాలకులు రాజ్యాంగపరమైన నీతిని పాటించడం. 5. ప్రజాస్వామ్యం పేరిట మైనారిటీల మీద నిరంకుశ పెత్తనం లేకుండా చూడడం మెజార్టీ పక్షం, ప్రభుత్వం మైనారిటీలకు భద్రతను కల్పించాలి. 6. ప్రజాస్వామ్యానికి ప్రజామోదం లేదా ప్రజా మద్దతు విధిగా ఉండాలి. ఈ లక్ష్యాలు రాజకీయ నాయకులు, ప్రభుత్వాలు ఒక నిర్దిష్ట కాలంలో సరైన మార్గంగా ఎంచుకొని దశ-దిశను చూపినట్లయితే ఇప్పటికీ అంబేద్కర్ ఆశయం నెరవేరేది.

## హక్కులు- రిజర్వేషన్లపై ఆలోచన

భారతదేశం ఆదర్శరాజ్యంగా ఏర్పడాలంటే సామాజిక్ ఆర్థిక్ రాజకీయ ప్రయోజనాలను సమానంగా అందేలా చూడవలసిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉంటుందన్నారు. ప్రాథమిక హక్కులు పౌరులందరికి సమానంగా కల్పించి ప్రజాస్వామ్య స్ఫూర్తిని పెంపొందించేలా ఉండాలన్నారు. అలాగే కొన్ని నిర్దిష్టమైన హక్కులను రాజ్యాంగంలో పౌరుల ప్రాథమిక హక్కులుగా చేర్చి, హక్కులకు భంగం కలిగితే ప్రతిపౌరుడు న్యాయస్థానాలను ఆశ్రయించే విధంగా న్యాయపర అంశాలను చేర్చారు.

దేశంలో తరతరాలుగా కొన్ని వర్గాల ప్రజలు సకల సౌకర్యాలతోపాటు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఉన్నత స్థానంలో ఉండడం. అలాగే కొన్ని వర్గాలవారు వివక్షతను, అవిద్య, అన్యాయాలను, దోపిడికి, నిరాదరణమే వెనుకబాటుకు కారణం. సనాతనంగా మార్పులు లేని సంస్కృతి, సాంప్రదాయ ఆచారాలను కట్టుబాట్లను ఆలోచించడంతో ప్రజలలో అంతరాలు పెరిగిపోయి ఉన్న సమయంలో దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాలవారికి "ఉన్నతస్థాయి, స్థితిగతులను మార్చడానికి రాజ్యాంగంలో తప్పనిసరిగా తప్పని పరిస్థితులలో 'రిజర్వేషన్లు' ప్రవేశపెట్టి దేశ ప్రజలందరు వివక్ష లేకుండా సమానమైన హక్కులతో సామాజిక



న్యాయం కోసం, సమాజంలోని వెనుకబడిన వారికి విద్య, ఉపాధి, ఉద్యోగాలలో రిజర్వేషన్లు జనాభా ప్రతిపాదికన ప్రవేశపెట్టారు. వీటితో సమాజంలో అంతరం తగ్గడంతోపాటు దేశ సమగ్రత, సమైక్యత కోసం, నవ్య భారతావనికి బాటలు వేయడానికి ప్రతిఒక్కరి భాగస్వామ్యం చేయవచ్చని తెలిపాడు. అలాగే నిర్దిష్టకాలం వరకే ఈ రిజర్వేషన్లు అమలు మరియు సాధారణ సామాజిక స్థాయి చేరుకునే వరకు ప్రత్యేక ప్రభుత్వ పథకాలు, కార్యకలాపాలు చేపట్టాలన్నారు. కాని స్వాతంత్ర్యం వచ్చి 68 సంవత్సరం అయినా ఇంకా ఓట్ల కోసం కుల, మత, వర్గ, ప్రాంతీయ తత్వాలను నేటితరం రాజకీయ పార్టీలు రిజర్వేషన్లను పొడిగించుకుంటూ పోవడంతో అంబేద్కర్ ఆశించిన స్థాయిలలో ఫలితాలు రాక దేశ ప్రజలలో రిజర్వేషన్లపై కొన్ని వర్గాల వారు వ్యతిరేకించడం ఉద్యమించడానికి పాలకులే కారణంగా చెప్పవచ్చు.

## కుల వ్యవస్థ - అస్పృశ్యత - దేశ భవిష్యత్తు

కుల వ్యవస్థ అంటరానితనం ఒక దురాచారం. ఇది మహాపాపం అని ఇది సమాజ నాశనానికి భవిష్యత్ ఉద్యమ పోరాటాలకు దారి తీస్తుందని సంఘ సంస్కర్తలయిన బుద్ధుడు, ఆదిశంకరాచార్య, స్వామి దయానంద, రాజారామ్ మోహన్‌రాయ్, వివేకానంద, జ్యోతిరావ్‌పూలే, పెరియార్, గాంధీలాంటివారు, ప్రాచీన కాలం నుండి నేటి వరకు బోధిస్తున్నారు. కుల వ్యవస్థ పునాదులను శాస్త్రీయ పద్ధతిలో పరిశోధించి, దీన్ని నిర్మూలించడానికి ఎనిహిలేషన్ ఆఫ్ క్యాస్ట్, (1936) హువర్ ద అన్‌టచ్చబుల్స్ (1948) లో మూలాలను గురించి చర్చించారు. ఈ సిద్ధాంతాల ప్రకారం కులం అనేది ఒక భావన. ఇది దేవుని చేత సృష్టించబడలేదు.

సమాజంలో ఒక వర్గం ఆధిపత్యం కోసం మనుషులే దీనిని సృష్టించారనేది సత్యం. నేటికి కూడా రాజకీయాలు కులం ఆధారంగా చేసుకొని సీట్లు కేటాయించి ఎవరి లాభం కోసం వారు వాడుకోవడం, నేడు కుల సంఘాలు అధికమై కులాల మధ్య ఆధిపత్య పోరు సాగి మేము గొప్ప అంటే మేము గొప్ప అనే విధానాలు పాటించి అందరూ రాజ్యాధికారం కావాలని ప్రతివారు కోరుకోవడంతో మళ్లీ వెనక్కి నెట్టబడుతు కొన్ని కులాల వారికే లబ్ధి జరిగే విధంగా ఉంది.

"రెండవవాడు కొట్లాడితే మూడోవాడికి లాభం ఉన్నట్లుగా ఉంది నేటి కుల వ్యవస్థ". అందుకే అంబేద్కర్ కులాలను రూపుమాపి దేశ సమైక్యతకోసం పాటుపడాలన్నారు. ఎందుకంటే ఉన్నతమైన కులములో పుట్టినవారందరు మేధావులు కారు. అలాగే తక్కువ కులంలో పుట్టినవారందరు అజ్ఞానులు కారు. ఒక వ్యక్తి ప్రజ్ఞాపాటవాలనేవి అతను పెరిగిన సామాజిక, ఆర్థిక రాజకీ, భౌగోళిక పరిస్థితులు, కుటుంబం నుండి తన చుట్టు ఉన్న సమాజంతోపాటు తాను ఎంచుకొన్న లక్ష్యంతోపాటు అనుభవం, పరిసరాలు, గమ్యానికి చేరుకోవాలని కాంక్ష ప్రభావితం చేస్తాయని అంటారు.

ఉదా: మహాత్మాగాంధీ పుట్టిన కులం నుండి ఎంతమంది మేధావులు దేశ దశ దిశను నిర్దేశిస్తున్నారు. అలాగే పూలే, వివేకానంద, భగత్‌సింగ్‌లాంటి వారి కులాలలో ఎంతమంది దేశంకోసం పనిచేస్తున్నారు. అంబేద్కర్ కులం నుండి ఎంతమంది అదేస్థాయిలో మేధావులున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే దేశంలో ప్రాచీనకాలం నుండి నేటివరకు కులం అనేది మేధావులను సృష్టించలేదు. ప్రజ్ఞాపాటవాలు, నాయకత్వం అనేవి ఎవరి సొత్తుకాదనేది ఎన్నో ఋజువులతో మనం విద్యావంతులుగా గమనిస్తున్నాం. దేశంలో అక్షరాస్యత పెరిగింది, అలాగే ప్రచార మాధ్యమాలయిన సినిమా, టి.వి, రేడియో, పత్రికలు, పుస్తకాలు చదువుకుంటూ కూడా ఇంకా అక్కడక్కడ అస్పృశ్యతను పాటించడం, గుడులకు రానివ్వకపోవడం, కులం, మతం పేరుతో హత్యలు చేయడం, భారతదేశ సమైక్య స్ఫూర్తికి, ప్రజాస్వామ్య విలువలకు గొడ్డలిపెట్టులా భావించాలి. అందుకే మనం మన ప్రాంతాలలో కుల వ్యవస్థపట్ల, అస్పృశ్యతను రూపుమాపడానికి ప్రయత్నం చేద్దాం. అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని అందరికీ అర్థమయ్యేటట్లు బోధించుదాం.

## పార్లమెంటరీ వ్యవస్థతో - ఐక్యత సాధనకు మార్గం

'అధికారం పాలకుడిని అవినీతి పరునిగా మారుస్తుంది, అపరిమిత అధికారం ఎల్లలులేని అవినీతికి దారితీస్తుంది' ఈ పోప్ సిద్ధాంతంతో అంబేద్కర్ ఏకీభవించి అధికారాల పంపిణీ, వికేంద్రీకరణ, కేంద్ర రాష్ట్ర అధికారాల సమతుల్యంపై ప్రత్యేక దృష్టి సారించి అధ్యక్షతరహా ప్రభుత్వంవైపు మొగ్గుచూపి భారతదేశంలో, అస్థిర, ప్రత్యేక పరిస్థితులను, స్వేచ్ఛ, సమగ్రతకు అధ్యక్ష తరహా విధానం మేలనుకున్నాడు. కాని మన దేశ పరిస్థితులకు అనుగుణంగా పార్లమెంటరీ ప్రభుత్వ విధానం ఉపయోగకరమని నిర్ధారించడానికి, ప్రాచీన కాలంలో మన దేశంలో పార్లమెంటరీ సంస్థలు ఉండేవనీ, బౌద్ధ గ్రంథమైన 'మహాపరిణిబ్బన' లోని అనేక సూక్తాలలో ఉన్నాయన్నారు. నేడు ఎలక్షన్ కమీషన్ పాటిస్తున్న రహస్య బ్యాలెట్ పద్ధతి సైతం ప్రాచీన కాలంలో 'సాల పత్రకా గ్రాహకాలు' గా పిలవబడేవని తెలిపారు.

అలాగే ఆధునిక పార్లమెంటు వ్యవస్థకు ప్రధానాంశాలను వివరించారు. అవి 1) పార్లమెంటరీ వ్యవస్థతో కూడిన ప్రభుత్వంలో వారసత్వ పాలనకు తావులేదు. పాలకులు ప్రజలుచేత ఎన్నుకోబడుతూ ఉండాలి. 2) పార్లమెంటరీ వ్యవస్థలో ప్రజాప్రతినిధులు మాత్రమే చట్టాలను రూపొందించాల్సి ఉంటుంది. చట్టాలు నిర్వహణ చర్యలు అన్ని ప్రభుత్వ పరంగా ప్రజా ప్రతినిధులు ద్వారానే జరగాలి. 3) మరియు నిర్ణీత కాలవ్యవధి ప్రకారం ఎన్నికలు నిర్వహించి ప్రభుత్వ ఏర్పాటు చేయడం, వీటితోపాటు బాధ్యతాయుత ప్రతిపక్షం స్వేచ్ఛాయుత ఎన్నికల ద్వారానే ప్రజాస్వామ్య వ్యవస్థ మనజాలదని తెలిపారు. నేడు పార్లమెంటరీ వ్యవస్థలో సిద్ధాంతాలను ఆచరించే పార్టీలు తక్కువగా ఉన్నాయి. చట్ట సభలలో ఎన్నికవుతున్న ప్రజా పార్లమెంటరీ వ్యవస్థలో సిద్ధాంతాలను ఆచరించే పార్టీలు తక్కువగా ఉన్నాయి.

చట్ట సభలలో ఎన్నికవుతున్న ప్రజా ప్రతినిధులు ప్రజా సమస్య

పట్ల స్పందిస్తున్న తీరు, వారి వ్యవహారి శైలి కొన్ని సందర్భాలలో ఇలాంటివారినేనా మనం ఎన్నుకున్నది అనే ప్రశ్న ప్రతి ప్రజాస్వామ్యవాదికి ఉదయిస్తుంది. ఎన్నికలంటే కోట్లతో కూడిన వ్యవహారంగా మారింది. సామాన్యులు చట్టసభల్లో కాలుపెట్టే అవకాశం లేకుండా పోతుంది. ఉన్నతమైన రాజ్యాంగం ఉన్నా, దాని ఆశయాలు, భావనలు ఆకళింపు చేసుకుంటుకున్నవారు కొద్దిమంది మాత్రమే ఉండడంతో ప్రజా సమస్యలకు పరిష్కారం సత్వరంగా దొరకడం లేదు. అలాగే బాధ్యతాయుత ప్రతిపక్షాలు కూడా నేడు పార్లమెంటు వ్యవస్థలో అక్కడక్కడా కనిపిస్తున్నాయి. మరియు నేటి పార్లమెంటు, అసెంబ్లీ సమావేశాలలో వ్యక్తిగత విషయాలు, పరస్పర దూషణలకు ప్రాధాన్యమివ్వడంతో సభా సమయాన్ని, కొన్ని కోట్ల ప్రజా ధనాన్ని వృధా చేస్తున్న మన ప్రజా ప్రతినిధుల తీరు కలవరపెడుతున్నాయి.

అంబేద్కర్ ఏ స్ఫూర్తితో అయితే రాజ్యాంగం రచించారో ఆ విలువలు, ఆశయాలు సాధించాలంటే క్రమ శిక్షణ కలిగిన పౌరులు బాధ్యతయుతంగా ప్రజాసేవ చేయాలనే ధృఢ సంకల్పం ఉన్నవారు చట్ట సభలలో ప్రజాప్రతినిధులను పంపిస్తే నిజాయితీతో రాజ్యాంగాన్ని రక్షిస్తూ ప్రజల సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని చెప్పవచ్చు.

డా॥ అంబేద్కర్ రాజ్యాంగ సభలో చేసిన ప్రసంగాలను నిశితంగా గమనిస్తే అతని దేశభక్తి, ముందుచూపు మనకు అర్థమవుతుంది. దేశంలో భిన్న కుల, మత, సంస్కృతులు కొనసాగి ఐక్యతతో ముందుకు నడవాలంటే బలమైన కేంద్రం ఉండాలన్నారు. బల మైన కేంద్రం ఎందుకు కావాలో 'స్టేట్స్ మైనార్టీస్' అనే పుస్తకంలో క్షుణ్ణంగా వివరించారు. బలమైన కేంద్రం ఉంటేనే అన్ని వర్గాల కులాల ప్రయోజనాలు కాపాడబడతాయి. లేని యెడల విచ్ఛిన్నకర శక్తులు తమ అవకాశవాదంను వినియోగించుకొని బయటపడే అవకాశం ఉందంటారు. బలమైన కేంద్రంగా ఉండడంలో రాజ్యాంగ సంస్థలయిన సుప్రీంకోర్టు, ఎలక్షన్ కమీషన్, పబ్లిక్ సర్వీస్ కమీషన్, రక్షణ దళాలు, ప్రెస్ కౌన్సిల్, న్యాయ కమీషన్, ఆర్థిక సంఘం, ప్రణాళికా సంఘం, రాష్ట్రాలలో ఉండే గవర్నర్లు మొదలైనవి ప్రధాన భూమిక పోషిస్తూ దేశ ఐక్యతకు మూల స్థంభాలుగా పేర్కొనవచ్చును.

భారతదేశ సమైక్యతను పెంపొందించడంతోపాటు దేశంలోని సామాజిక ఉద్రిక్తలను తగ్గించడానికి పూర్వ రాష్ట్రాలను భాషా ప్రయుక్త రాష్ట్రాలుగా విభజించడంతో కులతత్వం, మతతత్వం, ప్రాంతీయవాదం, ఛాందసవాదం లాంటివి అరికట్టవచ్చని భావించారు. భాషా ప్రయుక్తంగా కాకుండా ఇతర అంశాల ఆధారంగా దేశాన్ని పునర్వ్యవస్థీకరిస్తే జాతి సమైక్యత, సమగ్రతకు ముప్పు వాటిల్లగలదని తీవ్రంగా హెచ్చరించారు. దేశంలోని భాషలు, లిపిలను ప్రోత్సహించి, లిపి ఏదైనా దేశ సమైక్యత కోసం భాష ఒక్కటిగా ఉండాలని, దీనితో జాతిని సమైక్యత పరిచే శక్తిగా ఉండగలదన్నారు. అందుకే హిందీని జాతీయ భాషగా గుర్తించడం జరిగింది.

## అంబేద్కర్ ప్రసంగం

1948 నవంబర్ 4న రాజ్యాంగ సభలో ముసాయిదాపై చర్చ మొదలైంది. అవసరమైన మార్పులు చేర్పులు జరిపాక రాజ్యాంగ సభ తుది ఆమోదం కోసం ఈ చట్టాన్ని సభలో ప్రవేశపెట్టారు. రాజ్యాంగం స్వరూప స్వభావాలను సూక్ష్మంగా సరళమైన భాషలో సభికుల ముందు సుదీర్ఘమైన ఉపన్యాసం మొదలెట్టారు.



"అమెరికా దేశంలోవలెనే మన దేశంలోనూ అధ్యక్షుడిదే అగ్రసనం. అయినా మనది పార్లమెంట్ పద్ధతిలో ఏర్పాటయిన రాజ్యాంగం. మన రాజ్యాంగం ప్రకారం అధ్యక్షుడు తన పేరుమీద పార్లమెంటు ద్వారా యంత్రాంగాన్ని నడిపిస్తాడు. అమెరికాలో అధ్యక్షుడికి కార్యదర్శులు ఉన్నట్లుగా మన అధ్యక్షుడికి మంత్రివర్గం ఉంటుంది. మన మంత్రివర్గం పార్లమెంటుకు బాధ్యత వహిస్తుంది. మంత్రులు తప్పకుండా పార్లమెంటు సభ్యులయివుండాలి. ప్రజాస్వామిక మంత్రివర్గం సుస్థిరమైనదిగా, బాధ్యతాయుతంగా ఉండాలి.

పార్లమెంటులో సభ్యులు ప్రవేశపెట్టే వాయిదా తీర్మానాలు, కోత తీర్మానాలు, ప్రశ్నలు - వీటన్నింటినీ ఎదుర్కొంటూ ముందుకు సాగాలి. కనుక మనది పార్లమెంటరీ తరహా ప్రభుత్వ వ్యవస్థ. మనదేశంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలనేవి రెండూ ఉన్నాయి కనుక మనది సమాఖ్య రాజ్యాంగమే. ఐతే - అమెరికాలో వలెకాక మన దేశస్తులందరికదీ ఒకే పౌరసత్వం. మన రాజ్యాంగం ఆస్ట్రేలియా రాజ్యాంగాన్ని పోలి ఉంది. కేంద్ర ప్రభుత్వమే ఆయా రాష్ట్రాల విధులు, బాధ్యతలు, హక్కులు, విధానాలను నిర్ణయిస్తుంది. దేశం మొత్తానికి ఒకే న్యాయసూత్రం, ఒకే ఉద్యోగ విధానం ఏర్పాటు చేయడం వల్ల ప్రజలందరికీ ఒకే పౌరసత్వపు హక్కులు లభిస్తున్నాయి.

భారతదేశంలో వంశపారపర్యంగా రాజ్యాలనేలిన రాజులు అనేకం. ఒక వంశాన్ని పడగొట్టి మరో వంశం అధికారంలోకి వచ్చేది. హిందువులు, పఠానులు, మొఘలులు, మహారాష్ట్రులు, సిక్కులు, ఆంగ్లేయులు యిలా ఎందరో రాజ్యమేలారు. రాజులు మారినా రాజ్యాలు మారినా గ్రామీణ జీవితంలో కొత్త మార్పు, చైతన్యం, అభివృద్ధి ఉండేవి కావు.

మన రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కుల్ని కూలంకషంగా పరి శీలించగలిగితే అమెరికా రాజ్యాంగంలోని హక్కులకంటే మన హక్కులే వాత్తమమయినవి. రాజ్యాంగ చట్టంలో - అధిక సంఖ్యాకులు అల్ప సంఖ్యాకులని దోపిడికి దౌర్జన్యానికి గురి చేయకుండా ఎలాంటి వాపద్రవం కలుగుతుందో ఐర్లాండ్ దేశ చరిత్రే సాక్ష్యం.

కేంద్రీకృత ధోరణులు అధికంగా ఉన్నాయని కొందరూ, కేంద్రానికున్న అధికారాలు తక్కువని కొందరు విమర్శించారు. అధికార కేంద్రీకరణ విషయంలో మనం మధ్యే మార్గాన్నవలంభించాం. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంబంధాలపై కూడా కొన్ని విమర్శలు వచ్చాయి. దేశరక్షణ,

విదేశాంగ వ్యవహారాలు, రవాణా సౌకర్యాల విషయాలలో పూర్తి బాధ్యత కేంద్రానికే యివ్వబడింది. అలా లేకపోతే దేశ రక్షణకే ప్రమాదం సంభవిస్తుంది.

మన రాజ్యాంగం ఆచరణ సాధ్యమయినది. పైకి చాలా సున్నితంగా కనిపించినా అవసరాన్ని బట్టి అది దృఢం కాగలదు. యుద్ధ కాలంలోనూ శాంతి కాలంలోనూ కూడా అది ఒడిదుడుకులను తట్టుకోగలదు.

రాజ్యాంగం ఎంత ఉత్తమయినదయినా ప్రజల సహకారం లేనిదే అది ఉత్తమ ఫలితాలనూ, ఆశించిన ఫలితాలనూ యివ్వజాలదు. ప్రజాస్వామిక విలువలను దృఢంగా నమ్మి, చిత్తశుద్ధితో రాజ్యాంగ సూత్రాలను అమలు జరిపితే తప్ప భారత కోల్పోయిన మనదేశం. మరోసారి తన స్వాతంత్ర్యాన్ని కోల్పోతుందా? చరిత్ర పునరావృతమవుతుందా? ఏమో గతంలో ప్రమాదం సంభవించవచ్చు. మన స్వాతంత్ర్యాన్ని పదిలంగా కాపాడుకోవాలంటే రక్తపాతానికి దారితీసే అరాచక విప్లవ తత్వాలను వదలాలి. ఎటువంటి జటిల సమస్యలనయినా ప్రజాస్వామ్య పద్ధతుల ద్వారానే పరిష్కరించుకోగలగాలి. వ్యక్తి పూజా విధానం దేశాన్నీ, ప్రజానీకాన్నీ అత్యంత హీనదశకు దిగజారుస్తుంది. అన్ని బాధ్యతలూ ఆయనకు వదలి పెట్టే ధోరణి ఎంతమాత్రమూ వాంఛనీయంకాదు. ఈనాడు మనకి లభించింది రాజకీయ స్వాతంత్ర్యం మాత్రమే. దానితో తృప్తి పడి ఉండకూడదు. సాంఘిక ఆర్థిక రంగాలలో కూడా ప్రజాస్వామ్యం సాధించడానికి కృషి చేయాలి. స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాతృత్వం పునాదులపై సాంఘిక ప్రజాస్వామ్యాన్ని ఏర్పరచకపోతే రాజకీయ ప్రజాస్వామ్యం మనజాలదు.

1950 జనవరి 26వ తేదీ నుండి మనదేశంలో రాజకీయ సమానత్వం ఏర్పడినా సాంఘిక ఆర్థిక రంగాలలో అసమానత్వమే సాగుతుంది. ప్రజాస్వామ్య విరుద్ధమయిన యీ అసమానత్వాలను మనమంతా ఏకమై వీలయినంత త్వరలో రూపుమాపినట్లయితే తిరుగుబాట్లు జరగవు."

ఈ విధంగా డా॥ అంబేద్కర్ ప్రజ్ఞాపాటవాలు ఉన్న ఒక ప్రొఫెసర్‌గా, న్యాయవాదిగా ప్రజాప్రతినిధిగా, న్యాయవాదిగా ప్రజాప్రతినిధిగా రాజ్యాంగ నిర్మాతగా, కేంద్రమంత్రిగా, సంఘ సంస్కర్తగా అన్నింటికంటే ముఖ్యంగా శతాబ్దాల తరబడి అణచివేతకు, దోపిడీకి, పీడనకు గురవుతున్న నిమ్న, దళిత, గిరిజన జాతి వెనుకబడిన వర్గాల విముక్తి కోసం అవిశ్రాంతంగా తిరుగుబాటు చేసిన పోరాట యోధుడు. ప్రజల సంక్షేమం, పురోభివృద్ధి కోసం రాజ్యాంగపరంగా పలురకాల ప్రయోజనాలకు సమకూర్చిన ప్రజాబాంధవుడు. అందుకే భారతదేశ ప్రభుత్వం అంబేద్కర్ సేవలను గుర్తించి ప్రతిష్ఠాత్మకమైన 'భారత రత్న' బిరుదును ప్రధానం చేసి దేశ ప్రతిష్ఠను ఇనుమడింప చేసింది.

అంబేద్కర్ అందరివాడు, సామాజిక వైతాళికుడు, జాతీయవాది, గొప్ప దేశభక్తుడు, రాజ్యాంగ పిత. ఇతని ఆలోచన విధానాన్ని, తత్వాన్ని అర్థం చేసుకొని, ఆదర్శ భారతదేశం నిర్మాణానికి రాజ్యాంగ బద్ధంగా మనకు సంక్రమించిన హక్కులు, విధులను అనుభవిస్తూ భవిష్యత్ తరాలకు రాజ్యాంగ స్ఫూర్తిని, ఐకమత్యంతో జాతీయ భావనను ముందుకు తీసుకెళ్ళాలని కోరుకొందాం.

*- కొర్ర ఈశ్వర్‌లాల్*
*రాజనీతి శాస్త్ర విభాగం, ఉస్మానియా యూనివర్సిటీ*

# టిసిపార్డులో జాతీయ పంచాయతీరాజ్ రాజ్ దినోత్సవం

**జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏప్రిల్ 24న టిసిపార్డులో సభా కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ & గ్రామీణాభివృద్ధి సంస్థ జాయింట్ డైరెక్టర్ శ్రీ కె. యాద్య అధ్యక్షత వహించి, ప్రసంగించారు.**

భారతదేశంలో పంచాయతీవ్యవస్థ అతి పురాతనమైనది. ఎన్నో మార్పులు చెందుతూనే నేటికి గ్రామీణ ప్రజలకు పలు రకాలైన సేవలను అందిస్తుందన్నారు. గుప్తుల కాలం నుండి పంచాయతీ వ్యవస్థ గ్రామాల పరిపాలన నిర్వహణ కొనసాగిస్తూ, క్రింది స్థాయిలో ప్రజాస్వామ్యాన్ని విజయవంతంగా కొనసాగిస్తుందన్నారు.

1959 నుండి గ్రామ పంచాయతీ రాజ్ చట్టం, కాలానుగుణంగాను, ప్రజావసరాల దృష్ట్యా నడుస్తూ క్రిందిస్థాయిలో ప్రజలకు పలు సేవలు నిర్వహిస్తుందన్నారు. ఈ పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయడానికి రాజ్యాంగ సవరణలు చేయడం జరిగిందన్నారు. చివరకు 1993లో 73వ రాజ్యాంగ సవరణ పంచాయతీలకు పూర్తి స్వయం నిర్ణయాధికారాలను 'గ్రామసభకు' ఇవ్వడం ద్వారా గ్రామీణ పౌరుడే తనకు కావలసిన గ్రామావసరాలను తీర్చుకోటానికి అధికారం కట్టబెట్టింది. దానిననుసరించి నూతనంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం నూతన పంచాయతీరాజ్ చట్టాన్ని మరింత సమర్థవంతంగా ఏర్పాటు చేసే కార్యక్రమంలో ఉంది.

ఆ చట్టం అమలులోకి వస్తే తెలంగాణ గ్రామీణ ప్రజలకు సేవలను మరింత సమర్థవంతంగా చేరగలవని ఆశాభావం వ్యక్తం చేశారు. అందుకు పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగస్వామ్యం సమర్థవంతంగా తమ సేవలను అందించాలని ఉద్యోగులకు విజ్ఞప్తి చేశారు. పంచాయతీరాజ్ దినోత్సవం ప్రాముఖ్యత గూర్చి వివిధ శాఖాధిపతులు తమ అనుభవాలను పంచాయతీశాఖను బలోపేతం చేయటానికి వివిధ చర్యలను, ఎం.పిల గ్రామాభివృద్ధి యోజన తీరుతెన్నులను గూర్చి వివరించారు.

ఈ కార్యక్రమంలో టిసిపార్డు సిబ్బంది, ఉద్యోగులు అందరూ పాల్గొని విజయవంతం చేశారు. రాబోయే రోజుల్లో పంచాయతీరాజ్ వ్యవస్థ తెలంగాణ రాష్ట్రంలో మరింత సమర్థవంతంగా పనిచేస్తూ ముందుకు పోతుందని ఆశించవచ్చు.

*– సి.ఎం.పి.*



# పంచాయతీరాజ్ చట్టం - గతం - నేడు పరిణామం అధికార - విధులు పరిణామ క్రమంపై వర్క్‌షాప్

**పంచాయతీరాజ్ వ్యవస్థలు గతంలో ఎట్లా ఉన్నాయి? నేటి పరిస్థితులలో అధికారాలు, విధులను ఏ విధంగా సంస్థలు పని చేస్తున్నాయనే అంశం మీద డి.పి.ఆర్. చట్టాలు 195-1994 మీద అనుభవజ్ఞులైన నిపుణుల అభిప్రాయాలను సేకరించేందుకు ఎ.ఎం.ఆర్. అపార్డులో ఒక రోజు వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ వర్క్ షాప్‌ను 'ప్రణాళిక మరియు వికేంద్రీకరణ కేంద్రం' వారి ఆధ్వర్యంలో జరిగింది. దీనికి ఎ.ఎం.ఆర్. అపార్డు జాయింట్ డైరెక్టర్ కె. యాదయ్య అధ్యక్షత వహించారు.**

ఈ వర్క్‌షాప్‌లో గతంలో బి.డి.ఓ. గా పనిచేసిన వారు, జిల్లా పరిషత్ ఎక్జిక్యూటివ్ ఆఫీసర్లు, డి.పి.ఓలు పాల్గొని పంచాయతీ సంస్థ అధికారులను సమన్వయపరచే సి.ఇ.ఓ. జిల్లా పంచాయతీ సర్వీసు నుండైతే గ్రామాభివృద్ధి సంస్థల మధ్య సమన్వయం పెరిగి లక్షిత వర్గాల పథకాలు, ఫలితాలు చేరేందుకు అవకాశం ఉందన్నారు.

73వ రాజ్యాంగ సవరణకు తెచ్చిన పంచాయతీరాజ్ చట్టం 1993కు ముందుగల జిల్లా పరిషత్ మరియు పంచాయతీరాజ్‌ల చట్టం 1950కి గల తారతమ్యాలను సవరించి, ప్రస్తుతం ఉన్న పంచాయతీరాజ్ చట్టం 1993 తగిన మార్పులు చేయటం వలన పంచాయతీరాజ్ సంస్థలైన స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేయవచ్చని పలువురు సూచించారు. పంచాయతీరాజ్ సంస్థకు సమాంతరంగా ఇతర సంస్థలు కూడా పని చేయటం వలన పంచాయతీరాజ్ వ్యవస్థలు తమ లక్ష్యాలను సాధించటంలో ఆలస్యం అవుతుందన్నారు.

ఇటీవల తెలంగాణ ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థలని పాలకుల గౌరవ వేతనం పెంపు స్థానిక ప్రభుత్వాలకు తగిన సాధికారతను కల్పించటానికి ప్రభుత్వం కృతనిశ్చయం తెలుపుకుందని అభిప్రాయపడ్డారు.

స్థానిక ప్రభుత్వాలైన జిల్లా పరిషత్‌లను మండల పరిషత్‌లను బలోపేతం చేయటానికి తగిన సూచనలు ఈ వర్క్‌షాప్‌లో తెలియజేశారు. గతంలో పంచాయతీరాజ్‌లో వివిధ స్థాయిలలో అధికారులుగా పనిచేసిన వారు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేయటానికి వీరు అందించిన సలహాలను, సూచనలు రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించడం జరుగుతుంది.

*- సి.ఎం.పి.*

# అందరికి విద్యాసాధనలో భారత్

**భారతదేశ విద్యారంగంలో పెను మార్పులు చేసుకొన్నాయి. ఐక్యరాజ్యసమితి విద్యా, సాంఘిక, సాంస్కృతిక మండలి ఇండియా నివేదిక ప్రకారం పాఠశాలకు బయట నుండే వారి శాతాన్ని 90% తగ్గించుకుంది. విశ్వవ్యాప్త ప్రాథమిక సదుపాయాలను సాధించడంలో ముందుందని పేర్కొంది.**

- ❋ 47% దేశాలలో విశ్వవ్యాప్త ప్రీ-ప్రాథమిక పాఠశాలలో పిల్లల నమోదు రేటు పెరిగిందని 2000-2015 నివేదిక పేర్కొంది.
- ❋ 32% దేశాలు ఇండియాతో సహా 'వయోజన విద్య' స్థాయిని పొందటంలో వెనుకబడి ఉన్నాయి.
- ❋ 8% దేశాలు ఇండియాతో కలుపుకొని విద్యా సాధనకు కృషి చేస్తున్నాయి.
- ❋ ప్రతి ఏడాదికి 22 బిలియన్ డాలర్లు ప్రీ-ప్రైమరీ విద్యను పొందడానికి ఖర్చు అవుతుంది. ఈ లక్ష్యాన్ని 2030 కల్లా అధిగమించాలని యునెస్కో నిర్ణయించింది.
- ❋ ప్రీ-ప్రైమరీ పాఠశాల విద్యలో జెండర్ రేషియో బాల్ బాలికల మధ్య వ్యత్యాసం ఉంది. ఆ వ్యత్యాసంను తగ్గించుకొనేందుకు పనిచేయాలని - యునెస్కో సందేశం ఇచ్చింది. ◆

# ‘జననేత’ బాబూ జగ్జీవన్ రామ్

**బీహార్‌లోని షాబాద్ జిల్లా చాంద్వా గ్రామంలో శ్రీమతి బసంతీదేవీ, శ్రీ శోభిరామ్ దంపతులకు 1908 సంవత్సరంలో ఏప్రిల్ 5న చమర్‌కులంలో జన్మించారు. అంటరానితనంపై బాల్యం నుంచే పోరాడిన వీరుడు బాబూ జగ్జీవన్‌రామ్. ఈయనకు ఎనిమిదోవ ఏటనే బాల్య వివాహం చేశారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్య ముగిశాక 1928లో కాశీని వదిలి కలకత్తా విశ్వవిద్యాలయం నుండి 1931లో బి.యసి డిగ్రీని పొందారు.**



ఆయన చదువుకునే రోజుల్లో పండిత మదన మోహన్ మాలవ్యా, పండిత గోవింద వల్లభవంత్‌లతో పరిచయం ఏర్పడింది. బాబూ జగ్జీవన్‌రామ్ బీహార్ రాష్ట్ర శాఖ హరిజన్ సేవాసంఘ కార్యదర్శిగా పనిచేశారు. బీహార్‌లో భూకంప బాధితులను మహాత్మాగాంధీతోపాటు సహాయ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నారు. బాబూ రాజేంద్రప్రసాద్‌తో కలిసి అనేక హరిజన సేవా కార్యక్రమాలలో పాల్గొన్నారు. రామ్‌కు 1933లో భార్యావియోగం జరిగింది. అనంతరం 1935లో సంపన్న కుటుంబానికి చెందిన ఇంద్రాణితో కాన్పూర్‌లో రెండవ వివాహం జరిగింది. 1935లో శాసనసభకు ఎన్నికయ్యారు. బీహార్ రాష్ట్ర మంత్రివర్గంలో ఆయన మొదటిసారి పార్లమెంటరీ కార్యదర్శి అయ్యారు. 1937లో బీహార్ రాష్ట్ర కార్మికమంత్రిగా పనిచేశారు. సత్యాగ్రహంలో పాల్గొని హజారిబాగ్ జైల్లో ఉన్నప్పుడు జయప్రకాశ్ నారాయణ్‌తో ఆయనకు సన్నిహిత పరిచయం ఏర్పడింది.

డా॥ రాజేంద్రప్రసాద్, జగ్జీవన్‌రామ్, జయప్రకాశ్ నారాయణ్ వీరు ముగ్గురు బీహార్ రాష్ట్ర త్రిమూర్తులుగా పేరు తెచ్చుకున్నారు. బీహార్‌లో 1942లో జరిగిన దళితవర్గాల మహాసభకు అధ్యక్షత వహించారు సెప్టెంబర్ 2న 1946లో జవహర్‌లాల్ నెహ్రూ నాయకత్వంలో ఏర్పడిన అవిభక్త భారతదేశం తాత్కాలిక ప్రభుత్వంలో ఆయన మొదటిసారి కార్మికమంత్రిగా నియమితులయ్యారు.

హైదరాబాద్‌లో 1948లో జరిగిన దళిత వర్గాల మహాసభలకు శ్రీ ముదిగొండ లక్ష్మయ్య అధ్యక్షత వహించగా రామ్ ఆ సభకు విచ్చేసి ముఖ్య అతిథిగా ప్రసంగించారు. రామ్ పరిపాలనా దక్షతకు మెచ్చి 1952లో నెహ్రూజీ మంత్రివర్గంలో తపాలా శాఖను ఇచ్చారు. 1956లో రైల్వేశాఖకు మార్చడంతో ఆయన జీవితం గొప్ప మలుపు తిరిగింది. తర్వాత వ్యవసాయ శాఖా మంత్రిగా దేశంలో హరిత విప్లవానికి కారణభూతుడై ఆహార ధాన్యాల ‘బఫర్ స్టాక్’ నిల్వలపై భారత ఆహార సంస్థ, సెంట్రల్ ఫర్‌వేర్ హౌసింగ్ కార్పొరేషన్‌లను నెలకొల్పారు.

కామరాజ్ పథకం కింద 1963 సెప్టెంబర్ 1న కొంతకాలం పదవి నుండి వైదొలగి కాంగ్రెస్‌పార్టీ కార్యక్రమాలను నిర్వర్తించారు. నెహ్రూ మరణానంతరం 1964లో లాల్‌బహదూర్ శాస్త్రి మంత్రివర్గంలో చేరారు. ఆయన మరణానంతరం ప్రధానమంత్రి పదవికై ఇందిరా గాంధీ, మొరార్జీదేశాయ్‌లతో పోటీపడ్డారు. ఆ సమయంలో రామ్ షెడ్యూల్ కులాలు, తెగలకు సంబంధించిన పార్లమెంట్ సభ్యుల ఐక్యం కావడానికి కారణభూతుడైనాడు.

శ్రీమతి ఇందిరాగాంధీ మంత్రివర్గంలో ఆయనకు కార్మిక, ఉపాధిశాఖ తర్వాత, 1967లో రామ్‌జీ కేంద్ర వ్యవసాయ మంత్రిగా ఉన్నకాలంలోనే తిండి గింజలలో దేశం మొదటిసారిగా స్వయం సమృద్ధిని సాధించింది. ఆ సమయంలో జరుగబోయే రాష్ట్రపతి ఎన్నికలలో తొలుత ఇందిరాగాంధీ తమ అభ్యర్థిగా ఢిల్లీలో నీలం సంజీవరెడ్డి పేరును ప్రకటించి తర్వాత బెంగళూరు గ్లాస్‌హౌస్‌లో జరిగిన కాంగ్రెస్ సభలో ఆత్మప్రభోధం పేరున రామ్‌చేత తమ పార్టీ అభ్యర్థి వి.వి.గిరి అని ఇందిరా గాంధీ ప్రకటన చేయించారు. ఆ ఎన్నికలలో వి.వి.గిరి రాష్ట్రపతిగా ఎంపికయ్యారు.

కాంగ్రెస్ రెండుగా చీలినప్పుడు ఇందిరాగాంధీ పక్షానవుంటూ 1969లో బొంబాయిలో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో జగ్జీవన్ అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎంపికయ్యారు. ఆయన హయాంలో జరిగిన పార్లమెంట్ మధ్యంతర ఎన్నికలలో 1971 కొత్త కాంగ్రెస్‌కు అఖండ విజయం చేకూర్చి పెట్టడానికి ‘అధికార కాంగ్రెస్ అనే ముద్రవేసిన ఘనత ఆయనది.

1971లో కేంద్ర రాష్ట్ర మంత్రిగా రామ్ హయాంలో జరిగిన యుద్ధానంతరం పాకిస్తాన్‌తో విడిపోయి ‘బంగ్లాదేశ్’ ఆవిర్భవించింది. రామ్ మంత్రిగా ఉన్నప్పుడే బీహార్ శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలుపొందింది. శాసనసభ్యునిగా గెల్చిన రామ్ కుమారుని రాజ్‌కుమార్ పేరును మంత్రివర్గ జాబితాలో చేర్చగా రామ్ తన కుమారుని కంటే ఎంతో సీనియర్స్ ఉన్నారంటూ వారికి ఆ అవకాశం కల్పించారు.

మనదేశంలో మంత్రి పదవి జగ్జీవన్‌రామ్‌ను అంటిపెట్టుకుని ఉన్నట్టుగా మరొక నాయకునికి అంటిపెట్టుకొని ఉండలేదు. రామ్ కేంద్రంలో ఏ మంత్రి పదవి చేపట్టినా, ఆ పదవులను తన ప్రజ్ఞాపాటవంతో, పరిపాలనా దక్షతతో ప్రజారంజకంగా నిర్వర్తించారు. అంతేకాకుండా షెడ్యూల్ కులాల, తెగల విద్యా ఉద్యోగ రంగాలలో రాజ్యాంగంలో పొందుపరిచిన రిజర్వేషన్స్ నూటికి నూరుపాళ్లు అమలు చేయించారు.

ఇందిరాగాంధీ 1976లో దేశంలో విధించిన అత్యవసర పరిస్థితికి నిరసనగా రామ్ కాంగ్రెస్‌పార్టీకి మంత్రి పదవికి రాజీనామా చేయగానే దేశం విస్తుపోయింది.

ప్రజాస్వామ్య కాంగ్రెస్‌లో ఇందిరా గాంధీ విధానాలతో అసంతృప్తి చెందిన పెక్కు మంది కాంగ్రెస్ వాదులు రామ్‌జీతో కలిసి ‘కాంగ్రెస్ ఫర్ డెమొక్రసి’ అను రాజకీయపార్టీని స్థాపించి ఎమర్జెన్సీ నిర్భంధాలకు వ్యతిరేకంగా జయప్రకాశ్ నారాయణ్‌తో కలిసి దేశంలో సంపూర్ణ విప్లవం తీసుకురావాలని ధ్యేయంతో ‘జనతా’ పార్టీని నాడు జరిగిన పార్లమెంట్ ఎన్నికలలో విజయఢంకా మ్రోగించగా రామ్ తన పార్టీ తరపున 28



# ఈ - పంచాయతీపై అధికారుల శిక్షణ

**ప్రభుత్వ లెక్కలను ఆన్‌లైన్ ద్వారా లెక్కించటంలో ఉంచిన అంశాలను లింక్ చేయడం, క్రోడీకరించి ఒక చోట చేర్చడానికి కావలసిన పద్ధతుల పై కంప్యూటర్ డీల్ చేసే అధికారులకు ఎ.ఎం.ఆర్-అపార్డు శిక్షణనిస్తుంది.**

ఈ శిక్షణను పంచాయతీరాజ్ శాఖ డిప్యూటీ కమీషనర్ పి. రామారావు ప్రారంభించి, ప్రసంగించారు. మార్చి చివరి కల్లా అకౌంట్స్ ఉపయోగించి 'వన్ స్టాప్ షాప్' పద్ధతిలో హైదరాబాద్‌కు సమర్పించాలని అన్నారు. ఈ -పంచాయతీ పద్ధతిని నిజామాబాద్ జిల్లా దోమకొండ ప్రారంభిస్తారు.

బ్రాడ్‌బాండ్ కనెక్షన్స్ ఆరు జిల్లాలకు 2017 అందుబాటులో వస్తాయని డిప్యూటీ కమిషనర్ పి. రామారావు అన్నారు. ప్రతిపంచాయతీకి ఇంటర్‌నెట్ కనెక్షన్‌ను, 15% క్లస్టర్స్ పంచాయతీలుకు, మొత్తం 5,200, సెర్ఫ్ వారు 1000 చేయడం జరుగుతుంది. మెదక్ జిల్లా 1066 100% పన్నులు సేకరించిందని చెప్పారు. అదేవిధంగా 24 విషయాంశాల మీద పంచాయతీలకు అధికారాలకు ఇవ్వడం జరుగుతుందని డిప్యూటీ కమీషనర్ రామారావు చెప్పారు.

ఈ కోర్సులో జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు. అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారులు రెండురోజులు శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అపార్డు డైరెక్టర్ కె. యాదయ్య తదితరులు పాల్గొన్నారు. ◆

మంది పార్లమెంట్ సభ్యులను నెగ్గించుకో గలిగారు.

జయప్రకాశ్‌నారాయణ్, చంద్రశేఖర్ మొదలగు సోషలిస్ట్ నాయకులు రామ్‌ను దేశ ప్రధానిని చేయాలనే తలంపుతో ఆ సమయంలో వైద్య చికిత్స చేయించుకుంటున్న చరణ్‌సింగ్ మద్దతు కోరారు. ఆయన ససేమిరా అన్నారు. కొన్ని విభేదాల కారణంగా మొరార్జీ దేశాయ్ ప్రభుత్వం పతనం కాగా తనకు పార్లమెంట్‌లో మెజార్జీ సభ్యుల మద్దతు ఉన్నందున తనను ప్రధానిగా నియమించమని రామ్‌జీ నాటి రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి కోరారు.

గతంలో వి.వి. గిరిని రాష్ట్రపతి అభ్యర్థిగా తనకు వ్యతిరేకంగా ప్రతిపాదించాడనే కక్షతో సంజీవరెడ్డి రామ్‌జీ అభ్యర్థిత్వాన్ని తిరస్కరించి ఆరుమాసాలలో కనీసం పార్లమెంట్ ముఖం కూడా చూడని చరణ్ సింగ్‌ను ప్రధానిగా చేశారు. అదే సమయంలో కాంగ్రెస్ రెండుగా చీలిపోయింది. నాడు ఉపప్రధానిగా ఉన్న రామ్‌జీని శ్రీమతి ఇందిరాగాంధీ ప్రధానిగా చేస్తానని, అయితే మూడు మాసాలకు తిరిగి ఎన్నికలకు పిలుపునివ్వాలని షరతుపెట్టింది.

ఒక్కరోజు ప్రధానిగా గద్దెక్కినాచాలనుకునే రాజకీయ నాయకులెందరో ఉన్నా రాజకీయ స్థితప్రజ్ఞత గల రామ్ మూడుమాసాల పదవి కోసం అశపడక ఇందిరాగాంధీ ప్రతిపాదనకు తిరస్కరించారు. ఈ చర్యమూలంగా తనకు పదవీ కాంక్ష లేదనేది రామ్ తేటతెల్లం చేశారు. తర్వాత హైదరాబాద్‌లో జరిగిన ఆంధ్రరాష్ట్ర హరిజన మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రామ్‌కు ఆంధ్రా యూనివర్శిటీ గౌరవ డాక్టరేట్‌నిచ్చి సత్కరించింది. బాబా సాహెబ్ డా॥ బి.ఆర్ అంబేద్కర్‌ని జీవితాంతం ఎంతగానో గౌరవించడమే గాక డా॥ బి.ఆర్ అంబేద్కర్ రచించిన 'శూద్రులెవరు?' అనే గ్రంథానికి రామ్ పీఠిక రాశారు.

భారతదేశ స్వాతంత్రోంలోను, నవభారత నిర్మాణంలోను ఆయన ఉదాత్తమైన పాత్ర నిర్వర్తించి దేశ నిర్మాతలలో ఒక్కరయ్యారు. పరిపాలనాదక్షునిగా రాజనీతి కోవిదునిగా బడుగువర్గాల ఆశాజ్యోతిగా దేశానికి ఎంతగానో సేవలందించడమేకాక భారత ప్రజల ఆశేష అభిమానాన్ని చూరగొన్నారు.

కేంద్రంలో జనతా ప్రభుత్వం ఏర్పడుతున్న సమయంలో 'మీరు ఒక వ్యక్తి కాదు చైతన్యశక్తి. మీరు లేనిదే నవభారత నిర్మాణం సాగదు' అన్న జయప్రకాశ్ నారాయణ్ పిలుపునందుకున్న దేశభక్తుడు. హరిజన దేవాలయ మహాత్మాగాంధీ చేతే 'అన్మోల్ రతన్' (అమూల్య రత్నం) అని కితాబు పొందిన ప్రజాసేవకుడు. నిజంగా గాంధీ అభిప్రాయ పడినట్టు ఆయన భారత ప్రజలకు లభించిన అమూల్యరత్నం. పండిట్ నెహ్రూజీ మన్ననలు పొందిన కార్యదక్షుడు. నాటి దేశానికి చెందిన అగ్రశ్రేణి నాయకులలో ఒక్కరైన డా॥ బాబూ జగ్జీవనరామ్ జూలై 6న 1986లో నిర్యాణం చెందారు.

*– ఎన్‌పిఎ*

Printed & Published by: Anita Ramachandran, Commissioner, on behalf of TSIPARD, Printed at Caxton Offset Pvt. Ltd., 11-5-416/3, Red Hills, Hyderabad-4. Telangana, Published at TSIPARD, Rajendranagar, Hyderabad-500 030 **Editor : Anita Ramachandran**